

# హరి సర్వాత్మకుడు

ఇది

ఎన్నుకొన్న అన్నమయ్య కీర్తనలకు

ఉపోద్ఘాతము మరియు భావోద్దేశ్యము



# హరి సర్వాత్మకుడు

ఇది

ఎన్నుకొన్న అన్నమయ్య కీర్తనలకు

ఉపోద్ఘాతము మరియు భావోద్దేశ్యము

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు



# హరి సర్వాత్మకుడు

## (ఎన్నుకొన్న అన్నమయ్య కీర్తనలకు)

## ఉపోద్ఘాతము మరియు భావోద్దేశ్యము

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

**M.Tech.**

కం॥ సర్వాత్మకుడేహరియని
సర్వోన్నతులెరుగగలరు సాధ్యమె పెరకున్
ఉర్వీపతి వేంకటపతి
సర్వేశ్వరుడతడె సుండి! చక్కగదెలియన్.

# హరి సర్వాత్మకుడు

మొదటి ప్రచురణ

**ఆగష్టు 2014**

రచన :

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :

**కె.వి.ఆర్.**

98495 79345

# అంకితము

## ఎందరో మహానుభావులు. అందరికీ వందనములు



సీ॥ కీర్తనల్ జెప్పిరి కీర్తి శిఖరమెక్కి
పాడిరి వాటిని భాగవతులు
విశ్లేషణలు చేసి ప్రీతిని బెంచిరి
నర్తించి చెలగిరి నర్తకులును
నాటక కళలతో నాటిరి భక్తిని
పూదండలర్పించి పుణ్యులైరి
వ్రతముల బూజల ప్రార్థించి మొక్కిరి
దానధర్మాలతో ధన్యులైరి

ఆ.వె॥ హరిని గొలుచు విధము అదియేదియైనను
శరణమనక ఫలము నరయలేరు
హరి చరణము కోరు అందరికీ కృతి
ఫలితమబ్బుగాక పరమపురుష!

# హరి సర్వాత్మకుడు

(సంపుటి)

(ఎన్నుకొన్న) అన్నమయ్య సంకీర్తనలకు ఉపోద్ఘాతము మరియు భావోద్దేశ్యము

## విషయ సూచిక


| క్ర.సం. | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 1. | అందిచూడగ నీకు నవతారమొకటె | IV/331 | 01 |
| 2. | అందుకల్లాలోనుగాక అట్టేయెచ్చరిక | II/183 | 03 |
| 3. | అక్కటాప్రాణికిని అహంబ్రహ్మత్వమే | XV/262 (పె.అ) | 05 |
| 4. | అడ్డముచెప్పగరాదు | II/490 | 07 |
| 5. | అదినేనెఱగనా అంతలో భ్రమత | II/85 | 09 |
| 6. | అనాదిజగమునకౌభళము | IV/29 | 11 |
| 7. | అన్నియు నడుగవేనేనే మఱచితి | II/186 | 13 |
| 8. | అరుదరుదు నీమాయ హరిహరి | | 15 |
| 9. | అల్లనాడే కంటి వింటి అధోక్షజ | XV/253 (పె.అ) | 17 |
| 10. | ఆతురబందుగుడవు హరినారాయణ | II/277 | 19 |
| 11. | ఇందరిగాచిననీవు ఇట్టేనీవు | IV/350 | 21 |
| 12. | ఇందిరనామము ఇందరికీ | I/8 | 23 |
| 13. | ఇచ్చినవాడు హరి పుచ్చుకొన్నవాడు | II/493 | 25 |
| 14. | ఇదియే వేదాంతమిందుకంటేలేదు | IV/369 | 27 |
| 15. | ఈడే నిందరికి యేలికైవున్నాడు | IV/289 | 29 |
| 16. | ఈరూపమైవున్నాడు యీతడే | II/244 | 31 |
| 17. | ఈవిశ్వాసంబు యెవ్వరికి దోపదిది | I/64 | 33 |
| 18. | ఎంతకెంత యిదియేమని పొగడుట | II/491 | 35 |
| 19. | ఎంత వెట్టి గొండదవ్వి యెలుక | IV/344 | 37 |
| 20. | ఎందరు సతులో యెందరు సుతులో | IV/315 | 39 |
| 21. | ఎన్నటిజీవుడిక నీడేరేది | II/188 | 41 |
| 22. | ఎన్నడొకోనే చేరదగులక | IV/309 | 43 |
| 23. | ఎవ్వరు నాకు దిక్కు యేమని చెప్పేది | XV/284 (పె.అ) | 45 |
| 24. | ఏగతినుద్ధరించేవో యింతటి | IV/312 | 47 |

| | | |
|---|---|---|
| 25. ఏదియుగానడు (గాననందు) నేది | IV/329 | 49 |
| 26. ఏమని చెప్పనె ఇట్టినా వలపు | XX/10 | 51 |
| 27. ఏమని పొగడవచ్చునిటువంటి | II/180 | 53 |
| 28. ఏమమ్మా నీకెవ్వరీడు యిందిరాదేవి | XVI/188 | 55 |
| 29. ఏలకో కర్మమా ఇందుకు బాలైతిని | IV/325 | 57 |
| 30. ఐనదయ్యా కానిదెల్లా నటు కాకుండితే | III/6 | 59 |
| 31. ఒక్కడే మోక్షకర్త ఒక్కటే శరణ్యము | II/186 | 61 |
| 32. ఓహో యెంతటివాడే వద్దనున్నవాడే | IV/39 | 63 |
| 33. కంటే సులభమిది కనకుంటే | I/479 | 65 |
| 34. కటకట హరిమాయ కల్పనెట్టిదో | IV/316 | 67 |
| 35. కడనుండి చూసేనీకు గనికరమైతే | II/519 | 69 |
| 36. కన్నదేటిదో విన్నదెట్టిదో | III/318 | 71 |
| 37. కన్నుల పంటగలాయ గన్నవారికి | IV/178 | 73 |
| 38. కల్లమాయ దొడ్డముద్రకటకటా | II/18 | 75 |
| 39. కానవచ్చీ గానరాదు కమలాక్షి | II/583 | 77 |
| 40. కాలము కాలము గాదు కపటాలే | I/307 | 79 |
| 41. కైకొనవయ్యా కరివరదా | XV/278 (పె.అ) | 81 |
| 42. చవినోరకేడదెత్తు సంపదేడ | IV/326 | 83 |
| 43. చిత్తజగురుడా వో శ్రీనరసింహా | IV/292 | 85 |
| 44. చిత్తజువేడు కొనరే చెలియలాల | VII/407 | 87 |
| 45. చెలినేడు తానేమి సేయునమ్మా | I/356 | 89 |
| 46. చేపట్టి మమ్ముగావు శ్రీనరసింహా | II/496 | 91 |
| 47. చేరికొల్వరో యాతడు శ్రీదేవుడు | II/297 | 93 |
| 48. జీవుడించక చేత సముద్రమంత | IV/307 | 95 |
| 49. జీవుడూ నొక్కడే చిత్రమూ నొక్కటే | IV/296 | 97 |
| 50. తనకర్మవశంబించుక దైవకృతం | I/65 | 99 |
| 51. తప్పదు తప్పదు దైవము కృప | I/371 | 101 |
| 52. తలపులోననే దైవము వీడిగో | XI/206 (పె.అ) | 103 |
| 53. తలపోత చిత్తమున దరిగానక | IV/332 | 105 |
| 54. తల్లియాపె కృష్ణునికి తండ్రి | IV/304 | 107 |

| | | |
|---|---|---|
| 55. తానేడ వారేడ తనువేడ మది | X/50 (బి.అ) | 109 |
| 56. తెలిసితే మోక్షము తెలియకుంటే | II/19 | 111 |
| 57. దయదలచగ రాద తరుణి | XIV/149 | 113 |
| 58. దిక్కునీవే జీవులకు దేవసింహమ | II/363 | 115 |
| 59. దిక్కులేనివారికి దిక్కని కొలువగ | IV/328 | 117 |
| 60. దేవతలు గాచిన దివ్యుడితడు | IV/300 | 119 |
| 61. దేవదేవోత్తమ నాకు దిక్కు నీవే | XV/326 (పె.అ) | 121 |
| 62. దీనరక్షకుడఖిల వినతుడు | II/178 | 123 |
| 63. దైవమా వోదైమా నన్ను దయజూడ | III/171 | 125 |
| 64. దైవము నెఱగము తత్వముదలచము | IV/294 | 127 |
| 65. దైవమొక్కడే సంతత భజనీయుడు | IV/311 | 129 |
| 66. ధర్మమునకే మము దయగావలే | IV/290 | 131 |
| 67. ధ్రువ వరదునివలె తుదికెక్కు | IV/347 | 133 |
| 68. నందగోపనందనుడే నాటిబాలుడు | II/387 | 135 |
| 69. నమ్మితి నితడేమన్ననగా | IV/136 | 137 |
| 70. నమో నమో దశరథనందన | IV/144 | 139 |
| 71. నన్నుజూచి హరినీవు నవ్వకుండేవా | II/187 | 141 |
| 72. నిండెనులోకములెల్ల నెఱినితని | IV/299 | 143 |
| 73. నిలిచినవాడవు నీవే కాక దైవమా | IV/302 | 145 |
| 74. నీచిత్రమిందరి నేరుపు నేఱమి | II/489 | 147 |
| 75. నీమహిమది యెంత నీవు చేసె | III/76 | 149 |
| 76. నీయంత నీవే యెఱిగి నిచ్చునన్ను | II/492 | 151 |
| 77. నెలమూడు సోబనాలు నీకు | VII/280 | 153 |
| 78. నేరగలదొక్కటే నిచ్చల బ్రహ్మవిద్య | II/184 | 155 |
| 79. పండియు బండదు చిత్తము | I/274 | 157 |
| 80. పడతినినుదలచి పో పలుకడతడు | V/320 | 159 |
| 81. పాటెల్లా నొక్కచో నుండు భాగ్యమొక్కచో | II/182 | 161 |
| 82. పెదయౌబళపు కొండ బెరిగీనిదె | IV/309 | 163 |

| | | |
|---|---|---|
| 83. భక్తవత్సలుడవుగా భావించ | XV/326 (పె.అ) | 165 |
| 84. భళి భళి మాకిది పరిణామము | XVI/380 | 167 |
| 85. భావించి తెలుసు కొంటే భాగ్యఫలము | IV/291 | 169 |
| 86. మంచిముహూర్తమున శ్రీమంతులిద్దరికి | XIV/110 | 171 |
| 87. మచ్చరముల గపటంబుల మానినంత | X/4 (చి.అ) | 173 |
| 88. మనసె వశమైతేగా మరిమీదటి | X/21 (చి.అ) | 175 |
| 89. మాటిమాటికి జూచి మఱపులేల | X/14 (చి.అ) | 177 |
| 90. మాయామోహము మానదిది | III/566 | 179 |
| 91. మాయింటికి రావోయి మాధవా | XV/236 (పె.శృ) | 181 |
| 92. మేలుకొనవే నీలమేఘవర్ణుడా | XV/200 (పె.అ) | 183 |
| 93. మొక్కరే మొక్కరే మీరు ముందు | II/379 | 185 |
| 94. లావణ్యశృంగారరాయ లక్ష్మీనాథ | II/149 | 187 |
| 95. లేరా దేవతలూ లేరా లావరులూ | XV/237 (పె.అ) | 189 |
| 96. వట్టి విచారములేల వలనని చింతలేల | X/29 (చి.అ) | 195 |
| 97. వద్దు సుమ్మీ చెప్పితిని వలలబడగ | X/31 (చి.అ) | 197 |
| 98. వింత నానేదనకు వేసాలవాడు | IV/44 | 199 |
| 99. వీడేనెలకొన్నాడు శ్రీవేంకటగిరిమీద | XXVII/XXIII | 201 |
| 100. వీణవాయించెనే అలమేలుమంగ | XXVII/XXII | 203 |
| 101. వెదకితే నీవంటి వేల్పులెవ్వరు | XV/338 (పె.అ) | 205 |
| 102. వెన్నలు దొంగిలునాటి వెట్టివా నీవు | II/32 | 207 |
| 103. శరణంటే జాలు సర్వేశ్వరునికి | XV/134 (పె.అ) | 209 |
| 104. శరణువేడెదయజ్ఞ సంభవరామ | III/155 | 211 |
| 105. సకలలోక నాథుడు జనార్దనుడు | II/279 | 213 |
| 106. హరి అవతారమె ఆతండితడు | IV/193 | 215 |
| 107. హరినారాయణ ఆదిమపురుషుడ | XV/184 (పె.అ) | 217 |
| 108. హరి సర్వాత్మకుడాదిమ పురుషుడు | | 219 |
| 109. హరి మంగళాశాసనము | | 221 |

# ప్రార్థన

కం॥ శ్రీపతి కరుణే ఘనమని
మా పోతన, అన్నమయ్య, మా నారదుడున్
దోపిరి నమ్మిక మదిలో
ఏపట్టున వేంకటేశుడే యేలికరా!

చం॥ గడిపితి నిన్నినాళ్ళు మది గద్దరియైనను లెక్కసేయకన్
సడలెను చేవ నా హితుల సఖ్యతపై భ్రమలన్ని నీరయెన్
మిడిమిడి శాస్త్రమెందుకని, మేలుగ పొట్టను నింపు విద్దెలన్
విడిచితి మాధవా! యిపుడు వేచితి నీ పిలుపెన్నడో కదా!

ఉ॥ ఆత్మలయన్నిటన్ వెలసి ఆ తిరువేంకటనాథుడుండియున్
ఆత్మకు భ్రాంతి కల్గి తను ఆర్గురు దుష్టుల వెంట బోయి చిం-
తాత్మునిగా చెలంగి, మది తాలిమి బాయును దుఃఖమందుచున్
ఆత్మకు జ్ఞానసంపదగు అందును ముక్తిని శౌరి సత్కృపన్.

ఆ.వె॥ ఆత్మనున్న హరిని అరయగల్గినవాడు
తొలగి'భ్రాంతి', యెక్కు తుదిపదంబు
శౌరి జగములందు సర్వాత్మకుండని
తెలియువాని ఆత్మవెలయు శాంతి.

కం॥ హరి నరయుడు మురిపెముతో
సిరివరదుని శరణుకోరి చేరుడు తృటిలో
తిరుమలగిరులన్ మెరసిన
వరములు ధరవరుడు కురియ వరుసగ నిడురా!

సీ॥ ఏనాటి సుకృతమో ఈ వేంకటేశుని
కరుణామృతమువోలె కట్టతెగెను,
ఏ జన్మపుణ్యమో ఈ అన్నమాచార్య
కీర్తనల్ వివరించు కీర్తిదక్కె
ఏరీతి దొరికెనో, తిరుమలేశుని కృప
విభుని పాదము చెంతపెట్టినాను
ఏమైననిది చాలు యే కోర్కెలును లేవు
నీ పిలుపుకు వేచి నిలిచినాను,

తే.గీ॥ ఏమి పాపాలు చేస్తినో యెరుకలేదు
ఏమి శిక్షింతువిక నన్ను ఈవెదిక్కు
ఏమి చేసినా నీ చిత్తమిది నిజంబు
ఏమిటికి జాగు బ్రోవుమా ఇందిరేశ!

మత్తకోకిల :
రెండు వేలకు జేర బ్రోవము లెక్కతప్పక నీ కృతుల్
ఉండనిమ్మిల చాలునాకది ఓపికించుక నీయుమా
అండ వేంకటరాయుడుండగ అన్యులేలర దిక్కనన్
కొండలయ్యని గొల్వనేరని కోటిజన్మలు దండగే!

శా॥ రారా రామని యేడ్చి పాడిపిలిచెన్ రక్షింప గోపన్న నిన్
రారా రామని ఆర్తితోడ పలుకన్ లాభించె త్యాగయ్యకున్
రారా రామని అన్నమయ్య కొలువన్ రంజిల్లె వేంకన్నగా
పోరా పోయని బంటునైన పనుపున్ పోరంగ మా బోంట్లిలన్.

మ॥ తుదకీరీతిని తోయజాక్షుకృప సంతుష్టండనైతిన్ భళీ!
ఇది నా భాగ్యమొ పూర్వ జన్మ ఫలమో ఇందీవరశ్యామునిన్
పదిలంబౌవిధి జొచ్చి నేను శరణున్ బాధన్ విసర్జించితిన్
అదిగో వేంకటనాథుడిచ్చె సిరులన్ అర్థించముక్తిన్ అహో!!

# ముందుమాట

ఆదిపురుషుడు, సర్వాత్మకుడు అయిన పరమపురుషుడు శ్రీవేంకటేశ్వరుడు, శరణన్నవారిని వదలని నీడ. మొట్టమొదట అమిత సిరి సంపదలిచ్చినా వాటితో నాకు పనిలేదు. నాకు నీ దాస్యమే కావాలంటే తన సన్నిధిలో నిరంతరం వుండే మహద్భాగ్యాన్ని కల్పిస్తాడు. అడపాదడపా పరీక్షించి తన ఔదార్యం ఇబ్బడి చేస్తాడు. పరీక్షకు తట్టుకోలేకపోతే సిరిసంపదలు సంభావనగ ఇచ్చి క్రింది తరగతిలోకి "డిమోట్" చేస్తాడు. ఆ సిరి సంపదల పిచ్చిలోపడితే తన "విశ్వవిద్యాలయాన్నించే ఉద్వాసన చెబుతాడు.

వైకుంఠపాళిలో పెద్దపాము మింగినవాడి గతే మనకీ పడుతుంది. ఇదంతా స్వామి ఆట. ఈ ఆటలో నేర్పుకంటే ఓర్పు అవసరం. కామక్రోధములవంటి ఆరు పాములు నిరంతరం కాటువేయటానికే చూస్తుంటాయి. భక్తి, సజ్జన సాంగత్యం, కీర్తన, హరికథా శ్రవణం, శరణాగతి అనే మంచి నిచ్చెనలు కూడా చాలా వున్నాయి, ఈ వైకుంఠపాళిలో. ఇదిట్లా వుంటే సత్కర్మలు పుణ్యాన్ని దుష్కర్మలు పాపాన్ని పెంచుతాయి. ఇవి నీవు స్వయంగా చేయనక్కరలేదు చేయిస్తానన్నా, చేద్దామనుకొన్నా కూడా దానికి తగ్గ ఫలితముంటుంది. ఒకపక్క డిపాజిట్లు పడ్డట్టే ఇంకొక పక్క రీపేమెంట్ బిల్సూ కట్టాలి. కాబట్టి ఈ క్షణాన నీ పరిస్థితేమిటో నీకే తెలియదు. అందులోనూ బోనస్ పేమెంట్లూ, పెనాల్టీలు కూడా చాలా వుంటాయి. ఇక మనగతేమిటి?

ఈ బాధలన్నీ తెలిసిన అన్నమాచార్యులవంటి అవతారపురుషులు "హరి సర్వాత్మకుడాదిమ పురుషుడు, పొరి నెఱుగువారి పుణ్యముగాన" అని అన్నారు. నేటి వరకు ఆ శ్రీహరి తత్త్వం యెవ్వరికీ అంతుచిక్కలేదు. మనము అన్నమయ్య అనుయాయులమే కాని అన్నమయ్యలం కాదు, కాలేము. మన పరిమితులతో మనమేమి చేయగలమో చూద్దాము.

కాళిదాసు జగన్మాతను "బిద్దె కావాలి" (విద్య కావాలి) అని వెంటపడ్డట్లు, మనమూ ఈ తిరుమలయ్య వెంటపడగలము. కొట్టినా, కట్టినా, తిట్టినా అమ్మకొంగు వదలని, శిశువులాగ ఈ స్వామి కాళ్ళుపట్టుకోగలం. తన్నినా, అన్నంమాన్పి శిక్షించినా వదలని యజమాని భృత్యునిలాగా ఆ శ్రీహరి దాస్యం స్వీకరించగలము. సెబాసో... సెబాసు. ఇవి చాలు. కృతార్థులమైనట్లే.

గజేంద్రుడిలా వనితా వ్యామోహంతో, బల గర్వంతో బరితెగించినా, మకరికి జిక్కి తపించి "కలడు కలండనెడివాడు కలడో లేడో" అని సందేహించినా, "లావొక్కింతయు లేదు నీవే తప్ప ఇతః పరంబెరుగ" అని యేడ్చి మొరవెట్టి "రావే ఈశ్వర కావవే వరద" అంటే తత్తరపడి పరుగులు పెట్టి కాపాడతాడు.

మన ఆత్మీయులే మనని పీడిస్తే ప్రహ్లాదుని కాపాడినట్లు కంటికి రెప్పలా కాపాడతాడు. బలిచక్రవర్తిలాగా ఆయననే తక్కువ అంచనా వేస్తే అథః పాతాళానికి తొక్కేస్తాడు. ఇతర దేవతోపాసనలతో భస్మాసురుడిలాగా పొందరాని వరాలను పొందితే భస్మం చేసేస్తాడు. భక్తులకిచ్చిన మాట కోసం సక్కుబాయి అత్తగారికి కాళ్ళు కూడా పట్టాడు. గొల్లకంపు కొట్టే రేపల్లె గోపికలకి శృంగార కొలువునిచ్చాడు. ముక్కిపోయిన అటుకులు తిని కుచేలునికి అష్టైశ్వర్యాలు అడగకుండానే ఇచ్చాడు.

అంతెందుకు క్షమ అంటేనే శ్రీహరి. అత్తకిచ్చిన మాట కోసం శిశుపాలునితో నూరు తిట్లు తిన్నాడు. సత్యనారాయణునిగా వైశ్యుడు యెన్నిసార్లు మాటతప్పినా ఓర్పు వహించాడు. కాకపోతే గర్వాన్ని సహించడు. గర్వం తలకెక్కితే తలదించుకొనేట్లు చేస్తాడు. ఇలా యెంతని చెప్పను ఆతని విభవము?

ఆ పరంధాముని కృప వున్నవాడు కావాలనుకొన్నది అవుతుంది. వద్దనుకొన్నది కాదు. అదే ఆయన కృపలేనివాడికి కావాలనుకొన్నది కాదు. కాకూడదనుకొన్నది అవుతుంది. మన జీవితంలో నిత్యమూ ఇదే చూస్తున్నాం. కాని కర్మ సిద్ధాంతం బయటకు లాగి, దేవదేవుని కృప నీ కర్మఫలం వలన లేదని తృప్తి పడుతుంటారు కొందరు. దాన్ని సరిచేస్తామని యేవేవో కర్మకాండలు జరిపే పెద్దలూ వున్నారు. ఈ కర్మకాండ మన కర్మ ఫలాన్ని బాగు చేస్తుందనే వారి వాదము గోడమీద పిల్లి వాటము. అది యెట్లైనా దూకవచ్చు. అట్టి వారికి నామనవి ఒకటే కర్మ అనుభవించమని దేవుని ఆజ్ఞ అయితే దానిని ఆయన తప్ప మరేదీ, మరెవ్వరూ మాన్పలేరు.

మన నాన్నగారు మనల్ని దండిస్తే సరియైన దారిలో పెట్టటానికేగాని, చంపేయటానికి కాదుగదా! ఇదే సిద్ధాంతం భగవంతునికీ వర్తిస్తుంది. ఆయన శిక్ష మనలో మార్పుకోసమే. మనల్ని నాశనం చేయటానికి కాదు. నా జీవితాన్ని ఈ సిద్ధాంతానికి అన్వయించుకొని నేను సంతృప్తికరమైన సమాధానం

పొందాను. ఇంతకుమించి వ్యాఖ్యానించడం వూకదంపుడు వలె నిష్ఫలమైనది. ఇంతకీ ఈ సమస్యకు సరైన పరిష్కారం యేమిటి?

ఉన్నది, చక్కటి పరిష్కారం వున్నది.అదే శరణాగతి. శరణు శరణు శ్రీవేంకటేశ్వరా! అని త్రికరణ శుద్ధితో అంటే చాలు. కాని అది చెప్పినంత తేలిక కాదు. కోటిసార్లు నోటితో చెప్పినా ఫలితం శూన్యం. నోరు పలకాలి, మనస్సు అవుననాలి, అంతర్యామి కూడా అవుననాలి. అప్పుడు శరణాగతి లభిస్తుంది. ఇకపై అంతా ఆయనే చూసుకొంటాడు.

దీనికి మొదటి మెట్టు భక్తి. వైరాగ్యం లేని భక్తి పుణ్యాన్ని పెంచుతుంది కాని, ముక్తి మార్గంలో పెట్టదు. శృంగారం మీద విరక్తి వైరాగ్యానికి మొదటిమెట్టు. ఇలా చెప్పుకొంటూ పోతే యెన్నటికీ తేలని సమస్య ఇది. భగవంతుని కృప వుంటే భక్తి వైరాగ్యాలు స్థిరపడతాయి. మళ్ళీ మొదటికే వచ్చాము. చెట్టుముందా విత్తుముందా? అని యెవరు వాదించగలరు?

ఎడతెగని వాదన త్యజించి ఇప్పుడు చేయవలసిందేమిటా అని ఆలోచిద్దాం. ఏది మంచి అని త్రికరణ శుద్ధిగా నమ్ముతావో, అది చేసేస్తే చాలు. ఇలా చెప్పుకొంటూపోతే దీనికి అంతూ పొంతూ వుండదు. నామాటగా ఒకటి వినండి. మానవుని శక్తి పరిమితం, యుక్తి పరిమితం. వీడికి మంచి దేహము, మంచి మనస్సు, మంచి ఐశ్వర్యము, మంచి కీర్తి, అన్నీ వాడి స్వార్జితాలు కావు. అన్నీ దేవుని అనుగ్రహాలే. మరి నీ ఘనత కాని దాని గురించి నీవు గర్వపడటం యెంత అవివేకం?

ఇంకా 100 కీర్తనలు అన్నమాచార్యులవారివి వివరిస్తే 2000 కీర్తనలు విశ్లేషించిన సౌభాగ్యము నాకు దక్కుతుంది. ఆ సౌభాగ్యం దక్కిన మరుక్షణం నా శ్వాస ఆగిపోయినా నాకు కించిద్విచారం కూడా వుండదు. కాల్చుకు తినే వ్యాధి పీడిస్తున్నా ఆ సౌభాగ్యంకోసమే యెప్పుడు తెల్లవారుతుందా అని పడుకొంటాను, నిద్రలేస్తాను. ఇంతకు మించి యే కోరికా లేదు. ఏ ఆశకూడ నా దరికి రాదు. నేను చేసే అర్థంలేని పనులలో కాసేపు టి.వి. చూడటం, ఇష్టంలేనివాళ్ళతో కూడా అప్పుడప్పుడు మాట్లాడటం, చెత్త రాజకీయాలను కూడా భరించటం, లాంటివి చాలా వున్నాయి. ఇవన్నీ ఒకెత్తు అయితే రోజుకొక అన్నమయ్య కీర్తన వివరించటం నా జీవితాశయం. ఇక పోతే నాకు భగవంతుడిచ్చిన అనుగ్రహాన్ని

నలుగురికి తెలియజేయడానికి వెబ్‌సైట్ కూడా వున్నదండి. Google Network Site లో geetadeeksha.com విజిట్ చేస్తే 2000 అన్నమయ్య కీర్తనలు వినే సౌకర్యం కోసం కూడా ప్రయత్నిస్తున్నాను.

ఈ నా సుదీర్ఘ ప్రయాణంలో యెంత మంది సహకారం వున్నదో వ్రాయాలంటే ఈ పుస్తకంలోని పేజీలు చాలవు. నేను నేర్చిన జీవిత సత్యం ఒకటే. నీవు ఇతరులనుంచి దేనిని ఆశిస్తావో దానిని వారికి నీవూ ఇవ్వగలగాలి. దేనిని వద్దనుకొంటావో అది ఇతరులకు నీవూ ఇవ్వకు. ఇంతే ఇంతకు మించిన మంచి లేదు.

ఎప్పుడూ దేవుడే నీకు దిక్కు అని మరవరాదు. కాని మానవ ప్రయత్నం మానరాదు. సరిగ్గా ఇంకొక నూరు కీర్తనలను విశ్లేషిస్తే 2000 కీర్తనలు అన్నమాచార్యులవారివి విశ్లేషించిన అదృష్టం నాకు దక్కుతుంది. మరి ఆ తిరుమలయ్య కృప యెలావున్నదో. ఈ నూరు కీర్తనలలో 60 కీర్తనలు విన్నకోట మురళీకృష్ణ, చాగంటి సంధ్యా సుందర్, సోమయాజుల ఇందిరా భరద్వాజ్ వంటి ప్రసిద్ధ గాయనీ గాయకులు వారి శిష్యులు ఆలపించినవి వీటిని గూడా నాబోటి వారి అభిమానులకోసం నా వెబ్‌సైట్‌లో పదిలపరచి సంగీతప్రియులకు అందజేస్తాను.

ఇంకొక 50 కీర్తనలు నా హృదయాన్ని అలరించినవి విశ్లేషిస్తే "తుదిపదమెక్కితిని తోయజాక్షా!' అని నేనూ నిజమైన ఆనందం అనుభవిస్తాను. ఈ 2000 కీర్తనలే కాదు నా ఇతర రచనలను కూడా www.geetadeeksha.com లో చదువుకొనవచ్చును.

అన్నమాచార్యులవారన్నట్లు "పిండంతే నిప్పటి" మనం యెంత పుణ్యం సంపాదిస్తే ఆ శ్రీమన్నారాయణునికి అంత ప్రీతి కలుగుతుంది. పుణ్యం అంటే మంచి. పాపం అంటే చెడు అంతే.





సంఖ్య : IV/331 రాగం : గుండక్రియ
కీర్తన : అంది చూడగ నీకు నవతారమొకటె

**1 అందిచూడఁగ నీకు నవతారమొకటే**
**యెందువాఁడవై తివి యేఁటిదయ్యా** ॥పల్లవి॥

**నవనీతచోరా నాగపర్యంకా**
**సవనరక్షక హరీ చక్రాయుధా**
**అవల దేవకిపట్టివి యశోదకు నిన్ను**
**నివలఁ గొడుకవనేదిది యేఁటిదయ్యా** ॥అంది॥

**పట్టపు శ్రీరమణా భవరోగవైద్య**
**జట్టిమాయలతోడిశౌరి కృష్ణ**
**పుట్టిన చోటొకటి పొదలెడి చోటొకటి**
**యెట్టని నమ్మవచ్చు నిదియేఁటిదయ్యా** ॥అంది॥

**వేదాంతనిలయా వివిధాచరణా**
**ఆదిదేవ శ్రీవేంకటాచలేశ**
**సోదించి తలఁచినచోట నీ వుండుదువట**
**యేదెస నీ మహిమే యిదేఁటిదయ్యా** ॥అంది॥**331**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య వొక్కొక్కసారి వున్నట్లుండి ఆయన భావనలలో భాసించిన సత్యాన్ని నిస్సంకోచంగా ప్రకటిస్తారు. కొద్దిపాటి అతిసామాన్యమైన అనుభవంతో, నేనూ దీనినంగీకరిస్తున్నాను. ఆ స్ఫురణ సాక్షాత్తూ ఏడుకొండలవాడు కలిగించినదే. ఎందుకంటే నాకంత పాండిత్యం వుండే అవకాశమే లేదు. ఇక అన్నమయ్య అంటారా ఆయన నోటితో పలికించేది ఆ శ్రీవేంకటేశ్వరుడే. ఈ కీర్తనలో యెంత నిర్ద్వంద్వమైన ప్రకటన చేస్తున్నారో చూడండి. జాగ్రత్తగా అందుకొని చూస్తే అసలు నీ అవతారమొక్కటేనని అర్ధమవుతుందయ్యా! అసలు నీవెక్కడివాడవయ్యా? అయోధ్య రామయ్యవా? రేపల్లె కృష్ణయ్యవా? మధురానగరం శౌరివా? శ్రీరమణీవల్లభుడవా. కలియుగదైవం శ్రీవేంకటేశ్వరుడవా?

**ఉ॥ వెన్నలు దొంగిలించితివి వీడవు పొన్పగుశేషునెన్నడున్**
**వున్నది శ్రీసతెన్నడును వుర్వికిజేరుచుతోడు నీడయై**
**యెన్ని పురాణగాధలిక నేటికి నీఅవతారమొక్కటే**
**కన్నులపంట! సప్తగిరి కారణభూతివి వేంకటేశ్వరా!**

**భావోద్దేశ్యము :**

అంది చూడగా (అర్థం చేసికొని చూస్తే) నీకు దశావతారాలున్నట్లు చెబుతున్నారు కాని నీ అసలైన అవతారం మాత్రం ఒక్కటే. అదే శ్రీవేంకటేశ్వరుని రూపం. ఇంతకీ నీవెందువాడివైతివి? ఇదేమిటో తెలియకుండా వున్నదయ్యా!

నీవే వెన్నదొంగవా? నీవే శేషశయనుడవా? నీవే యాగరక్షకుడవైన రామచంద్రుడవా? నీవే గజేంద్రుని రక్షించిన చక్రాయుధుడైన శ్రీహరివా? నీవే దేవకీనందనుడవా? నీవే రేపల్లెలో గొల్ల పడతియశోద గారాలపట్టివా? ఇంతమంది తల్లులు గల నీవు అసలు యెవరి కొడుకువయ్యా?

నీ పట్టపురాణి శ్రీరమణియా? భవరోగమును నివారించు గొప్ప వైద్యుడవు నీవేనా? జట్టి మాయలు (అమూల్యమైన మాయలను) ప్రదర్శించిన శౌరివి నీవేనా? శ్రీకృష్ణుడవూ నీవేనా? నీవు పుట్టిన చోటేమో మధురలోని కారాగారమా? పెరిగింది రేపల్లె బృందావనములోనా? గొల్లవారింట్లోనా? ఇదంతా యెట్లా నమ్మవచ్చును?

నీవే వేదాంత నిలయుడవా. వివిధాచరణాలు (ద్వైతమూ, అద్వైతము, విశిష్ఠాద్వైతమూవంటి) ప్రోత్సహించిన వాడవు నీవేనా? ఆదిదేవుడవైన శ్రీవేంకటేశుడు నీవేనా? నిన్ను శోధించి తెలుసుకొంటే తలచుకొన్న చోటికి వస్తావట. ఏదిక్కునైనా నీమహిమేనట. ఇదెక్కడి మహిమ? ఇదేటిదయ్యా?

సంఖ్య : II/183 రాగం : రామక్రియ

కీర్తన : అందుకల్లా లోనుగాక అట్టే యెచ్చరికెతోడ

**2 అందుకల్లా లోనుగాక అట్టే యెచ్చరికెతోడ**
**పొందుగా హరిఁ దలఁచేపురుషుఁడే ఘనుఁడు ॥పల్లవి॥**

**చలములు పుట్టించ సారె మచ్చరము రేఁచ**
**కలుగు నానావిధకారణములు**
**తలఁపులు భ్రమయించ తగువేడ్క లొనరించ**
**పలుమా రెదుట నిల్చు బహురూపాలు ॥అందు॥**

**తగవులు దిద్దించ తగ నలమటఁ బెట్ట**
**తగులు ననేకబంధములెల్లాను**
**పగసాధింపించ నప్పటి నుపాయాలు నేర్ప**
**నిగిడివచ్చు ననేకనెపములెల్లాను ॥అందు॥**

**తేరకే మేనలయించ దేశమెల్లా నావటించ**
**వూరకే తోఁచు ననేకవుద్యోగాలు**
**కోరి శ్రీవేంకటేశ్వరుఁ గొలిచి నిశ్చింతుఁ డైతే**
**ఆరయ మతిలో నిండు నానందాలు ॥అందు॥183**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య ఒక గొప్ప సత్యం చెబుతున్నారు. మాత్సర్యము, భ్రమలు, తగవులు, పగబట్టుట, శరీరాన్ని అనవసరమైన శ్రమలకు గురిచేయటం వంటివి జీవికి సహజసిద్ధమైన గుణములు. వీటికి లోనుగాక శ్రీహరినే శరణని నిత్యమూ స్మరించు ఘనుడే నిజమైన పురుషుడు. జీవితంలో దెబ్బతిన్నాక చాలామంది శరణాగతులౌతారు. అదేమీ గొప్ప విషయం కాదు. కాని ముందుగానే తాను అల్పజీవినని గుర్తించి, శ్రీవేంకటేశ్వరుని శరణుజొచ్చినవాడు నిజమైన మోక్షార్హుడు. దీనిలో అణుమాత్రం సందియమవసరంలేదు.

**కం॥ అందుకులోనేగాకా,**

**పొందుగ హరి దలచునట్టి పురుషుడె ఘనుడౌ**

**సుందరుడు వేంకటేశుని**

**ముందుగ శరణన్నవాడె ముక్తిని బడయున్.**

**భావోద్దేశ్యము :**

అందుకెల్లా (అటువంటి చిత్తభ్రమలకు) లోనుగాక (లొంగిపోక) అట్టే హెచ్చరికతో వుంటె పొందుగా హరిని దలచే పురుషుడే నిజమైన ఘనుడు.

మానవులకు ప్రతిసారి చలములు (పట్టుదలలు) పుట్టించుటకు మాత్సర్యము పెరుగుటకు కారణము నానావిధములుగా వుంటుంది. వీని తలపులు వీనిని భ్రమింపజేస్తుంటాయి. ఒక్కొక్కసారి ఆ తలపులే వేడుక గలిగిస్తుంటాయి. అనేక రూపములలో అనేకమార్లు అవి మనయెదుటనే నిలుస్తాయి.

తగవులు దిద్దించ (సర్దుబాటు చేయుటకు) తగని అలమట (చింతలు) పెట్టుటకు తగులుకొనే బంధములే కారణము సుమా! పగ సాధించటానికి అనేకమైన ఉపాయాలు అలవాటవుతుంటాయి. ఆలోచిస్తే ఇవన్నీ నెపములే.

తేరకే (వ్యర్థముగా) మేనలయించి (శరీరమును శ్రమపెట్టి) దేశమునంతా ఆవటించ (పొందుపరచగా) అనేకమైన ప్రయత్నాలు వూరకనే జరుగుతాయి. అట్టివారు కాలము వ్యర్థము చేయకుండా శ్రీవేంకటేశుని నమ్ముకొంటే, నిశ్చింతుడై ఆ స్వామిని కొలిస్తే అట్టివారి మదిలో ఆనందం వెల్లివిరుస్తుంది.

సంఖ్య : XV/262 రాగం : భైరవి

కీర్తన : అక్కటా ప్రాణికిని అహంబ్రహ్మత్వమే కాని

**3 అక్కటా ప్రాణికిని అహంబ్రహ్మత్వమే కాని**
**దిక్కు దెస యైనవానిఁ దెలుసుకో నోపఁడు ॥పల్లవి॥**

**కలలోన సృజియించుఁ గర్తయై యంతర్యామి**
**లలిఁ బ్రపంచ మింద్రజాలములవలె**
**తల పోయు జీవుఁడు తనకృత్యములు గావు**
**వెలి నెందుఁ బుట్టె నని విచారించుకోఁడు ॥అక్కటా॥**

**యెదుటనే పొడమించు యీ రూపు లాత్మేశుఁడు**
**కదిసి పురాణముల కతలవలె**
**వదలక జీవుఁ డెవ్వరిని నేమించలేఁడు**
**పదరక మూలముట్టు భావించుకోఁడు ॥అక్కటా॥**

**కనిపించు మోక్ష మిక్కడ శ్రీవేంకటేశుఁడు**
**పనివడి తన తపఃఫలమువలె**
**ఘనతఁ బొందుజీవుఁ డే కర్మమువాఁడుగాఁడు**
**గొనకొన్న మహిమల గుఱు తెంచుకొనఁడు ॥అక్కటా॥**

**ఉపోద్ఘాతము :**

పెదతిరుమలయ్య చెప్పిన క్లిష్టమైన కీర్తన ఇది. దీని వివరణ కూడా కొంత అస్పష్టంగానే వుండవచ్చు. నా ప్రయత్నం నేను చేస్తాను. భారం మాత్రము ఆ బ్రహ్మాండనాయకునిదే. మెట్ట వేదాంతం వల్లించే ఘనులు పరబ్రహ్మ తత్త్వం తెలియలేరు. జీవుడు ముక్తుడయ్యేదాకా తాను బ్రహ్మస్వరూపుడనని మనస్ఫూర్తిగా భావించడు. నోటితో చిలుకపలుకులవలె "అహంబ్రహ్మోస్మి" అంటే అది అర్థంలేనిపని. నీకు జీవి స్పృహవున్నంతవరకు నీవు ముక్తుడవు కాలేవు. శ్రీవేంకటేశుని శరణనక ఆయన ధ్యానంలో అంతర్ముఖుడు కాక కర్మఫలత్యాగి కాలేడు. అదిగాక ఏమి చేసినా ఫలితంలేని శ్రమయే.

**తే.గీ॥ తానె బ్రహ్మమునని యెంచు హీనప్రాణి**
**దిక్కుదశ తనకెవ్వడో తెలియలేదు**
**వేంకటేశుని శరణని వేడుదనుక**
**ముక్తి జీవుండు యెన్నడూ పొందలేదు.**

**భావోద్దేశ్యము :**

అక్కటా (అయ్యో!) "అహం బ్రహ్మాస్మి" (నేనే పరబ్రహ్మను) అని చిలుకపలుకులు పలికే అహంకారియైన ప్రాణి (జీవాత్ముడు) ఈ సర్వజగత్తుకు దిక్కుదెస (ఆధారమైన) పరమాత్మను తెలుసుకొనలేదు. వాని అహంకారమే వాని పతన హేతువు.

ఇంద్రజాలము చేయువారు లేనివి వున్నట్లు భ్రమ కల్పింతురు. అట్లే మనని నడిపించు అంతర్యామి తన కలలో, లేని ప్రపంచమును వున్నట్లు కల జరుగుతున్నంతసేపు తానే కర్తనని భ్రమిస్తుంటాడు. జీవుడు నిద్రలేచాక అవి తను చేసిన పనులు కావని తెలుసుకొంటాడు. కాని అవి తన మనస్సులోనైనా యెటుల పుట్టాయి అని గ్రహించలేడు.

ఈ రూపాలనన్నింటిని అంతర్యామి తన ఆత్మలోనే పొడమించు (పుట్టించుకొంటాడు). పురాణాల కథలలో పదితలల రావణాసురుడు ఎలా వుంటాడో వీడు యెన్నడూ చూడకపోయినా భావించడా? అట్లాగే అంతర్యామి భావనలే అన్నీ. అందుకనే జీవుడు వీటికెవ్వరు బాధ్యులని నేమించలేడు (నియమించలేడు). పదరక (చలించిపోక) మూలముట్టు (ఆ మూలము) జరిగిందేమిటో భావించలేడు. వీటి కర్తయెవరో గ్రహించలేడు.

కనుల యెదుటే కనుపించే మోక్షదాత ఈ శ్రీవేంకటేశ్వరుడు. ఇది వీడు యే జన్మలోనో చేసిన తపః ఫలము. తాను ఘనత పొందినా జీవుడు ఆ తపఃఫలము వలననే. వాడు యేనాటికీ ఆ ఘనతకు కర్తకాడు. అది వాడి కర్మప్రాప్తమే. కాని ఆ కర్మప్రాప్తికి కారణమైన "వాడి" మహిమను గుర్తించలేడు. అదే "అహంబ్రహ్మాస్మి" అనే అహంభావం. దాన్నే అజ్ఞానం అంటారు.

సంఖ్య : II/490 రాగం : దేవగాంధారి

కీర్తన : అడ్డము చెప్పగరాదు అవుగాదనగరాదు

**4 అడ్డము చెప్పఁగరాదు అవుఁగాదనఁగరాదు**
**వొడ్డిన దనుభవించే దోపిక జీవులది ॥పల్లవి॥**

**యీరికలెత్తె జన్మము లిన్ని జంతువులయందు**
**కోరికలు గొనసాగెఁ గోటానఁగోటి**
**నారుకొనె సంపదలు నానారూపములై**
**తీరదేమిటా నీచిక్కు దేవుఁడు వెట్టినది ॥అడ్డ॥**

**అల్లుకొనెఁ గర్మములు అక్కడికి నిక్కడికి**
**వెల్లవిరాయను మాయ వెనకా ముందు**
**కెల్లురేఁగె దేహమందే కిమ్ములచుట్టరికాలు**
**పొల్లువో దెన్నఁడు భూమి పుట్టఁగాఁ బుట్టినది ॥అడ్డ॥**

**పండెను సంసారము ఫలమైననానాఁటికి**
**నిండెను నాలికకు నెమ్మదిఁ జవులు**
**అండనే శ్రీవేంకటేశుఁ దంతర్యామై వుండి**
**వండ వండనట్లుగ (?) వన్నె కెక్కించినది ॥అడ్డ॥490**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య ఈ కీర్తనలో యేమంటున్నారంటే జీవుల కర్మానుసారంగా వారికి జన్మ ప్రసాదిస్తున్నప్పుడే వారికి భాగ్యమును లిఖిస్తాడు, పరమాత్మ. ఆయన ఇచ్చిన దానిని స్వీకరించక తప్పదు. ఔననక కాదనరాదు. ఆయన ఒడ్డించినదనుభవించియే తీరవలయును. నానారూపములైన సంపదలిస్తాడు. ఎట్లా ఇచ్చాడో అట్లాగే లాగేసుకొంటాడు. అల్లుకొన్న కర్మననుభవించక తప్పదు. భూమి పుట్టిన నాటినుంచి ఇది పొల్లుపోని సత్యం. ఈ పండిపోయిన సంసారంలో నాలుకకు రుచులు దేహానికి సుఖేచ్ఛ అతి సహజము. అది వేంకటేశుని ఆజ్ఞ. అనుభవించక యెవ్వడికీ తప్పదు.

**ఉ॥ అడ్డము జెప్పగా తగదు ఔనని కాదనరాదు యెన్నడున్**
**వొడ్డినదెన్నడేనిగొని ఓపికతో అనుభూతి జెందగా**
**దొడ్డతనంబునన్ బ్రతుకు దోగును కర్మము తీరిపోవురా**
**చెడ్డను మాటవుండదురచెల్వపు వేంకటరాయడౌననున్**

**భావోద్దేశ్యము :**

ఒడ్డినది (భగవంతుడు ఒడ్డించినది) అనుభవించక జీవులకు తప్పదు. వారి వారి ఓపిక అయినప్పటికి, యెన్నడు అడ్డము చెప్పకూడదు. ఔననవలసిందేగాని, కాదనకూడదు. అప్పుడే ఈ జీవిని చూచి దేవుడు తృప్తి చెందుతాడు.

ఈరికలెత్తే (అంకురించే) అనేక జంతు జన్మలలో కోరికలు కొనసాగుతూనే వుంటాయి. అందులో వాటి సంపదలు కూడా నానారకాలుగా వుంటాయి. కొన్ని జంతువులు సులభంగా మంచి ఆహారం సంపాదించుకొంటే కొన్ని ఇతరుల ఆహారం దొంగిలించి తింటూ నిందింపబడుతూ బ్రతుకుతాయి. దేవుడు ఇట్లాంటి చిక్కులెందుకు పెడతాడో తెలియదు.

మాయవెల్లివిరై వెనకాముందు కమ్మివేయుట చేత, కర్మలు ఆ జీవులను వశపరచుకొని, అల్లుకొనిపోయి అక్కడికి ఇక్కడికి తిప్పి వారిని నానాతిప్పలు పెడుతుంటాయి. ఈ దేహంతోటే కలిగిన చుట్టరికాలు మభ్యపెట్టి యెందుకూ పనికిరానివాణ్ణి చేస్తాయి. ఈ పీడ మన భూమిపై జీవులు పుట్టిననాటి నుంచి వున్నదే.

ఈ సంసారఫలము పండిన నాటినుంచి నాలికకు రుచులు అంటే అనుభవం కలిగి ఆశ మొదలైనది. అది చెలరేగకుండా వుండేందుకే శ్రీవేంకటేశుడు మన అంతర్యామియై వుంటాడు. పండు పండి రుచిపెరిగి వన్నె కెక్కినట్లు మన జన్మసిద్ధినొందుటకు ఆయన సహాయపడతాడు.

సంఖ్య : II/185 రాగం : శంకరాభరణం

కీర్తన : అది నే నెఱగనా అంతలో భ్రమతుగాక

**5 అది నే నెఱగనా అంతలో భ్రమతుగాక**
**మదనజనక నాకు మంచిబుద్ధి యియ్యవే ॥పల్లవి॥**

**యెంత లోకానుభవము అంతయు వ్రిథా నష్టి**
**కొంతైనా బ్రహ్మచింత కోటిలాభము**
**వింతైన జనులతోడి వినోదము నిష్ఫలము**
**చెంత సజ్జనసంగతి చేరినయాదాయము ॥అదినే॥**

**నానాదేశవార్తలు జింతామూలము**
**పూనిన పురాణగోష్ఠి పుణ్యమూలము**
**ఆనినకృషివాణిజ్యాలన్నియు దీరనివెట్టి**
**మాననియాచార మాత్మకు బడ్డపాటు ॥అదినే॥**

**పలుచుట్టరికములు బట్టబయలుతగుళ్ళు**
**చెలగునాచార్యసేవ జీవన్ముక్తి**
**బలిమి శ్రీవేంకటేశ పరగ రెండువిధాలు**
**నిలుకడయినవాడవూ నీవే యిన్నిటికి ॥అదినే॥**

**ఉపోద్ఘాతము :**

మంచి సాహిత్యం చదివిన వారికి, పురాణగాధలను విన్నవారికి సజ్జనులతో చెలిమిచేసేవారికి మంచి బుద్ధికలుగుతుంది. ఇందులో ఆశ్చర్యమేమీలేదు. కాని మానవునికి యెన్నో భ్రమలు కలుగుతుంటాయి. ఆ భ్రమవల్ల యుక్తాయుక్త విచక్షణ మరచి చెడుబుద్ధి ఆవహించి దుష్కర్మలు చేసి పాపము మూటకట్టుకొంటుంటాము. ఈ పీడనుంచి మనను శ్రీవేంకటేశ్వరుడే రక్షించగలడు. అందుకే అన్నమయ్య రెండు విధముల నిలకడ వాడైన తిరుమలేశుని నమ్ముకమ్మంటున్నారు. అంటే?

కం॥ **అదినేనెఱిగినదైనను**
**చెదురుచు భ్రమయుదును దేవ! చిత్తజుజనకా!**
**కుదిరిన సద్బుద్ధియము**
**ఇదె జీవన్ముక్తి పథము హితవేంకన్నా!**

**భావోద్దేశ్యము :**

అది (జీవన్ముక్తి పొందాలనుకొనేవారు ముందు అరిషడ్వర్గాలను జయించి సజ్జన సాంగత్యంలో శ్రీహరి శరణాగతితో జీవించాలి, అనే జీవిత సత్యము) నేనెఱుగని కొత్త విషయము కాదు. అయినా శ్రీపతి మాయలో దగిలి మధ్యలో భ్రమ కలుగుతుంది. మళ్ళీ ఈ లంపటంలో పడిపోతుంటాను. మదన జనకా! ఈ భ్రమలకు మొదటి ముద్దాయి మన్మథుని తండ్రీ!) మాకు మంచి బుద్ధి ప్రసాదించవయ్యా!

ప్రభూ! యెంత లోకానుభవమున్నా, "అది" లేకపోతే అంతా వృథా. అంతా నష్టభూయిష్టమే. కొంతయైనా బ్రహ్మచింతన వుంటే, దానివలన కోటి లాభాలు కలుగుతాయి. వింత కలిగించే లంపటాల పీకులాటలోనే సంతోషముంది అని భావించేవారి వినోదాలు నిష్ఫలము. సజ్జన సాంగత్యమొక్కటే మంచి ఆదాయము (రాబడి) నిస్తుంది.

దేవా! నానా ప్రదేశముల వార్తలు తెలుసుకోవాలనుకోవటం చింతకు మూలము. అదే సమయం మంచి పురాణ పఠనానికి వెచ్చిస్తే అది పుణ్యానికి మూలమౌతుంది. ఆనిన (అవలంభించే) కృషి (వ్యవసాయమ) వ్యాపారము తీరని వెట్టిచాకిరిగానే మిగిలిపోతాయి. మనము ఆచారము అనుకొని జీవితాంతం పాటించేది ఆత్మతృప్తికి పడేపాట్లే.

స్వామీ! మా చుట్టరికాలన్నీ బాహాటంగా మేము పెట్టుకొన్న తగులములు (చిక్కులు) అతిశయించిన మా సద్గురుని సేవ జీవన్ముక్తి పథము. ఓ శ్రీవేంకటాధిపా! నీవొక్కడివే రెండు విధాలా నిలకడ అయినవాడవు (బ్రతికుండగా ఇహలోక సుఖములు, దేహాంతమున పరలోక సుఖములు, రెండూ అనుగ్రహిస్తావు.)

సంఖ్య : IV/29 రాగం : సారంగ
కీర్తన : అనాది జగమున కౌభళము

**6 అనాది జగమున కౌభళము**
**అనేకాద్భుతం బౌభళము** ॥పల్లవి॥

**హరినివాస మీ యౌభళము**
**అరిది పరమపద మౌభళము**
**అరిదైత్యాంతక మౌభళము**
**హరముఖసేవిత మౌభళము** ॥అనాది॥

**అమలరమాకర మౌభళము**
**అమితమునీంద్రం బౌభళము**
**అమరవందితం బౌభళము**
**అమరె బుణ్యముల బౌభళము** ॥అనాది॥

**అగరాజంబీ యౌభళము**
**అగణితతీర్థం బౌభళము**
**తగు శ్రీవేంకటధామవిహారం**
**బగు శుభాంచితం బౌభళము** ॥అనాది॥

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య చాలా కీర్తనలు సన్నుతి కీర్తనలుగా చెప్పారు. వీటిలో వివరించవలసిన కథగాని, పురాణ విశేషముకాని కొరుకుడుపడని భాషాపాటవము కాని ఆవశ్యకతకు నోచుకోవు.

అగణిత భక్తితో సన్నుతించడమే అంతిమధ్యేయం. అహోబలము కొండను జానపదులు దైనందిన జీవితంలో ఔభళము అని పిలుస్తుంటారు. సామాన్య జనులకే అంకితమైన పదకవితాపితామహుని “ఔభళ సన్నుతి” నాస్వాదించండి.

సీ॥ **హరినివాసంబది, అరిది పరమపదం-**
**బైనది యిదెసుండి! ఔభళంబు**
**అసురాంతకంబిది హరవిరించ్యాదులు**
**అందరు సేవించు ఔభళంబు**
**మాలక్ష్మి నిలయము మౌనీంద్రవాసంబు**
**అమలంబు యీకొండ ఔభళంబు**
**అమరవందితమిది అమరుపుణ్యములన్ని**
**అడుగిడినంతనే ఔభళంబు,**

**తే.గీ॥ అగణితంబైనతీర్థంబు అతిసులభము,**
**జగమునకనాది అద్భుతమగుననిదియె**
**వేంకటేశు విహారంబు వెలయు శుభము**
**అవని అగరాజమీకొండ ఔభళంబు**

**భావోద్దేశ్యము :**

ఈ జగము అనాదియైనది. దీనికి యేలిక అహోబలేశ్వరుడైన నరసింహ స్వామి. ఈ పుణ్యక్షేత్రమునే జానపదులు ఓభళము (ఓబులము) అంటారు. ఈ క్షేత్రము అనేక అద్భుతములకు స్థానము.

ఇది హరి నివాసము (శ్రీహరి మరియు నృసింహులకు నిలయము.) ఇదే పరమ పదము అయిన వైకుంఠము. శత్రువులైన రాక్షసాంతకము ఓభళము. శివుడు, బ్రహ్మ వంటి ముఖ్యులు సేవించునదే ఔభళము.

నిర్మలయైన రమ (శ్రీలక్ష్మి)కి నివాసము ఇదే. అంతులేని మునీంద్రుల కాలవాలము ఈ ఓభళము. ఇది దేవతలచే స్తుతింపబడు క్షేత్రము. పుణ్యములన్నీ అమరుక్షేత్రమే ఈ ఓభళము.

అగరాజము (కొండలన్నిటిలోకి రాజు వంటిది) ఈ ఓభళము. అగణితతీర్థము (సాటిలేని మేటి పుణ్యక్షేత్రము) ఇదియే. శ్రీవేంకటధాముడైన తిరుమలేశుడు విహరించు పుణ్యస్థలమే ఈ ఓభళము. ఈ ఔభళము శుభముల వలన అంచితము (పూజింపబడునది) ఇదియే.

సంఖ్య : II/189 రాగం : గుజ్జరి
కీర్తన : అన్నియు నడుగవే నేనే మఱచితి నవి హరి నీకే తెలిసినవి

**7 అన్నియు నడుగవే నేనే మఱచితి నవి హరి నీకే తెలిసినవి**
**మన్నించి నా కీజన్మ మొసఁగితివి మర్మగాఁడు మన్మథుఁ డొఁకడు ॥పల్లవి॥**

**పలుజన్మంబుల నేఁ ద్రాగినచనుఁబాలు గొలచితే నెన్నొనో**
**తలిదండ్రులు మరియెందరో తా మెక్కడ నున్నారో**
**తిలకింపఁగ నాహారంబునకును తెగినకొలుచు లవి యెన్నెన్నో**
**యిలపై నే బ్రదికినకాలము యెంతని వ్రాసెనో చిత్రగుప్తుఁడు ॥అన్ని॥**

**చినుఁగఁగఁ జినుఁగఁగఁ గట్టుకోకలకుఁ జెల్లినపత్తి దా నదియంతో**
**కనక మెంతో నా కాభరణములై కాయంబులతో నొరసినది**
**పెనఁగి రమించినకామినీమణులపేరు లెన్నియో తొల్లిటివి**
**ఘనముగ నను నిటు భోగించఁజేసినకర్మమే యెఱుఁగు నివియెల్లా ॥అన్ని॥**

**గరిమల నే గడియించినయిండ్లుఁ గాణాచిచోట్లు యేదేడో**
**పొరలినయిడుమలు యెందుకెక్కెనో పొదలితి భువిపై నిన్నాళ్లు**
**అరయఁగ నందరి కంతర్యామివి అఖిలకారణంబును నీవే**
**నిరతపు శ్రీవేంకటేశ్వర దయగలనీచిత్త మెటువలెఁ దలచీనో ॥అన్ని॥189**

**ఉపోద్ఘాతము :**

అత్యద్భుతమైన తత్త్వబోధను చేస్తున్నారు అన్నమయ్య. హరి నన్నీ భువిపైకి పంపెముందు నాకు అయ్యో ఇక ఈ జన్మలోనైనా నాకు ముక్తినీయవయ్యా! హరీ! అని అడగాలనుకొన్నాను. కాని మఱచిపోయాను. మర్మగాడైన ఆ తుంటరి మన్మథుని వలన నేను పుట్టవలసివచ్చింది. ఆ తరువాత నాపాట్లు యేమని చెప్పను. ఇది విను స్వామీ!

సీ॥ **ఎంతమందికి బుట్టి యెన్ని చన్నులు పీల్చి**
**ఎంత తిండిని మెక్కియేచినాను**
**చిత్రగుప్తుండేమిచేవ్రాలు నుదుటిపై**
**ఎన్నాళ్ళు బ్రతుకీడ్వపన్నినాడొ?**

**ఎన్నికోకలు గట్టి ఎన్ని సొమ్ములువెట్టి**
**ఎన్ని సంభోగాల యెనసినాడొ?**

**ఎన్ని ఇండ్లను గట్టి ఎన్ని ఇక్కట్లంది**
**పుట్టులు చావులు పొంది నానొ?**

**తే.గీ॥ అంతరాత్ముడ వఖిలంబు లన్నినీవె**
**మన్మథునిమాయ బుట్టితి మహినినేను**
**ఎటుల దయజూతువోనన్ను యేనెరుగను**
**వేడెదను నన్ను గావవే వేంకటేశ!**

**భావోద్దేశ్యము :**

అన్నియును అడగవలెననుకొన్నాను. కాని నేనే యవి మఱచితిని. అయినా శ్రీహరీ! నీకన్నీ తెలుసును కదా! నన్ను మన్నించి నీ పుత్రుడైన మన్మథుని నీవు ప్రేరేపించడం వలన నాపుట్టుకకు అవకాశం దొరికింది. ఆ మన్మథుడు మర్మగాడు. కాని అన్నిటికీ మూలకారణంమాత్రం నీవే.

ప్రభూ! నన్నేమి చెప్పమంటావు? ఎంత చెప్పమంటావు? నేను పొందిన పలుజన్మంబులలో యెన్ని చన్నుల పాలుత్రాగానో, అవి కొలిచిన యెన్నానో యెవరికి తెలుసు? ఎంతమందిని తల్లిదండ్రులుగా పొందానో వాళ్ళంతా ఇప్పుడెక్కడున్నారో? ఎంత ఆహారం మెక్కానో యెవరు కొలిచి చెప్పగలరు? పోనీ ఈ జన్మలో ఇన్నేళ్ళు బ్రతుకునీడువరా అని చిత్రగుప్తులవారు వ్రాసినారో చెప్పగలవారెవరు? నాకు తెలియదు నీకు తెలిసినా చెప్పవు.

స్వామీ! నేను కట్టుకొని చింపి పారవేసిన బట్టలకి ఇన్ని జన్మలలోనూ యెంతపత్తి పట్టిందో చెప్పగల మొనగాడెవడు? నా శరీరాలు యెన్ని నగలను మోసినవో దానికెంత బంగారం పట్టిందో లెక్కకట్టగల మొనగాడెవడు? నేను రమించి పెనగిన కాంతలు ఈ జన్మలో యెందరో ఈ జన్మలన్నింటిలో మరింక యెందరో చెప్పగల గణికుడెవడు? నన్ను ఇట్లా భోగింపజేసిన నా కర్మమే యెఱుగునుగాని నేనెరుగుదునా?

దేవా! ఈ జన్మలో నేను గడించిన ఇండ్లెన్నియో కాణాచి (చిరకాలపు స్థావరాలు) మరింకెన్నో అవి యెక్కడెక్కడున్నాయో వృద్ధాప్యపు మతిమరపు వలన నాకే తెలియదు. ఎన్ని ఇడుముల పాలు కావలసివస్తుందో తెలియదు. ఈ భూమి మీద యెన్నాళుంటానో తెలియదు. ఒక్కటి మాత్రం నిజం. అరయ (యెంచి చూస్తే) ఈ జీవులందరికీ అంతర్యామి అని పిలువబడే ఆత్మవు నీవే. అఖిల సృష్ఠికి కారణం నీవే. నిరతపు (శాశ్వతుడవైన) ఓ శ్రీవేంకటేశ్వరా! దయాసముద్రుడవైన నీ చిత్తము యెట్లావున్నదో యేమి తలచేనో నీకు తప్ప పరులకు తెలియునా?

సంఖ్య : 00 రాగం : మాయామాళవగౌళ

కీర్తన : అరుదరుదు నీమాయ హరిహరీ

**8 అరుదరుదు నీమాయ హరిహరీ**
**అరసి తెలియరాదు హరిహరీ ॥పల్లవి॥**

**అనంత బ్రహ్మాండము లవె రోమకూపముల**
**అనంతములై వున్నవి హరిహరీ**
**పొనఁగి కుంగిన వొక్కభూమి నీ వెత్తినది యే-**
**మని నుతింతు నిన్ను హరిహరీ ॥అరుద॥**

**పొదిగి బ్రహ్మాదులు నీబొడ్డున నేకాలము**
**అదివో పుట్టుచున్నారు హరిహరీ**
**పొదలి యీ జీవులను పుట్టించే యీ సామర్థ్యము**
**అదన వేమనిచెప్పే హరిహరీ ॥అరుద॥**

**పావన వైకుంఠము నీపాదమూలమం దున్నది**
**ఆవహించేభక్తిచేత హరిహరీ**
**శ్రీవేంకటాద్రిమీఁద చేరి నీ విట్టె వుండఁగా**
**నావల వెదకనేల హరిహరీ ॥అరుద॥**

**ఉపోద్ఘాతము :**

ఓ హరీ శ్రీహరీ! నీ మాయ అరుదైన వాటిలోనే అరుదైనది అంటున్నారు పల్లవిలోనే అన్నమయ్య. బ్రహ్మాది దేవతలే దర్శించి నీమాయ గ్రహించలేరు. అటువంటప్పుడు సామాన్యులైన మానవమాత్రులు యెట్లు గ్రహించగలరు. ఈ దేవదేవుని వైభవము యెవరికి తెలియును. కొసమెరుపుగా చక్కటిసత్యం చెబుతున్నారు ఈ వేంకటాద్రిమీద స్వయంగా పరమాత్మే వుంటే ఆవల వేరే హరిని వెదకనేల అంటున్నారు.

**ఆ.వె॥ వేంకటాద్రిమీద విరిసెను నీలీల**
**అరసి తెలియలేని దది హరిహరి !**
**అత్యరుదు హరిహరి! అమితంబు నీ మాయ**
**అవలవెదకనేల అలముకొనియె.**

**భావోద్దేశ్యము :**

ఓహరీ! శ్రీహరీ! నీ మాయలు అరుదరుదు (అరుదైన వాటిలోనే అరుదైనవి). ప్రభూ! నీ మాయలను అరసి (జ్ఞానేంద్రియములతో) తెలియరానివి తండ్రీ!

ఈ విశ్వములోని అనంతమైన బ్రహ్మాండములున్నవి. అవి యెక్కడనోలేవు, అనంతమైన నీ రోమకూపములలోనే వున్నవి. ఈ భూమి కూడా ద్వాపరయుగంలో సముద్రంలోకి క్రుంగిపోతుంటే బలరాముడివై నీ హలాయుధముతో దానిని పైకెత్తి సరిచేశావు. ఏమని నుతింతును శ్రీహరీ!

బ్రహ్మదేవుడు నీ నాభికమలమున పుట్టి సృష్టికర్తయై యేకాలము (నిరంతరము) తన కర్తవ్యము నీ ఆజ్ఞానుసారము పాలించుచున్నాడు. అందువల్లనే జీవులు పుట్టుచున్నారయ్యా! శ్రీహరీ! ఇన్ని జీవులును ఇన్ని జాతులుగానూ, ఆ జాతులలోనే ప్రతి ఒక్క జీవి మనుగడ నీ నిర్ణయము ప్రకారము జరుగునట్లు నిర్వహించుచున్నావు. నీ సామర్థ్యమునేమని, యెంతని చెప్పగలను?

ఏవైకుంఠప్రాప్తి తమ ధ్యేయమని యోగులూ, ఋషులూ పరిణత నొందిన జీవకోట్లు దీక్ష వహిస్తారో అది నీపాదములచెంతనే వున్నది. దానిని పొందే మార్గం నీపై అనన్యభక్తి ఒక్కటే. మాబోటి వారికి అదీ కష్టమే. అట్టి మా కోసం, తిరుమలపై వెలసి ఒకే ఒక్కసారి ఓం నమో వేంకటేశాయ అంటే ఇహపరముల రెంటినీ ఇస్తున్నావు. ఇంత సౌలభ్యం నీవిస్తుంటే ఆవల మరి నిన్ను వెదకుట దేనికి తండ్రీ?

సంఖ్య : XV/253 రాగం : ఖమాస్

కీర్తన : అల్లనాడే కంటి వింటి అధోక్షజా

**9 అల్లనాఁడె కంటి వింటి అధోక్షజా**
**అల్లుకొంటి విని చెలుల నధోక్షజా** ॥పల్లవి॥

**అందు విందు నీ యిర వధోక్షజా**
**అందాలు చెప్ప వచ్చే వధోక్షజా**
**అందరు నెఱుఁగుదురు యధోక్షజా మాకు**
**నందుకొని బాసిచ్చే వధోక్షజా** ॥అల్ల॥

**అంగడి మొక్కువారమా అధోక్షజా నీకే**
**యంగము యీ నడవడి యధోక్షజా**
**అంగజ ముద్రలు నించే వధోక్షజా నీ**
**యంగనలు గాదనేరా యధోక్షజా** ॥అల్ల॥

**అనరాదు గాన నిన్ను అధోక్షజా కడు**
**ననుకాయెఁ బ్రియములు అధోక్షజా**
**అనుఁగు శ్రీవెంకటాద్రి యధోక్షజా మమ్ము**
**ననిశముఁ గూడితివి యధోక్షజా** ॥అల్ల॥

**ఉపోద్ఘాతము :**

అధోక్షజుడు అని శ్రీమహావిష్ణువును పిలుస్తున్నారు. ఆయనకు పుట్టుక లేకపోయినా సృష్టి నిర్వహణ బాధ్యత వలన శరీరము ధరించి పుట్టుకను పొందుతాడు. దానినే "అవతారము" అంటారు. అట్లా తనకు తానే తక్కువ జన్మపొంది దుష్టశిక్షణ, శిష్ట రక్షణ చేసినవాడు అధోక్షజుడు. చేపగా తాబేలుగా, వరాహముగా, నరుడు మృగమూకాని నరమృగరూపిగా, అతిపొట్టివాడైన వామనునిగా, దుష్టులను చీల్చి చెండాడిన పరుశురామునిగా, ధనుజదమనుడు శ్రీరామునిగా, ధర్మసంస్థాపక కృష్ణయ్యగా, త్రిపురారి అయిన బుద్ధదేవునిగా కలినిర్మూలకుడు కల్కిగా, కామనలు తీర్చే శ్రీవేంకటేశ్వరునిగా అవతరించినదీ "అధోక్షజుడే" అంటున్నారు అన్నమయ్య సుపుత్రుడైన పెదతిరుమలయ్య.

**కం॥ అలనాడె కంటివింటిని**
**చెలులను చుట్టేసెదౌర ! చెలువల ప్రియుడా!**
**వలపుల అధోక్షజుడవని**
**కొలుతుము శ్రీవేంకటేశ! కూడితివి ప్రభూ!**

**భావోద్దేశ్యము :**

భూమిపై జీవుల శరీరంతో పుట్టి ధర్మపాలనా బాధ్యత నిర్వహించే శ్రీమన్నారాయణుడా! నీవు “అధోక్షజుడ”వని అల్లనాడే (పురాణ కాలమునాడే), వింటిమి. అదృష్టవంతులమైన కొందరము కంటిమి కూడ. మాలో మిక్కిలి అదృష్టవంతులైన, చెలులను అధోక్షజుడవై అల్లుకొంటివి కదా!

నా నోటితో నీయొక్క వునికి వున్నది అంటాను. చెవులతో వింటాను. నీవు అందాలను ప్రశంసించే అధోక్షజుడవు. ఇది అందరూ యెఱిగిన సత్యమే. మమ్మల్ని అందుకొని నీ అంతట నీవే ‘బాగు’ ఇచ్చావు. మరువవద్దు అధోక్షజా!

అంగడి మొక్కువారమా? (నీ కొలువులోని దాసీ జనమువలె మొక్కేవారమా యేమి?) ఈ నీ ప్రవర్తన ఉపాయములతో కూడియున్నది. అంగజముద్రలు నించేవు (ముద్దుల గుర్తులతో మమ్మల్ని నింపేస్తావు) కదా! అధోక్షజా! వాటి రుచి తెలిసిన నీ అంగనలు నిన్ను కాదనగలరా ప్రియా!

ఓ అధోక్షజా! నిన్నేమీ అనలేకున్నామయ్యా! నీ ప్రియములు కడున్ అనుకాయె (నీ వలపు చేష్టలు మిక్కిలి విచ్చలవిడియైనవి). నీవు అనుగు (ప్రియమైన) శ్రీవేంకటేశ్వరుడవు. మమ్ము అనిశము (యెల్లవేళలా) కూడితివి అధోక్షజా! మా జన్మ తరించినది.

సంఖ్య : II/277 రాగం : గౌళ

కీర్తన : ఆతురబంధుగుఁడవు హరినారాయణ కృష్ణ

**10 ఆతురబంధుగుఁడవు హరినారయణ కృష్ణ**
**మాతలఁ పెటిఁగి నీవే మన్నించితి విపుడు ॥పల్లవి॥**

**గురుకుమారులఁ దెచ్చుకొని రక్షించినయట్లు**
**ధరలో గజరాజు నుద్ధరించినట్లు**
**గరిమఁ జెరలుమాన్పి కాంతలఁ బెండ్లాడినట్లు**
**సిరులతో మముఁ దెచ్చి సేవలు గైకొంటివి ॥ఆతుర॥**

**నేరుపుననే రుకుమిణిదేవిఁ దెచ్చినయట్లు**
**ధీరత మునిపుత్రులఁ దెచ్చినయట్లు**
**భారమైనయహల్యశాపము మానిపినయట్లు**
**గారవించి మము నేఁడు కరుణఁ జూచితివి ॥ఆతుర॥**

**లంక సాధించి సీతను లలిఁ జేకొనినయట్లు**
**తెంకికి ననిరుద్ధునిఁ దెచ్చినయట్లు**
**అంకెల శ్రీవేంకటేశ అట్టె నీదాసులమని**
**పొంకముగ మా పాలిటఁ బొసఁగి యేలితివి ॥ఆతుర॥**

**ఉపోద్ఘాతము :**

ఆతురబంధువు అంటే రోగపీడితులై ఆతృతపడు వారికి బంధువు అని అర్థం. ఓ హరినారాయణ కృష్ణా! నీవు రోగార్తులకు బంధువువయ్యా! నీవెంతమందిని ఆదుకొన్నావో చెప్పనలవికాదు. చనిపోయిన గురుపుత్రుని బ్రతికించావు, గజరాజుని కాపాడావు, పదియారువేల రాచకన్నెలను రక్షించావు. రుక్మిణిని శిశుపాలుని బారిన పడకుండా పెండ్లాడావు. మునిపుత్రులను, అహల్యను, చెరనున్న సీతను రక్షించావు. నేడు వేంకటపతివై దాసులకు దిక్కు అయినావు అంటున్నారు అన్నమయ్య.

కం॥ **ఆతుర బంధుగుడీవే**
**మాతలపుల నెరిగి నీవె మన్నింతువుగా**
**బ్రోతువు ఆర్తులు దిక్కన**
**హే తిరుమలనాథ! నీవె యేలికవు ప్రభూ!**

**భావోద్దేశ్యము :**

ఓ దేవదేవా! నీవు ఆతురబంధుడవు (రోగపీడితులకు బంధువువంటి వాడవు) ఓ హరినారాయణా! కృష్ణా! నీవు మా మనస్సులలోని ఆలోచనలను గ్రహించగలవు. మమ్మందరిని మన్నించితివి.

ప్రభూ! నీ లీలలను యేమని వర్ణించను. ఆనాడు చనిపోయి దివికేగిన నీ గురుపుత్రుని పునర్జీవుని చేసి గురువు ఋణం తీర్చావు. గజేంద్రుని మకరిబారినుండి రక్షించావు. నరకుని పీడ నుంచి పదియారువేల మంది రాచకన్నెలను వదలించి వారి కోరికపై అందరిని పెండ్లాడినావు. ఈనాడు మమ్ము పుడమిపై పుట్టించి మా సేవలు పొందుతున్నావు.

ఆనాడు నేర్పుతో రుక్మిణిని ద్వారకకు తెచ్చినట్లు, ధీరుడవై ముని పుత్రులను దెచ్చినట్లు, భారమై శిలవలెనున్న అహల్యకు జీవమొసంగినావు. ఇన్ని చేసిన వాడివి నన్ను గారవించి (ఆదరించి) నావు. నాపై దయకలిగి నన్ను కృపజూచినావు.

ఆనాడు త్రేతాయుగంలో సీతను అపహరించిన రావణుని లంకను వానరసేనతో ముట్టడించి యుద్ధంలో రాక్షస నిర్మూలన జేసి ప్రేమతో సీతాదేవిని స్వీకరించితివి. ద్వాపరయుగంలో బాణాసురుని చెఱలోనున్న నీ మనుమడు అనిరుద్ధుని విడిపించి పరమశివుని భక్తుడైన బాణుని కుమార్తెతో అనిరుద్ధుని పరిణయం జరిపించావు. నేడు అంకెల (అధీనుడవైన) వేంకటేశ్వరుడవై, మా పాలిట కరుణించి నీదాసులమైన మమ్ము యేలితివి.

సంఖ్య : IV/350 రాగం : సామంతం
కీర్తన : ఇందరిగాచిన నీవు యిట్టే నీవు నాకు

**11** **ఇందరిగాచిన నీవు యిట్టే నీవు నాకు**
**కందువ నిధానమవై కలవుగా నీవు** ॥పల్లవి॥

**అరసి ధ్రువుని గాచినట్టి నీవు**
**కరుణతోఁ బ్రహ్లాదుఁ గాచిన నీవు**
**కరిరాజు శరణంటేఁ గాచిన నీవు**
**కరతలామలకమై కలవుగా నీవు** ॥ఇందరి॥

**గట్టిగా విభీషణుఁగాచిన నీవు**
**అట్టె ద్రౌపదిఁ గాచినప్పటి నీవు**
**చెట్టవట్టి బలిఁగాచిన నీవు నాకు**
**కట్టిన ముడుపవై కలవుగా నీవు** ॥ఇందరి॥

**కమ్మర సుగ్రీవునిఁ గాచిన నీవు నేఁడు**
**కిమ్ముల లోకములు రక్షించే నీవు**
**నెమ్మది శ్రీవేంకటనిలయ నీవు మాకు**
**కమ్ముకొని దాపుదండై కలవుగా నీవు** ॥ఇందరి॥**350**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య చెప్పిన ఇటువంటి స్తోత్ర కీర్తనల ప్రత్యేకత యేమంటే ఇవి చక్కటి సీసపద్యంలో యథాతథంగా ఇమిడిపోతాయి. నేను చెప్పేది యెంత సత్యమో మీరే గమనించండి. నేను చెప్పబోయే ఇంతమందిని రక్షించిన నీవు నాకు నిధానమువంటివాడవు. ఎంతమందికి దాపు దండైనావయ్యా వేంకటనాథా!

సీ॥ **అరసి ధ్రువునిగాచు హరివి నీవేనయ్య!**
**కరుణతో ప్రహ్లాదుగాచినావు**
**కరిరాజు శరణంటె పరుగిడి కాచావు**
**కరతలామలకమై కలవు నీవు**
**కాచి విభీషణు గావించితివి రాజు**
**ద్రౌపది కాపదబాపినావు.**
**చేపట్టి బలిగాచి సేవలందించావు**
**కట్టిన ముడుపువై కలవు మాకు**

**తే.గీ॥ గాచి సుగ్రీవు కిష్కింధ కాన్కవెట్టి**
**ఇందరికి నిధానంబవై ఇంపుజేసి**
**వేంకటేశుడై భక్తుల వెతలు బాపి**
**దాపుదండైతివో ప్రభూ! దాసులకును.**

**భావోద్దేశ్యము :**

ఓ దేవదేవా! నీవింతమందిని గాచినావే? వారి కష్టములముందు నాదేపాటిది? నన్నూ కనికరించరాదా? సాటిలేని నిధానము (పెన్నిధివలె) నీవుండగా ఇంకా మాకు ఆందోళన దేనికయ్యా?

నీవు అలనాడు “ఓం నమో భగవతే వాసుదేవాయ” అని భజించిన బాలునికి ధ్రువమండలమిచ్చావు. అట్లాగే ఇంకొక బాలుడు ప్రహ్లాదునికోసం స్తంభంలో నరసింహుడుగా వెలసి హిరణ్యకశిపుని సంహరించావు. కారడవి చెఱువులో ఒక ఏనుగును నీవేతప్ప ఇతఃపరంబెరుగనని యేడ్చిందని పరుగులిడి రక్షించావు. నీవు నీ భక్తుల చేతిలోని ఉసిరికవు.

విభీషణుడు నిన్ను శరణువేడాడని రావణుని తమ్ముడని చూడక అభయమిచ్చిన శ్రీరామచంద్రుడవు, నీవే కదా! నిండు కురు సభలో ద్రౌపదీమాన రక్షకుడవు నీవేకదా! కృష్ణయ్యా? బలిని నిగ్రహించుటకే వామనుడు మూడడుగుల స్థలం యాచించి వానిని రసాతలానికి త్రొక్కివేసినా, వానికావలివానివై రాక్షసులకూ, పూజనీయుడవైనావు. ఈరోజు మేము కట్టే ఆపద ముడుపులకు మా ఆపదలు తీరుస్తున్నావు.

తరువాత శరణన్న సుగ్రీవునికోసం వాలిని (చెట్టుచాటు నుంచి) చంపి నీకు నీవే సాటి అనిపించుకొన్నావు. ఇదంతా నీకోసం కాక లోకరక్షణ కోసం చేశావు. నెమ్మది వాడివైన శ్రీవేంకటేశ్వరా! నీవు మమ్మల్ని, కమ్ముకొని అండదండవై మాబోటి నీదాసులను కంటికి రెప్పలా కాపాడుతున్నావు.

సంఖ్య : I/8 రాగం : కానడ

కీర్తన : ఇందిర నామము ఇందరికీ

**12 ఇందిర నామము ఇందరికీ**
**కుందరపు ముద్దవో గోవిందా** ॥పల్లవి॥

**అచ్చుత నామము అనంత నామము**
**ఇచ్చిన సంపద లిందరికీ**
**నచ్చిన సిరులు నాలుకతుదలు**
**కొచ్చి కొచ్చీ వో గోవిందా** ॥ఇందిర॥

**వైకుంఠనామము వరదనామము**
**ఈకడ నాకడ నిందరికీ**
**వాకుఁదెరపులు వన్నెలు లోకాలఁ**
**గూకులు వత్తులు వో గోవిందా** ॥ఇందిర॥

**పందరి నామము పరమ నామము**
**ఎండలు వాపెడి దిందరికీ**
**నిందు నిధానమై నిలిచిన పేరు**
**కొండల కోనేటి వో గోవింద** ॥ఇందిర॥

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య ఈ కీర్తనలో అనంత నామములతో విలసిల్లిన దేవదేవుడు కొండలలో నెలకొన్న కోనేటిరాయని అనేక నామముల వైభవమును కీర్తిస్తున్నారు. తొలినాటి కీర్తన అగుటంజేసి దీనిలో శ్రీవేంకట మకుటం బదులు కోనేటిరాయుడుగానే సంబోధింపబడ్డాడు స్వామి. అయితే ఈ గోవిందుని దేవేరి యైన ఇందిరాదేవి నామమును ధ్యానించని మానవమాత్రుడుండడు. అందరికీ ఆవిడ బంగారపు ముద్ద రూపంలో కావాలి కదా!

కం॥ **ఇందిరనామంబే కద!**
**ఇందరికిన్ ఆయెభళిర! హితమైనదిగా**
**కుందనపు ముద్దవలె గో-**
**విందా! కోనేటి రాయ! వేంకటనాథా!**

**భావోద్దేశ్యము :**

ఓ గోవిందా! ఇందిర (లక్ష్మీదేవి) నామము ఇందరికి (లోకులందరికి) కుందరపు (బంగారపు) ముద్దవలె ధనప్రాప్తి కలిగించి అవసరములను తీరుస్తుంది.

అచ్యుతుడు (నాశనములేనివాడు) అని పేరు గాంచిన వీనికి అనంతమైన నామములున్నవి. ఏ నామము జపించినా అమిత సంపదను ప్రసాదిస్తాడు. ఈ గోవిందుని నామము నాలుక చివర గుచ్చి గుచ్చి పెట్టుకొంటే కావలసిన సిరులు కలుగుతాయి.

వైకుంఠా! అని నోటితో పలికితే ఆ నామము వరదనామము (సంరక్షించే నామము). ఇది ఇందరికీ (భక్తులందరికి) ఈకడ (ఇహలోకమందునా) ఆకడ (పరలోకమందున) తప్పక మనలను రక్షిస్తుంది. ఓ గోవిందా! లోకాలలో నీ నామములు వాకుఁదెరపులు (మూగవానినైనా మాట్లాడించగలవు). అవి కూకులు వత్తులు (కృశించిపోనీయవు).

పందరి నామము (పాండురంగ విఠ్ఠలుని నామధేయము) పరమ పదము నొసగు శక్తి కలది. ఇది లోకులందరికి పాపములనబడు తీవ్రమైన ఎండలను నివారిస్తుంది. ఓ గోవిందుడా! కొండలలో నెలకొన్న కోనేటిరాయడువైన నీ శుభకర నామము పరిపూర్ణమైని నిధానమువలె నిలిచిన పేరు. (కనుక అందరూ “ఓం నమో వేంకటేశాయ” అని భక్తితో పలికి ఇహపరములను సాధించండి.)

సంఖ్య : II/493 రాగం : సాళంగనాట

కీర్తన : ఇచ్చినవాడు హరి పుచ్చుకొన్నవాడ నేను

13 ఇచ్చినవాఁడు హరి పుచ్చుకొన్నవాఁడ నేను
చెచ్చెరఁ దగవు లింకఁ జెప్పఁగదరో ॥పల్లవి॥

నిలిచినది జగము నిండినది భోగము
కలిగె జీవుల కొక్క కాణాచి
వలయశాసనాలు వడి నాల్గువేదములు
చలపట్టి జాణలు చదువుకోరో ॥ఇచ్చి॥

పారినవి మనసులు పట్టినది జననము
పోరు దీరెఁ గర్మములపొలమేర
కోరికలె సాక్షులు గుట్టలు త్రిగుణములు
వూరుఁ బేరుఁ దెలుసుక వొడఁబడరో ॥ఇచ్చి॥

దక్కినది ధర్మము తప్పనిది భాగ్యము
లెక్కించ నుదుటివ్రాలె లిఖితములు
యిక్కువ శ్రీవేంకటేశుఁ డిన్నిటికి మూలము
చిక్కులు వాపె నితని సేవించరో ॥ఇచ్చి॥493

**ఉపోద్ఘాతము :**

ఈ కీర్తనలో అన్నమయ్య సర్వమూ ఇచ్చేవాడు దేవుడైన శ్రీహరి. మరి పుచ్చుకొనేటివాడను జీవుడనైన నేను. ఇక అటువంటప్పుడు తగవు యేమి వున్నది చెప్పండి అంటున్నారు. నిజమే కదా! ఆమాట. మధ్యలో ఇంకొకరి పనేమున్నది. జీవులకర్మానుసారంగా దైవం ఫలితం నిర్ణయం లిఖిస్తాడు మన నుదుటిమీద. ఆ వ్రాత నూరేళ్ళదాకా వుంటుందని ప్రతీతి. అందుకే పాపకర్మలకి దూరంగా వుండాలి.

ఉ॥ **ఇచ్చినవాడు శ్రీహరియె ఇన్నియు పూనిన నేను తప్పకన్**
**పుచ్చుకొనేటివాడ కద! వూరక కర్మవశానువర్తినై**
**చెచ్చెరలైన యాతగవు జెప్పగదో తిరువేంకటేశ్వరున్**
**మెచ్చుచు చిక్కువాపుటకు మేల్కొనివానికి సేవజేయుడీ!**

**భావోద్దేశ్యము :**

నా పురాకృత కర్మలకు ఫలములుగా నాకు జన్మలనిస్తున్నవాడు శ్రీహరి. మరి అది నా కర్మఫలము కాబట్టి యెట్టి పరిస్థితిలోనైన తప్పక తీసికొంటున్నవాడను నేను. ఇందులో ఇంకొకరి ప్రమేయమేమున్నది. లేనే లేదు.

భగవంతుని వలన నిలిచిన ఈ జగములలో అనేక భోగింపదగిన వస్తువులు సృష్టించబడ్డాయి. అప్పుడు జీవులకు సుఖానుభవం కలిగింది. అప్పుడు వారిని శాసించుటకు వేదములు సృజించబడ్డాయి. మూర్ఖులు మాకెందుకులే అని మానేసినా, జ్ఞాణలు (తెలివిగలవారు) చదువుకొని బాగుపడండయ్యా!

ఒక్కటి గుర్తుంచుకొనండి. మన మనసులు పారినవి (వశము తప్పినవి). ఇక అంతే. మరల పుట్టుకలు తప్పవు. ఇంకేముంది మళ్ళ కర్మములు పొలిమేరదాటుతాయి. ఆ జీవుల కోర్కెలే సాక్షులుగా వారికి సత్త్వ రజస్తమోగుణములు వృద్ధి జెందుతుంటాయి. ఈ జన్మలో నీవూరు పేరు తెలుసుకొని ఒడబడి సద్వర్తనతో మెలగి భక్తిమార్గంపట్టి మోక్షానికి ప్రయత్నించు.

ధర్మం దక్కినదంటే భాగ్యం తప్పక కలుగుతుంది. దానిని లెక్కించే మన నుదుటిమీద వ్రాయబడ్డది. వీటన్నిటికి మూలము యెవరనుకుంటున్నారు? శ్రీవేంకటేశ్వరుడే అనిన చిక్కులను తీర్చేటువంటి ఇతనిని సేవించి, తరించండయ్యా!

సంఖ్య : IV/369 రాగం : మాళవి

కీర్తన : ఇదియే వేదాంత మిందుకంటె లేదు

**14 ఇదియే వేదాంత మిందుకంటె లేదు**
**యిదియే శ్రీవేంకటేశుని మతము ॥పల్లవి॥**

**విరతియే లాభము విరతియే సౌఖ్యము**
**విరతియే పో విజ్ఞానము**
**విరతిచే ఘనులైరి వినకవారెల్ల**
**విరతిఁబొందకున్న వీడదు భవము ॥ఇదియే॥**

**చిత్తమే పాపము చిత్తమే పుణ్యము**
**చిత్తమే మోక్షసిద్ధియును**
**చిత్తమువలెనే శ్రీహరి నిలుచును**
**చిత్తశాంతిలేక చేరదు పరము ॥ఇదియే॥**

**యెంతచదివినా యెంతవెదకినా**
**యింతకంటె మరి యిఁకలేదు**
**యింతకంటె శ్రీవేంకటేశుదాసులౌట**
**యెంతవారికైన యిదియే తెరువు ॥ఇదియే॥369**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య జీవిత పరమార్థం గ్రహించి చెబుతున్న గొప్ప సత్యాన్ని ఆకళింపు చేసికొనండి. వేదాంతము అంటే మింగుడుపడని గొప్ప విషయమని భయపడకండి. అసలు ఇంతకంటే వేదాంతం లేదు. శ్రీవేంకటేశ్వరుడు బోధించే మతము కూడా ఇదేనండీ. వేదాంతానికి మూలవేఱువంటిదేమిటో తెలుసా? విరతి. విరతి అంటే విముఖత్వం. ఈ వినుకవారు (వేదాంతులు) దేనివలన ఘనులైనారు? విరతివల్ల. ఈ మనస్సు అనేది దైవము మనిషికిచ్చిన వరము. అదే వాడి శాపము కూడా. దాన్ని వరములా వాడుకొన్నవాడే మోక్షం సాధించగలడు. ఎంత చదువుకొన్నా శ్రీవేంకటేశుని దాస్యం చేకొననివానికి ముక్తి లభించనే లభించదు.

**కం॥ వేదాంతంబన నిదియే**

**లేదయ్యా! యింతకంటె లేదన్యంబౌ**

**మేదిని వేంకటనాథుని -**

**కాదరమౌ మతము ఇదియె హరిదాసులకున్.**

**భావోద్దేశ్యము :**

వేదాంతమంటే మరేమిటో కాదు. వేదాంతమంటే ఇదే. ఇంతకంటే మరేమీలేదు. శ్రీవేంకటేశ్వరుడే మన సర్వస్వము. ఆయన మతము కూడా ఇదియే సుమా!

విరతి అంటే "విముఖత్వము" అని అర్థం. విరతియే లాభకరము. విరతియే సౌఖ్యప్రదము. విరతియే విజ్ఞాన సర్వస్వము. వినుకవారెల్లా (వేదాంతులందరూ) ఈ విరతిచేతనే ఘనులైరి. ఒకటి గుర్తుపెట్టుకోండి విరతి పొందకపోతే భవము (పుట్టుక) కూడా నిన్ను వీడదు.

చిత్తమే (మనస్సే) పాపమునకు మూలము. చిత్తమే పుణ్యానికీ కారణము. మోక్షము సిద్ధించాలన్నా నిర్మల చిత్తునికే సాధ్యమవుతుంది. శ్రీహరి యెక్కడ నివసిస్తాడనుకొంటున్నారు? నిర్మలమైన చిత్తములోనే సుమా! చిత్తశాంతి లేనివానికి పరము సిద్ధించుట అసంభవము.

ఎంత వేద వేదాంతములు శాస్త్రములు చదివినా, ఎంత పరమాత్మను వెదకినా గొప్ప ప్రయోజనమేమియూ వుండదు. ఇంతకంటే మరి చదువవలసినదీ నేర్వవలసిన విద్య కూడా లేదు. కాని ఇంతకంటే శ్రీవేంకటేశుని దాసుడైనవాడే నిజమైన ఘనుడు. ఒక్కటి గుర్తుపెట్టుకోండి. ఎంతటి వారికైనా ఈతని దాసుడవుటకంటే మోక్షానికి దగ్గరి దారిలేదు.

సంఖ్య : IV/289 రాగం : వసంతం
కీర్తన : ఈడ నిందరికి నేలికై వున్నాడు

**15 ఈడ నిందరికి నేలికై వున్నాఁడు**
**వాడలరేపల్లెవాఁడా వీఁడు ॥పల్లవి॥**

**భారపువుట్ల పాలుఁబెరుగులు**
**వారలు వట్టినవాఁడా వీఁడు**
**కోరి గొల్లెతల కొలనిలోపల**
**చీరలుదీసిన శిశువా వీఁడు ॥ఈడ॥**

**ఆవులఁ బేయల నందరియిండ్ల**
**వావిరిఁ గాచినవాఁడా వీఁడు**
**వావు లొక్కటిగా వనితలఁ గూడి**
**వేవేలునేర్చినవిటుఁడా వీఁడు ॥ఈడ॥**

**అరుదై శ్రీవేంకటాద్రిమీఁదనుండి**
**వరములిచ్చేటివాఁడా వీఁడు**
**మరిగెలమేల్మంగతో మమ్మేలె**
**సరసుఁడై వుండేజాణా వీఁడు ॥ఈడ॥289**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య ఈ కీర్తనలో రేపల్లె నందగోపనందనునికి తిరుమల వేంకటేశ్వరునికి అభేదం ప్రతిపాదిస్తున్నారు. వాడా వీడు అని ప్రశ్నిస్తున్నారు. వీడు (తిరుమలనాథుడు) ఆ రేపల్లెవాడా? ఏమిటీ విపరీతం. వాడెంత మాయగాడు. పాలు వెన్నలను దొంగిలించాడు. గొల్లెతల మానములను దొంగిలించాడు. ఎన్నో కిటుకులు నేర్చిన విటుడయ్యాడు. ఆవులను దూడలను కాచాడు. బ్రహ్మ తనని భ్రమింప జేయాలనిచూస్తే వాని దిమ్మదిరిగేట్లు చేశాడు. అందుకనే జ్ఞానులు మాత్రమే ఆయన అసలు స్వరూపం తెలుసుకోగలిగారు. అజ్ఞానులకెన్నటికీ అంతు చిక్కడు.

ఉ॥ **చీరెలుతీసిదాచి, పలుసిగ్గులు దోచినవాడు వీడివో**
**కూరిమి గొల్లకన్నియల గూడుచు చేసెను వావినేకమున్**
**మీరిన వేంకటేశ్వరుని మేలు గణింపుడు వీడు వాడెవో**
**కోరికదీర్చు దైవమట కొల్వుడు భుక్తికి ముక్తికైనను**

**భావోద్దేశ్యము :**

ఈ శ్రీవేంకటేశ్వరుడు, యీడ నిందరికి (ఈ తిరుమలలో భక్తులందరికి) యేలికయై (పరిపాలకుడై) వున్నాడు. ఇంతా చేసి వీడు (ఈ తిరుమల దేవుడు) రేపల్లె వాడలో అంతచేసినవాడా? (ఆ గోపాలబాలుడా?)

ఉట్లలో అమర్చిన భారపు (బరువైన) పాల దుత్తలు పెరుగు దుత్తలు పగలగొట్టి వారలు వెట్టించి (ధారలుగా కారిపోయేట్లు చేసిన) ఆ రేపల్లె గోపాలుడు వీడేనా? గొల్లెతలు కొలనులో స్నానం చేస్తుంటే వారి చీరెలనపహరించి యేడిపించింది వీడా? ఆ శిశువు ఈ శ్రీవేంకటేశుడా? ఏమి వింత!!

బ్రహ్మదేవుడు కృష్ణుని మహిమను చూడాలని వానితోటి గోపాలురను వారి ఆవులను అదృశ్యంచేస్తే తానే గోవులు గోపాలురూ అయిపోయి వారి వారి ఇండ్లకు తానే వెళ్ళాడు. ఇది చూచి బ్రహ్మగారి దిమ్మతిరిగి కృష్ణుని క్షమను వేడినాడు. బ్రహ్మనూ క్షమించి కాపాడినాడు. తను వలచిన గోపికలందరికి రత్యానందం కలిగించి అందరి 'వావి' (చుట్టరికం) ఒక్కటి చేశాడు. కిటుకులన్నీ నేర్చిన విటుడయ్యాడు. ఇంతకీ వాడే వీడా?

అరుదైన తిరుమలపైన వెలసిన ఈ శ్రీవేంకటేశుడు, కోరిన వరములనిస్తాడు. ఆ ఇచ్చేవాడూ, వీడూ (కృష్ణుడూ) ఒక్కరేనా? తనని వీడలేక వురముపైనున్న దేవి అలమేల్మంగపతి, మమ్మేల్నేలే మా ఇంటివేల్పూ ఈ జాణయైన సరసుడూ ఒక్కరేనా? ఎంత అద్భుతం!!!

సంఖ్య : II/244 రాగం : శద్ధధన్యాశి

కీర్తన : ఈ రూపమై వున్నాడు యీతడే పరబ్రహ్మము

**16 ఈ రూపమై వున్నాడు యీతడే పరబ్రహ్మము**
**శ్రీరమాదేవితోడ శ్రీ వేంకటేశుడు ॥పల్లవి॥**

**పొదలి మాయాదేవి పట్టిన సముద్రము**
**అదె పంచ భూతాలుండే అశ్వత్థము**
**గుదిగొన్న బ్రహ్మాండాల గుడ్లబెట్టే హంస**
**పదరపు బ్రహ్మలకు జలజ మూలకందము ॥ఈ రూప॥**

**అనంత వేదాలుండేటి అక్షయ వటపత్రము**
**ఘన దేవతలకు శ్రీకర యజ్ఞము**
**కనలు దానవ మత్తగజ సంహార సింహము**
**మొనసి సంసార భారము దాల్చే వృషభము ॥ఈ రూప॥**

**సతతము జీవులకు చైతన్య సూత్రము**
**అతిశయ భక్తుల జ్ఞానామృతము**
**వ్రతమై శ్రీ వేంకటాద్రి వరముల చింతామణి**
**తతిగొన్న మోక్షపు తత్వపు రహస్యము ॥ఈ రూప॥**

**ఉపోద్ఘాతము :**

శ్రీవేంకటేశ్వరుని అన్నమయ్య కీర్తిస్తుంటే తేనెలు జాలువారుతున్నట్లుంటుంది. ఈ ఈ తిరుమలనాథుడే, జగన్నాథుడైన పరబ్రహ్మము. నేటి కలియుగంలో మనందరికీ పుణ్యం అంటగట్టాలని దయతో ఈ శ్రీవేంకటేశుని రూపములో శ్రీరమాదేవి యొక్క వల్లభుడై వెలసినాడు. ఈయన సముద్రమువంటివాడు. దీనిని మాయాదేవి అతిశయముతో పట్టుకొనివుండుటవలన లోతు యెంతో తెలుసుకొనుట సాధ్యము కాదు. ఎంత క్లిష్టమైనా ఇష్టంతో సాధిస్తే మోక్షపు రహస్యం తెలుస్తుంది.

**చం॥ చెలగెను యీతడే అవని చేరిన ఆ పరమాత్మ రూపమున్**
**కలిగినరీతి, శ్రీవిభుడు కామితదాతగు వేంకటేశుడే**
**నిలిపె ననంతవిశ్వమును, నీమపుతోడయె పంచభూతముల్**
**పలువురు దాససజ్జనులు బాయనిముక్తిని పొందిరిందునన్.**

**భావోద్దేశ్యము :**

శ్రీవేంకటేశ్వరుడు తిరుమల శిఖరాలపై శ్రీరమాదేవి సహితుడై ఈ నిలువెత్తు సుందర రూపమున వెలసియున్నాడు. ఈయనెవరనుకొంటున్నారు? ఈతడే పరబ్రహ్మము (పరమాత్మ).

అణువణువునా వున్నాడు. అండపిండ బ్రహ్మాండమంతా వ్యాపించివున్నాడు. మనబోటి అల్పులకది అర్థంకానేకాదు. ఈయనతో మహాసముద్రము వంటి మాయాదేవితోడై వుంటుంది. సముద్రము లోతూ తెలియదు. మాయాదేవి ముంపూ తెలియదు. ఆనాడు గీతలో అన్నట్లు అశ్వత్థవృక్షము ఈయన వృక్షరూపము. పంచభూతాలైన భూమి, నీరు, వాయువు, కాంతి, ఆకాశము ఈ అశ్వత్థములోనే వున్నాయి. అనంతకోటి బ్రహ్మాండాలను తన గుడ్లవలె పెట్టిన హంస ఈతడే. నవబ్రహ్మలు (అంగీరసుడు, దక్షుడు మొదలైన తొమ్మిది బ్రహ్మలు) పదరపు సృష్టికర్తలు (అతివేగముగా సృష్టించే సహాయక బ్రహ్మలు). వీరికి తల్లివేరు వంటి పద్మము ఈతడే సుమా!

వేదములనంతమైనవి. అవి క్షయమునెరుగని ఈ మఱ్ఱి ఆకుపైననే పుట్టినవి. దేవతలుగా మారాలంటే గొప్ప యజ్ఞములు చేయాలి. ఆ యజ్ఞాల ఫలదాత ఇతడే. కనలు (మండిపడే) రాక్షస మదగజాలకితడే తుదముట్టించే సింహము. ఈ సంసార భారము (ప్రపంచ పాలనా బాధ్యత) మోసే గొప్ప వృషభం ఈ మహానుభావుడే.

బిడ్డ పుడితే ఆనందం రాదు. వానికి చైతన్యం కలిగి కేరుమని ఏడిస్తేనే ప్రాణం వచ్చినట్లు. జీవులకు ఆ చైతన్యమితడే. భక్తి వున్నంతమాత్రాన జ్ఞానం రాదు. తన భక్తులకు జ్ఞాన ప్రదాత ఈతడే. వ్రతము పట్టినట్లు శ్రీవేంకటాద్రిపై వరములనిచ్చే చింతామణి ఈతడే. మోక్షకాములకు ఈయన అందించే తత్త్వరహస్యమే ముక్తిని ప్రసాదిస్తుంది.

సంఖ్య : I/64 రాగం : శ్రీరాగం

కీర్తన : ఈ విశ్వాసంబు యెవ్వరికి దోపదిది

**17** **ఈ విశ్వాసంబు యెవ్వరికిఁ దోఁప దిది**
**పావనులహృదయమునఁ బ్రభవించుఁగానివి** ॥పల్లవి॥

**ఇమ్మయినపాపంబు లెన్నివలసినఁ బ్రాణి**
**సమ్మతంబునఁ జేయఁజాలుఁగా కేమి**
**కుమ్మరికి నొకయేఁడు గుదియ కొకనాఁడవును**
**నమ్మితలఁచినవిష్ణునామంబుచేత** ॥ఈవి॥

**కొదలేనిదురితములు కొండలునుఁ గోట్లును**
**చెదర కెప్పుడుఁ బ్రాణి చేయుఁగాకేమి**
**పొదరి గొరి(టి)యలలోన పులిచొచ్చినట్లౌను**
**హృదయంబు హరిమీఁద నుండినంతటను** ॥ఈవి॥

**సరిలేనిదుష్కర్మసంఘములు రాసులై**
**పెరుగఁజేయుచు ప్రాణి పెంచుఁగాకేమి?**
**బెరసి కొండలమీఁదఁ బిడుగువడ్డట్లౌను**
**తిరువేంకటాచలాధిపునిఁ దలఁచినను** ॥ఈవి॥**64**

**ఉపోద్ఘాతము :**

శ్రీమహావిష్ణువుపై విశ్వాసం కలగటం అంత తేలిక వ్యవహారం కాదు. గుడిపక్కనే ఇల్లు కట్టుకొని నివసిస్తూ నెలకి ఒకసారికూడా దైవదర్శనానికి పోని ఉద్దండుల్ని నేనెరుగుదును. దైవాన్ని చూడాలనే కోరిక కలగాలన్నా ఆ దైవ కృప వుండాల్సిందే. ఇది నేను స్వానుభవంతో తెలిసికొన్న సత్యం. శ్రీహరిపై విశ్వాసం ఆయన కృప వుంటేనే ప్రభవిల్లుతుంది అంటున్నారు అన్నమయ్య. దుష్కర్మలు చేసినకొద్దీ పాపం మూట పెరుగుతూనే వుంటుంది. కొండల మీద పిడుగు పడితే కొండకేమి నష్టం? శ్రీవేంకటేశుని యెప్పుడూ తలచేవారికి అలాగే ఏ ఆపదా రాదుగాక రాదు.

**ఉ॥ పావనులైనవారి హృది ప్రాభవ మొందెడుగాని యేరికిన్**
**యేవిధినైన దోపదిక యెన్నడు నమ్మిక వేంకటేశ్వరా!**
**కావరమెక్కి కొండలుగ కర్మలు పాపపు మూట పెంచు పో**
**ఆవల కొండలయ్య కృప యబ్బిన తీరును పాప కర్మముల్.**

**భావోద్దేశ్యము :**

శ్రీహరిపై ఈ విశ్వాసం యెవ్వరికీ అంత తేలికగా కలుగదు. కేవలం పావనులైన (పుణ్యాత్ములైన) వారి హృదయంలో ప్రభవించే (పుట్టునటువంటి) విశ్వాసం, అది.

ఇమ్మయిన (విరివియైన) పాపములను, ప్రాణి యెన్నైనా చేస్తాడు. అదీ యెవ్వరి బలవంతంతో కాక తన సమ్మతితోనే తాను చేస్తుంటాడు. ఎవడన్నా కుమ్మరి ఒక ఏడాది కష్టపడి చేసిన కుండలను పెంకులుగా మార్చడానికి ఒక గుదియ (చిన్న చేతికఱ్ఱ)కు, ఒక పూట చాలదా? నమ్మిక కలిగి విష్ణునామము జపిస్తే పాపం తుత్తునియలవటం యెంతసేపు?

ఈ ప్రపంచంలో ఒక ప్రాణి జన్మపొందిన దగ్గరనుంచి ఏమాత్రం చెదరక (వెనుదీయక) నిరంతరం కొండల వంటి దురితములను (దుష్కర్మములను) చేస్తూనే వుంటాడు. వాటికేమాత్రం కొదవ వుండదు. ఒక పులి గొఱియల మందలో (గొఱ్ఱెల గుంపులో) దూరితే యేమవుతుందో అదే అవుతుంది. గొఱ్ఱెలు నామరూపాలు లేకుండా పోతాయి కదా! హరి మీద హృదయం నిలువగానే దుష్కర్మలు అట్లాగే నశిస్తాయి.

ఇంకా కొంతమంది పాపకర్మలను మూకుమ్మడిగా చేస్తూనే వుంటారు. ఆ పాపాల రాశి సరిలేనిదైనా వారు గ్రహించరు. ప్రాణి చెడుకి అలవాటుపడి దుష్కర్మలు చేస్తూనే పోతాడు. మైదానంలో వున్నవాడికి పిడుగుపాటు భయం వుంటుంది కాని కొండలలో వుండేవారికి పిడుగు ప్రమాదం వుండదు. తిరువేంకటేశ్వరుని తలచిన వారివలె వారు నిర్భయులై వుంటారు.

❁

సంఖ్య : II/491 రాగం : శంకరాభరణం
కీర్తన : ఎంత కెంత యిది యేమని పొగడుట

**18 ఎంత కెంత యిది యేమని పొగడుట**
**యింతసేయ నీకు నెదురా వీరు ॥పల్లవి॥**

**పిడుగులఁబోలెడిపెనునీనఖముల-**
**కెదయక హిరణ్యుఁ డెట్లుండెనో**
**వుడి కెటిచక్రాయుధమువేఁడికిని**
**జడియక మకరెటు సహించెనో ॥ఎంత॥**

**శరపరంపరల శిరములు నఱకఁగ**
**యెరగొని రావణుఁ డేమనెనో**
**పరియలువారఁగ బ్రహ్మాండభాండము**
**ఉరుశంఖరవం బోర్చుట యెట్లో ॥ఎంత॥**

**గాఁటపునిష్ఠురగదాహతికి మధు-**
**కైటభులతలలకత లెట్లో**
**యీటున శ్రీవేంకటేశ నీకృపను**
**పాటించి దాసులు బ్రదుకుట యెట్లో ॥ఎంత॥491**

**ఉపోద్ఘాతము :**

బహుచక్కని ఈ కీర్తనలో అన్నమయ్య శ్రీహరి మహిమలనేమని పొగడను అని ప్రశ్నిస్తున్నారు. ఎంతకెంతని పొగడను ఇంతటి ఘనకార్యాలు చేశావు. నీకెదురేమిటయ్యా? పిడుగుల వంటి నఖములతో హిరణ్యకశిపుని చీల్చేశావు. రావణుని పదితలలు నరికేశావు. గదతో మోది మధుకైటభులను సంహరించావు. ఒక మొసలిని చంపటానికి సుదర్శన చక్రాన్ని వినియోగించావు. బ్రహ్మాండాన్నే కంపింపజేసేట్లు పాంచజన్యం పూరించావు. నీదాసుల్ని బ్రతికించటానికి వేంకటేశుడవైనావు నీకేమయ్యా?

**కం॥ ఇంతలు సేసే నీకును**
**యెంతకు నెదురేమి శౌరి? యేమని పొగడన్?**
**వింతలగు పలుదురాత్ముల**
**అంతముగావించినావు అసురాంతకుడై.**

**భావోద్దేశ్యము :**

ఓ శ్రీహరీ! నీవు కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరుడవై నీ శరణాగతులైన భక్తులను రక్షించుచున్నావు. ఇది నీకు యెంతకు నెంత పని? నిన్ను యేమని పొగడుదునయ్యా? నేనిచ్చట పేర్కొనబోతూవున్న, ఈ దుర్మార్గులు నిజానికి నీకొక యెదురా చెప్పవయ్యా?

ఆనాడు హిరణ్యకశిపునే తీసికొందాము. పిడుగులను బోలిన నీ నఖములతో వాడి కడుపు చించి, చంపేశావు. పాపం వాడంత బాధనెలా భరించాడో కదా! వేడితో రగిలే సుదర్శన చక్రంతో ఒక జల జంతువు మొసలిని సంహరించావు. అణుమాత్రం వెనుకంజ వేయలేదు. ఏమి చోద్యం?

పది శిరస్సులున్న రావణాసురుని జాలితో ఒక్కటి కూడా మిగల్చక తలలన్నీ నరికి సంహరించావు. పాపం వాడేమనుకొన్నాడో? బ్రహ్మాండ భాండమే పరియలువాయ (చీలిపోవునట్లు) గొప్ప పాంచజన్య శంఖారావము చేసినావు. దానిని జగములెట్లు భరించినవో కదా?

గాటపు (అధికమైన) నిష్ఠుర (కఠిన) గదా ఘాతములతో మధుకైటుభులను తలను పగులగొట్టి చంపావు. పాపం వారి తలలు ఆ దెబ్బలనెట్లు సైచినవో? ఈ విధముగా ఓ శ్రీవేంకటేశ్వరా! నీ కృపను చూపి నీ దాసులను పాటించినావు (ఆదరించినావు) నీ దాసుల బ్రతుకులు యెంత ధన్యమో?

సంఖ్య : IV/344 రాగం : బౌళి

కీర్తన : ఎంత వెట్టి గొండదవ్వి యెలుక బట్టెద నేను

**19 ఎంత వెట్టిఁ గొండదవ్వి యెలుకఁ బట్టెద నేను**
**పంతపు శ్రీహరి నా|భమ వాపవే ॥పల్లవి॥**

**పడనిపాట్లఁ బెక్కుపనులఁ దిరుగుటెల్ల**
**కుడిచేపట్టెఁడుగూటికొర కింతే కా**
**కడదాఁకాఁ జెలులతోఁ గాఁపురము సేయుటెల్ల**
**వొడలు మరచియుండే వొక్క నిమిషానకా ॥ఎంత॥**

**ఘనమైన గృహములు గట్టుకొనుటెల్లాను**
**తనువు మోచేయంతటికే కా**
**తనివోనిమతిలోనితలపోఁతలెల్లాను**
**యెనసిన బదుకు తా నెంచుటకే కా ॥ఎంత॥**

**యింతలోని పనియని యెరఁగని చేతఁలెల్లా**
**సంతకూటముల యీసంసారానకా**
**చెంతలశ్రీవేంకటేశ చేరి నీకే శరణంటే**
**యింతక మున్నిటినేర మేమనేవో కా ॥ఎంత॥344**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య గొప్ప నిర్వేదనతో యేమంటున్నారో వినండి. కొండను త్రవ్వి నేను సాధించినదేమిటంటే ఒక ఎలుకను పట్టుకొన్నాను, నా అంత వెట్టి తలకెక్కినవాడు వుంటాడా స్వామీ! ఓ శ్రీహరీ! నాకున్న భ్రమలన్నీ తొలగించటం నీకు గాక మరొకరికి సాధ్యం కాదయ్యా అంటున్నారు. పట్టెడు కూటికోసం పడరాని పాట్లు పడుతున్నాము. పోనీ, ఇవ్వాళ తిన్నాము, ఇంకొక నెలదాకా నిశ్చింత అనుకోవటానికి లేదు. ఏపూట తిండి ఆ పూటే. గొప్ప ఇళ్ళు కట్టుకొని ఏమి సాధిస్తాము? వెంట తీసికెళతామా. మన చుట్టరికాలన్నీ సంతలో కూటములే కదా! మరి ఇంకా భ్రమ దేనికి? శ్రీవేంకటపతిని శరణు అనరాదా?

**ఆ.వె॥ ఎంత వెఱ్ఱిద్రవ్వ యెలకబట్టగ గొండ**
**పంతములను నేను పట్టువాడ**
**వేంకటేశ! చేరి వేడెద క్షమ నేను**
**మున్నుజేయు నేరములకు శరణు.**

**భావోద్దేశ్యము :**

ఓ శ్రీహరీ! నేనెంత వెఱ్ఱివాడనయ్యా? పెద్ద కొండను ద్రవ్వి ఒక చిన్న యెలుకను పట్టుకొన్న వాడిలావుంది నా పరిస్థితి. ఈ నా భ్రమ బాపవలెనంటే నీవే పంతముతో పూనుకొని తీరాలి. ఇదింకెవరికి సాధ్యము కాదు.

అనేకచోట్ల వీరిని వారినీ యాచిస్తూ తిరిగేది గుప్పెడు కూటికోసమే కదా! ఇంతేనా? దీనికోసం ఇన్నిపాట్లు అవసరమా? జీవితాంతం కాపురం చేస్తానని ప్రమాణాలు చేస్తారే. ఏమిటా జీవితాంతం? ఒక్క నిముషం దేహం పొందే మైమఱపేనా? ఇదేనా కాపురం సేయుట అంటే.

పెద్ద పెద్ద గృహాలు కట్టుకోవాలని చేయరాని పనులు చేయాలా? ఈ తనువు మోచేటంతవరకే కదా ఈ గృహము. మరి దానికోసం పాపం చేయాలా. మెలకువతో వున్నంతసేపు కుయుక్తులు. ఆహా! వీడు గొప్పగా బ్రతుకుతున్నాడని అందరూ అనుకోవాలనేగా? ఇదంతా నిజమా? నీముఖప్రీతి మాటలని నీకు తెలియదా?

ఈ సంసారంలో మనచుట్టరికాలన్నీ సంతకూటములే. ముఖప్రీతి పలుకరింపులయ్యాక యెవరిదారి వారిదే. మనం వారికోసం చేసీ ఈ ఆరాటపు చేతలన్నీ ఈ నిజం తెలియకనే. ఓ శ్రీవేంకటేశ్వరా నీ చెంతచేరి శరణంటే అన్నీ నీవే చూసుకొంటావు కదా! ఇంతకు మున్నిటి నేరాలు (నా గత జన్మ పాపాలకు) ఇంకా నన్ను శిక్షించటం న్యాయమా ప్రభూ!

సంఖ్య : IV/315 రాగం : రామక్రియ

కీర్తన : ఎందరు సతులో యెందరు సుతులో

**20 ఎందరు సతులో యెందరు సుతులో**
**యిందునందు నెట్లెరిఁగే నేను** ॥పల్లవి॥

**మలయుచు నాయభిమానములని నే**
**కెలననిపుడు వెదకేనంటే**
**పలుయోనులలో పలుమా(మ?) రుఁబొడమిన -**
**చలమరి నాతొలుజన్మంబులను.** ॥ఎంద॥

**గరిమెలఁ బాణిగ్రహణము నేసిన**
**సిరులచెలులఁ గలసేనంటే**
**తరుణులగురుతులు తలఁపున మరచితి**
**పరగిన బహుకల్పంబులయందు** ॥ఎంద॥

**శ్రీవేంకటగిరిచెలువునియాజ్ఞల**
**భావించియె కరిఁ బైకొంటి**
**తావులఁజూడగ తగిలికోర్కుల**
**భావరతుల బెంబడి మనసందు (?)** ॥ఎంద॥**315**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య ఈ అధ్యాత్మకీర్తనలో నరులకు గత జన్మలలో మనకెందరు భార్యలో యెంతమంది సంతానమో ఈ జన్మలోగాని ఆ జన్మలలో గానీ యేను యెట్లెరిగేను? అని ప్రశ్నిస్తున్నారు. ఆ జన్మలలో యెంత పొగరుబోతువాడనో, యెంత అభిమానధనుడనో తెలిసే మార్గమేది? వాటి స్మృతియే లేదు కదా! ఎన్ని పెళ్ళిళ్ళు చేసికొన్నానో. ఎంత సిరి మూట గట్టితినో యెంతమంది తరుణులను పొందానో ఈ కతనములన్ని యెన్ని కల్పములలో జరిగాయో యెవరు లెక్కకట్టగలరు? ఇప్పుడు శ్రీవేంకటేశుడు తననెలా రక్షించాడో చెబుతున్నారు. అన్నమయ్య కీర్తనలందుకే యెన్నిసార్లు విన్నా కొత్తగానే వుంటాయి.

**కం॥ సతులెందరొ సుతులెందరొ**
**స్మృతియే లేదాయెనాకు జగములనెఱుగన్**
**గతజన్మంబుల జరిగిన**
**కతనంబో తిరుమలేశ! కలయో నిజమో?**

**భావోద్దేశ్యము :**

ప్రభూ! నా గత జన్మలలో యెంతమందిని పెండ్లి చేసికొన్నానో? యెంతమంది పుత్రులను పొందానో లెక్కగట్టగల మొనగాడెవడయ్యా. ఏను (నేను) ఇందు (ఈ జన్మలోగానీ) అందు (ఆ జన్మలోగాని) యెట్టెరిగేను (ఎటుల తెలియగలను)?

మలయుచు (ఉద్యమించి) ఆ జన్మలలో యెంత అభిమానధనుడనో? తెలియాలంటే ఇప్పుడు యే కెలన (దిక్కున) వెదకను? అనేక పర్యాయములు అనేక యోనులలో జన్మించిన పొగరుబోతువాడిని. నా తొలిజన్మంబులలో యెన్ని అవస్థలు పొందానో యెవరు చెప్పగలరు?

ఆ జన్మలలో యెన్ని పాణిగ్రహణములను చేసికొన్నానో, ఎన్ని సిరిసంపదలననుభవించానో యెవరికి తెలుసు. ఆ తరుణుల గురుతులను ఎవరు చెప్పగలరు ఆ తలపులనే నేను మరచిపోయాను. పోనీ నేను మాట్లాడేది ఒక్క గత జన్మ వ్యవహారమా అంటే కాదు. ఇది అనేక కల్పములనుండి జరుగుతున్న వ్యవహారమే.

ఇవన్నీ శ్రీవేంకటగిరిపై నెలకొన్న గొప్ప అందగాని యాజ్ఞలుగా భావించి, కరిన్‌పైకొంటి (నిదర్శనలుగా గ్రహించాను). తరచి చూస్తే అనేక కోర్కెలలో తగిలియుండుటచే మనస్సు భావరతులపాలై నన్ను జన్మ జన్మలకీ వెంబడిస్తూనే వున్నది. దీనికి ముగింపు జీవి ముక్తిని పొందుటయే.

సంఖ్య : II/188 రాగం : లలిత

కీర్తన : ఎన్నటికి జీవుడిక నీడేరేది

**21** **ఎన్నటికి జీవుఁ డిఁక నీడేరేది**
**పన్నుకొనేటిచింతలే బలిసీఁగాని** ॥పల్లవి॥

**కలరు వివేకులు కలదిటు ధర్మము**
**కలఁడు దైవము నేఁడు గావలె నంటే**
**వలవనిసందేహాన వట్టిజాలిఁబొరలేటి-**
**తలపోఁత లేమిటికో తడఁబడీఁ గాని** ॥ఎన్న॥

**వున్నవి వేదశాస్త్రాలు వున్నది విశ్వాసము**
**వున్నవాఁడాచార్యుఁడు వుపదేశించ**
**తన్నుఁదానే మోసపోయి తత్వము నిశ్చయించక**
**మిన్నక చంచలమే లో మెరసీఁగాని** ॥ఎన్న॥

**యివిగో పుణ్యనిధులు యిదిగో సంకీర్తన**
**వివరింప వీఁ డిగో శ్రీవేంకటేశుఁడు**
**భవములచే భ్రమసి బహుసంగతులచేత**
**యివల నామన సిప్పు డెటిఁగీఁగాని** ॥ఎన్న॥**188**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య ఈ కీర్తనలో జన్మలతో విసిగి వేసారుతున్న ఈ జీవుడు ఈడేరేది యెన్నటికో కదా! అని ప్రశ్నిస్తున్నారు. అసలు జన్మలకు కారణమేమిటి? అజ్ఞాన జనితమైన చింతలే. ఇన్నాళ్ళూ ధర్మము, వివేకము అంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శించి నేడు నాకు దైవమే శరణ్యమంటే ఎలా కుదురుతుంది అంటున్నారు. అందుకనే ముందుగా జ్ఞానధనియైన సద్గురుని ఆశ్రయించాలి. ఆయన బోధనలనాకళింపజేసికొనాలి. ఆయన ద్వారా శ్రీవేంకటేశ్వరుని శరణాగతి పొందాలి. ఆ స్వామే నీతో కీర్తనలు వ్రాయించుకొంటాడు, అంటున్నారు.

**చం॥ ఘనముగ జీవుడెన్నటికి గట్టును యెక్కితరించునో కదా!**
**వెనుకొని చింతలన్ని కడువేదననే కలిగించు చుండగా**
**చనువుగ సద్గురుండొొసగు శాస్త్రవివేకము సందియమ్ములే**
**నను తరియింప వేంకటపునాథుడు కీర్తనలిచ్చె ధన్యుడన్.**

**భావోద్దేశ్యము :**

ఈ జీవుడు, యిక ఈడేరేది (సద్గతిని పొందేది) యెన్నటికో కదా! ఎంత కాలమైనా వీనిని పన్నుకొనేటి (పట్టుకొనునట్టి) చింతలు నానాటికీ బలిసీగాని (బలవంతములవుతాయి).

ఏనాటినుంచో ఈ లోకంలో వివేకవంతులు వున్నారు. ధర్మముకూడా వున్నది. ధర్మము వుంటే చాలునని గొప్ప గొప్ప మాటలు చెప్పి నేడు దైవమే దిక్కంటే అటువంటి వారికి వదలని సందేహాలు, వట్టి జాలి (వూరకే మనఃఖేదములో) పొరలేటి తలపోతలతో తడబడుటే మిగులుచున్నది.

ఏనాటినుంచో వేదాలు శాస్త్రాలూ వాటిపై అచంచలమైన విశ్వాసమువున్నది. అదే విధంగా, మా ఆచార్యుడు వుపదేశించుటకు వున్నాడు. అయినాగాని తనను తానే మోసపుచ్చుకొని తత్త్వము నెఱుగక, నిశ్చయించక వూరకనే చంచల మతులై వుండుట ప్రయోజనమేమిటి?

సరే! వీటినన్నిటిని కాసేపు పక్కన పెట్టేద్దాము. ఈ శ్రీహరి సంకీర్తనే పుణ్యనిధులు. వీనిని వివరిస్తున్నవాడెవరు? నేనా? కానేకాదు. నాకంత శక్తివున్నదా? ఆ పని చేస్తున్నది శ్రీవేంకటేశ్వరుడే. మానవజన్మలో కలిగిన భ్రమవలన అనేక సంబంధాలలో తగులుకొని, తపించి, ఇటీవలనే నా మనసు సత్యాన్ని గ్రహించింది.

సంఖ్య : IV/308 రాగం : కాంబోధి
కీర్తన : ఎన్నడొకో నే నీచెరదగులక

**22** ఎన్నఁడొకో నే నీచెరఁ దగులక
అన్నిటా శ్రీపతికాధీనమౌట ॥పల్లవి॥

దేహాధీనము తిరిగేటి జీవులు
దేహము యరాధీనము
మోహాధీనము ముంచినయర్థము
ఆహా యిది పుణ్యాధీనము ॥ఎన్నఁ॥

సతతముఁ బురుషుఁడు సతులయాధీనము
అతివలు వయసుకు నధీనము
గతియగు వయసులు కాలాధీనము
అతిశయమిది మాయాధీనము ॥ఎన్నఁ॥

దైవాధీనము తగినజగ మిది
దేవుఁడు మోక్షాధీనము
చేవల మోక్షము శ్రీవేంకటపతి -
సేవాధీనము సిలుగే లేదు ॥ఎన్నఁ॥308

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య శ్రీపతిని వేడుకొంటున్నారు. స్వామీ! నాకీ చెర యెప్పుడు తప్పుతుందయ్యా. అన్ని ఉపాయాలు విడనాడి నీ అధీనము యెప్పుడవుతాను? నాకు ఈ జీవభ్రాంతి వున్నన్నాళ్ళూ చిక్కులు తప్పవు. నీవు తప్ప అన్నీ ఇంకొకరి అధీనములై ఆడింపబడుతున్నవారే. ఇది అంతా ఒక తగులము. దీనినుండి తప్పించగలవాడు తిరుమలేశుడే. జీవుడు, దేహము, సంపద, మోహము పుణ్యాధీనములు. మళ్ళీ ఇవన్నీ ఒకదానికింకొకటి కారణం. పురుషుడు, సతులు, వయస్సు, కాలము, మాయ అనునవీ ఒకదానికొకటి అధీనము. ఈ జగము, దైవము, మోక్షము, శ్రీవేంకటేశుడి సేవాధీనము. కాబట్టి హరిసేవను మించగలిగింది లేదు.

**కం॥ ఎన్నడు వదులును యీ చెర**
**అన్నిట శ్రీపతియె గతిగ యలరుట యెపుడో**
**పన్నుచు శ్రీవేంకటపతి -**
**నెన్నక సేవించి జీవి యెరుగునె ముక్తిన్?**

★ **పన్నుచు** - సిద్ధపడి

**భావోద్దేశ్యము :**

ప్రభూ! ఎన్నడొకో (ఎప్పటిదాకానో) నాకీ చెర (బంధికాన). దీంట్లో తగలక (చిక్కుకొనక), అన్నిటా (అన్ని విధములా) శ్రీపతికి అధీనమై (స్వాధీనుడనై) వుండుట మరింకెప్పుడో కదా!

ఈ జీవులందరూ వారి దేహాలకు అధీనులై (లోబడి) వుంటారు. ఆ దేహాలు అర్థము (సంపద) అధీనములు. అర్థము కడు మోహపు అధీనము. మోహం మాత్రం పుణ్యాత్ముల అధీనంలో వుంటుంది.

అదేమి వింతయోగాని, ఎల్లప్పుడూ పురుషులు భార్యలకధీనులు. మళ్ళీ అతివలు మాత్రం వారి వయస్సులకు లొంగివుంటారు. ఇక వయస్సు కాలము యొక్క అధీనములో వుంటుంది. మళ్ళీ ఈ కాలము మాయ యొక్క అధీనములో వుంటుంది.

ఈ యావత్ ప్రపంచము దైవం యొక్క అధీనంలో వుంటుంది. దేవుడు మోక్షము యొక్క అధీనములో వుంటాడు. మరి మోక్షం యెవరి అధీనంలో వుంటుందో తెలియునా? అది శ్రీవేంకటపతియొక్క సేవ అధీనంలో వుంటుంది. ఆయన సేవకు సిలుగే లేదు (హాని యెన్నటికీ రాదు).

సంఖ్య : XV/284 రాగం : గుజ్జరి

కీర్తన : ఎవ్వరు నాకు దిక్కు యేమని చెప్పుదు నిఁక

**23 ఎవ్వరు నాకు దిక్కు యేమని చెప్పుదు నిఁక**
**అవ్వలికి నివ్వలికి హరి నీవే కాగా** ॥పల్లవి॥

**యెన్నటి ప్రతిబంధమో యెంచఁ గామక్రోధములు**
**వెన్నాడి నేఁ బుట్టితేనే వెంటఁ బుట్టీని**
**మున్నిటికొాల మెట్టిదో మొగి మదమత్సరము**
**లన్నిలోకములఁ జొచ్చి నందుఁ జొచ్చీని** ॥ఎవ్వరు॥

**యెక్కడి ఋణమో నాకు నీ దేహభోగములు**
**పక్కన నేడ నుండినా బడివాయవు**
**తక్క కేనాటి కర్మమో తగఁ బుణ్యపాపములు**
**చిక్కులై కలలోనఁ జిమ్మి రేఁ చీని** ॥ఎవ్వరు॥

**యెందరిపగో కాని యీ తమోరాజసములు**
**సందడించి చలములు సాధించీని**
**యిందునే శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి**
**కిందుపడి యీవే నన్నూ గెలిపించీని** ॥ఎవ్వరు ॥

**ఉపోద్ఘాతము :**

తాళ్ళపాక పెదతిరుమలయ్య "నాకు ఇహపరములలోనూ, ఎవరు దిక్కు స్వామీ! శ్రీహరివైన నీవొక్కడవే కదా!" అని తిరుమలేశుని వేడుకొంటున్నారు. మన ముక్తి మార్గంలో ముళ్ళకంచెలు మాదిరి మన కామక్రోధాలే అడ్డుతగులుతాయి. మనం చేసికొనిన పుణ్యాన్నంతా మన భోగాలు హరించివేస్తాయి. మన తమోరజోగుణాల మనచలమును పెంచి దుర్మార్గులను చేస్తాయి. ఏనాడైతే శ్రీవేంకటేశుడొక్కడే దిక్కని గ్రహిస్తామో, ఆయనే మనని గెలిపిస్తాడు.

**ఉ॥ క్రొవ్విడు కామక్రోధములు కూల్చెను నాకవితోడబుట్టులై**
**రవ్వయితిన్ కదా! తగిలిరట్టడి బెంచిన భోగలాలసన్**
**అవ్వల నాతమోరజము ఆచలముల్ ప్రతిబంధకాలయెన్**
**ఎవ్వరు దిక్కునాకుయని యేద్వగ వేంకటరాయుడేలెరా.**

**భావోద్దేశ్యము :**

ఓ శ్రీహరీ! అవ్వలికి (చనిపోయిన తరువాత పొందే పరమునకు) ఇవ్వలికి (ఇప్పుడు జీవించివున్న ఈ ఇహలోకమునకు) నాకు దిక్కు నీవే కాగా (అయివుండగా) వేరే యెవరున్నారని చెప్పేది? మరెవ్వరూ లేరు.

నన్ను పీడిస్తున్న ఈ కామక్రోధాలు యేనాటి ప్రతిబంధకాలు (అడ్డంకులు) స్వామీ? అవి నన్ను వెంటాడి నేనెక్కడ పుట్టినా అవీ నాతోనే పుట్టుకనొందుతున్నాయి. నా మునుపటి కులమెట్టిదో కాని, మదమత్సరములు మాత్రం నేనెన్ని లోకాలకి పోతే అవీ నావెంటే వచ్చాయి.

ఇది యేనాటి ఋణమోగాని నా దేహము పొందే భోగాలూ నేనెక్కడికి పోతే అవీ నావెంటే వస్తున్నాయి. తక్కక (వెనుకాడక) నేను చేసిన యేనాటి కర్మమో కాని పుణ్యపాపముల రూపమున మార్పు చెంది కలలో మాదిరి అనుభవాలే అయినాకు మళ్ళీమళ్ళీ చిక్కులు తెచ్చి చిమ్మిరేచీని (చెలరేగినవి).

ఎందరి పగో (ఎన్ని జన్మల నాటి ప్రతీకార వాంఛలోగాని) నేడు నాకు తమోగుణము, రజోగుణము రేకెత్తించి పట్టుదల పంతములై నన్ను వెంటాడుతున్నాయి. ఈ కథలిట్లా నడుస్తుండగానే నాకు శ్రీవేంకటేశ్వరుని కృప ప్రాప్తించింది. ఆ స్వామి నన్ను యేలుకొన్నాడు. కిందుపడి (వైకుంఠనాథుడవైన నీవే కిందకు వచ్చి) నీవే నన్ను గెలిపించితివి తండ్రీ!

సంఖ్య : IV/312 రాగం : లలిత

కీర్తన : ఏగతి నుద్ధరించేవో యింతటిమీదట మమ్ము

**24 ఏగతి నుద్ధరించేవో యింతటిమీఁదట మమ్ము**
**భోగపుఁగోరికలచేఁ బొలిసెఁ బో ప(గ?)తులు ॥పల్లవి॥**

**పరగి నాలుకసొంపు పరసిపోయ**
**పరులనే నుతియించి పలుమారును**
**విరసపుఁబాపములవినికిచే వీనులెల్లాఁ**
**గొరమాలె మాకు నేఁటి కులాచారము ॥ఏగతి॥**

**మొక్కలాన పరధనమునకుఁ జాఁచిచాఁచి**
**ఎక్కువఁజేతులమహి మెందో పోయ**
**తక్కక పరస్త్రీలఁ దలఁచి మనసు బుద్ధి**
**ముక్కపోయ మాకు నేఁటి ముందటిపుణ్యాలు ॥ఏగతి॥**

**యెప్పుడు నీచులయిండ్లకెడతాఁకి పాదములు**
**తప్పనితపములెల్లఁ దలఁగిపోయె**
**యిప్పుడె శ్రీవేంకటేశ యిటునిన్నుఁ గొలువఁగా**
**నెప్పున నేఁజేసినట్టి నేరమెల్లా నణఁగె ॥ఏగతి॥312**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో ఓ దేవదేవా! ఇకమీద మమ్ము ఏగతి వుద్ధరింతువో ఇప్పటిదాకా భోగలాలసతోనే బ్రతికాము. నిన్ను పొగడవలసిన నాలికతో పరులను పొగిడాను. నీ స్తుతిని వినవలసిన చెవులతో పనికిరాని కులాచారం గురించి విన్నాము. పరులధనమున కాశబడి 'దేహీ' అన్నాను. పరస్త్రీలనాశించి మనస్సూ దాని పుణ్యమంతా కోల్పోయింది. నీచుల ఇండ్లకు పోవుట చేత నా పాదములు యేనాడో పద్మాసనం వేసికొని చేసిన తపఃఫలము తొలగిపోయింది. చివరికి నా భాగ్యమువలన శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయించి నా నేరములనన్నింటిని పారద్రోలాను.

**కం॥ ఏగతి మముగాచెదవో**

**భోగపుకోరికల మునిగి పొలిసితిమి కదా!**

**తూగని నేరములొగ్గెద**

**వేగమె కొల్చెదను విడువ వేంకటనాథా!**

**భావోద్దేశ్యము :**

ఓ ప్రభూ! ఇంతటి మీదట (ఇకపైన) మమ్ము ఏ తీరుగా వుద్ధరించెదవో కదా! మా గురించి యేమి చెప్పను? మా గతులు ఇంతవరకు భోగలాలసతోనే పొలసినవి (సంచరించినవి).

అనేక పర్యాయములు పరులను కీర్తించి నా నాలిక పాసిపోయింది. వికటమైన పాపకర్మల గురించి వినీవినీ మా చెవ్వులు పనికిమాలినవైనవి. ఇంకా మాకులాచారముల గురించి వినే ఓపిక మాకు లేనేలేదయ్యా!

మొక్కలాన (ఉత్సాహంతో) పరుల ధనమునకై చేతులు చాచీ చాచీ నా చేతులలోని శక్తి అంతా క్షీణించింది. తక్కక (బిడియమనేది లేక) పరస్త్రీలనాశించీ ఆశించి మనస్సు, బుద్ధి మొక్కపోయినవి. అటువంటి మాకు గత జన్మల పుణ్యమువలన యేమి మేలు జరుగుతుంది.

ఎప్పుడూ నీచులతో సంబంధం పెట్టుకొనినందువలన, వాళ్ళ ఇళ్ళల్లో నా పాదములుపెట్టి ఎడతాకి (గడిపినందున) నా తపోబలము, యేజన్మదైనా అది పూర్తిగా తరిగిపోయింది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఈవిధంగా నిన్ను గొలిచినందువల్ల ఇంతవరకూ నావల్ల జరిగిన అపరాధములన్నీ అణచివేయబడినవి తండ్రీ!

సంఖ్య : IV/329 రాగం : వరాళి
కీర్తన : ఏదియుగాననందు నేదిగాదందు

**25 ఏదియుఁగానఁడు (గాననందు?) నేది గాదందు**
**ఆదిపురుష నీదాస్యమే చాలనాకు ॥పల్లవి॥**

**గరిమఁ గొందరికి సాకారమై నిలిచితి**
**గురునిరాకారమై కొందరికి**
**సరుసఁ గొందరికెల్లా సగుణుఁడవట నీవు**
**ధర నిర్గుణమవట తగిలి కొందరికి ॥ఏదియు॥**

**వొకటఁ గళాపూర్తి నొనరియుందువట**
**వొకట నిష్కళుఁడవై వుడివోవట**
**వొకచో జీవుల (కు) నీకొరయ భేదమట**
**వొకచో నె (న?) భేదమట వున్నారట నీకు ॥ఏదియు॥**

**అదన నిందరిలోన నంతరాత్ముఁడవట**
**యెదుట శ్రీవేంకటేశుఁడవట**
**యిదియది యననేల యింతయును నీ మహిమ**
**కదిసి నీ పాదాలే కనుఁగొంటగాక ॥ఏదియు॥329**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో ఆదిపురుషుడు సాకారుడా, నిరాకారుడా? జీవాత్మ యెవరు? వానికి భగవంతునికీ సంబంధమేమిటి? నిర్గుణ బ్రహ్మ యెవరు? ఇటువంటి అనవసరమైన చింతన లెందుకు? అని అడుగుతున్నారు. నామట్టుకు నాకు ఈ వివరాలతో పనిలేదు. నేను వీటికేసి చూడనుగాక! చూడను. నేను దేనినైనా నాదంటాను. ఎందుకంటే ఓ తిరుమలనాయకా! నాకు వాటితో పనిలేదు, నీదాస్యం ఒక్కటి లభిస్తే అది చాలు నాకు నీ పాదముల అండ దొరికితే నాకింకా యేమి కావాలి అంటున్నారు.

**కం॥ కానను దేనిని యందును**
**నేనేదియు కాననందు నీదాస్యమదే**
**పూనుదు ఆదిమపురుషా!**
**మానక నీ పాదమొకటె మదిని తలంతున్.**

**భావోద్దేశ్యము :**

ఏదియు కాననందు (నేను దేనినీ చూడనంటాను) ఏదీ కాదందును (దేనినైనా కాదని అంటాను) ఎందుకంటే నాకేదీవద్దు. ఆదిపురుషుడైన ఈ శ్రీవేంకటేశ్వరుని దాస్యము ఒక్కటుంటే నాకది చాలును.

దేవా! ఈ లోకంలో నీవు కొందరికి ఆకారముతో కనుపిస్తావు. కొందరికి నిరాకారుడవై స్ఫురిస్తావు. మరికొందరికి సుగుణమూర్తిగా భావింపజేస్తావు. మరింకా కొంతమందికి నిర్గుణస్వభావునిగా తలపిస్తావు. వీటిలో నిజం యేది?

ఇక నీ తత్త్వమెట్టిదో వివరించాలంటే అనేకవిధములైన ఆలోచనలున్నవి. ఎందుకంటే కొన్ని పురాణాలు నీవు చతుష్షష్టి కళలలో ఆరితేరినవాడివన్నాయి. మరికొన్ని చోట్ల కళలు లేని నిర్వికారుడవని చెప్పారు. కొంతమంది ద్వైతమతస్తులు జీవుడు వేఱు పరమాత్మవైన నీవు వేఱు అని భావించారు. మరికొంతమంది అద్వైతమతస్తులు నీవే జీవాత్మవు. మీకు అభేదము అని వాదించారు. ప్రజలు అందరి మాటలూ విని ఎవరికి నచ్చింది వారు నమ్మారు.

కానీ ఓ శ్రీవేంకటేశ్వరా! నిజమేమంటే జీవులందరిలో నీవు అంతరాత్మగా వున్నావు. కన్నులకు తిరుమలాధీశునిగా కనుపిస్తావు. అందుకనే నిన్ను అదీఇదీ అని అనటం యెందుకు? అంతయూ నీ మహిమయే. నీ పాదములే నా తలపులో వుంటే చాలదా?

సంఖ్య : XX/10 రాగం : కాపి

కీర్తన : ఏమని చెప్పేనే ఇట్టి నావలపు

26 ఏమని చెప్పేనే ఇట్టి నావలపు
**ఆమీఁదటిపను లతఁడే యెఱుఁగు** ॥పల్లవి॥

**యెదుటనే వున్నాఁడు యిదె నారమణుఁడు**
**కదిమీఁ దమకము కనురెప్ప లిడిన**
**పెదవుల నున్నది పే రాతనిదే**
**కొద దీరవు నా కోరికలు** ॥ఏమని॥

**నగుతా నున్నాఁడు నాతో నాతఁడు**
**నిగిడీఁ గాకలు నే నూరకుండిన**
**వెగటునఁ బతిపై వేసితి నేఁ జేయి**
**తగులకతొల్లే తడిపీఁ జెమట** ॥ఏమని॥

**కాఁగిట నుందానఁ గడు నాతనితో**
**రేఁగీ వలపులు రేవగలు**
**వీఁగ కలమె శ్రీవేంకటపతి నను**
**చెఁగదేరె నా చిగురుటధరము** ॥ఏమని॥

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య చెప్పిన ఈ సరసకీర్తనలో దేవి తన చెలికత్తెతో యేమని అంటున్నదో వింటే స్వామి ఏకాంతంలో దేవి కూడా ఆత్రుతకు మొకమోటమునకు, వలపు తత్తరకు లోనౌతుంది అని రూఢి అవుతుంది. శ్రీవేంకటపతి చేగదేరిన ఆమె చిగురుటధరములను వదలకపోతే ఆయనతో వేగటం ముద్దరాంద్రకు కుదరదనే నిశ్చయానికి వచ్చేసింది. ఇట్లా వున్న నావలపు సమాచారం యేమని చెప్పమన్నావే అంటున్నదా దేవి.

**ఆ.వె॥ ఏమి చెబుదునమ్మ ఇట్టి నావలపును**
**ఇచ్చకాల పనులనెఱుగునతడు**
**చేగదేరె నాదు చిగురుటధరములు**
**వీగలేము వీడు వేంకటపతి**

**భావోద్దేశ్యము :**

చెలీ! నీకు నా మగని చేతలనెన్నని చెప్పను? యేమని చెప్పను? నా వలపు అతనికి ఇట్టిది అని చెప్పాలంటే కూడా నాకు తడాటుగానే వున్నది. ఆ మీదటి పనులు (ఇచ్చకాలపనులు) అతడే యెఱుగును. (ఆయనకు తెలిసినట్లు మరెవ్వరికీ తెలియవు).

ఇదిగో నా రమణుడు నా యెదుటనే వున్నాడు అనే భ్రాంతి కలుగుతుంటుంది. నా కనురెప్పలనెత్తి చూస్తేనే తమకము కదిమీని (తన్మయత్వం నన్ను చుట్టేసుకొంటుంది). ఎల్లవేళలా అతని పేరే నా పెదవులు పలుకుతుంటాయి. మరి నా కోరికలను చూడబోతే, వాటికొదలేదు (అంతూపొంతూలేదు) ఇక నేనేమి జేతునే.

అతగాడు నాదగ్గరకు రాగానే నాతో, నగుతానున్నాడు (నవ్వుతూవున్నాడు). అదేమి చిత్రమో నేను వూరకనే వున్నా నా శరీరం కాకలు నిగిడీని (వేడెక్కిపోతుంది). వెగటున (కొద్దిగా జంకుతూనే) నా పతిపై నెమ్మదిగా చేయివేస్తాను. తగులకతొల్లే (ఆయన నన్ను తాకకముందే) చెమట నా దేహాన్ని తడిపేస్తుంది.

చెలీ! ఇంతా చేసి అతగాడు నాకు కొత్తకాదు కదా! కానీ ఆతని కౌగిట చేరగానే అదిరేయి అయినా, పగలు అయినా నాలో వలపు రేగీని (మొగ్గతొడుగుతుంది). అబ్బా! ఆ శ్రీవేంకటపతితో వీగకలమే (మనము తూగగలమా?) చేగదేరె (ఆరితేరి) నాచిగురుటధరములను...

సంఖ్య : II/180　　　　　　　　　రాగం : వరాళి

కీర్తన : ఏమనిపొగడవచ్చు నిటువంటిది నీమాయ

**27 ఏమని పొగడవచ్చు నిటువంటిది నీమాయ**
**కామించి బ్రహ్మాదులనుఁ గప్పీ నీమాయ** ॥పల్లవి॥

**బచ్చెనరూపులు పెక్కు పడెచ్చుల వేసినట్లు**
**నిచ్చల నినుచున్నది నీమాయ**
**తచ్చి వారివారిరతి తమతమకే తెలియ**
**పచ్చిగా భోగింపించీ దంపతుల నీమాయ** ॥ఏమ॥

**మఱి తొలునాటిభోగాలు మరునాటికి వింతగా**
**నెఱవుగాఁ దమకించీ నీమాయ**
**విఱుచరానిదుఃఖము వెస నిద్రవోయి తేనే**
**మఱపించి నవ్వించీ మహిలో నీమాయ** ॥ఏమ॥

**పట్టరానిజవ్వనము పరసిపోతే ముదిమి**
**నెట్టుకొల్పి వుబ్బఁడచీ నీమాయ**
**గట్టిగా శ్రీవేంకటేశ ఘనుఁడవైననీదాసుల**
**పట్టకుండాఁ జేయుము బలిసెనీమాయ** ॥ఏమ॥**180**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య ఈ కీర్తనలో శ్రీహరితో యేమని అంటున్నారో ఆలకించండి. నీమాయ ఇట్టిది అని యేవిధముగా పొగడనయ్యా? నీమాయ సాక్షాత్తూ బ్రహ్మదేవునే కప్పి వేసి ఆనాడు రేపల్లెలో భంగపడి తాను దాచిపెట్టిన గోపాల బాలురూ గోవులు యేమయ్యాయా అని భ్రాంతి పడునట్లు చేసింది కదా! నీమాయవలన అశాశ్వతాలైన రూపములు శాశ్వతాలుగా భ్రమ కలిగిస్తాయి. ఎవ్వరి రతి సుఖం వారికే తెలుస్తుంది. అవతలవారికి అది అసహ్యమని అనిపించవచ్చుకూడా. ఇవ్వాళ రాత్రి భోగము మరునాడు వింతగా అనిపిస్తుంది. నేటి దుఃఖము మరునాటి నిదురయై ఆ తరువాత బాధమరచి నవ్వించవచ్చును. ఇదే వేంకటేశుని మాయ అంటున్నారు.

**ఉ॥ ఏమని నీదుమాయలను యెంచెదమో హరి కీరితించుచున్,**
**కామములొంగదీసి భళి! గప్పెను బ్రహ్మను మేములెక్కయా**
**పామరులైన దుఃఖమను బాధకు లొంగియు నవ్వకుందురా**
**నీమహిమయ్య లొంగితిని నీశరణార్థిని వేంకటేశ్వరా!**

**భావోద్దేశ్యము :**

ఓ దేవదేవా! నీమాయ ఇటువంటిది అని మేము యేమని పొగడగలమయ్యా? నీమాయ కామించి (కోరికతో) బ్రహ్మదేవుడినే గప్పివేసి నిన్ను గొల్లపిల్లవానిగా భ్రమించి భంగపడునట్లు చేసింది.

ప్రభూ! నీమాయ, పెక్కుబచ్చెనరూపులు (అశాశ్వతములైన రూపములది.) నిత్యమూ, శాశ్వతమైనదిగా భ్రమ కలిగిస్తుంటుంది నీమాయ. నీమాయ దంపతులను పచ్చిగా భోగించునట్లు చేస్తుంది. వారు ఉచ్చమూ నీచమూ మఱచిపోతారు. ఎందుకంటే యెవరి రతి సుఖం వారికి గొప్పగా అనిపించినా, అవతలి వారికి అసహ్యముగా అనిపిస్తుంది అదే నీమాయ.

దేవా! నీమాయ మరొక పనిచేస్తుంది. ఈ రోజు నేను అనుభవించిన భోగమే. మరునాడు వింతగా పిచ్చిగా అనిపిస్తుంది. కాని మరునాడు ఆ భోగానుభవము తమకించీని (తన్మయంలో ముంచుతూనే వుంటుంది. విడువలేని ఈనాటి దుఃఖము మరునాడు అంత బాధాకరంగా వుండదు. పైగా మఱపించి నవ్వించవచ్చు కూడా. మహిలో నీమాయ అంతటిది.

యౌవనము పట్టరానిది. అది పరసిపోతే (నశిస్తే) ముసలితనం నెట్టుకొని వస్తుంది. ఈ రెండూ నీమాయా కల్పితములే. ఓ శ్రీవేంకటేశుడా! మేము నీకు దాసులమయ్యా! అందుకని మాపై కృపను జూపి కాస్త నీ మాయకు మమ్మల్ని వదలిపెట్టమని నచ్చజెప్పవయ్యా!

❋

సంఖ్య : XVI/188 రాగం : ఖరహరప్రియ

కీర్తన : ఏమమ్మా నీ కెవ్వరీడు యిందిరాదేవి

**28 ఏమమ్మా నీ కెవ్వరీడు యిందిరాదేవి**
**నీ మగనికి నీవు నిందునిధానమవు ॥పల్లవి॥**

**చూపులనే కురిసేవు సొరిది బంగారుపొడి**
**తీపుల నీపతి కది తీరనిసొమ్ము**
**రూపుననే కులికేవు రుచుల రాజస మెల్ల**
**మోపులై యాతని కవె ముంగిటి సంపదలు ॥ఏమమ్మా॥**

**మోముననే మలిచేవు మోహనపు మెఱుఁగులు**
**కావించు నీవిభునికి కానదివ్వెలు**
**తామెరచేతుల నెత్తి దైవారేవు మహిమలు**
**ప్రేమపుమీయాతనికి ప(పె?)ట్టెలధనములు ॥ఏమమ్మా॥**

**పలుకులఁ జిలికేవు పైపైనే అమృతాలు**
**అలరి శ్రీవేంకటేశు కవె మంత్రాలు**
**అలమేలుమంగవు నీ వాతనిఁ గూడితివిట్టె**
**చెలఁగి మీయిద్దరికి సేసిన భాగ్యములు ॥ఏమమ్మా॥**

**ఉపోద్ఘాతము :**

మనకు చెప్పలేని ప్రేమ కలిగితే మన ముద్దుబిడ్డలని, నా బంగారుకొండ, నా కన్నుల పంట, నా రతనాల రాశి అని ముద్దు చేస్తుంటాం. అన్నమయ్యకు శ్రీపతే తండ్రి. శ్రీసతే తల్లి. ఆమెయే ప్రతిరోజూ అన్నమయ్య జరిపించే నిత్యకళ్యాణ వధువు, ఆయన గారాల కూతురు. ఆమెను యెన్ని విశేషణాలతో పొగుడుతున్నారో చూడండి. గతంలో "ఏమని పొగడుదునే నిను, ఆమని సొగసుల అలమేల్మంగా?" అని కీర్తించలేదూ? అదే అన్నమయ్య చనవు.

**కం॥ ఏమమ్మ యీడు యెవ్వరు?**
**నీమపు ఇందిరవు, పతికి నిండు నిధానం-**
**బౌమగువవు, మాతల్లివి,**
**ప్రేమపు 'మీయాతనికిని' పెట్టెల ధనముల్**

**భావోద్దేశ్యము :**

ఏమమ్మా అలమేల్మంగా! నీకు యెవ్వరు ఈడు (సమానము) తల్లీ! నీవు క్షీరసాగరకన్యవైన ఇందిరాదేవివి. నీ మగడు శ్రీహరికి నీవు నిండు నిధానమవు (ఎన్నడూ తరగని దాచుకొన్న బంగారు పాతరవు).

కేవలం చూపుతోనే సొరిది బంగారు పాడి (కుప్పలుగా బంగారపు పాడి పండించగలవు). నీ పతికి అది తీపుల తీరని సొమ్ము (మధురమైన తరుగని భూషణము). రుచుల రాజసము (దేదీప్యమైన రాచఠీవి) కలిగిన చక్కటి రూపముతో కులికేవు (సొగసులొలికేవు). మరి నీ యొక్క ఆ సొగసు నీపతికి మోపులై (మూటకట్టి) ముంగిటి సంపదలు (ఎదురుగా నిలుపుకొనిన సంపదలు) తల్లీ! మరి నీవుండగ మాకు లోటేమిటమ్మా.

తల్లీ! శ్రీదేవీ! నీమోముననే (వదనముననే) మోహనమైన మెరుఁగు (కాంతిని) మలిచేవు (పోతపోసినావు). కావించు నీ విభునికి (సదా నిన్ను కాంక్షించే నీమగనికి) ఆ మెరుగులే అసంఖ్యాకమైన దీపాలంకరణ. తామరతూడులవంటి కోమలమైన నీ చేతులనెత్తి నీమహిమలు దైవారేవు (అతిశయించేవు). మీయాతనికి (మీ ఆయనకు) అది పెట్టెల నిండా సర్దిన ప్రేమ ధనము తల్లీ!

అమ్మా! నీవు నీ పతితో, మాటలాడుతుంటే అవి అమృతము చిలికినట్లుంటాయి. అవే శ్రీవేంకటపతికి మీ పెండ్లి మంత్రాలు. మీవారి అర్థాంగి అలమేల్మంగవై ఆయనను కూడితివి. తల్లీ! ఆది దంపతులైన మీ ఇరువురికి అది అతిశయించి చేసికొన్న భాగ్యము.

సంఖ్య : IV/325 రాగం : గుండక్రియ

కీర్తన : ఏలొకో కర్మమా యిందుకు బాలైతిని

**29 ఏలొకో కర్మమా యిందుకు బాలైతిని**
**పొలుపడిన యీ జలభ్రమణమువలెను ॥పల్లవి॥**

**ధరలోఁ బుట్టినప్పుడే తలఁచ నీ యాత్మ**
**మరుగఁడు పరమైతే మరచీఁగాని**
**అరిది దుర్భాషల నలవడ్డనాలికె**
**హరినామములయందు నలవడదు ॥ఏలొ॥**

**జవకట్టి పూర్వవాసనల సంసారమే**
**చవియే తాఁగాని ముక్తి చవిగాదు**
**భువిఁగల విషయాలఁ బుంగుడయ్యీఁగాని మతి**
**వివరించి దైవమును వెదకలేదు ॥ఏలొ॥**

**శ్రీవేంకటేశుకృపచేత నింతేకాని**
**వావాత నివి గైవశము గావు**
**భావమిప్పుడితని పాదాలు చేరికొని**
**యేవుపమలనుఁ గాన మిన్నాళ్లును ॥ఏలొ॥325**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో తన కర్మమును సూటిగా ప్రశ్నిస్తున్నారు. 'జలభ్రమణము' అంటే సుడిగుండము. "ఓ నా కర్మమా! దీనికి యెందుకు పొలుయైనావు? ఈ సంసారమనే సుడిగుండంలో నన్ను యెందుకు తోసేశావు? హరినామమునకు అలవాటు పడకుండా చేస్తావు. దుర్భాషలను నాచేత పలికిస్తావు. నేను ఏ జన్మలోనో చేసిన పాపాలను ఈనాడు నాకు జమకట్టి సంసార సుఖాలు రుచించి ముక్తిమార్గం రుచించకుండా చేశావు. ఏదో శ్రీవేంకటేశుని కృపవలన ఆయన పాదాలు శరణని అన్నాను. లేకపోతే ఇన్నాళ్ళూ యే వుపమలనుగానము అంటున్నారు. అంటే హరిదాస్యము చేస్తే ముక్తిని పొందవచ్చును అనే ఉపాయము తెలియకుండా భ్రష్టునిలా జీవించాను" అని అంటున్నారు.

కం॥ **అలవరచి 'చెడ్డమాటలు'**
**పలువిషయములందుబెట్టి బాధించితివే!!**
**చెలువపు హరికృప బ్రతికితి**
**సులువుగ కర్మంబ! నన్ను 'సుడి' ముంచితివే?**

**భావోద్దేశ్యము :**

ఓ నా కర్మమా! ఇందుకు నేనెందుకు పాలైనాను? అనేక భ్రమలకులోనై ఈ జలభ్రమణకు 'సుడిగుండం' పాలుపడితిని? (దీంట్లో చిక్కుకుపోయాను). దీనివలన నీకేమి లాభం కలిగిందే?

తలచన్ (ఆలోచిస్తే) ఈనా ఆత్మ నేను భూమ్మీద పడ్డ క్షణం నుంచే 'పరము' మీద ధ్యాస పోయి, మరుగడు (దానిగురించి ఆసక్తిని వదలివేస్తాడు. ఇక నా నాలుక దుర్భాషనలవరచుకొని పుష్కలంగా పాపం చేయిస్తూనే వుంటుంది. హరి నామము నొకవేళ గత జన్మలో నాకలవాటైనా ఇప్పుడు మఱచిపోతాను.

పూర్వజన్మ వాసనలు జమ అయిపోయి సంసార సుఖముపై రుచిపెరుగుతుంది. ముక్తి రుచించదు. ప్రపంచములోని విషయ సుఖాలమీద అంతులేని "యావ" కలుగుతుంది. దైవమే లేడనే భ్రమ కూడా కలుగుతుంది. అశాశ్వతమైనవన్నీ శాశ్వతమనుకొంటుంటాడు జీవుడు. అసలు దైవాన్ని వెదకే ఆలోచనే రాదు.

ఒకే వొక సుకృతమువలన శ్రీవేంకటేశ్వరునికి నీ జీవుడిపై దయ కలుగుతుంది. అంతేకాని మరొక కారణం కనుపించదు. వావాత (నోరారా) హరినామము అలవడుతుంది. భావములో హరిపాదములను స్మరించేశక్తి వస్తుంది. ఇన్నాళ్ళూ ముక్తి వుపమల (పాయములను) మఱచినా, ఇప్పుడు దానిపై ఆసక్తి పెరుగుతుంది.

(దీనిని వ్రాస్తున్న వాడికి కూడా ఇది స్వానుభవమే...)

సంఖ్య : III/9 రాగం : వరాళి

కీర్తన : ఐనదయ్యీ గానిదెల్లా నటు గాకుండితే మానీ

**30 ఐనదయ్యీఁ గానిదెల్లా నటు గాకుండితే మానీ**
**మానుపరా దివి హరిమాయామహిమలు** ॥పల్లవి॥

**పుట్టేటి వెన్ని లేవు పోయేటి వెన్ని లేవు**
**వెట్టిదేహాలు మోచినవెడజీవులు**
**గట్టిగాఁ దెలుసుకొంటే కలలోనివంటి దింతే**
**పట్టి ఇందుకుఁగా నేల బడలేమో నేము** ॥ఐన॥

**కడచిన వెన్ని లేవు కాచుకున్న వెన్ని లేవు**
**సుడిగొన్నతనలోనిసుఖదుఃఖాలు**
**యెడపుల నివి రెండు యెండనీడవంటి వింతే**
**కడనుండి నేమేలకరఁగేమో నేము.** ॥ఐన॥

**కోరినవి యెన్ని లేవు కోరఁగల వెన్ని లేవు**
**తీరనిసంపదలతో తెందేపలు**
**ధారుణి శ్రీవేంకటేశుదాసులమై యిన్నియును**
**చేరి కైకొంటిమి యేమిసేసేమో నేము.** ॥ఐన॥**9**

**ఉపోద్ఘాతము :**

ఈ అధ్యాత్మ కీర్తనలో అన్నమయ్య శ్రీహరి మాయామహిమలను ప్రశంసిస్తున్నారు. ఈ జీవులు యెన్ని పుట్టుకలను పొందుతారో యెన్ని దేహాలు ధరిస్తారో యెవరు చెప్పగలరయ్యా వీడి కోసం యెన్ని సుఖదుఃఖాలు గడచిపోయినవి, యెన్ని రాబోతున్నాయి తెలిసిన వారెవరన్నా వున్నారా? వీడు ఒక్క పుట్టుకలోనే యెన్ని కోరుకొన్నాడు? కోరలేనివి ఎన్ని కోరాలనుకొని తపించాడు? ఈ కోరికలన్నీ తీరాలంటే అనంతమైన సంపదుండాలి. మరి అంత సిరిగలవారు హరిదాసులు కాక వేరెవరుంటారు?

**కం॥ ఐనది ఔకద! కానిది**
**కానేరదు, మాయలన్ని ఘనమగుమహిమల్**
**మానుపరాదివి శౌరీ!**
**పూనిచి నీదాసజనులె పోల్చెదరయ్యా!**

**భావోద్దేశ్యము :**

అయ్యేదేదో అవుతుంది. కానిదేదో కానేకాదు. ఇదంతా శ్రీహరి లీలా చిద్విలాసము. ఇది మాన్పలేనిది, మాన్పరానిది. ఈ మాయ నెవరు అతిక్రమించగలరయ్యా!

ఈ జీవి పుట్టే పుట్టుకలు యెన్నిలేవు? పోయే చావులు యెన్నిలేవు. అద్దెకు తెచ్చుకొన్న యెన్ని రకాల దేహాలనుద్ధరించాడో యెవరు చెప్పగలరు? గట్టిగా తెలుసుకొందామనుకొంటే అన్నీ కలలోని సంగతుల్లా గడచిపోతాయి. ఇది అంతా శ్రీహరి మాయ. మేము దీనిని గ్రహించాలని ఆరాటపడటం శుద్ధదండుగ కదా!

ఏ జీవియైనా సుఖదుఃఖాలు అనుభవించి తీరవలసిందే. సుడి వంటి వాటినెవ్వరూ మాన్పలేరు. మళ్ళీ వీటిలో గడిపివేసినవెన్ని? గడపవలసినవి యెన్ని? ఈ లెక్క చెప్పగలగిన మొనగాడెవరయ్యా? ఎడపుల (యెడతెగని) ఈ రెండూ (సుఖము, దుఃఖము) యెండ నీడల్లాగా జంటగానే వుంటాయి. అందుచేత మాకు వీటిని అనుభవించక తప్పుట లేదు.

ఒక జీవి తన జీవితములో కోరినవి యెన్ని లేవు చెప్పండి. ఈ కోరికలలో యెన్ని కోరదగినవి, యెన్ని కోరరానివి వుంటాయి. ఈ లెక్క తేల్చగల మొనగాడెవడయ్యా? తీరని సంపద వుంటే కాని ఈ తెందేపలు (అంతులేని ఆశలు) తీరే అవకాశమే లేదు. అయితే, ఈ పుడమిలో శ్రీవేంకటేశ్వరుని దాసులు మాత్రమే ఈ మాయలను అధిగమించగలరు. ఆయనే లేకపోతే ఇక వారిగతేమిటో?

సంఖ్య : II/186 రాగం : దేవగాంధారి

కీర్తన : ఒక్కడే మోక్షకర్త వొక్కటే శరణాగతి

**31 ఒక్కఁడే మోక్షకర్త వొక్కటే శరణాగతి**
**దిక్కని హరిఁ గొల్చి బదికిరి తొంటివారు ॥పల్లవి॥**

**నానాదేవత లున్నారు నానాలోకము లున్నవి**
**నానావ్రతా లున్నవి నడచేటివి**
**జ్ఞానికిఁ గామ్యకర్మాలు జరపి పొందేదేమి**
**ఆనుకొన్న వేదోక్తాలై నా నాయఁగాక ॥ఒక్క॥**

**వొక్కఁడు దప్పికిఁ ద్రావు వొక్కఁడు కడవ నించు**
**నొక్కఁ డీఁదులాడు మడుగొక్కటియందే**
**చక్కజ్ఞానియైనవాఁడు సారార్థము వేదమందు**
**తక్కక చేకొనుఁగాక తలకెత్తుకొనునా ॥ఒక్క॥**

**యిది భగవద్గీతార్థ మిది యర్జునునితోను**
**యెదుటనే వుపదేశమిచ్చెఁ గృష్ణుఁడు**
**వెదకి వినరో శ్రీవేంకటేశుదాసులాల**
**బ్రదుకుఁద్రోవ మనకు పాటించి చేకొనరో ॥ఒక్క॥186**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య ఈ కీర్తనలో యేమంటున్నారంటే, అనేకమంది దేవతలున్నప్పటికీ అందరికీ మోక్షాన్ని ప్రసాదించే హక్కు, శక్తి వుండవు. వారు కామ్యములనబడు కోరికలను తీరుస్తారు. ధనప్రాప్తి, సంతానప్రాప్తి, సుఖప్రాప్తి, అధికారప్రాప్తి వంటి అనిత్యమైన సుఖములనివ్వగలరు. సూర్యునిద్వారా శమంతకమణిని సంపాదించిన సత్రాజిత్తు బలవన్మరణం పొందలేదా? ప్రాణం పోయాక దానివలన అతనికేమి ప్రయోజనం? హరిభక్తుడైన అంబరీషుని దుర్వాసుడే యేమీ చేయలేకపోయాడు. వేదముల ప్రధానోద్దేశ్యము మంచి జ్ఞానము ప్రసాదించటం. జ్ఞానియైనవాడు ఆ వేదసారాన్ని గ్రహిస్తే కర్తవ్యంగా పనులు చేస్తాడు గాని అనవసరమైనవి తలకెత్తుకొంటాడా?

**ఆ.వె॥ ఒకడె మోక్షకర్త ఒకటే శరణ్యంబు**
**హరియె దిక్కుమాకు అనుచు తొంటి-**
**వారు బ్రతికినారు హరిదాసులైనారు**
**వేంకటేశు శరణు వేడినారు**

**భావోద్దేశ్యము :**

భక్తులారా! శ్రీహరి ఒక్కడే మోక్షకర్త (ముక్తి ప్రదాత). ఆయన ఒక్కడే శరణాగతిని ప్రసాదించుటకు సర్వరక్షకుడు కాబట్టి అర్హుడు. తొంటివారు (మన పూర్వీకులు) హరియే దిక్కని గొలిచి నిర్మలులై బ్రతికిరి.

వేదము ధర్మ సంస్థాపనకు యజ్ఞకార్యములను, ప్రోత్సహించినా, నిజమైన జ్ఞానికి ఆ కామ్యకర్మలు జరిపినందువలన ప్రయోజనమేమిటి చెప్పండి? అనేక దేవతలున్నారు. వారుండే అనేక లోకములున్నవి. నడచేటివి (అందరూ చేస్తున్న) అనేక వ్రతములున్నవి. ఇవన్నీ యేవేవో కోర్కెలు తీరాలనుకొనేవారికి మాత్రమే. ముక్తికోరే వారికోసం కాదు.

ఇది యెంత విధి అంటే, ఈ జీవుల భాగ్యవశమున అన్నీ జరుగుతాయి, కాని వారి వివిధ అర్హతల వలన కాదు. అవును కదా! ఒకడు కడవలో నీళ్ళు నింపి పెడితే, ఇంకొకడు వాటిని తృప్తిగా త్రాగుతుంటాడు. ఒకడు త్రవ్వి తయారు చేసిన చెఱువులో, ఇంకొకడు ఈదులాడుతున్నాడు జ్ఞానికి వేద సారం తెలిసినా, దైవకృపలేక ముక్తి దక్కదు.

ఇది రణరంగంలో శ్రీకృష్ణుడు అర్జునునికి స్వయంగా బోధించిన భగవద్గీతోపదేశము. ఆ కృష్ణుని కలియుగ అవతారమైన శ్రీవేంకటేశుని దాసుల్లారా! శ్రీకృష్ణుని ఈస్వామిలో వెదకి ఈ సత్యాన్ని గ్రహించండి. బ్రతుకు త్రోవలో ధర్మం తప్పక సంచరించండి. దానిని పాటించి, చేకొనుడు.

సంఖ్య : IV/39 రాగం : కళ్యాణి

కీర్తన : ఓహో యెంతటివాడే వొద్దనున్నవాడే హరి

**32 ఓహో యెంతటివాఁడే వొద్దనున్నవాఁడే హరి**
**సాహసపు గుణముల చతురుఁడా యితఁడు ॥పల్లవి॥**

**జలధిలోఁ బవళించి జలనిధి బంధించి**
**జలనిధి కన్యకను సరిఁ బెండ్లాడి**
**జలనిధిలో నీఁది జలనిధి మథియించి**
**జలధి వెరింగిన (వెరిఁజిన) చలమరా యితఁడు ॥ఓహో॥**

**ధరనికిఁ బతియై ధరణి గ్రుంగిన నెత్తి**
**ధరణికూఁతురుఁ దానె తగఁ బెండ్లాడి**
**ధరిణిఁ బాదము మోపి ధరణిభారము దించి**
**ధరణీధరుఁడైన దైవమా యితఁడు ॥ఓహో॥**

**కొండ గొడుగుగ నెత్తి కొండఁ దూఁటువడ నేసి**
**కొండకింద గుదురై కూచుండి**
**కొండపై శ్రీవేంకటాద్రి కోనేటిరాయుఁడై**
**కొండవంటి దేవుఁడైన కోవిదుఁడా యితఁడు ॥ఓహో॥**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య చెప్పిన ఇటువంటి కీర్తనలు గొప్ప ప్రహేళికలు (క్విజ్ కంటెస్ట్‌లాగా) సాగిపోతుంటాయి. మంచి పురాణ సాహిత్యం తెలియకపోతే దెబ్బతినటం ఖాయం. నా అనుభవం ప్రకారం కనీసం ఒక్క చిక్కుముడి అయినా వుంటుంది. మనందరి హృదయాలలోనే వున్న యీ శ్రీహరి ఓహో! యెంతటివాడే? ఇతడు సాహసగుణం వుండుటయే కాక ఆ గుణం కూడా చతురతతో వుపయోగించే మేటి. ఇతనేమేమి ఘనకార్యాలు చేశాడో వినండి.

**ఆ.వె॥ ఒద్దనున్నవాడు ఓహో! యెంతటివాడే**
**సాహసపు గుణముల చతురుడు హరి,**
**కొండవంటి ప్రభువు కోనేటి కోవిదున్**
**వేంకటేశు పొగడ వెలయు సుఖము.**

**భావోద్దేశ్యము :**

ఓహో! ఈ శ్రీహరి యెంతటివాడే? ఎల్లవేళలా ఇతగాడు మన ఒద్దనే వున్నవాడు(సమీపముననే వుండి రక్షించేవాడు). ఇతడు గొప్ప సాహస గుణము కలిగిన చతురుడు (యుక్తిపరుడు).

ఇతడెట్టివాడో వినుడు. ఒకానొక సమయమున జలనిధిని బంధించాడు (సముద్రముపై సేతువు నిర్మించిన రాముడు), జలధిలో పవళించాడు (మహావిష్ణువు), జలనిధి కూతురును పెండ్లాడాడు (లక్ష్మీదేవిని పెండ్లాడిన శ్రీహరి), జలనిధిలో ఈదాడు (మత్స్యావతారము), జలనిధి మధించినాడు (కూర్మావతారం). మరి ఇంతటి వాడు జలధి వెరజిన (భయపడిన) చలమరా (మత్సరము చూపినాడా?) అవును శ్రీరాముడై సముద్రునిపైననే బాణము సంధించినాడు.

ఇతగాడే ధరణిని (భూదేవిని) వరాహావతారంలో పెండ్లాడాడు, ధరణి క్రుంగగా నెత్తినాడు (బలరాముడు), ధరణి కూతురుని కూడా పెండ్లాడాడు (భూపుత్రి సీతాపతియైన రాముడు), ధరణినంతా పాదముతో కప్పివేశాడు (త్రివిక్రమావతారం), ధరణి భారముదించె (శ్రీకృష్ణుడై 18 అక్షోహిణుల సైన్యాన్ని రూపుమాపి భూమి బరువు తగ్గించాడు), నేడు ప్రతిదినం భూదేవిని పరిణయమాడుతున్న తిరుమల నాథుడితడే.

ఇతగాడు కొండ గొడుగుగా నెత్తినాడు (శ్రీకృష్ణుడు గోవర్ధనమునెత్తి వడగండ్ల వాననుంచి రక్షించాడు). ఒక కొండను తూటువడనేసె (నరకుని చంపటానికి వాడి నగరం చేరుటకు కొండకు రంధ్రం చేశాడు శ్రీకృష్ణుడు). ఒక కొండకిందకుదురై కూర్చున్నాడు (మంధరగిరిని మోసిన ఆదికూర్మము), కొండపైనున్న కోనేటిరాయుడై (శ్రీవేంకటేశ్వరుడై) కొండవంటి దేవుడివైన ఉద్ధండుడవు నీవేనా?

సంఖ్య : I/479 రాగం : ముఖారి

కీర్తన : కంటే సులభమిది కానక యుంటే దుర్లభ

**33 కంటే సులభ మిది, కానక యుంటే దుర్లభ-**
**మింటిలోననే వున్న దిహముఁ బరమును ॥పల్లవి॥**

**హరిదాసులు మెట్టినక్కడే పరమపద-**
**మరయ నిందుకంటె నవల లేదు**
**తిరమై వీరిపాదతీర్థమే విరజానది**
**సొరిది నన్నిచోట్లు చూచినట్టే వున్నది ॥కంటే॥**

**మచ్చిక వైష్ణవులమాటలెల్లా వేదములు**
**యిచ్చల నిందుకంటే నింక లేదు**
**అచ్చట వీరిప్రసాద మమృతపానములు**
**అచ్చమై తెలిసేవారి కఱచేత నున్నది ॥కంటే॥**

**చెలఁగి ప్రపన్నుల సేవే విజ్ఞానము**
**ఫల మిందుకంటే మఱి పైపై లేదు**
**తలఁప శ్రీవేంకటేశుదాసులే యాతనిరూపు-**
**లెలమి నెదుట నున్నా రెఱిఁగినవారికి ॥కంటే॥479**

**ఉపోద్ఘాతము :**

అవనిలో హరిదాసులు, నిర్మోహులైన వైష్ణవులు, ప్రపన్నులు (శరణాగతులు) అయిన వారికి శ్రీమన్నారాయణుని కృప ఇచ్చటనే కలుగుతుంది. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరుని రూపంలో జ్ఞానులకు ఆయన సాకారుడుగానే గోచరిస్తాడు. చేసికొన్నవారికి చేసికొన్నంత. ఏదైనా గ్రహించగలిగితే సులభం, గ్రహించలేకపోతే దుర్లభము, అంతే కదా! ఇహము ఈ లోకంలోనే అనుభవరూపంలో వున్నా, పరము యెక్కడో పై లోకంలో వుందనుకొంటారు. హరిశరణాగతులు జీవన్ముక్తులు. వారికి రెండూ ఇక్కడే.

**కం॥ ఘనముగ 'కంటే' సులభము**
**కనకుంటేదుర్లభంబు కమలారమణా!**
**కనుగొందు 'రింటనే' ఇహ-**
**ముసు పరమును రెండు కూడ మురహరిదాసుల్.**

**భావోద్దేశ్యము :**

మనం మన ఇంటిలోనే వుండి ఇహమూ (ఈ ప్రాపంచిక వైభవము) పరమూ (పరలోక దివ్యానుభవమూ) పొందవచ్చును. ఇదెట్లు సంభవమో కంటే (తెలిసికొంటే) సులభము. కానకవుంటే (తెలిసికొనకపోతే) దుర్లభము (యెన్నటికీ పొందలేనిది) అవుతుంది.

పరమపదము (వైకుంఠము) యెక్కడో వున్నది, దానినెలా పొందడం అని చింతించకండి. గమనిస్తే ఆ వైకుంఠం ఆవలనెక్కడనో లేదు. హరిదాసులు యెక్కడ కాలుపెడతారో అక్కడే వైకుంఠం వుంటుంది. స్థిరమైన ఈ హరిదాసుల పాదక్షాలన జలధారయే వైకుంఠంలో ప్రవహించే పవిత్ర "విరజానది". అయితే ఈ 'విరజానది' హరిదాసులు మెట్టిన ప్రతిచోట ప్రవహిస్తుంది.

మచ్చికతో వైష్ణవులు పలికే మాటలన్నీ వేదములే. ఈ ఇహలోకములో ఇంతకంటే వేరొక వేదవాక్యము లేదు. వీరు తమ స్వహస్తాలతో నొసగిన ఫల, పత్ర, పుష్ప, తోయము లేవైనా ప్రసాదముగా స్వీకరిస్తే అది అమృతపానమే. ఈ సంగతి మనస్ఫూర్తిగా తెలిసిన వారికి అమృత నివాసస్థానమైన స్వర్గము వైష్ణవులున్నచోటనే వున్నది.

అతిశయించిన ప్రపన్నుల (హరిశరణాగతుల) పాదసేవయే విజ్ఞానము అని తెలియదగును. ఇంతకంటే సత్ఫలము మరెక్కడో స్వర్గములో లేదు. ఆలోచిస్తే, శ్రీవేంకటేశ్వరుని నిజమైన దాసులే స్వయంగా ఆ విష్ణురూపులు. ఎరిగిన వారికి ఆ తిరుమలనాథుడు యెట్టెదుటనే వుంటాడు.

సంఖ్య : IV/316 రాగం : గుండక్రియ

కీర్తన : కటకట హరిమాయాకల్పనెట్టిదో

**34 కటకట హరిమాయాకల్పనెట్టిదో**
**తటుకునఁ బారవేసేతలఁపెందు లేదు** ॥పల్లవి॥

**అనంతకోటియుగాదులనుండియు**
**తనివోక విషయాలఁ దగిలుండినా**
**దినమొక్కొక్కరుచియై తీపులైఁ పండీఁగాని**
**వెనుకొన్న యాత్మకు వెగ టెందు లేదు** ॥కటకటా॥

**కడలేక నాలుకకుఁ గన్నయాహారములెల్ల**
**వొడలిలోఁ బూఁటవూఁట వొట్టుకొనినా**
**సడిఁ బైపై వింతవింతచవులే వెదకుఁగాని**
**విడువని యాత్మకు వెగ టెందు లేదు** ॥కటకటా॥

**కలకాలముననుండి కాపురపు లంపటాలె**
**కలిమితో మెడఁగుచ్చి కట్టుకొనినా**
**యెలమితో శ్రీవేంకటేశ్వరునాజ్ఞల -**
**నలవాటైన యాత్మకలపే లేదు** ॥కటకటా॥**316**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో అయ్యయ్యో! హరి మాయాకల్పిత మెట్టిదో యెరుగలేకపోయాను కదా! పోనీ ఈ మాయలను ఇప్పటికైనా చటుక్కున వదలి ముక్తుడనౌదామంటే కనీసం ఆ ఆలోచనకూడా రావటం లేదు. ఏమిటీ దౌర్భాగ్యం!! ఎన్ని తిప్పలు పడుతున్నాను!! దీనికొక్కటే మార్గం వున్నది. ఇక వేటి మాటవినను. శ్రీవేంకటేశుని ఆజ్ఞనే వింటాను అంటున్నారు.

**సీ॥ పలుకోట్ల యుగముల బడిననూ విషయాల**
**తగులము వీడదు తనివి పోదు**
**దినమొక్కరుచికోరి తీపులై పండినా**
**వెనుకొని యీ ఆత్మ వెగటుబడదు**
**మితిలేక నాలుక మెక్కు ఆహారంబు**
**బూట పూటకు సరి పొరలుచుండు**
**వింత వింత చవులు వెదకుట మానునా?**
**విడువని ఆత్మకు వెగటు లేదు.**

**తే.గీ॥ కాపురములంపటమువోలె గట్టుకొనియె**
**కటకటా! హరిమాయల గనలియుండె**
**వేంకటేశుని ఆజ్ఞల వినుట కాత్మ**
**అలవడినయంత ధన్యమై అలపు పోయె.**

**భావోద్దేశ్యము :**

కటకటా! (అయ్యయ్యో!) శ్రీహరి కల్పించిన మాయల కల్పనయెట్టిదో యెవరెరుగగలరు? వాటిని చటుక్కున వదిలించుకొను ఆలోచననెవరు చేయగలరు?

ఈ ఆత్మ ఒక దేహాన్ని పొందాక, అంతక్రితం యెన్ని యుగాలనుండి యెన్ని జన్మలు పొందినా ఈ జన్మలో విషయముల భ్రాంతి ఈ జన్మకి కొత్తయే. ఇప్పుడు కూడా ప్రతిదినమూ కొత్త రుచులు కోరుకొంటాడు. వెగటు అనే మాటనే యెరుగడు.

వాడి నాలుకకు మితిలేక కనుపించిన ప్రతి 'తిండి' తింటానంటాడు. పూటపూటకు కొత్త కాత్తవి తింటానంటాడు. అది కాస్త ఇదికాస్త నంజుకొని అంతే పైపై రుచులు ఎంత ఎంత చవులు (రుచులు) కావాలని వెంపర్లాడతాడు. దేనినీ విడిచిపెట్టని ఆత్మ వెగటు అనే మాటనే యెరుగడు.

ఎన్ని జన్మలలో ఎన్నికాపురాలో చేసిన ఆత్మ మళ్ళీ ఈ లంపటంలో పీకలోతుకు మునిగిపోతాడు. కలిమితో (ఐశ్వర్యం మత్తులో) గుచ్చి అన్నీ మెడకు కట్టుకొంటాడు కానీ ఏదో ఒకజన్మలో ఈ ఆత్మపై శ్రీవేంకటేశ్వరునికి కృప కలుగుతుంది. ఆయన ఆజ్ఞలను పాటించటం మొదలుపెడతాడు. అటువంటి ఆత్మకు జన్మల అలుపే వుండదు.

సంఖ్య : II/519 రాగం : దేసాళం

కీర్తన : కడనుండి చూచే నీకు గనికరమైతేగన

**35 కడనుండి చూచేనీకుఁ గనికరమైతేఁగన-**
**బడి నన్నుఁ గావు నీతో బలిమేలే** ॥పల్లవి॥

**వొడలుమోచినయది యొకయపరాధము**
**అడరి సంసారినౌటె యపరాధము**
**బడి నివి పఱచినపాట్లఁ బడకపోదు (దు?)**
**యెడనీకు మొరవెట్ట నిఁకఁ జోటేదయ్యా** ॥కడ॥

**అన్నపానములు గొన్న దది యొక్కనేరమి**
**వున్నతి సంపదఁ బొందు టొకనేరమి**
**యిన్నియు ననుభవించి యిఁక నొల్లనంటేఁ బోదు**
**విన్నపాలు సేసి నీతో విసుగఁ జోటేది** ॥కడ॥

**మదిలో నీవుండగాను మఱచిన దొకకల్ల**
**అదనఁ గర్మాధికారినౌటొకకల్ల**
**యెదుట శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గాచితివి**
**తుద కెక్కితిమి యింకఁ దొలఁగఁగవలెనా** ॥కడ॥**519**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య తాను చేసిన అపరాధాలు అనేకం వున్నాయని వాటిని క్షమించి తన సద్గతిలో పెట్టగలిగినవాడు తిరుమలేశుడని వేడుకొంటున్నారు. సంపాదన యావతో ఇబ్బడిముబ్బడిగా సంపాదించటం కూడా నేరము. సదా మదిలో హరి వుంటాడని గ్రహించక మఱచినది నేరము. నేనే కర్తనని భావించి అన్ని కర్మలకూ అధికారినవుట ఒక కల్ల (తప్పు). ఇటువంటి పరిస్థితుల్లో వెనుదీయక నన్ను ఆదుకొనగలవాడవు నీవే శ్రీవేంకటేశ్వరా అంటున్నారు.

కం॥ **నీతోబలిమేలయ్యా?**
**మాతీరును చూతువుకద! మాకడనుండే**
**ప్రీతినికావుమునన్నును**
**నేతుదికెక్కితిని శౌరి నీదాసుడనై.**

**భావోద్దేశ్యము :**

ఓ దేవదేవా! కడనుండి చూచే నీకు (నీవు యెక్కడ యే భక్తుని రక్షించుటకు పరుగిడినా అక్కడనుండే జీవులనందరిని పరికించే నీవు) మాపై కనికరమైతే నాకూ కనబడి కావుమయ్యా! (రక్షించవయ్యా!) నీతో బలిమేలే (నీతో నేను నా బలిమిని చూపగలిగిన వాడనా నేను!!!)

అదీగాక, నా అపరాధములు పరిమితిగలవైతే పోనీలే అనుకోవచ్చు. కాని నా అపరాధములు అంతులేనివి. నేనీ మానవ శరీర ధారణకంగీకరించటం ఒక నేరము దానిమీద ఆ శరీర సుఖంకోసం సంసార లంపటం తలకి చుట్టుకోవటం ఇంకొక నేరము. ఇంత జరిగాక అనేకపాట్లు పడక తప్పదు కదా! నాకు ఈ పాట్లు పడటంతోనే సరిపోయింది. ఇక నీకు మొరవెట్టే జోటేదయ్యా?

ఇంకొక గొప్ప నేరము యేమంటే మేము "అన్నగతప్రాణులము". అదే పెద్ద ఇబ్బంది. ఆ అన్నము కోసం యాచనదగ్గరనుంచి దొంగతనం వరకు అన్ని నేరాలు చేస్తూ వుంటాము. సంపాదన కేవలం జీవిక కొరకే కాని మితిలేని సంపాదన ఒక నేరము. ఇంతకాలమూ ఇవన్నీ అనుభవించి ఈనాడు ఛీఛీ నాకవి వొద్దు అనటం కూడా నేరమే. ఈ మత్తులో పడినవాడికి నీకూ విన్నపాలు చేసి విసుగు (నిర్వేదంతో) వుండే చోటేది? (అవకాశమేది?)

నీవు నా అంతర్యామివైనా మదిలో వున్న సంగతి మరచుట ఒక కల్ల (ఒకానొక తప్పు) అన్నిటికి నేకర్తనని గర్వించి, చివరకు నా కర్మలకు అధికారినవుట ఒక పెద్దతప్పు. ఇంత జరిగినా ఓ శ్రీవేంకటేశ్వరా! దయతో నన్ను గాచితివి. తుదిపదమెక్కితిమి (జీవన్ముక్తులమయ్యాము.) ఇంకా తొలగవలెనా ప్రభూ!

సంఖ్య : III/318 రాగం : బౌళి

కీర్తన : కన్నదేటిదో విన్నదేటిదో కాగలదిక నేదో

**36** కన్న దేఁటిదో విన్న దేఁటిదో కాఁగలదిఁక నేదో
నన్నుం గానను నిన్నుం గానను నడుము బట్టబయలు. ॥పల్లవి॥

నీమాయమహిమో నే నేరనికడమో
భూమిలోన నీవున్నాఁడవు నాపుట్టుగులుఁ గలవు
యేమి గాఁగలనో యింకా మీఁదట నిటకతొల్లి యేమైతినో
సోమార్కులవుదయాస్తమయంబులు చూచుచున్నాఁడను నేను ॥కన్న॥

జ్ఞానము నీవో అజ్ఞానంబే బలువో
నీనామంబులు అనంతకోట్లు నిలుకడ గాఁగాను
కానఁగల యీ ప్రపంచమెల్లా కలయో యిది నిజమో
కానరాని యీ ముక్కునసూర్పులు కాలముఁగొలచేటికుంచములు ॥కన్న॥

నీకు నీవే నను దయ దలఁచితివో నేనాచార్యుని నమ్మితినో
కైకొని నాయంతర్యామివి నినుఁ గంటి నిపుడే నేను
శ్రీకాంతుఁడవో శ్రీవేంకటేశ్వర శ్రీవైకుంఠమే యీజగము
యేకడ చూచిన నీదాసులు నాయెదుటనే వున్నారు. ॥కన్న॥**318**

**ఉపోద్ఘాతము :**

మానవుని ఇంద్రియజ్ఞానము పరిమితము. వీడికి పరమాత్ముని గురించి తెలిసినది పరిమితము. వీడి పుట్టుక వీడికే తెలియదు; గిట్టుటా తెలియదు; మధ్యలో జరిగేవే వీడికి తెలిసింది. అజ్ఞానంలో మగ్గినన్నాళ్ళూ జ్ఞానం కోసం ప్రయత్నించడు. ఈ ప్రపంచము కలయో నిజమో తెలియని భ్రమకులోనౌతుంటాడు. వానికి అదృష్టం హరికృపవలె వరిస్తుంది. శ్రీహరి దాసులే తనవారని వారి సేవలో హరినెరిగి ధన్యుడౌతాడు. లేకుంటే, మళ్ళీ పుట్టుక మళ్ళీ చచ్చుట ఈ పీడ తప్పదుగాక తప్పదు. ఈ కీర్తన అర్ధంకావాలంటే కష్టమే.

**ఉ॥ కన్నదదేటిదో? అవలకాగలదేటిదొ విన్నదేటిదో?**
**నన్నునెరింగి కాననిక నా తరమా నినుగాన? మధ్యలో**
**వున్నజగంబు జూచితిని వోజ నెరుంగను నీదుమాయలన్**
**వెన్నుడ వేంకటేశ్వరుడ! విశ్వవిజేతలు శౌరిదాసులే.**

**ఓజ :** స్వభావము

**భావోద్దేశ్యము :**

ఈ కన్నుల శక్తి పరిమితం. చెవులశక్తీ పరిమితమే. మరుక్షణమున యేమి జరుగనున్నదో యెవరికీ పూర్తిగా తెలియదు. నన్ను నేను తెలుసుకోలేకపోయాను. మరి పరమాత్ముడవైన నిన్నెట్లు తెలియగలను? నాకు తెలిసిందేమిటయ్యా! అంటే ఈ నడుమ బట్టబయలవుతున్న కొద్దిపాటి ప్రపంచము.

నీ మాయామహిమవల్లనో నేనెరుగని కడమో (కొఱతయో)? భూమిమీద నీవూ వున్నావు, నా పుట్టుకలూ నిజమే. అయినా, ఈ జన్మలో నేనేమవుతానో, ఇంతకు పూర్వజన్మలో యేమైనానో తెలిసినవాడినా అంటే, అదీ లేదు. నేను నిశ్చయంగా తెలిసిందేమంటే సూర్యచంద్రుల ద్వారా వచ్చిన వెలుగు చీకట్లను. నేను వాటిని చేయలేదు. మరి నీవుగాక ఇంకెవరు చేశారు?

నిన్ను దెలియుటే జ్ఞానము. నిన్ను తెలియక బోవుట అజ్ఞానము. అది యెంత బలమైనదంటే. నీ నామములనంతము. నాకు నిలకడే సరిగ్గా లేదు. నాయెదుట కనబడు ఈ ప్రపంచము కలయో నిజమో అర్థంకాని వైవిధ్యభరితము. నా "ముక్కు" నేను చూడలేను. కాని ఒకటి తెలుసుకున్నాను. ఈ ముక్కుద్వారానే శ్వాస లోపలికి పోతోంది, బయటకు వస్తోంది. ఈ శ్వాసను లోపలికి తీసికొంటున్నదెవరు? బయటకు పంపిస్తున్నదెవరు? నేననుకొంటున్నాను, కాని నేను కాదు. నేనేతై దానినెన్నటికీ ఆపను కదా!

అట్లాంటి అయోమయంలో నేనుంటే నాపై నీకే దయగలిగినదేమో మా ఆచార్యునిపై నాకు నమ్మకం కలిగించావు. ఆయన చేసిన జ్ఞానబోధవల్ల నీవే అంతర్యామివలె నాలో వున్నావని తెలిసికొన్నాను. ఓ శ్రీకాంతుడా! ఓ శ్రీవేంకటేశ్వరుడా! నీ శ్రీవైకుంఠమే ఈ తిరుమల శిఖరాలపైనున్నది ఇక్కడ అందరూ నీ దాసులే. నేనెటుచూచినా వారి రూపంలో నీవు నాయెదుటనే వున్నావు.

సంఖ్య : IV/178 రాగం : ఆందోళి

కీర్తన : కన్నులపండుగలాయఁగన్నవారికందరికి

**37** కన్నులపండుగలాయఁ గన్నవారికందరికి
వెన్నుఁడేఁగీ నిల్లిదివో వీధుల వీధులను ॥పల్లవి॥

అదె యెక్కెఁ దిరుతేరు అసురలు బెదరఁగ
త్రిదశులు చెలఁగఁగ దేవదేవుఁడు
కదలె బండికండ్లు ఘనమైన మ్రోఁతతోడ
వెదచల్లుఁ గాంతులతో వీధుల వీధులను ॥కన్ను॥

తోలి యాడీఁ దిరుతేరు దుష్టులెల్ల నణఁగఁగ
చాలుకొని శిష్టులెల్ల జయవెట్టఁగ
గాలికిఁ బడగలెల్లాఁ గడు నల్లాడఁగఁ జొచ్చె
వేలేటి పువుదండలతో వీధుల వీధులను ॥కన్ను॥

తావు చేరెఁ దిరుతేరు ధర్మములు నిలువఁగ
యీవల నలమేల్మంగ ఇచ్చగించఁగా
శ్రీ వేంకటేశ్వరుఁడు శింగారాలు మెరసెను
వేవేలు విధముల వీధుల వీధులను ॥కన్ను॥**178**

**ఉపోద్ఘాతము :**

శ్రీవేంకటేశ్వరుని తిరుతేరు (పవిత్రరథము) తిరుమల వీధుల వీధులనేగి నిజభక్తులకు ఆ తేరులాగే భాగ్యము పొందిన వారికి మరుజన్మలేని మహద్భాగ్యాన్ని అందిస్తుంది. పరవశించిన అన్నమయ్య పాడిన కీర్తన నాస్వాదించి, తరించండి. ఇదివరలో చెప్పినట్లుగా నాబోటి అతి సామాన్యునికే కవితావేశం కట్టలు తెగుతుంది.

**చం॥ మెరసెను వీధివీధి హరి మించెను గా తిరుతేరు చూడరో**
**వెరగున బారిరా అసురవీరులు, దేవతలెల్ల జయ్యనన్**
**ఒరిగిరి దుష్టులున్, చెలగియుర్విని శిష్టులకాలమొచ్చెరా**
**తిరుమలనాథునిన్ గొలిచి తేరును లాగని జన్మమే వృథా.**

**భావోద్దేశ్యము :**

ఇల్లిదిగో (ఇదిగిదిగో) తిరుమల వీధుల వీధులలో వెన్నుడు పయనిస్తున్నాడు. ఈ రథోత్సవము కన్నులకు పండుగవలెనున్నది. చూచిన వారందరికి ధన్యత కూడా కలిగింది.

దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుడు అదిగో పావనమైన తన 'తేరు' నెక్కాడు. ఇక అసురమూకలు బెదరి బెంబేలెత్తాయి. త్రిదశులు (పుట్టుట, పెరుగుట, గిట్టుట అనే మూడు దశలు మాత్రమే) వున్న దేవతలు చెలరేగిరి (విజృంభించిరి). బండికండ్లు (రథచక్రములు) ఘనమైన శబ్దము చేస్తుంటే రథము కదిలినది. వీధుల వీధుల కాంతులు వెదజల్లుతూ తిరుతేరు సాగిపోవుచున్నది.

తిరుతేరు, దుష్టులందరు అణగునట్లు తేలిపోతున్నట్లు విజృంభించింది. చాలుకొని (వరుసగా) శిష్టులందరూ జయజయధ్వానములను జేసినారు. గాలికి రథముపైనున్న కేతనములు అల్లల్లాడుతున్నవి. వ్రేలాడే పూవు దండలు కదలాడుతుంటే తిరుతేరు వీధుల వీధులనేగుచున్నది.

ఈ పుడమిలో ధర్మము నిలబడగా పరమాత్ముని తిరుతేరు తావు చేరె (గమ్యస్థానము చేరినది). దేవి అలమేల్మంగ ఇష్టము వ్యక్తము చేయగా శ్రీవేంకటేశ్వరుడు సింగారాలతో మెరసినాడు. అనేకమైన విధములుగా వీధుల వీధులను పావనము చేసింది తిరుమలేశుని దివ్యరథము.

❋

సంఖ్య : II/18 రాగం : దేవగాంధారి

కీర్తన : కల్లమాడ దొడ్డముద్ర కటకటా

**38 కల్లమాడ దొడ్డముద్ర కటకటా**
**చెల్లుబడికల్లలు చెప్పేరు లోకులు ॥పల్లవి॥**

**యిప్పుదేలే బ్రహ్మదేవుఁ డిట్టే వుండఁగ మీఁదటి-**
**వొప్పుగుబ్రహ్మపట్టము వొకరికి వెచ్చపెట్టి**
**అప్పటి మూఁడుమూర్తులయందులో నీతని సరి-**
**చెప్పఁబొయ్యే రీమాట చెల్లునా లోకులకు ॥కల్ల॥**

**కైలాసము రుద్రుఁడు గలబ్రహ్మాండకోట్లు**
**పోలించి విష్ణుఁడు కడుపున నించుకుండఁగాను**
**చాలి మూఁడుమూర్తులలో సరి యీతఁ డంటాను**
**కూళలై యాడేరుగాక కూడునా లోకులకు ॥కల్ల॥**

**ఘనుఁడీతనిపాదము గడిగె బ్రహ్మదేవుఁడు**
**మునుముట్టి శిరసున మోఁచె శివుఁడు**
**వొనర మూఁడుమూర్తులం దొకఁడు శ్రీవేంకటేశు-**
**డనుమాట యిది తగవవునా లోకులకు ॥కల్ల॥18**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య యేమంటున్నారో వింటే ఆశ్చర్యం కలుగక మానదు. పురుషోత్తముడు శ్రీహరి అని అందరూ యెరిగిన సత్యమే త్రిమూర్తులు సృష్టి, పాలన, లయము బాధ్యతలను నిర్వహిస్తుండగా ఆ బ్రహ్మ పదవి త్రేతాయుగంనాటి ఒక రామ బంటుకు ఒప్పగిస్తారా? మరి ఆ బ్రహ్మ ఆయన నియమించిన ప్రజాపతులు యేమవుతారు? బ్రహ్మ రుద్రులున్న అనేక లోకములు విశ్వరూపుని కడుపులో వుంటే ఆ మూడు మూర్తులలో ఒకడైన బ్రహ్మతో రామబంటుని పోల్చటం తగిన పనియా? అంటున్నారు. అంతెందుకు బ్రహ్మకడిగిన విష్ణుపాదజలమై శివుని శిరసున గంగయై భూమిని చేరి భాగీరథి నదియై మానవులను పునీతులను చేస్తున్నది కదా! గంగ.

**కం॥ కటకట! కల్లలు చెబుదురు**
**ఇటులుండగ బ్రహ్మవొకడు ఇంకొకని కదా?**
**అటుగొలుతురు శివబ్రహ్మలు**
**పటిమల శ్రీవేంకటేశు వదలక వసుధన్**

★ **పటిమల** – మహిమలుగల

**భావోద్దేశ్యము :**

అయ్యయ్యో! అబద్ధాల మాటలు చెబుతున్నారు. గొప్ప గొప్ప పురాణాలనుదహరిస్తారు. లోకులు పలుగాకులన్నట్లు చెల్లుబాటయ్యే అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. ఇది తగిన పనియేనా?

ఇప్పుడు ఒక చతుర్ముఖ బ్రహ్మ సృష్టి బాధ్యత నిర్వహిస్తుంటే, ఆ బ్రహ్మపట్టము ఇంకొక రామబంటుకి ఒప్పగించి, అప్పుడీ మూడు మూర్తులతో అతనిని సమానము చేస్తారా? ఇట్లాంటి మాటలు చెల్లుబాటు అవుతాయా? లోకులు మెచ్చెదరా?

అనేక కైలాసములు, అందులో అనేకమంది రుద్రులు గల బ్రహ్మాండములు అనేకములు విశ్వరూపుడైన విష్ణుమూర్తి ఉదరములోవున్నవి. అటువంటి వానికి ఈ విశ్వాన్ని రక్షించే బాధ్యత ఒప్పగింపబడిందని చదివాం. సంతోషమే. ఇది చాలక వీరుండగా వీరితో సరిగా ఇంకొకరిని చేయుట విజ్ఞులు మెచ్చెదరా? ఇవి దుర్మతుల చెప్పుడు మాటలు కావా?

ఘనుడైన శ్రీహరి సురలకోసం వామనుడై బలినర్థించి మూడడుగులు దానం పుచ్చుకొని, ఒక అడుగుతో (త్రివిక్రముడై) లోకములను, ఇంకొకడుగుతో గగనాన్ని కప్పివేస్తే, వెనువెంటనే బ్రహ్మ తన కమండలంలోని నీటితో ఆ పాదాన్ని కడిగాడు. అది ఆకాశగంగయై ప్రవహించింది. దానిని పరమశివుడు శిరస్సున ధరించి గంగాధరుడైనాడు. కలియుగంలో ఆ ముగ్గురిలో, ఒకడైన శ్రీహరి, శ్రీవేంకటేశుడుండగా, లోకులు నోటికి తోచిన మాటలు చెప్పుట తగునా?

సంఖ్య : II/518 రాగం : లలిత

కీర్తన : కానవచ్చీ గానరాదు కమలాక్ష నీమాయ

**39 కానవచ్చీఁ గానరాదు కమలాక్ష నీమాయ**
**తానే వెంటవెంటఁ దగిలీ నిదివో ॥పల్లవి॥**

**తొల్లి నీవు గలవు తోడనే నేఁను గలను**
**యెల్లగా నీప్రపంచము యింతాఁ గలదు**
**కొల్ల యెద్దు లెప్పటివే గోనెలే కొత్తలైనట్టు**
**చల్లనినేనొకఁడనే జన్మములే వేరు ॥కాన॥**

**వేదములు నాటివే వినుకులు నాటివే**
**ఆదినుండి చదివే నదియే నేను**
**వేదతో వెన్నవట్టి నేయి వెదకఁ బోయినయట్టు**
**దాదాత నా తెలివి యితరుల నడిగేను. ॥కాన॥**

**వైకుంఠమూ నున్నది వరములు నున్నవి**
**యీకడ శ్రీవేంకటేశ యేలితి నన్ను**
**కైకొని పువ్వు ముదిరి గక్కనఁ బిందె యైనట్టు**
**నీకు శరణనఁగాను నేనీడేరితిని ॥కాన॥518**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య కమలాక్షుడైన నారాయణుని మాయను వేనోళ్ళ పొగడుతున్నారు. అది కనబడీ కనబడనట్లుంటుందని హెచ్చరిస్తున్నారు. అనాదిగా ఈ ప్రపంచమూ వున్నది నీవూ వున్నావు, నేనూ వున్నాను. ఎద్దులు ఇదివరకటివే వాటిపై వేసిన ఉడుపులే కొత్తవి. అదేవిధంగా నేక్కొడినే కానీ నా జన్మలే అనేకం. అంతేకాదు, అనాదివేదాలను నేటికీ కొత్తగా చదువుతూనే వున్నాము. ఇక నాతెలివేపాటిది? యెందుకు? శ్రీవేంకటేశ్వరుని శరణాగతితో ఇవన్నీ వుండటం మంచిది కదా!

**చం॥ కనబడు నీదుమాయ మరికానగరాదు మరొక్కమారు పో!**
**వెనుకొని తానువెంటబడి వీడదువో కమలాక్ష మమ్ములన్**
**ఘనశరణార్థులే నిలిచి గట్టిగ బూనితరింతురందుకే**
**ననుకడునేలినావు కద! నామొరలన్ విని వేంకటేశ్వరా!**

**భావోద్దేశ్యము :**

కమలాక్షుడవైన ఓ శ్రీహరీ! నీమాయ యెంత విచిత్రమైనదంటే అది గానవచ్చీ (స్పష్టముగా వున్నట్లనిపించినా, కానరాదు. (స్పష్టము కాదు). ఇదిగో దేవా! నీ మాయ తానే వెంటవెంట దిగిలీ మావెంటబడి తగులు కొంటుంది.

దేవా! తొల్లి నీవు గలవు (నీవు అనాదివి) తోడనే నీతోబాటే నేనూ కలిగితిని. అదే విధంగా నాతోబాటే ఈ ప్రపంచమూ ఆవిర్భవించింది. ఇదీ మనతోబాటే కలిగినది. ఈ యెదులు (అనగా జీవులు) ఎప్పటివే (అనాదివే) జీవులకే ఎద్దులు కట్టుకొన్న (పైన వేసికొనిన) గోనెలు శరీరాలు మాత్రమే కొత్తవి. “నేను” ఒక్కడినే కాని జన్మలే వేఱు.

ప్రభూ! నీవురక్షించిన వేదములు అనాదివే. దానిని ఆలకించినవారూ అనాదులే. నేనుకూడ వాటిని యేనాటినుంచో చదువుతూనే వున్నాను. ఇదెలావుందంటే వెన్న చేతిలోవుంచుకొని నెయ్యికోసం పరులకు చెయ్యి చాచినట్లయింది. నా తెలివి యెలా అఘోరించింది అంటే దాదాత (దాతలకు దాతలైన) నీవుండగా పరులను అడుగుతున్నాను.

నీ వైకుంఠమూ అలాగేవున్నది. నీవిచ్చే వరములూ వున్నవి. ఇప్పుడు ఓ శ్రీవేంకటేశ్వరా! నన్నేలితివి. నా భాగ్యమనే పువుముదిరి పిందె అయింది. నీకు శరణాగతుడనై నేనూ ఈడేరితిని (వర్ధిల్లితిని).

❃

సంఖ్య : I/305 రాగం : సామంతం

కీర్తన : కాలము కాలముగాదు కపటాలే తఱచాయ

**40 కాలము కాలముగాదు కపటాలే తఱచాయ**
**చాలునింక దీనితోడీజాలి మానరే ॥పల్లవి॥**

**పిన్ననాటనుండి తన పెంచినయీ దేహము**
**మున్నిటివలెగాదు ముదిసీని**
**యెన్నికదినాలచేత నెప్పు డేడఁ బడునో**
**కన్నవారిచేతికి గక్కున నియ్యరే ॥కాల॥**

**తోలునెముకలచేత దొడ్డనయాదేహము**
**గాలిచేత దాలిమీఁదఁ గాగీని**
**కీలుగీలు యెప్పు డేడ కింద వీడిపడునో**
**మేలుఁగీడు లేనిచోట మేఁటిఁజేసిపెట్టరే ॥కాల॥**

**కింకపుకిసరుచేత కీడైనదేహము**
**వంకవంకతెరువుల వడిసీని**
**యింక నీవిధిచేత నెప్పు డేడఁ బడునో**
**వేంకటేశుఁ జేరఁ బడవేయఁగదరే ॥కాల॥305**

**ఉపోద్ఘాతము :**

కాలము యెప్పుడూ ఒకేలావుండదు. కలికాలం వచ్చేసింది కదా! దీంట్లో అన్ని కపటములే వుంటాయి. నేను చిన్ననాటినుంచి పెంచిపోషించిన నా దేహం నేను ముదుసలినైపోతున్నానని నామాట వినటంలేదు. తోలు, యెముకలతో నిర్మితమైన ఈ శరీరం కీలుకీలుకి లుకలుకలాడుతుంది. ఏది యెప్పుడు వూడిపడుతుందో తెలియదు. కోపము దాని వికారముతో జరిపే పనులు చేసి కీడు తెచ్చుకొనే ఈ దేహము నన్ను ఏదారిలో తీసికొని పోతుందో యెవరికి తెలుసు? ఇక దీన్ని శ్రీవేంకటపతియే రక్షించాలి.

**తే.గీ॥ కాలమొకరీతి గడువదు కపటులెల్ల**
**తఱచు వర్ధిల్లుదురు, జాలి విఱియబోదు**
**నిలకడేలేని దేహము తోలుతిత్తి**
**వేంకటేశుని కృపలేక కింకపోదు.**

**భావోద్దేశ్యము :**

మనము జీవిస్తున్న ఈ కాలము కాలముకాదు (సరియైన కాలము కాదు). కపట బుద్ధికలవారే తఱచుగా వర్ధిల్లే చెడుకాలము ఇది. దీనితోడి జాలి (దుఃఖము) ఇంకచాలు. దీనితో కలిగే వేదనను మానరే (మానివేయండి).

ఈ దేహముపైనున్న వ్యామోహముతో యెంత వ్యధ చెందుతున్నాను!! చిన్నతనమునుండి తాను పెంచిన ఈ దేహము, మున్నిటివలె (ఇదివరకు మాదిరి) వున్నదా? లేదుకదా! ఇది ముదిసినది (ముసలిదైపోయింది). దినములు లెక్కబెట్టుకొంటూ, ఇది యెప్పుడు యెక్కడ పడిపోతుందో తెలియదు. దీనిని కన్నవాడు (భూమికి తెచ్చినవాడు) పరమాత్మే కదా! మరి ఆలస్యమెందుకు? గక్కన (వెంటనే) ఆ పరంధాముడికి దీనిబాధ్యత ఒప్పజెప్పండి.

దొడ్డ అయినట్టి (ఘనమైన) ఈ దేహము దేనితో చేయబడినది? తోలు, యెముకల సంచి ఇది. గాలిపోసుకొని వెచ్చగా వుండేదాలి (పిడకల పొయ్యి) మీద కాగి సమమైన వేడితో వుంటుంది. దీనినుండి కదిలే కీళ్ళు చాలా వున్నాయి. ఎప్పుడు యే కీలు వూడుతుందో తెలియదు. దీనిని మేలు కీడులకు దూరంగా పరమాత్మ వద్దకు చేర్చండి.

ఈ శరీరమున్నది చూశారా? ఇది యెప్పుడూ, కింకపుకిసరు (కోపము, దానివల్ల కలిగే వికారములతో) కీడు తెస్తూనే వుంటుంది. ఎన్నో రకాలుగా, ఎన్నో చోట్లలో ఇది కృశించిపోతూనేవుంటుంది. ఇది విధి చేతిలో యెప్పుడు పడుతుందో యెవరికీ తెలియదు. ఇప్పటికైన కళ్ళు తెఱచి దీనిని శ్రీవేంకటేశ్వరుని దారిలో పడేయండి. ఇంకో దారిలేదు కదరా!

సంఖ్య : XV/178 రాగం : లలిత

కీర్తన : కైకొనవయ్యా కరివరదా

41 కై కొనవయ్యా కరివరదా
నీకే శరణము నిలింపవరదా ॥పల్లవి॥

పాండవవరదా పద్మజుని యజ్ఞ
గుండములో నున్న గురువరదా
మెండుగ ధ్రువునిని మెచ్చినవరదా
దండము నీ కిదె ద్రౌపది వరదా ॥కై కొన॥

బలివరదా యంబరీష వరదా
వలనగు నక్రూరవరదా
బలిమి నటించిన ప్రహ్లాదవరదా
కొలిచెద మిదె నిన్నుఁ గుచేలునివరదా ॥కై కొన॥

నారదవరదా నమో శుక వరదా
సారస గుణ విభీషణవరదా
కారుణ్య శ్రీవేంకటగిరివరదా
చేరి నుతించెద శ్రీసతి వరదా ॥కై కొన॥

**ఉపోద్ఘాతము :**

పెదతిరుమలయ్య పాడుతున్న శరణాగతిని ఆస్వాదించండి. హరి నామ సంకీర్తన ముఖ్యోద్దేశ్యం నాలుకకు అలవాటైనది సబ్‌కాన్షస్ స్టేట్‌లో మనస్సు గుర్తిస్తుందని ప్రతీతి. అంతిమ క్షణంలో నోరు పెల్లగిలి నారాయణ అనలేనివారు మనస్సులో అనుకొన్నా సద్గతినిస్తానని స్వామి అభయం. చిట్టచివరిదాకా హరిశరణాగతి కోరేవారు తుచ్ఛమైన ప్రాపంచిక విషయాల గురించి ఆలోచించరు. భగవంతుడు మనిషికి ఒక్కడికే ఆ 'స్మరణ' ఇచ్చాడు. ఇటువంటి కీర్తనల అంతిమ లక్ష్యమదే. లేకపోతే ఆయనకి వేయి నామాలెందుకు? రూపమేలేని వానికి పేరేమిటి? అన్ని రూపాలూ శ్రీహరివే, అన్నిపేర్లూ శ్రీహరివే. చివర శ్రీసతి వరద అని వుండాలి.

**సీ॥ అక్రూర దివిజేంద్ర, అంబరీష వరద!**
**ప్రహ్లాదుగా చిన బలివరదుడ!**
**పాండుసుతులను, ద్రౌపదిగాచిన వరద!**
**నారద, శుక, ధ్రువ, కరి వరదుడ!**
**అలవిభీషణుని, కుచేలుని గాచిన**
**'విధి'యజ్ఞ సంభవావేలనుతులు**
**శరణన్న వారిని కరుణించు వరదుడా!**
**కైకొను మమ్మెల్ల నీకు ప్రణుతి**

**ఆ.వె॥ వేంకటాద్రి మీద వేడిన వరములు**
**శ్రీసతీ వరదుడ సిరిప్రదాత!**
**చేరి నుతిని సేయ శీఘ్రమే బ్రోతువు**
**కన్నవారికెల్ల కనులపంట !**

★ **విధి** – బ్రహ్మదేవుడు

**భావోద్దేశ్యము :**

ఓ కరివరదా! (గజేంద్ర రక్షకా!) కైకొనవయ్యా! (నన్ను స్వీకరించవయ్యా!) ఓ నిలింపవరదా! (దేవతల రక్షకా!) నీకే శరణుజొచ్చితినయ్యా!

ఓ పాండవ రక్షకా! పద్మజుని (బ్రహ్మదేవుని) యజ్ఞ గుండము ఆవాసమైన వరప్రదాతా! మెండుగ (బాగుగా) ధ్రువుని మెచ్చి ధ్రువమండలాధిపత్యము నొసగిన వరప్రదాతా! ఓ ద్రౌపదీమాన సంరక్షకా! నీకే శరణు తండ్రీ!

ఓ బలిచక్రవర్తి శరణుప్రదాతా! ఓ అంబరీష రక్షకా! నీ ప్రభావము చూపి అక్రూరుని శరణాగతి పొంది రక్షించిన దేవా! శరణు. బలిమి నటిం(తిం)చిన (నీవేనా అండ అని మ్రొక్కిన) ప్రహ్లాదుని నీడవలె వెంటవుండి రక్షించిన వరదా! పిడికెడు అటుకులకు అనంతమైన సిరి సంపదలిచ్చి కుచేలుని అడుగకనే కాపాడిన శరణాగత వత్సలా! నీకు ప్రణతులు.

ఓ నారద వరదా! శుకయోగి వరప్రదాతా నమోనమో. సత్యగుణ దీపకుడైన విభీషణుని గాచిన రామ! శరణు. కరుణాస్వరూపుడవై శ్రీవేంకటగిరిని నీ ఆవాసము చేసికొనిన తిరుమల నాయకా! శరణు. ఓ శ్రీపతి (సతి) శ్రీలక్ష్మికి ఉరముపై నివాసమిచ్చిన వరదా! ఇదే నీకు నా శరణాగతి.

సంఖ్య : IV/326 రాగం : ముఖారి

కీర్తన : చవినోర కేడదెత్తు సంపదేడదెత్తు వీని

**42 చవినోర కేడదెత్తు సంపదేడదెత్తు వీని**
**సవరించుటే నా సంపదిది కాదా** ॥పల్లవి॥

**పచ్చడా లెక్కడ దెత్తు పట్టుచీరలేడ దెత్తు**
**వెచ్చనిండేండ్ల దెత్తు వెంట వెంటను**
**తెచ్చిన ఈ పచ్చడము దేహమిది వెంటవెంట**
**వచ్చుగాక తన్నుదానె వద్దనగా వచ్చున** ॥చవి॥

**దొరతనమేడ దెత్తు దొడ్డసొమ్ములేడ దెత్తు**
**ఎరవున సిరుల నే నేడ దెత్తు**
**నెరపున నేనెవ్వరిని వేసవింతజాలక**
**దరిచేరుటే దొరతనమిది కాదా** ॥చవి॥

**తోడబుట్టువుల నేడ తోడ దెత్తు చుట్టాల**
**నేడ దెత్తు సుతుల పొందేడ దెత్తును**
**వేడుకైన పొందు శ్రీ వేంకటేశు తలచుటే**
**ఈడులేని బంధుకోటి ఇతడే కాడా** ॥చవి॥

**ఉపోద్ఘాతము :**

తొంబదియేండ్లుపైన జీవిస్తే ఒక సత్యం తెలుస్తుంది. నోటికి రుచి వుండదు, ఒకనాడు మనవి అనుకొన్న సంపదలు వుండవు. మనం కట్టిన చీనీ చీనాంబరాలుండవు. మన దొరతనము, ఐశ్వర్యమూ వుండదు. మనవారు అనుకొన్న తోబుట్టువులు, సుతులు, బంధుకోటి యెవ్వరూ వుండరు. నీవు కావాలనుకొనేదేదీ వుండదు. అప్పుడు శ్రీహరిని స్మరించుట నేర్చితే వాడే నీదిక్కూ మొక్కూ అంటున్నారు అన్నమయ్య.

ఉ॥ **ఎక్కడ నుండి దెత్తు హరి? యెంచిన చీరెలు పచ్చడంబులన్**
**ఎక్కడనుండి దెత్తు దొర యేనని సొమ్ములు దొడ్డవౌ సిరుల్**
**ఎక్కడ నుండి దెత్తునను యెకుడు కొల్చిన బంధువర్గమున్**
**దిక్కిక వేంకటాధిపుడె దీటగు సంపదముక్తి దాతయున్.**

**భావోద్దేశ్యము :**

ఈనాడు నానోరు చవిజచ్చిపోయింది. దీనికి ఆ నేర్పు యెలా తెప్పించగలను? ఈనాడు నేను సంపాదించినదేదీ లేదు. ఒకవేళ వున్నా నాకాసంపద నిరుపయోగం. నా లొసుగులను గుర్తించి సవరించుకోగలగుతున్నాను. నిజానికి అదే నాకు మిగిలిన సంపద.

పచ్చడాలు (పట్టు అంగవస్త్రములును) పట్టు చీరెలను నేనీనాడు యెక్కడనుండి తీసికొని రాగలను? వెచ్చదనమునిచ్చే భవంతులనెక్కడనుండి త్వరగా తెచ్చేది. నిజానికి నేను నాతో తెచ్చుకొన్న పచ్చడము నాదేహమే. ఇదొక్కటే ఇన్నాళ్ళయినా నన్ను భరించి నాతోనే వున్నది. ఈరోజు ముసలిదైపోయిందని దీనిని వద్దనవచ్చునా?

ఒకనాడు నేను దొరతనము వెలగబెట్టాను. నేను మోయలేనన్ని ఆభరణాలను ధరించాను. కాని నేడు నాతో అవేవీ లేవు. వాటిని నేనీనాడు యెక్కడనుంచి తెచ్చేది? ఆ సిరులన్నీ యెక్కడికి పోయాయి? కాని నేనీనాడు యెవ్వరిని ప్రాధేయపడి వారి వాకిటిముందు పడిగాపులు కాయను? ఒక్క దైవాన్ని తప్ప ఎవ్వరినీ యాచించను. ఇది దొరతనము కాదా చెప్పండి.

నేడు నాతోబుట్టువులు లేరు, చుట్టాలు ఆప్తులు అనుకొన్న వారెవ్వరూ లేరు. నాసుతుల పొందుకూడా లేదు. ఇదంతా ఈనాడు యెక్కడనుంచి తెచ్చేది? అసలు నాకెవ్వరి పొందూ అక్కరలేదు. శ్రీవేంకటేశ్వరుడే నా దిక్కని తలుస్తాను. ఎల్లకాలమూ తోడువుండే ఈడులేని బంధువు ఈ దేవుడే కదా!

సంఖ్య : IV/292 రాగం : మధ్యమావతి

కీర్తన : చిత్తజగురుడవో శ్రీనరసింహా

**43 చిత్తజగురుఁడ వో శ్రీ నరసింహా**
**బత్తిసేసేరు మునులు పరికించవయ్యా ॥పల్లవి॥**

**సకలదేవతలును జయవెట్టుచున్నారు**
**చకితులై దానవులు సమసి రదె**
**ఆకలంకయగు లక్ష్మి యటు నీ తొడపై నెక్కె**
**ప్రకటమైన నీ కోపము మానవయ్యా ॥చిత్త॥**

**తుంబురునారదాదులు దొరకొని పాడేరు**
**అంబుజాసనుఁ దభయమడిగీ నదె**
**అంబరవీధి నాడేరు యచ్చరలందరుఁ గూడి**
**శంబరరిపుజనక శాంతము చూపవయ్యా ॥చిత్త॥**

**హత్తి కొలిచే రదె యక్షులును గంధర్వులు**
**చిత్తగించు పొగడేరు సిద్ధసాధ్యులు**
**సత్తుగా నీ దాసులము శరణు చొచ్చితి మిదె**
**యిత్తల శ్రీవేంకటేశ యేలుకొనవయ్యా ॥చిత్త॥292**

**ఉపోద్ఘాతము :**

శ్రీ నృసింహ దేవుని కీర్తిస్తున్నారు అన్నమయ్య. ఆయన చిత్తజగురుడైన విష్ణువే అని భావించి మునులు నిన్ను భక్తితో కొలుస్తున్నారు వారిని ఆదరించవయ్యా! అని అడుగుతున్నారు. దానవులా రూపాన్ని చకితులై చూస్తుంటే దేవతలు జయ జయధ్వానాలు చేశారట. నారదతుంబురులు గానం చేస్తుంటే అప్సరసలు ఆడినారట. శంబరాసురుని శత్రువైన మన్మథుని తండ్రీ! శాంతము చూపవయ్య అంటున్నారు. మేము నీ దాసులము నీ శరణుచొచ్చినాము. మా తిరుమల వేంకటపతివై యేలుకోవయ్యా! అంటున్నారు. ప్రతిపదార్థం వివరిస్తే ఎలా వుంటుందో చూడండి

ఉ॥ **చిత్తజు తండ్రివైనహరి శ్రీ నరసింహుడ! చూడుమయ్యరో**
**బత్తిని సేసిరీమునులు, భక్తులు, యోగులు, సిద్ధసాధ్యులున్**
**హత్తుచు లక్ష్మి అంకమున, అచ్చరలాడిరి పారదైత్యులున్,**
**ఇత్తల వేంకటాధిపుడ! యేలుము దాసుల నీశరణ్యులన్.**

**భావోద్దేశ్యము :**

చిత్తజ గురుడు (మన్మథుని తండ్రివైన) ఓ శ్రీ నరసింహా! మునులు బత్తిసేసేరు (భక్తితో నిన్ను కొలిచేరు). వారిని పరికించవయ్యా! (చూచి కరుణించవయ్యా!)

అదిగో నీపై పరిపూర్ణ విశ్వాసంగల నీ దాసుల మనోనేత్రాలకు వారందరూ కనబడుతూనే వున్నారు. దేవతలందరూ జయహో! జయహో! అని జయజయ ధ్వానాలు చేస్తున్నారు. దానవులందరూ నీ నరసింహ రూపమునకు చకితులై (అచ్చెరువంది) అదేసమసిరి (అక్కడికక్కడే మరణించారు). అదే, అకలంక (నిష్కళంకమైన) ఆదిలక్ష్మి ఆనందంతో నీ ఎడమతొడపై కూర్చొనివున్నది. ఇప్పుడైనా ప్రస్ఫుటమైన నీ కోపమును మానవయ్యా!

మధురగాయకులైన తుంబురుడు, నారదుడు దొరకొని (అతిశయించి) నీ స్తోత్రాలు పాడుతున్నారు. అంబుజాసనుడు (పద్మాసనుడైన బ్రహ్మ) నిన్ను అభయమును వేడుచున్నాడు. అచ్చరలో (అప్సరసలు) అంబరవీథి (ఆకాశమార్గము) నృత్యము చేస్తున్నారు. శంబరరిపుజనకా (శంబరాసురుని వైరి అయిన మన్మథుని తండ్రీ) కాస్త శాంతము వహించవయ్యా!

ఇదిగో యక్షులు, గంధర్వులు హత్తి (పూనికతో) నిన్ను పూజిస్తున్నారు. సిద్ధులు, సాధ్యులు నిన్ను కీర్తిస్తున్నారు. వారిని మన్నించు. ఇదిగో సత్తుగా (సాధువులైన) నీ దాసులము నిన్ను శరణుచొచ్చినాము. ఇత్తల (ఇక్కడ తిరుమలలో) శ్రీవేంకటేశ్వరుడవైన దేవా! మమ్ము యేలుకోవయ్యా!

సంఖ్య : VII/407 రాగం : శ్రీరాగం

కీర్తన : చిత్తజువేడుకొనరే చెలియలాల

**44 చిత్తజు వేఁడుకొనరే చెలియలాల**
**తత్తరించి పతిమీఁది తలపోఁతనున్నది ॥పల్లవి॥**

**అతివపై మదనుఁడు అనలాస్త్రమేయఁబోలు**
**కతలుగ విరహాగ్నిఁ గాఁగీనదే**
**యితవుగా వరుణాస్త్రమేయఁబోలునప్పటిని**
**తతిఁ జెమటవానలఁ దడియుచునున్నది ॥చిత్త॥**

**అమరగ నంతలో వాయువ్యాస్త్రమేయఁబోలు**
**వుమరఁబడి నిట్టూర్పులొగి రేఁగెను**
**జమళిఁ గూడఁగ నట్టె శైలాస్త్రమేయఁబోలు**
**భ్రమసి చనుఁగొండలు బాయిటఁ గాన్పించెను. ॥చిత్త॥**

**మునుకొని పంతాన సమ్మోహనాస్త్రమేయఁబోలు**
**మనసు పరవశాన మరపందెను**
**అనిశము రక్షగా నారాయణాస్త్రమేయఁబోలు**
**ఘన శ్రీవేంకటేశుఁడు కాఁగిటిలోఁ గూడెను. ॥చిత్త॥407**

**ఉపోద్ఘాతము :**

మామూలు వాగ్గేయకారులు ఇటువంటి కీర్తననావిష్కరించలేరని నా నమ్మకం. వరప్రసాది అన్నమయ్యకే సాధ్యమిది. ఏదైనా దైవాన్ని సన్నుతిచేయటమో, ఒక గాధను ఉటంకిస్తూ ఆ దైవం యొక్క గొప్పతనం కీర్తించటమో, శరణాగతితో నుతించటమో, కాపాడమని ప్రార్థించటమో చాలామంది వాగ్గేయకారులు చేస్తారు. కాని ఈ విధంగా కీర్తన, అందులోనూ శృంగార కీర్తన చెప్పటం అన్నమయ్యకే సాధ్యం. ఆ కల్పనా వైచిత్రి నూతన అంశమునెన్నుకోవటం సామాన్యులు అతి ప్రయత్నంతో సాధిస్తే ఆచార్యులవారికి అవి ఆశువుగా వస్తాయి. ఇదేమి చిత్రమో ఈ మన్మథుడు పతికై తత్తరపడుతుంటే 'నీలోత్పలం' వంటి సుమశరాలుకాక ఆగ్నేయాస్త్రం, వారుణాస్త్రం, వాయువ్యాస్త్రం, శైలాస్త్రం, సమ్మోహనాస్త్రం అనే దివ్య మారణాస్త్రాలను వేస్తున్నాడీ మారుడు!! వీనికేమి దుర్బుద్ధి?

**కం॥ చిత్తజు వేడరెచెలులూ!**
**తత్తరతో పతినిగూర్చి తలపోతలతో**
**ఇత్తరి ఈచెలి రగులగ**
**కొత్తగ అస్త్రముల వేసె కూడగ విభునిన్**

**భావోద్దేశ్యము :**

ఓ చెలులారా! మీరంతా చిత్తజుని (మనస్సులలో జన్మించే మన్మథుని) వేడుకొనండమ్మా! వాడెంత గడుగ్గాయి!! ఒకపక్క తన పతి తలపులతో ఈ తరుణి తత్తరించిపోతుంటే (వేదన చెందుతుంటే) వీడు చంపకము, నీలోత్పలమువంటి తన కుసుమాస్త్రములను కాకుండా దానవసంహారానికి శ్రీహరివేసినట్లు ఆగ్నేయాస్త్రం, వారుణాస్త్రం వంటి దివ్యాస్త్రాలను వేస్తున్నాడు.

ఆ మదనుడు అనలాస్త్రము (ఆగ్నేయాస్త్రం) వేసి ఈ సతిని విరహాగ్నిలో మలమల రగుల్చుచున్నాడు. ఈ భావజుడు వారుణాస్త్రం సంధించి వేసెను కాబోలు ఈ 'చేమ' చెమటల వానలో తడిసి ముద్దయి పోయినది. వీడికి హితవేదో అహితవేదో తెలియదా యేమే?

అంతలోనే, ఆ కందర్పుడు ఆమెపై వాయువ్యాస్త్రం సంధించి వేశాడు కాబోలు ఉమరబడి (వేడిగామండే) నిట్టూర్పులతో ఈ సుకుమారి విపరీతంగా వేగినది. ఈ భార్యాభర్తలు జంటగా కూడియుండగా ఈ మారునికి భ్రమకలిగి ఆమె చనుగొండలను జూచి బయటకు కన్పించాయని ఆమెపై శైలాస్త్రం వేశాడు. అది కొండలను పిండిచేయగల దివ్యాస్త్రం. వీడెంత రాలుగాయి!!

ఇంకా ఈ పంచశరుడు, పంతం మానక ఈ పడతిపై సమ్మోహనాస్త్రం వేశాడు కాబోలు అమెకు పరవశత్వం కలిగి తన చుట్టూ వున్న ప్రపంచాన్నే మరచింది. చివరికి కామదహనం గుర్తుకువచ్చిందేమో నారాయణాస్త్రం వేసి ఆమె నారాయణుడైన శ్రీవేంకటేశ్వరుని కౌగిట కరుగునట్లు చేశాడు. ఇంతకంటే యేమి చెప్పను స్వామీ!

సంఖ్య : I/356 రాగం : లాహిరి

కీర్తన : చెలినేడు తానేమి సేయునమ్మ

**45 చెలి నేఁడు తా నేమి సేయునమ్మ**
**చెలి యేమిసేయు నీచెలు లేమి సేయుదురు**
**చెలువై నవిభుమేనిచెలు వింత సేయఁగా** ॥పల్లవి॥

**సతి నేఁడు బంగారుచవికెలోఁ జిత్రంపు-**
**గతు లెంత చూపినఁ గడకంటఁ జూడదు**
**అతనిఁజూచినమంచియబ్బురపుఁజూపులు**
**అతనివెంటనే పోయ నటుగాఁబోలును** ॥చెలి॥

**తేనియ లూరేటిమంచితియ్యనిమాటలు మంత్ర-**
**గానములుగా వినుపించి కడువేసరితిమి**
**వానిమాటలు విన్నవలనైన ముదమున**
**వీనులు ముద్రించినవిధముగాఁ బోలును** ॥చెలి॥

**నిచ్చళపుమోమున నెయ్యము దైలువారె**
**బచ్చనచేఁతలు గుబ్బలపై నిండనొప్పెను**
**అచ్చపువేడుక వేంకటాద్రీశుఁ డీరేయి**
**నెచ్చెలికి నిచ్చినట్టినేరుపు గాఁబోలును** ॥చెలి॥**359**

**ఉపోద్ఘాతము :**

ఈ శృంగారకీర్తనలో అన్నమయ్య యేమంటున్నారంటే శ్రీదేవి స్వామి అందాన్ని అబ్బురముతో జూచినందువల్ల ఆ చూపులు ఆయనెటువెళ్తే అటుపోతున్నవట. చెలికత్తెలేమి మాట్లాడినా ఆ దేవికి వినబడుటలేదు. కాని స్వామి తీయని మాటలు వింటూ పరధ్యానంలో కూడా ఆయన చెవ్వులనే చిత్రించినదట శ్రీదేవి. నిశ్చలమైన ఆ స్వామి వదనంలో స్నేహం ప్రతిఫలిస్తున్నా ఆయన చేతులు వూరకుండక యేమేమో చేస్తున్నాయట. ఔరా!!

**ఆ.వె॥ చెలియనేడుయేమిసేయున్ గదోయమ్మ?**
**చెలులు సేతురేమి? చెలువమైన**
**విభునిమేని చెలువువింతసేసెను, చెలి**
**వేంకటేశు గూడు వేడ్కలేమొ!!**

**భావోద్దేశ్యము :**

శ్రీదేవి చెలికత్తెలిలా అనుకొంటున్నారు. ఈ చెలియ నేడు తానేమి చేయునమ్మా? ఇదిలా వుంటే ఈ చెలియ చెలికత్తెలేమిచేస్తారో ఊహాతీతముగానున్నది. చెలులైన (స్నేహశీలుడైన) ఈ విభుని మేని చెలువు (శరీరపు అందము) ఇదంతా చేసింది. మన చేతిలో యేమున్నది? చెప్పండమ్మా!

ఈ సతి నేడు బంగారు చవికెలో (మండపములో) మనము యెన్ని చిత్రవిచిత్రమైన వేషములను వేసినా క్రీగంటనైన చూచుటలేదు. ఆ శ్రీనివాసుని చూచిన అబ్బురంపు చూపులతో (ఆశ్చర్యమునొందిన చూపులు) ఆమె ప్రమేయం లేకనే ఆతని వెంట పరుగిడుచున్నవి.

తేనెలు చిలికే తీయని మాటలను, మంత్రముగ్ధులను చేయు మంచి పాటలను వినిపించి యెంతో విసిగిపోయామమ్మా! తన విభుని తీయని మాటలను విన్న సాటిలేని సంతోషము ముప్పిరిగొన్న ఈ దేవి పరధ్యానంలో కూడా స్వామి చెవ్వులనే తాను చిత్రించినది.

స్వామి నిశ్చలమైన ముఖమున స్నేహము చిందులు వేస్తున్నది. చిత్ర విచిత్రమైన చేతలతో నిండు గుబ్బలు అతిశయించినవి. అంతులేని వేడుకలతో శ్రీవేంకటేశ్వరుడు ఈ రేయి తన నెచ్చెలికి చూపిన నేర్పులు కాబోలు వారి పరవశము పరాకాష్ట నొందినది.

సంఖ్య : II/496 రాగం : శంకరాభరణం
కీర్తన : చేపట్టి మమ్ము గావు శ్రీనరసింహా

**46 చేపట్టి మమ్ముఁ గావు శ్రీనరసింహా నీ-**
**శ్రీపాదములే దిక్కు శ్రీనరసింహా ॥పల్లవి॥**

**చెలఁగువేయిచేతుల శ్రీనరసింహా**
**చిలికేటినగవుల శ్రీనరసింహా**
**సిలుగులేనిమంచి శ్రీనరసింహా నీ -**
**చెలిఁ దొడెక్కించుకొన్న శ్రీనరసింహా ॥చేప॥**

**క్షీరసముద్రమువంటి శ్రీనరసింహా దైత్యుఁ**
**జీరినవజ్రపుగోళ్ల శ్రీనరసింహా**
**చేరి ప్రహ్లాదునిమెచ్చే శ్రీనరసింహా నుతిం-**
**చేరు దేవతలు నిన్ను శ్రీనరసింహా ॥చేప॥**

**శ్రీవనితతో మెలపు(గు?) శ్రీనరసింహా**
**చేవదేరె నీమహిమ శ్రీనరసింహా**
**శ్రీవేంకటాద్రిమీఁది శ్రీనరసింహా సర్వ-**
**జీవదయాపరుఁడ వో శ్రీనరసింహా ॥చేప॥496**

**ఉపోద్ఘాతము :**

కర్ణపేయమైన భజన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఇది శ్రీ నరసింహుని ప్రస్తుతి. నీ శ్రీపాదములే మాకు దిక్కు, మమ్ము చేకొనవయ్యా! అని వేడుకొంటున్నారు. భజనలో వివరించే చరణము వుండదు. కానీ అన్నమయ్య ప్రత్యేకతేమంటే ఏదో ఒక చరణంలో మెలిక వుంటుంది అంతే. "సిలుగులేని మంచి" అంటే యేమిటో ఆలోచించి చూడండి. గూఢార్థముల ప్రత్యేకత ఇంకేమంటే తరచి చూచినకొద్దీ వాటి అందం అవగతమవుతుంది. నరసింహునికి, క్షీరసముద్రమునకు పోలికయేమిటి. అదే తాళ్లపాక అవతారమూర్తి ప్రత్యేకత.

**కం॥ చేపట్టి మమ్ముగావుము**
**శ్రీపాదము దిక్కుమాకు శ్రీనరసింహా!**
**నీపడతిచెలగ దొడపై**
**మా పాలిటి 'పరుసవేది' మహితిరుమలలో**

**భావోద్దేశ్యము :**

ఓ శ్రీనరసింహుడా! మమ్ము చేపట్టి (స్వీకరించి) కావుము (రక్షించుము). మాకు నీ శ్రీపాదములే (మంగళప్రదమైన పాదములే) దిక్కు ప్రభూ!

ఓ దేవదేవా! నీకు వేయి చేతులు (అనేక కనబడని హస్తములు). అవి హిరణ్యకశిపుని కదలకుండా నీ తొడపై నొక్కి పట్టుటకు. అంతా ఉగ్రమూర్తివని భీతిల్లిన నీవు మావంటి భక్తుల కోసం నవ్వులొలికిస్తున్నావు. స్వామీ! వారికి నీవు "సిలుగు" (ఉపద్రవము) తొలగించు మంచివాడవు. ఓ నరసింహా! చెలిని (నీ శ్రీదేవిని) తొడపై కూర్చోబెట్టుకున్న ప్రేమస్వరూపుడవు.

దేవా నీవు క్షీరసాగరమువంటివాడవు. (అనగా కష్టపడి సేవించువారికి అనేక వైభవములను ప్రసాదించువాడవు). ఓ నరసింహా! వజ్రములవలె కఠినమైన గోళ్ళతో హిరణ్యదైత్యుని జీరినావు (చీల్చివేసినావు). కాని శరణాగతుడై నీకు మొక్కిన వాని పుత్రుడైన ప్రహ్లాదునిపై వాత్సల్యము చూపినావు. అందుకే కంపితులైన దేవతలంతా నీకు మ్రొక్కినారు, నరసింహా!

శ్రీవనిత వెలసిన ఓ శ్రీనరసింహా! నీ మహిమలన్నీ చేవదేరి (అతిశయించినవి). శ్రీవేంకటాద్రిపై దేవునివి నీవే. ఓ శ్రీనరసింహా! నీవు సర్వజీవుల పట్ల దయామయుడవు.

సంఖ్య : IV/297 రాగం : శ్రీరాగం

కీర్తన : చేరి కొల్వరో యాతడు శ్రీదేవుడు

**47 చేరి కొల్వరో యాతఁడు శ్రీదేవుఁడు**
**యీరీతి శ్రీవేంకటాద్రి నిరవైన దేవుఁడు ॥పల్లవి॥**

**అలమేలుమంగ నురమందిడుకొన్నదేవుఁడు**
**చెలఁగి శంఖచక్రాలచేతిదేవుఁడు**
**కలవరదహస్తముఁ గటిహస్తపుదేవుఁడు**
**మలసీ శ్రీవత్సవనమాలికలదేవుఁడు ॥చేరి॥**

**ఘనమకరకుండలకర్ణములదేవుఁడు**
**కనకపీతాంబర శృంగారదేవుఁడు**
**ననిచి బ్రహ్మాదుల నాభిఁగన్నదేవుఁడు**
**జనించెఁ బాదాల గంగ సంగతైనదేవుఁడు ॥చేరి॥**

**కోటిమన్మథాకారసంకులమైనదేవుఁడు**
**జూటపుఁగిరీటపుమించులదేవుఁడు**
**వాటపుసొమ్ములతోడి వసుధాపతిదేవుఁడు**
**యీటులేని శ్రీవేంకటేశుఁడైనదేవుఁడు ॥చేరి॥297**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని ప్రస్తుతిస్తున్నారు.

సిరిప్రదాతయైన దేవుడితడే ఈ తిరుమల శిఖరాలపై స్థిరపడ్డ దేవుని కొలువుడయ్యా అని నచ్చజెబుతున్నారు. స్వామి సొగసును వైభవాన్ని వేనోళ్ళ కీర్తిస్తున్నారు. కోటి మన్మథాకారుడని సాకారుడైన మూర్తి అందాన్ని పొగడుతున్నారు. జూటపు కిరీటముతో మించిన దైవము అనంగానే నా బోటివారికి గొంతులో పచ్చి వెలగకాయ పడ్డట్లయింది. అదీ అన్నమయ్య భాషాపటిమ. ఈటులేని దేవుడట. ఏడేళ్ళ క్రిందట అన్నమయ్య కీర్తనలను విశ్లేషించండి అని నా సన్మిత్రులు సలహా ఇస్తే తెలుగు కీర్తనలకి వివరణమేమిటన్న నేనెంత శుంఠనో ఆనాడు తెలియలేదు. అయినా, నాపై కృపతో నాకే ఆ పని ఒప్పజెప్పాడు. నన్ను ఆయన దారిలో పెట్టాడు.

**ఆ.వె॥ చేరి కొల్వుడయ్య! శ్రీదేవుడీతండె**
**వేంకటాద్రిపైన వెలయువాడు**
**పరమపురుషు సొబగు వర్ణించి శరణొంద**
**యీటులేనివాడు యెలమిగాచు.**

**భావోద్దేశ్యము :**

మనము దర్శించుచున్న ఆతడే శ్రీపతియైన దేవుడు. భక్తులారా మీరంతా చేరి యీతనిని కొలవండి. ఇతడే శ్రీవేంకటగిరి మీద నెలకొనిన దేవుడు. ఈ రీతి వెలసిన ఇతడు శ్రీవేంకటేశ్వరుడు.

ఈ దేవుని ప్రాముఖ్యతను వివరిస్తాను వినండి. ఈయన తన భార్య అలమేలుమంగను ఉరముపై నుంచుకొనిన దేవుడు. తన చతుర్భుజములలో రెండిటియందు శంఖ చక్రములను ధరించిన దేవుడు. మిగిలిన రెండిటిలో ఒకదానిని వరద ముద్ర జూపుటకు, మరొకటి అభయహస్తముగా కటిపై వున్నవాడు. శ్రీవత్సమనే పుట్టుమచ్చ, తులసి వనమాల ధరించియున్నాడు.

రెండు చెవ్వులకు మకరకుండలములను ధరించినాడు. ఈ శృంగారరాయుడు ధరించేది కనకవర్ణముగల పట్టుబట్ట. ఈతని మానస పుత్రుడు మారుడు. సృష్టికర్త చతుర్ముఖ బ్రహ్మ నాభికమలంనుంచి పుట్టిన పుత్రుడు. ఈయన పాదమునుండి పుట్టినది సురగంగ. ఆమెకు అనేకవరములనిచ్చి పునీతను గావించాడు.

కోటిమన్మథుల సౌందర్యాన్ని పుణికిపుచ్చుకొనిన దేవుడితడు. జూటపు కిరీటములో (ఎత్తైన కిరీటంతో) యెక్కుడైన దైవమీతడే. దివ్యాభరణములు పెక్కులు ధరించిన భూవల్లభుడితగాడే. ఈ తిరుమల శ్రీవేంకటేశ్వరుడు, యీటులేని (సాటిలేని) ఇతనినే శరణనెదను గాక!

సంఖ్య : IV/307 రాగం : వరాళి

కీర్తన : జీవు డించుకంత చేత సముద్రమంత

**48 జీవుఁ డించుకంత చేఁత సముద్రమంత**
**చేవెక్కి పలుమారుఁ జిగిరించీ మాయ ॥పల్లవి॥**

**కోపములైతేను కోటానఁగోట్లు**
**దీపనములైతేను దినకొత్తలు**
**చాపలబుద్ధులు సమయని రాసులు**
**రాపాడీఁ గడవఁగరాదు వోమాయ ॥జీవుఁ॥**

**కోరికలైతేను కొండలపొడవులు**
**తీరనిమోహాలు తెందేపలు**
**వూరేటిచెలమలు వుడివోనిపంటలు**
**యీరీతినే యెలయించీని మాయ ॥జీవుఁ॥**

**మునుకొన్నమదములు మోపులకొలఁదులు**
**పెనఁగినలోభాలు పెనువాములు**
**నినుపై శ్రీవేంకటేశ నీదాసులనంటదు**
**యెనసి పరులనైతే యీఁదించీ మాయ ॥జీవుఁ॥307**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య తత్త్వ బోధను అర్థంచేసికొనే ప్రయత్నం చేద్దాం. జీవి అణుమాత్రం వుంటాడు. కానీ, వాడి చేతలు మాత్రం, సముద్రమంత వుంటాయి. వాడంతట వాడికి 'చెడ్డ'దనేది లేకపోయినా శ్రీహరి మాయలో చిక్కుకుపోయి, అరిషడ్వార్గాలకు లొంగిపోయి మితిలేని కోపము, తీరని ఆకలి, చావని చపలత్వము, కొండలవంటి కోర్కెలు, తీరని మోహము, నశించని చెలమల్లాంటి ఆశ, పెద్ద కుప్పవంటి మోహము, కట్టిపడవేసే తాళ్ళవంటి లోభము నిరంతరం జీవులను వేధిస్తూనే వుంటాయి. మరి ఇది అందరికీ తప్పని బాధలా? కాదు ఎవరైతే శ్రీ వేంకటేశ్వరుని శరణని ఆయన దాసులౌతారో వారికి వీటి పీడవుండదు.

**ఉ॥ మాయల జిక్కి క్రోధమను మంటల గాలును జీవుడెన్నడున్**
**మాయల జిక్కి కోరికల మగ్గను శాంతినెరుంగబోడికన్**
**మాయలజిక్కి హెచ్చు మదమచ్చరమోపుల నీల్గు వీడకన్**
**రాయడు వేంకటేశు కృపరంజిలు దాస్యము స్వీకరించుచున్**

**భావోద్దేశ్యము :**

జీవుని పరిమాణం ఇంచుకంత (కొంచెమే) అణుమాత్రమై దేహంలో అన్నిచోట్లా వుంటుంది. కాని దాని చేతలు మాత్రం సముద్రమంత చేవెక్కి (బలవంతమైన) ఈ మాయ, పలుమారు (ఎన్నో రకములుగా) చిగురిస్తుంటుంది.

ఈ జీవి శరీరం రాగానే ముందుగా కామక్రోధాలు ఆవహిస్తాయి. ఈ కోపము కోటానుకోట్ల విధములుగా వుంటుంది. వీడి దీపనమునకు (ఆకలికి) అంతు అంటూ వుండదు. ప్రతిదినమూ కొత్తగా ఆకలి పుడుతూనే వుంటుంది. వీడికి చిత్తచాంచల్యము కూడా యెక్కువే. ఆ మాయను యెట్టి రాపిడికి గురిచేసినా పోదు.

ఈ జీవుడి కొండంత పొడవైన (ఎత్తైన) కోరికలుంటాయి. ఏనాటికీ తీరని మోహము తెందేపులై (అపారమై) వుంటుంది. చెలమల్లో నీరు వూరినట్లు అవి ఊరుతూనే ఉంటాయి (నశించవు). ఇదంతా మాయ వలననే జరుగుతుంది. అది యెన్నటికీ నశించదు.

ఈ జీవుడికి ఇంకొక పీడ, మునుకొన్న (అతిశయించిన) మదము. దానికి తక్కువ అయ్యే గుణమే లేదు. వీనికి లోభము అనే నీచమైన గుణము పెనవేసికొని వుంటుంది. అది కుప్పలు తెప్పలుగా చెడు చేస్తూనే వుంటుంది. సమృద్ధిగా కరుణ వున్న ఓ శ్రీవేంకటేశ్వరా! నీ నిజదాసులను మాత్రం ఆ నీచగుణాలు అంటలేవు. ఆ మాయలపరులనెంత ఈదించినా, ఈ దాసులజోలికి రాదు.

సంఖ్య : IV/296 రాగం : బౌళి

కీర్తన : జీవుడూ నొక్కటే చిత్తమూ నొక్కటే

**49 జీవుఁడూ నొక్కటే చిత్తమూ నొక్కటే**
**వేవేలు మాయలచే వెలయుఁ గొన్నాళ్లు ॥పల్లవి॥**

**వొక్కటే దేహము వూరకే బాల్యావస్థ**
**యెక్కడౌతా నెరఁగడు యిటు గొన్నాళ్లు**
**చక్కఁగ నంతటిలోనె జవ్వనపాయమునాఁడు**
**మిక్కిలి పోకలఁ బోయి మెరయుఁ గొన్నాళ్లు ॥జీవుఁ॥**

**ఆఁకలీ నొక్కటె యటు జనించిననాఁడు**
**వోఁకరెన్నఁడో (?) దాఁగి వుండుఁ గొన్నాళ్లు**
**కాఁకల నంతటిలోనె కమ్మరఁ బుట్టినప్పుడే**
**వేఁకమై పలురుచులు వెదకుఁ గొన్నాళ్లు ॥జీవుఁ॥**

**దేవుఁడూ నొక్కఁడే తెలియుదాఁకాఁ బెక్కు-**
**దేవతలై భ్రమయించు దేహము గొన్నాళ్లు**
**చేవమీర నంతలోనె శ్రీవేంకటేశుఁడై**
**సేవ గొని సుజ్ఞానిఁ జేసుఁ గొన్నాళ్లు ॥జీవుఁ॥296**

**ఉపోద్ఘాతము :**

ఈ సృష్టిలో ఎన్ని జీవాత్మలున్నప్పటికీ వారంతా ఆకారమే కాదు వికార రహితులు కూడా. అందుకనే వారంతా వొక్కటేనంటున్నారు అన్నమయ్య. చైతన్య భరితమైన చిత్తమూ వొక్కటే. మరి ఇన్నిరకములైన జీవులుగా ఇన్ని భావాలుగల చిత్తములుగా యెలా కనబడుతున్నాయి?

పరమాత్మ మాయలదగలి ఆ'దేహి' భ్రమలో వుంటాడు. భ్రమవల్ల కామక్రోధాహంకారాలచే పీడించబడతాడు. విషయాసక్తుడవుతాడు. అన్ని ప్రాణులకు ఆకలి దాహమూ వొకటే అయినా తన ఆకలి దప్పులే బాధాకరమనుకొంటుంటాడు. నిజానికి దేవుడొక్కడైనా దేవతలంతా దేవుళ్ళేనని కొలుస్తుంటాడు. మరి వీడి గతేమిటి?

**తే.గీ॥ ఒక్కడే జీవి చిత్తంబు వొకటె జుమ్మి!!!**
**వెలయుగొన్నాళ్ళు మాయచే వివిధగతుల**
**వేల్పు వొక్కడే జగతికి వేంకటపతి**
**సేవజేసిన సుజ్ఞాని జేయునరుని.**

**భావోద్దేశ్యము :**

ఈ సృష్టిలో జీవుడూ ఒక్కడే (వాడే అనేక శరీరాలు ధరిస్తాడు.) చిత్తమూ ఒక్కటే (ఆ జీవులకుండే మనస్సు ఒక్కటే, అదే అనేక పరిణామాలు చెందుతుంది). వేవేలు (అనేకమైన) మాయలబడుటచేత అలా కొన్నాళ్ళు దేహభ్రాంతితో వుంటాడు.

మన దేహము కూడా ఒక్కటే. దానికే బాల్య యౌవన వృద్ధాప్య దశలు కలిగేది. ఉద్ధతితో కొన్నాళ్ళు కొత్త దశను జీర్ణించుకోలేడు. యౌవన ప్రాయంలో అనేక చాపల్యాలకు లోనౌతాడు. ఏవేవో పోకడలు పోతాడు. ఇది మాయ కాక మరేమిటి?

ఈ జీవి పుట్టిన నాటి ఆకలి చచ్చేదాకా వుంటుంది. కొన్నాళ్ళు తిన్న ఆహారాన్ని ఓకరించు (ఉమ్మేస్తూ) తింటాడు. కొన్నాళ్ళు ఆకలి కాక (వేడి) మీద వుంటాడు. కొన్నాళ్ళు ఒక రుచి నచ్చక అనేక రుచులు కావాలంటాడు. వీడి మనస్సును పట్టుకోగలవాడెవడు?

సత్యం తెలిసికొంటే దేవుడూ ఒక్కడే కదా! ఇది తెలిసేదాకా అనేక మంది దేవుళ్ళు వున్నారని భ్రమపడుతూ వుంటాడు. వారు దేవతలు. పరమాత్మ కాదు. దేవతలంటే ఊర్ధ్వలోకాలలో వుండేవారు. అంతమాత్రమే. ఈ దేహియే ఆ భ్రమకు లోనయ్యేది. అంతలో అతిశయించిన శ్రీవేంకటేశుడైన ఆయన సేవలో జీవి సుజ్ఞానియవుతాడు. ఆ స్థితి కూడా కొన్నాళ్ళే.

సంఖ్య : I/65 రాగం : కన్నడగౌళ

కీర్తన : తనకర్మవశంబించుక దైవకృతం బొకయించుక

**50 తనకర్మవశం బించుక, దైవకృతం బొకయించుక,**
**మనసువికారం బించుక, మానదు ప్రాణులకు ॥పల్లవి॥**

**ఈదైన్యము లీహైన్యము లీచిత్తవికారంబులు**
**యీదురవస్థలు గతులును యీలంపటములును**
**యీదాహము లీదేహము లీయనుబంధంబులు మరి**
**యీదేహముగలకాలము యెడయవు ప్రాణులకు ॥తన॥**

**యీచూపులు యీతీపులు నీనగవులు నీతగవులు -**
**నీచొక్కులు నీ పొక్కులు నీవెడయలుకలును**
**యీచెలుములు నీబలువులు నీచనవులు నీ ఘనతలు -**
**నీచిత్తముగలకాలము యెడయవపు ప్రాణులకు ॥తన॥**

**యీవెరవులు నీయెరుకలు యీతలఁపులు నీతెలువులు**
**దైవశిఖామణితిరుమలదేవునిమన్ననలు**
**దైవికమున కిటువగవక తనతలఁ పగ్గలమైనను**
**దైవము తానౌ తానే దైవంబవుఁగాన ॥తన॥65**

**ఉపోద్ఘాతము :**

ప్రాణి యెట్టి పరిస్థితుల్లోను పురాకృత కర్మననుభవించక తప్పదు. సుఖదుఃఖాలు, మన్ననలు దైన్యాలు, మంచి చెడులు వలపులు వగపులు అన్నీ కొంత స్వయంకృతకర్మ, కొంత దైవనిర్ణయం, కొంత మనోవికారపు చేష్టగా వస్తాయి. వీటినుంచి ప్రాణి తప్పించుకోలేడు.

సీ॥ **తన కర్మ యొకకొంత, దైవకృతము కొంత**
**మనసుక్లైబ్యము కొంత మానదయ్య!**
**దైన్య, లంపటములు హైన్యంబులున్ చిత్త-**
**భ్రాంతులెన్నడుబోవు ప్రాణులకును**

**వలపులు, తీపులు, వగపులు, బలువులున్**
**చిత్తమున్నన్నాళ్ళు చిదుముప్రాణి**
**వెరపులు, తలపులు, యెరుకలు, తెలువులు**
**తిరుమలదేవుని వరములగును**

**ఆ.వే॥ దైవికములకిట్లు తనతలపునజింత**
**తగదు, ధరణి ధీరతను వదలక**
**దైవమగును తనుగ తనెయగుదైవంబు**
**వేంకటేశు కృపకు వెలితికలదె?**

**భావోద్దేశ్యము :**

ఈ ప్రపంచంలో ప్రాణులకు మానజాలనివి కొన్ని వున్నాయి. అవేమంటే, కొంచెము తను చేసిన కర్మ ఫలం, కొంచెము దైవకృతమైన కర్మఫలం, కొంచెము మనోవికారములచేత ఆచరించిన కర్మఫలము.

అట్లాగే ఈ ప్రాణులకు యెడబాయనివి కూడా కొన్ని వున్నాయి. అవేమంటే ఆ జీవి పొందే దైన్యములు, హీనదశలు, చిత్త వికారములు, దురవస్థల తీరుతెన్నులు, లంపటములు, యెన్నడూ తీరని దాహము, జీవిదేహములు, ఈ జీవి బంధములు మరియు ఈ దేహముండే కాలపరిమాణములు.

అట్లాగే ఈ ప్రాణులకు వలపు రేపెడి చూపులు వలపులు కలిగించే తీపులు, వీరి నవ్వులు, వీరి విభేదాలు, వీరి పారవశ్యములు, వీరి వుప్పొంగుటలు, వీరి అలుకలు, వీరి పంతములు, వీరి వుద్ధతులు, వీరి అనురాగములు వారి మనస్సులు లగ్నమైనంత కాలముననే పరిఢవిల్లుచుండును.

అట్లాగే ఈ జీవుల భయాందోళనలు, వీరి యెరుకలు, వీరి ఆలోచనలు, వీరి తెలివితేటలు, దైవశిఖామణియైన తిరువేంకటేశ్వరుని మన్నన వలననే కలుగుతాయి. మరి ఇక ఇట్టి దైవ సంకల్పములేతీరున నుండునోయని చింతించుట వృథా ప్రయాస. అదే తెలిస్తే తానె దైవమౌతాడు. ఆ దైవమూ తనౌతాడు.

సంఖ్య : I/371 రాగం : బృందావని

కీర్తన : తప్పదు తప్పదు దైవముకృప యిది

**51 తప్పదు తప్పదు దైవముకృప యిది**
**ముప్పిరి నింతా ముకుందుఁడే ॥పల్లవి॥**

**వెక్కసపుమతి వెలుతులుదీరిన-**
**నెక్కడ చూచిన నీశ్వరుఁడే**
**గుక్కక యాసలు గోపి(సి)వేసినను**
**నిక్క మడుగడుగు నిధానమే ॥తప్పదు॥**

**పొంచి శరీరపుభోగము లుడిగిన**
**చుంచుఁబాపములు సుకృతములే**
**దంచెడివిషయపుతగులమిఁ(ము?) బాసిన**
**యెంచిచూచినను యిహమే పరము ॥తప్పదు॥**

**శ్రీవేంకటపతి సేవే కలిగిన**
**వేవేలువగలు వేడుకలే**
**చేవదీరె సందియము లే దిదే**
**భావమునమ్మిన ప్రపన్నులకును ॥తప్పదు॥**

**ఉపోద్ఘాతము :**

ముప్పిరి అంటే మూడింతలైపోవటం. దేవదేవుడైన ముకుందుని కృప హరిశరణాగతులకు తప్పదుగాక తప్పదు అని ఘంటాపదంగా చెబుతున్నారు అన్నమయ్య. లోపం మన భక్తిదే కాని ఆయన కృపది కాదు. అహంకారం తొలగి చాంచల్యం తొలగించుకొంటే ఈశ్వరుని మనయెదుటనే చూడవచ్చును. శరీరభోగం విషయవాంఛలు వదిలిపెడితే ఇహలోకంలోనే ముక్తి లభిస్తుంది. ప్రపన్నులకి తిరుమలయ్యకాక పరులతో పనేముంది? అంటున్నారు.

కం॥ **తప్పదు దైవము కృప, యిక**
**ముప్పిరి శరణాగతులకు మురవైరొకడే**
**"అప్పదు" యీతని సేవే**
**ఎప్పుడును ప్రపన్నులకును ఇహపరమొసగున్.**

**భావోద్దేశ్యము :**

ఇది (ఈ ఐశ్వర్యము) తప్పదుగాక తప్పదు. ఎందుకంటే ఇది దైవము యొక్క కృప. ఇంతా (అంతటా) ముప్పిరి (మూడురెట్లై) అతిశయించిన ముకుందుడే (మురవైరియైన శ్రీహరి మహిమ చూపుతున్నాడు).

వెలితి (లోపము) వెక్కసప్రమతి (భరించలేని మనస్సుదే). ఒక్కసారి ఆలోపము సవరించుకొంటే మనకు యెక్కడ చూచినా ఈశ్వరుడే కనబడతాడు సుమా! గుక్కక (సందేహించక) ఆపదలు తెచ్చే ఆశలను కోసివేస్తే, అడుగడుగునా నిధానము (మూలధనము) వంటి ఈశ్వర కృప లభిస్తుంది. ఇది నిజం.

మనిషి పాపాలన్నీ భోగవాంఛతోనే చేస్తాడు. శరీరం ఒకసారి భోగానికలవాటుపడితే, ఇక వేచి ఆ భోగాలకు వెంపర్లాడుతుంటాడు. ఒక్కసారి వాటిని కాదనుకొంటే మానవుడు పాపాలు చేయడు. వాడు చేసేవన్నీ పుణ్యాలే. విషయ వాంఛలపై తగులము (మమకారం) వుంటే అవి వాడిని దంచెడి (చితక కొడుతుంటాయి). ఒక్కసారి వాటిపై అనురక్తిని వదిలిపట్టి చూస్తే, ఇహలోకంలోనే పరము సిద్ధిస్తుంది. వాళ్ళే జీవన్ముక్తులు.

శ్రీ వేంకటేశ్వరుని సేవా నిరతుడైన వాడికి వేవేలు వగలు (అంతులేని దుఃఖాలు) కూడా వేడుకలే అవుతాయి. భావన నమ్మిన (మనస్సులో తిరుమలేశుని నమ్మిన) ప్రపన్నుకు (హరి శరణాగతులకు) చేవదీరె సత్యము (గోచరిస్తుంది). ఇందులో ఏమాత్రము సందేహానికి తావు లేదు.

❋

సంఖ్య : XV/206 రాగం : శంకరాభరణం

కీర్తన : తలపులోననే దైవము వీడిగో

**52 తలcపులోననే దైవము వీcడిగో**
**సులభము సులభము సోధించరో** ||పల్లవి||

**యిదే హరినామము యిదే కొననాలికె**
**వదలక తలcచితే వైకుంఠము**
**వెదకcగ నేcటికి వెదపుణ్యము లింక**
**సదరము సదరము సాధించరో** ||తలcపు||

**కలదు దేహమిదె కలవివె ముద్రలు**
**వలెనని చేకొన్న వైకుంఠము**
**వొలసి కర్మములc బొరలcగ నేcటికి**
**కలిగెను కలిగెను కైకొనరో** ||తలcపు||

**శ్రీ వేంకట మదె శ్రీపతి వీcడిగో**
**వావిరిc గొలిచిన వైకుంఠము**
**భావించి చూచిన బ్రహ్మాదులకును**
**త్రోవయిదె త్రోవయిదె తొలcగకురో** ||తలcపు||

**ఉపోద్ఘాతము :**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో ఒక చక్కటి సత్యాన్ని ప్రతిపాదిస్తున్నారు. వైకుంఠము యెక్కడో ఊర్ధ్వలోకాలలో వుందని అక్కడికి ఎలా చేరుకోవాలా అని ఆరాటపడకండి. చచ్చిన తరువాత గాని యెక్కడున్నదో తెలియని దానికోసం ఆరాటపడటం దేనికి? కలియుగవైకుంఠమైన ఈ తిరుమల చేరుకొని నీ తలపులోనే శ్రీమహావిష్ణువును ధ్యానించి ఆ వైకుంఠుని దర్శించరాదా? ఈయన హరినామ సంకీర్తనకే లభిస్తాడు కదా! ఏవేవో పుణ్యకార్యాలు చేసి ధనవ్యయము, శక్తి వ్యయమూ అవసరమా? ఈ వైకుంఠుని శంఖ, చక్ర ముద్రలు దేహముపై ధరిస్తే వైకుంఠ దర్శనమైన ముక్తి ఫలమే కదా! కర్మలేవేవో చేసి మంచా చెడా అని బెంగ పెట్టుకోవటం దేనికి. ఈ తిరుమలయ్యను దర్శించి అక్కడే శ్రీహరి సన్నిధిలో వున్న బ్రహ్మాదిదేవతలను భావించు ముక్తి బాట అదే కదా!

**ఆ.వె॥ తలపులోనె నిలచు దైవంబు వీడెవో**
**సులభతరము ఇతని సోధనంబు**
**వెలసెనీ తిరుమల పేర్మి వైకుంఠంబు**
**వేంకటపతి దిక్కు విధి సురలకు**

★ **విధి** – బ్రహ్మదేవుడు

**భావోద్దేశ్యము :**

ఈ దైవము శ్రీవేంకటరమణుడు తలపులోననే (ధ్యానిస్తే కనులముందు దర్శనమిచ్చే) ముక్తిదాత వీడిగో (వీడే కదా!) ఈతనిని సోధించుట (వెదకుట) సులభము. కనుగొనుటా సులభమే.

ఆ సులభోపాయాలను వినండి. మీ నాలుక కొన మీద శ్రీహరినామము నిలపండి. వదలక ఈ దైవాన్ని ధ్యానించండి. ఒక క్షణంలో మీరు మనో దర్శనం ద్వారా వైకుంఠాన్ని దర్శించవచ్చును. ఈ శ్రీహరి నామమే ఆ పుణ్యఫలాన్నిస్తుంది. శ్రమ కలిగే పుణ్యకార్యాలు చేసినందున శ్రీహరి నీకు మంచి దేహాన్నిచ్చాడు. దానిపై శ్రీహరి శంఖ చక్రముద్రలు తిరునామము నుదుటిపై ధరిస్తే వైకుంఠ ప్రాప్తికి యెంత పుణ్యం చేయాలో అంతా చేసినట్లే కదా! అలిసిపోవునట్లు యజ్ఞయాగాది కర్మలు చేసి ధనవ్యయంకూడా దేనికి? ఈ శ్రీహరినామ సంకీర్తన నిత్యము చేసేవారికి ఆ ఫలము యెలాగైనా దక్కుతుంది కదా.

అదిగో శ్రీవేంకటాద్రి. అదిగోవాడే తిరుమల శ్రీవేంకటేశ్వరుడు. ఇక్కడకు చేరి కొలిచినవారిదే వైకుంఠము. భావించి భక్తితో చూస్తే మీ మనోనేత్రాలకు బ్రహ్మాది దేవతలు ఈయన సన్నిధిలో వున్నట్లే అనిపిస్తుంది. అయ్యలారా మీరు వైకుంఠ మార్గంలో మొదటి అడుగు వేసినట్లే.

సంఖ్య : IV/332 రాగం : గుండక్రియ
కీర్తన : తలపోత చిత్తమున దరిగానక బుద్ధి

53 తలపోఁత చిత్తమునఁ దరిగానక బుద్ధి
గలఁగెఁ గావవో మమ్ముఁ గర్మమా ॥పల్లవి॥

పాపజాతిమేనితోడఁ బడ్డపాటే చాలదా
ఆపదలకేల లోనాయ నిప్పుడు
దీపమైనహరిభక్తి దెలిసియింతటనైనఁ
గాపాడి పరమీవో కర్మమా ॥తల॥

చెప్పరానిసుఖములు చెప్పి చెప్పి కని కని
చప్పుడుగా లోకమునఁ జాటి చాటి
దెప్పరపుభవములఁ దిప్పుదీరైతి మిదె
కప్పుకొని కావఁగదో కర్మమా ॥తల॥

వేడుకలన్నియు శ్రీవేంకటాద్రిరాయఁడే
కూడిన మాదైవమని కొనియాడి
యేడఁజూచిననుఁ బుణ్య మెక్కుడాయనని నమ్మి
గాడలెల్లాఁ బాసితిమి కర్మమా ॥తల॥332

**ఉపోద్ఘాతము :**

ఈ కీర్తనలో అన్నమయ్య ఆలోచనలలో నలిగీ నలిగీ సద్బుద్ధిని విడనాడేట్లు చేసిన తన కర్మను బ్రతిమిలాడుకొంటున్నారు. నీవు ప్రతిదానికీ కలతచెంది మమ్ము చేయకూడని ఆలోచనలు చేయమంటున్నావు. నీకిది తగునా వో కర్మమా! పాపం చేయబట్టే ఈ రోగిష్టి మేను మాపాలబడ్డది. దినదినగండం నూరేళ్ళు ఆయుస్సులాగ బ్రతుకుతున్నాను. నాకీ పీడ చాలదా? ఏదో ఆ శ్రీహరికి ఈ జీవుడిపై దయకలిగి హరి భక్తి నేర్పాడు. నీవు మమ్ము దానికీ దూరం చేస్తావా? నేను నీకేం ద్రోహం చేశానే? నన్నెందుకు యేడిపిస్తావే.

కం॥ నెలకొన చిత్తము లోపల
తలపోతల నలగినలగి దరిగానగదే!
గలగే బుద్ధిది కావవొ
అలుగక కర్మంబ మేము హరిదాసులమే!

**భావోద్దేశ్యము :**

ఈ చిత్తమున కలిగే తలపోతలన బుద్ధి దరిగానదు. అందువల్ల అది కలుగుతుంది (సంక్షోభిస్తుంది). ఓ నా పురాకృత కర్మమా! దీనికి నీవే కారణం కాబట్టి మమ్ము రక్షింపవే అని నిన్ను వేడుకొంటున్నాను.

మా పురాకృత కర్మవల్ల మాకీ రోగిష్టి శరీరం వచ్చింది. దీనితో నేను పడుతున్న బాధలు చాలవా? ఇప్పుడు ఇంకా ఆపదలకేల లోనవుతున్నావు. ఇప్పుడు దీపమువంటి హరి భక్తి నా మనస్సులో ఆ దేవదేవుడు వెలిగించాడు. నా కర్మమా! ఇప్పటికైనా నన్ను కాపాడి పరము లభించేటట్లు అనుగ్రహించరాదా?

నోటితో చెప్పకూడని సుఖముల గురించి చాటిచాటి చెప్పాను. కొన్నిటిని అనుభవించాను కూడ. రొదపెట్టి లోకమంతా "టముకు" వేసాను. ఇదె (ఈ విధముగా) దెబ్బరపు భవముల (ఆపదలు సమృద్ధిగా గల పుట్టుకలకు) కారణభూతులైనాము. ఓ కర్మమా! జరిగిందేదో జరిగింది. ఇకనైనా మమ్ము కాపాడరాదా?

నా జీవితంలో యేవన్నా వేడుకలు జరిగినవంటే, దానికి కారణం శ్రీవేంకటేశుడి కృప. ఆయన మమ్ము కూడిన దైవమని కొనియాడి మైమరచినాము. ఓ కర్మమా! మేము ఇంకొక మంచి పని చేశాము. ఆ స్వామిని యెంత జూచినా, యెక్కడ చూచినా పుణ్యమేనని దానికంతు వుండదని గ్రహించాము. గాడలెల్లా బాసితిమి (కోర్కెలనన్నీ క్రమేపీ జయించాము) కనుక మా జోలికి రాకు.

సంఖ్య : IV/304 రాగం : వసంతం
కీర్తన : తల్లియాపె కృష్ణునికి దండ్రి యీతడు

**54 తల్లియాపె కృష్ణునికిఁ దండ్రి యీతఁడు**
**చల్లఁగా లోకములెల్లా సంతోసమందెను ॥పల్లవి॥**

**అరుదై శ్రావణబహుళాష్టమినాఁటిరాత్రి**
**తిరువవతారమందెను కృష్ణుఁడు**
**యిరవై దేవకిదేవి యెత్తుకొని వసుదేవు -**
**కరములందుఁ బెట్టితే కడుసంతోసించెను ॥తల్లి॥**

**తక్కక యమునానది దాఁటతఁడు రేపల్లెలో**
**పక్కన యశోదాదేవిపక్కఁ బెట్టెను**
**యెక్కువనాపె కృష్ణునినెత్తుక నందగోపుని**
**గక్కన వినిపించితే కడుసంతోసించెను ॥తల్లి॥**

**మరిగి పెద్దై కృష్ణుఁడు మధురలోఁ గంసుఁజంపి**
**బెరసి యలమేల్మంగఁ బెండ్లాడి**
**తిరమై శ్రీవేంకటాద్రిని దేవకీదేవియు**
**ఇరవైతే వసుదేవుఁ దేఁచి సంతోసించెను ॥తలి॥304**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య వినిపించిన శ్రీకృష్ణవైభవాన్ని ఆస్వాదించి, తరించండి. ఎందుకంటే నేనీ కీర్తనను వివరిస్తున్న ఈ రోజు నిజంగా కృష్ణాష్టమియే, అందుకని ఇది నా గత జన్మ సుకృతముగాక, వేరొకటి కాదు. దీనికి చక్కని పద్యము సమకూరింది. వేంకటకృష్ణ కృప "కలిసి వచ్చేకాలంలో నడిచివచ్చే కొడుకు పుడతాడు" అనే సామెత వున్నది. వాటన్నిటికి మూలం ఈ కృష్ణమూర్తేనని నా భావన. ఈయన నడిచి వైకుంఠం నుంచి వచ్చి కొడుకైతే కాలం కలిసివచ్చింది మనందరికి. అవునా? ఆ కృష్ణయ్యే అలమేలుమంగను పెళ్ళాడే వేంకటకృష్ణయ్య. కొసమెరుపేమిటంటే అలనాటి దేవకీవసుదేవులూ తిరుమలలోనే స్థిరపడ్డారట. అంటే ఆత్మరూపులై అని గ్రహించుకోవాలి!

**ఉ॥ తల్లియె దేవకీసతియు తండ్రియునా వసుదేవుడే భళా!**
**చల్లగ లోకమంతయును సంతస మందెను కృష్ణుజూచుచున్**
**హత్తిన శ్రావణాబహుళయష్టమిరేతిరి జేరెగోకులం**
**బిత్తరి నందు నింటమననేలెడి వేంకట కృష్ణుడాయె బో!**

**భావోద్దేశ్యము :**

ఈ శ్రీకృష్ణునికి తల్లియాపె (ఆమెయే), తండ్రి ఈతడే (ఈ వసుదేవుడే). వీరివల్ల లోకములన్నీ చల్లబడి సంతోషము నొందినవి. ఎందుకో వినండి.

అరుదైన శ్రావణ బహుళ అష్టమినాడు అర్ధరాత్రి పవిత్రమైన శ్రీకృష్ణావతారము పుడమిపై వెలసినది. దేవకీదేవి నారాయణుని ఆజ్ఞప్రకారమే పుట్టిన బిడ్డను కన్నీటితోనే భర్త వసుదేవునకొసగినది. ఆయన కూడా బిడ్డను యెత్తుకొన్నాక లోకములన్నీ మిక్కిలి సంతోషించినవి.

కృతనిశ్చయుడైన వసుదేవుడు, తక్కక (వెనుదీయక) యమునానదిని దాటి ఆ పక్కనే వున్న రేపల్లెలో యశోదాదేవి పక్కలో బిడ్డను పెట్టెను. అందరూ గాఢనిద్రలోనే వున్నారు. ఆమెకు పుట్టిన యోగమాయతో ఆతడు నిష్క్రమించగానే శిశువురోదనవిని అందరూ నిద్రలేచి నందగోపుని ఇంట కృష్ణుడుదయించాడని వినిపించితే అందరూ సంతసించిరి.

ఆపైన కృష్ణుడు పెద్దవాడై మధురకు వెళ్ళి కంసుని సంహరించాడు. కలియుగం వచ్చేదాకా కృష్ణుని కథ నడిచింది. అతిశయించి అలమేలు మంగను పెండ్లాడిన శ్రీవేంకటేశుడే నాటి రేపల్లె కృష్ణయ్య. నిత్యకళ్యాణములను జరుపుకొంటున్న శ్రీవేంకట కృష్ణయ్యను చూచి ఆత్మరూపులైన దేవకీ వసుదేవులు, సంతోషించి ఆనంద నిలయంలోనే బ్రహ్మానందం పొందుతున్నారు.

సంఖ్య : X/50 రాగం : పాడి

కీర్తన : తానేడ వారేడ తనువేడ మరి తక్కినవెల్లానేడ

**55 తానేడ వారేడ తనువేడ మరి తక్కినవెల్లానేడ**
**మానలే ననుచు తరితీపుసేసే మన సేద నుండునో ॥పల్లవి॥**

**కందువ మానిపై నోరూరించెటికాయలుఁ బండ్లు పక్వముదప్పిన**
**అందముగ మున్ను గోరినట్టివారియాస లెందుండునో**
**పొందున వలచి పులకించినట్టిపురుషులు సతు లట్టె ముదిసితె**
**ముందర వెనక నెరఁగనియ్యనిమోహ మెందుండునో ॥తానే॥**

**కొత్తమెరుఁగులచేత భ్రమయించే కోకలు చివిరె పాఁతగిలితె**
**బత్తితోఁ గావలె నని కొన్నవారిభ్రమ లెందుండునో**
**రిత్తజవ్వనాన కొప్పు గోళ్ల దిద్ది రీతిగానుండెటి సింగారంబులు**
**పత్తివలెనై బట్టగట్టఁదనభావ మెందుండునో ॥తానే॥**

**తావితో బుగులుకొనెటిపూవులు దాఁపఁగ నవియె వాడినపిమ్మట**
**భావించి చూచితే నందలి తొల్లిటిపస యెందుండునో**
**శ్రీవెంకటనాథుఁడిట్టె యేలెఁగాకచెల్లఁ బోతాఁదొల్లిభోగించినవెల్ల**
**వేవేగ మరునాఁ డవియె చూడ నేవిధమైయుండునో. ॥తానే॥ 50**

**ఉపోద్ఘాతము :**

ఇది చినతిరుమలయ్య వినిపిస్తున్న చక్కని అధ్యాత్మ కీర్తన ఇంత విస్తృతమైన కీర్తనలను సీసపద్యములు మాత్రమే చక్కగ వివరించగలవు. అతి సరళమైన ఈ పద్యమే మధురమైన భావాన్ని కూడా వివరిస్తోంది. భార్యాభర్తలు, సంతానము, అత్తవారింటి బంధువులూ యేజన్మకు ఆ జన్మతో సరి. మరుజన్మలో యెవ్వరికెవ్వరూ యేమీకారు. భ్రమవలన మోహం వలన యౌవన సహజమైన కామ ప్రభావితులై అలా అనిపిస్తుంది. ఆ ప్రేమ శ్రీవేంకటేశునిపై కలిగిననాడు మనం ముక్తి మార్గంవైపు అడుగులేస్తున్నామన్నమాట.

సీ॥ తానేడ, వారేడ, తనువేడ? భ్రమకదా!
మానలేననిపించు మనసువలపె
ముదిసిన మరులన్ని ముగిసి తీరును కదా!
మోహంబు తీరుట ముందువెనుక.
కోకపాతబడిన కోమలెవ్వతె కట్టు
ముదుసలి సింగారమదియె రోత
బుగులురేపును కదా! పుష్ప పరిమళంబు
తొల్లిసువాసనల్ తొలగువాడి

ఆ.వె॥ తొల్లిభోగమెల్ల తోచదే భ్రమవోలె
మరుదినంబు భ్రమలు మరులు కావు
వేంకటేశు భక్తి వెట్టిగా తోచదు
మనసునందు హరిని కనినయెడల.

భావోద్దేశ్యము :

అన్నీ మనస్సుచేసే తరితీపులే (వలపు భావనలే). అవే మానలేమనే భ్రాంతి కలుగుతుంది. లేకపోతే తానెక్కడివాడు. వారు (భార్యాపుత్రులు బంధువులు) యేడ? తన తనువెక్కడిది? అలాగే తక్కినవన్నీ ఈనాటివే. నా గత జన్మవి కావు, మరు జన్మకు రావు. ఇదే సత్యం.

చెట్టుపైనుండగా, నేడు నోరూరించిన కాయలె, పండ్లె అప్పటికీ యెవ్వరూ తినకుంటే మాగి వడిలి నిరుపయోగమైపోతాయి. ఏ అందము చూసి మునుపుఅంతా ముగ్ధులయ్యారో, అదే అందం వార్ధక్యం రాగానే వారి ఆశలన్నీ యెక్కడికి పారిపోతాయో! పొందునకు వలపించిన సతీపురుషుల అందం ముదిసినాక యేమవుతుందో? ఆనాడు ముందువెనుకల నెరుగనియని మోహం నేడేది?

నూతనంగా వున్నప్పుడు చీరెలు స్త్రీలను విచిత్రమైన నూతనశోభకున్న మెరుపుతో మురిపిస్తుంది. కొన్న భర్త కూడ సంతోషంగా వుంటాడు. ఆ చీరె పాతబడి తళుకు కోల్పోతే, ఇరువురి సంతోషం యెక్కడికి పోతుంది. అట్లాగే జవ్వనంలో తన కొప్పు, గోళ్ళు, సింగారంగా దిద్దుకొంటారు. ఒకసారి బట్ట అయ్యాక ఒకప్పుడు ఇదే 'పత్తి' అనే భావన యెలా రాదో, ముదుసలి అయ్యాక ఆ స్త్రీ అందాన్ని యెవ్వరూ తలవరు.

పూవులు ఒకనాడు వలపులు రేపినా, వాడిపోయాక వాటిలో తొల్లిటి పస వుంటుందా? శ్రీవేంకటనాథుడొసగిన భోగాలే ఒకనాడు భోగింపజేసినా ఆస్వామి యిచ్చిన విరక్తి వల్ల అదే భోగాలు చూడగా యేవిధినుండునో కదా!

సంఖ్య : II/19 రాగం : పాడి

కీర్తన : తెలిసితే మోక్షము తెలియకున్న బంధము

**56 తెలిసితేమోక్షము తెలియకున్న బంధము**
**కలలవంటిది బదుకు ఘనునికిని** ॥**పల్లవి**॥

**అనయము సుఖమేడ దవల దుఃఖమేడది**
**తనువుపై నాసలేనితత్వమతికి**
**పొనిcగితేc బాపమేది పుణ్యమేది కర్మమందు**
**వొనర ఫలమొల్లనియోగికిని** ॥**తెలి**॥

**తగినయమృతమేది తలcపcగ విషమేది**
**తెగి నిరాహారియైనధీరునికిని**
**పగవారనcగ వేరి బంధులనcగ వేరీ**
**వెగటుప్రపంచమెల్ల విడిచేవివేకికి** ॥**తెలి**॥

**వేవేలువిధులందు వెఱపేది మఱపేది**
**దైవమునమ్మినయట్టిధన్యునికిని**
**శ్రీవేంకటేశ్వరుcడు చిత్తములో నున్నవాcడు**
**యీవలేది యావలేది యితనిదాసునికి** ॥**తెలి**॥**19**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో నిజమైన మోక్షమంటే యేమిటో వివరిస్తున్నారు. అంతా వైకుంఠప్రాప్తి మోక్షమనుకొంటారు. అది ఆత్మపొందే అనుభూతి. మోక్షమంటే యేమిటో తెలిసిన వారికే విముక్తి. అంటే జ్ఞానులు ముక్తికి మరణించక్కరలేదు. అజ్ఞానులకు ముక్తిరాదు. అంటే వారు నావారు, నాది అనే బంధములోనే వుండిపోతారు. ఎందుకంటే జ్ఞానులైన ఆ ఘనులు అసలు బ్రతుకే కలవంటిది అని తెలిసికొంటారు. అవల (ఆపైన) అంతా సుఖమే. బంధమే ఉంటే అంతాదుఃఖమే. వేంకటపతి దాసులు కాకపోతే ముక్తే లేదు.

**ఆ.వె॥ తెలిసితే విముక్తి తెలియక బంధమ్ము**
**ఘనులకెల్ల 'బతుకు' కలనిపించు**
**వేంకటపతి మనసు వెలయించువారికి**
**ఇహము పరము రెండు ఇరవుగావు**

**భావోద్దేశ్యము :**

ఈ ధర్మసూక్ష్మం తెలిసినవారు నిత్యముక్తులు తెలియకుంటే సంసారబంధనంలోనే చిక్కుకుపోతారు. ఘనులైనవారు బ్రతుకంతా కలవలె సత్యం అనిపించే అసత్యం అని గ్రహిస్తారు.

తనువుపై వ్యామోహంలేని తత్త్వవేత్తలకు సుఖమేమిటి దుఃఖమేమిటి? అది కేవలం మానసిక భ్రాంతి. కర్మఫలము తాను ఆశించని వారికి పొసగిన పాపపుణ్యములతో నిమిత్తమే వుండదు.

నిరాహారులై జీవించగలిగిన ధీరులకు అమృతమిచ్చినా ఆసక్తి వుండదు. విషాహారమేమో అనే భయమే వుండదు. ప్రపంచమునంతా వెగటు అని విడనాడిన వివేకికి పగవారెవరు? బంధువులెవరు? వారికి అందరూ సమానమే.

దేవునిపై నమ్మకమున్న ధన్యజీవులకి వారు చేయవలసిన అనేక విధులంటే భయము కానీ మతిమరుపుకాని వుంటాయా? శ్రీవేంకటేశ్వరుని, చిత్తములో (మనస్సులో) నిలుపుకొన్నవాడు, ఆయన దాసుడైన శరణాగతునికి యీవలేది (ఏది ఇహము) ఆవలేది (పరమేది?) వారికి రెండిటితోనూ నిమిత్తములేదు.

సంఖ్య : XIV/149 రాగం : శ్రీరాగం

కీర్తన : దయదలcచగరాదా తరుణిపై నికనైనా

**57 దయదలcచcగరాదా తరుణిపై నిcకనైన**
**ప్రియములు చెప్పేనంటాc జెనcగుచునలసె** ॥పల్లవి॥

**వొగరులాడకుమంత వోపదుచెలి నీతో**
**నగవుల చేతనే మిన్నక యలసె**
**జగడాలడువకుమీ సంగతులు గావిcక**
**మొగమోడి సారెసారె మొక్కి మొక్కి అలసి** ॥దయ॥

**పంతాలు చూపకుమంత పనిలేదు యాపెతోను**
**వింత నీబాసలు విని విని యలసె**
**చింతలు రేcచకుమిcక సేసినట్టెల్లాc జెల్లె**
**అంతరంగముగ నిచ్చలాడి యాడి యలసె** ॥దయ॥

**అలయించుకుమంత ఆరడేల ఇల్లాలితో**
**కలసి కాcగిటిలో రతులనలసె**
**యెలమి శ్రీవేంకటేశ ఇంతసేసి కూడితివి**
**అలరిన నీమన్నన లందియంది యలసె.** ॥దయ॥**149**

**ఉపోద్ఘాతము :**

అలమేల్మంగ చెలికత్తెవలె భావనాలోకంలో విహరిస్తున్న అన్నమయ్య వినిపించిన మధుర కీర్తననాస్వాదించండి. ఆమె స్వామి వారికి నివేదిస్తున్నది. ప్రభూ! మాదేవిపై కాస్త కనికరం చూపరాదా? మాకు ప్రియమైన మాటలను చెప్పాలని ప్రయత్నించి బాగా అలిసిపోయింది ఆమె. కాస్త యెక్కువగా నవ్వితేనే అలిసిపోయే ఆ సుకుమారితో పంతము లాడెదవా? నాతో పోట్లాడకు స్వామీ! అని నీకు చెప్పి చెప్పి అలిసిపోయింది. కనుక ఆమెనంత అలయించకు ప్రభూ! అని వేడుకొంటున్నది. గడసరి అన్నమయ్య ఇల్లాలితో నీకు గొడవయెందుకయ్యా? నీకౌగిటి రతులతోనే మాదేవి అలిసిపోయిందంటున్నారు. ఈ చనువు మరొకరికి సాధ్యమా?

**కం॥ దయదలచవయ్య! తరుణిని**
**ప్రియములు చెప్పంగబోయి పెనగుచునలసెన్**
**నయమా పంతము సతితో?**
**రయమున వోతిరుమలేశ! రతిదేల్చగదో?**

**భావోద్దేశ్యము :**

ప్రభూ! ఇకనైనా యీతరుణిపై దయదలచరాదా? మా చెలి బేల. అతిసుకుమారి. మీరు సరసమైన ముచ్చట్లు చెప్పుకొంటుంటే, తానే ముందు చెబుతానని, నీతో పెనగి చిలిపి కజ్జానికే అలసినది ఈమె. కావున ఆమెతో నీకు పంతాలు వద్దు.

ప్రభూ! ఒగరు లాడకు (అంత కటువుగా మాట్లాడకు). నీతో మాచెలి అది సైపలేదయ్యా! ఆమె నీవు నవ్విస్తేనే చాలు నవ్వి నవ్వీ అలసిపోతుంది. ఆమెను జగడాలతో ఆమెను అణిచిపెడితే ఇక ఆ సంగతే చెప్పనక్కరలేదు. మొగమాటంతో నీకు మొక్కి మొక్కీ అలసిపోయిందయ్యా!

ప్రభూ! ఆమెతో అంత పంతము చూపించ తగదయ్యా! పంతము సంగతి తరువాత చూడవచ్చును. నీవు చేసిన వింత వింత బాసలు విని ఆమె అలసినదయ్యా! నీవేమి చేసినా చెల్లుతుంది లెమ్మని ఆమెలో అనవసరమైన చింతలు రేపకుమయ్యా! మీ ఏకాంతంలో తన అంతరంగములో నీపై తనకున్న ఇష్టము చెప్పి చెప్పీ అలసినదయ్యా

ప్రభూ! ఆమెనంత అలవగొట్టకుమయ్యా! ఇల్లాలితో ఆరడి యెందుకయ్యా! ఆమెను కౌగిటిలో నించి రతుల నలయించుము. ఓ శ్రీవేంకటేశా! ఇంతరట్టడిసేసి ఆమెని కూడినావు. అప్పుడు అలరిన నీ మన్ననలను పొంది పొందీ ఆమె సంతోషంతో అలసిపోయింది.

సంఖ్య : II/363 రాగం : మలహరి

కీర్తన : దిక్కు నీవే జీవులకు దేవసింహమా

**58 దిక్కు నీవే జీవులకు దేవసింహమా**
**తెక్కులగద్దియమీఁది దేవసింహమా ॥పల్లవి॥**

**సురలెల్లాఁ గొలువఁగ సూర్యచంద్రులకన్నుల**
**తిరమైనమహిమలదేవసింహమా**
**నిరతిఁ బ్రహ్లాదుఁడు నీయెదుట నిలిచితే**
**తెరదీసితి మాయకు దేవసింహమా ॥దిక్కు॥**

**భుజము లుప్పొంగఁగాను పూఁచినశంఖుఁజక్రాల**
**త్రిజగములు నేలేటిదేవసింహమా**
**గజభజింపుచు వచ్చి కాచుక నుతించేటి-**
**ద్విజమునిసంఘముల దేవసింహమా ॥దిక్కు॥**

**ముప్పిరిదాసులకెల్లా ముందు ముందే యొసగేటి-**
**తిప్పరానివరములదేవసింహమా**
**చిప్పల నహోబలాన శ్రీ వేంకటాద్రిమీఁద**
**తెప్పలదేలేటియట్టి దేవసింహమా ॥దిక్కు॥**

**ఉపోద్ఘాతము :**

అహోబలేశ్వరుడైన నారసింహుని దేవసింహమా అని కీర్తిస్తున్నారు. హిరణ్యకశిపుని వరానుగుణ్యంగా, నరసింహుడై అంతటి దానవుణ్ణి పిల్లవాడినెత్తుకొన్నట్లు పట్టియెత్తిన వాడు దేవుడు కాక నరుడా? అందుకనే దేవసింహమా అని కీర్తిస్తున్నారు అన్నమయ్య. 'చిప్పలనహోబలాన' అని కీర్తనలో వున్నా, అది 'చిప్పిలనహోబలాన' అయివుంటుందని నా భావన. వాడి వరాలకన్నిటికీ విరుగుడు చేశానని తెక్కులతో గర్వంతో సింహాసనంపై కూర్చొన్నాడట ఆ దేవసింహము.

**కం॥ దిక్కయిన దేవసింహమ**

**తెక్కులగద్దియనుయెక్కి తిరమైతివిగా**

**ఇక్కడ నహోబలంబున**

**మక్కువతో వరములిచ్చు మలయప్పవుగా.**

**భావోద్దేశ్యము :**

ఓ దేవసింహమా! ఈ సృష్టిలోని జీవులందరికీ నీవే దిక్కువు ప్రభూ! ఆ గద్దియమీద (సింహాసనముపై) తెక్కుల (గర్వముతో) ఆదిలక్ష్మి తోడుత కూర్చొనివున్న దేవసింహమా! మమ్ము రక్షింపుము.

సూర్యచంద్రులు నీకు రెండు నేత్రములై వున్నవి. హిరణ్యకశిపుని పీడ తొలగించినందుకు దేవతలందరూ నిన్ను శరణని కొలుచుచున్నారు. తిరమైన (స్థిరమైన) మహిమలుగల దేవసింహము నీవే. చచ్చినది తన తండ్రికాదు లోకకంటకుడని నిరతితో (నిష్పక్షపాతముగా) ప్రహ్లాదుడు నీయెదుట నిలిచి సన్నుతిస్తే నీమాయను వుపసంహరించి అతనిని బ్రోచిన ప్రహ్లాదవరద దైవసింహమవు.

రెండు హస్తములలో శంఖుచక్రములను ధరించి వుప్పొంగి పూచితివి (అతిశయించితివి). ఆ విధముగా త్రిజగములను యేలుకొనె దేవసింహము నీవే. గజము (గజేంద్రుడు) భజించిన పరుగు పరుగున వచ్చి మకరిపీడ తొలగించిన శ్రీహరివేనని ద్విజులు మునిసంఘములు కీర్తిస్తున్నాయి.

ఓ దేవసింహమా! మూడింతలైన నీ దాసులందరూ నిన్ను ముందు ముందే మొక్కి తిప్పరాని (తిరుగులేని) వరాలను పొందుతున్నారు. ఈ అహోబలము మీద ఆ వేంకటాద్రి మీద చిప్పిల (అతిశయించిన) తెప్పల దేలేటి (తెప్పోత్సవాలను జరుపుకొంటున్న) దేవసింహము నీవే తండ్రీ!

❊

సంఖ్య : IV/328 రాగం : ముఖారి

కీర్తన : దిక్కులేనివారు నీవే దిక్కని కొలువగా

**59** **దిక్కులేనివారు నీవే దిక్కని కొలువఁగా**
**అక్కరకితఁడు దైవమందురువో నిన్నును ॥పల్లవి॥**

**పాలుపడి నిన్నుఁజేరి పట్టి కొలిచినవారి**
**జాలిపాటు తొలఁగించి జడనువాపి**
**మూలఁబడనీక తెచ్చి ముద్దుసేసికావఁగాను**
**మేలెరుఁగుబుధులెల్ల మెత్తురువో నిన్నును ॥దిక్కు॥**

**కొండలుఁగోట్లునైనకోరికలుగలవారి -**
**యండనే కోరికలిచ్చి యాదరించఁగా**
**నిండినదాసులకెల్ల నీవే దైవ మవని**
**కొండమీఁదనుండినఁ బైకొందురువో నిన్నును. ॥దిక్కు॥**

**యేకమైన మనసుతో నెవ్వరు దలఁచినాను**
**చేకొని కరుణఁ గృపసేయఁగాను**
**యేకాలము శ్రీవేంకటేశుఁడు మాదైవమని**
**లోకమెల్లఁ దామే కొలుతురువో నిన్నును ॥దిక్కు॥328**

**ఉపోద్ఘాతము :**

దిక్కులేని వారికి దేవుడే దిక్కు అంటారు. అంటే వాడు ఆకలి దప్పులతో చావకుండా ఏదోవిధంగా పొట్ట పోషించుకొనే ఏర్పాటు చేస్తాడు దేవుడు. తనని పట్టి కొలిచేవారిని జాలిపాటు తొలగిస్తాడట. కొండల వంటి కోరికలనైనా తనను నమ్మినవారైతే తీరుస్తాడట. ఏకమైన మనసుతో తనను మనస్సులో తలచుకొన్నా వచ్చి కాపాడుతాడట. అందుకనే ఈ లోకమంతా శ్రీవేంకటేశ్వరుని మా దైవమని కొలుస్తున్నారట. మనకు చిన్న వాక్యాలలో యెంత గొప్ప సత్యం చెప్పారో చూడండి అన్నమాచార్యులవారు.

**ఉ॥ దిక్కని కొల్తురయ్యనిను దిక్కునెరుంగని దీనులందరున్**
**అక్కరదీర్చు దైవమని అందరు వోనిను వేంకటాధిపా!**
**మ్రొక్కుచు మెత్తురయ్య తగు ముద్దును సేయుచు కాతువంచు నిన్**
**చక్కని రక్ష నీవనుచు స్వాంతన బొందగ వేడువారలే.**

**భావోద్దేశ్యము :**

దేవదేవా! నీవు నిను నమ్మినవారినందరిని కరుణించి రక్షిస్తావు, వరములిస్తావు. వారు చేయవలసినదెల్లా నీవే దైవమని వారి అక్కరతీరుస్తావని నమ్మాలి. నాకు వేరుదిక్కులేదు నీవే నా దిక్కు అని కొలవాలి. ఈ రెండు పనులను చేస్తే చాలు.

ఎవరైతే పాలుపడి (పూనుకొని) నిన్ను చేరి కొలిచెదరో వారి జాలిపాటు (దుఃఖమును) తొలగించి జడనువాపి (వారి జాడ్యమును రూపుమాపి), వారిని మూలబడనీయక (వెనకబడిపోకుండా) తెచ్చి ముద్దుసేసి (లాలించి) రక్షింతువు. ఏది మంచియో యేది చెడో విచక్షణ తెలిసిన బుధులు (బుద్ధిమంతులు) నిను అందుకే మెత్తురు (మెచ్చుకొంటారు).

నిన్ను కోరుకునేవారి కోరికలు కొండలంతటివైనా నీ అండనే కోరేవారి యేకోర్కైనా ఆదరింతువు. నిండిన నీ దాసులు (పరిపూర్ణతనొందిన నీ శరణాగతులు) నీవు ఇంత ఎత్తైన కొండమీదవున్నా శ్రమలకోర్చి నిన్ను చేరుకొనేవారిని పైకొందువు (పూర్తి బాధ్యత తీసుకొందువు).

ఏకమైన మనసుతో (ఏకాగ్రత నిలిపిన మనస్సుతో) అచంచల విశ్వాసముతో నిన్ను యెవరు తలచుకొనినా వారిని స్వీకరించి కరుణతో కృప జూపిస్తావు. ఏ సమయముననైనా శ్రీవేంకటేశ్వరుడే మా దైవమని ఈలోకమంతయూ నిన్ను తమంతట తామే కొలుస్తారు.

సంఖ్య : IV/300 రాగం : బౌళిరామక్రియ

కీర్తన : దేవతలగాచిన దేవుడితడు

**60 దేవతలఁగాచిన దేవుఁ డితఁడు**
**వేవులుప్రతాపములవీరరాముఁ డితఁడు ॥పల్లవి॥**

**రావణుఁజంపి పుష్పకరథ మెక్కి సీతతోడ**
**తావుగా నయోధ్యను పట్టముగట్టుక**
**వావిరి సుగ్రీవాది వానరకోట్లు గొలువ**
**చేవమీరి పొగడొందు శ్రీరాముఁ డితఁడు ॥దేవత॥**

**వసుధ యింతయునేలి వసిష్ఠాదులు వొగడ**
**యెసగ నశ్వమేధాలెల్లాఁ జేసి**
**పొసఁగఁ గుశలవుల పుత్రులగా నటుగాంచి**
**రసికత మించు దశరథరాముఁ డితఁడు ॥దేవత॥**

**అలర రుద్రునెదుటనటు విశ్వరూపు చూపి**
**లలి బ్రహ్మపట్ట మనిలజుని కిచ్చి**
**యిల శ్రీవేంకటాద్రినిరవై నిలిచినాఁడు**
**చలము సాధించిన జయరాముఁ డితఁడు ॥దేవత॥ 300**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య వినిపించిన ఈ కీర్తనలో వీరరాముని ప్రస్తుతిస్తున్నారు. దానవ సంహారం చేసి దేవతలని రక్షించటానికి శ్రీ మహావిష్ణువై నరజన్మనెత్తాడు. వేవేలు ప్రతాపముల వాడట (అనేక విక్రమములు కలవాడు). అన్నమయ్య సన్నుతి కీర్తనలన్నీ ఒకే పంథాలో నడుస్తాయి. మాటల పొందికలోనే తేడా వుంటుంది. శివుని యెదుట తాను ప్రత్యేకంగా చూపకపోయినా ఆయన భావించి ఆయన విశ్వరూపం దర్శించి నీవు తారక రాముడవు అని కీర్తించాడు. అందుకనే కాశీనగరంలో మరణించినవారికి ఆయన తారకమంత్రం బోధించి ముక్తిననుగ్రహిస్తాడు. మారుతికి బ్రహ్మపట్టము నొసగినాడు.

**తే.గీ॥ దేవతలగాచిబ్రోచిన దేవుడితడు**

**వీరరామప్రతాపముల్ వేవులాయె**

**వేంకటాద్రిపై నిరవౌచువీడెనిలిచె**

**చలము సాధించె జయరామ చక్రవర్తి.**

**భావోద్దేశ్యము :**

ఈ వీరరాముడు దేవతలను రక్షించిన దేవుడు. వేవులు (అనేకరకములైన) ప్రతాపములను ప్రదర్శించినవాడితడు.

అలనాడు రావణాసురుని లంకలో వధించి, కపిసైన్యంతోను సీతాదేవితోను రీవితో అయోధ్యనేలినాడు. వీరులైన సుగ్రీవాది వానరమూక కొలుచుచుండగా చేవమీరి పొగడొందు కీర్తింపబడిన శ్రీరాముడితడు.

తన కులగురువు వశిష్ట మహర్షి కీర్తించుచుండగా అశ్వమేధ యాగము చేసి రాజ్యంలో సుభిక్షం వుండేట్లు చేసినాడు. ఆ తరువాత కుశలవులను తన పుత్రులుగా రాజ్యాభిషిక్తులను చేసినదీ దశరథనందనుడే.

శంకరుడు ఆనందించునట్లుగా తన విశ్వరూపమును చూపి కాశీనగరంలో తారకరాముడై వెలసినాడు. అనిలజుడు (వాయునందనుడైన హనుమకు బ్రహ్మపట్టము నొసగి ఆతనికి విశిష్టత కల్పించినాడు. నేడు నెలవైన తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడై జగములనేలుచున్నాడు. ఇట్లు చలము సాధించిన (పంతము నెగ్గించుకొన్న) జయరాముడే ఇతడు.

సంఖ్య : XV/326 రాగం : వాసంతి

కీర్తన : దేవదేవోత్తమ నాకు దిక్కు నీవే యెప్పుడును

**61 దేవదేవోత్తమ నాకు దిక్కు నీవే యెప్పుడును**
**యేవిరముఁ దెలియ నేమి సేతు నయ్యా** ॥పల్లవి॥

**పాపముడిగినఁ గాని ఫలియించదు పుణ్యము**
**కోపము మానినఁ గాని కూడదు శాంతి**
**చాపల మడఁచక నిశ్చల బుద్ధి గలుగదు**
**యేపున నా వసము గా దేమి సేతు నయ్యా** ॥దేవ॥

**ఆస విడిచినఁ గాని యంకెకు రాదు విరతి**
**రోసినఁ గాని సుజ్ఞనరుచి పుట్టదు**
**వేసాలు దొలఁగించక వివేకా లెల్లా మెచ్చరు**
**యీ సుద్దు లేమియు నేర నేమి సేతు నయ్యా** ॥దేవ॥

**కల్లలాడకున్నఁ గాని కడతేరదు సత్యము**
**వొల్ల నన్నఁ గాని సుఖ మొనఁ గూడదు**
**యిల్లిదె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే**
**యెల్లకాల మీ మేలున కేమి సేతు నయ్యా** ॥దేవ॥

**ఉపోద్ఘాతము :**

పెదతిరుమలయ్యచెప్పే అక్షరసత్యాన్ని వినండి. దేవదేవుళ్ళలో విశిష్టమైన శ్రీ వేంకటేశ్వరా! నాకు నీవే దిక్కు స్వామీ! అంటున్నారు. నాకు, వేద వేదాంగాలు గాని పురాణాలుగాని రావు. ఏ విధమైన విశిష్టత నాకు లేదు. మరి ఇక నేనేమి చేయగలనయ్యా? నేను చేసే పాపము తక్కువదికాదు. నా కోపము అలాగే వుంది. నిశ్చలబుద్ధి లేదు. ఆశ చావలేదు. ఎంత రోసినా సుజ్ఞానం లేదు. అబద్ధాలాడుతూనే వున్నాను, సత్యము చెప్పను, సుఖాన్ని మరువను ఇంత పనికిమాలిన వాడిని కూడా నీవు అనుగ్రహించావు. నాకీ ఆనందం చాలును ప్రభూ

**చం॥ గతి ఇక నాకు నీవె నను కాదననేటికి దేవదేవ? మా**
**మతి వివరంబులేమియును మాకును తోపవునేమి సేతురా?**
**జత యొకదానికొక్కటగు చావదు దుర్గుణ రాశి కూల్చుచున్**
**సతతము వేంకటేశ! నను చక్కగనేలుము చింతబాపుమా.**

**భావోద్దేశ్యము :**

ఓ దేవదేవోత్తమా! నాకెల్లప్పుడూ దిక్కు నీవేనయ్యా! నేను యే విరమూ (వివరమూ) తెలిసినవాడిని కాను. మరి ఇక నేనేమి చేయగలనయ్యా?

అంతా ఈ ప్రపంచంలో ఒకటి ఇంకొకదాని పరిణామమే కాని, వేరు కాదు. ఎవ్వనికైనా పాపము నశిస్తేనేకాని పుణ్యం రాదు. కోపము పోతేకాని మనశ్శాంతి కలుగదు. చాపలము (చాంచల్యమును) అణచకుండావుంటే నిశ్చలమైన బుద్ధి కలుగదు. నిలకడలేని బుద్ధి నావశములో వుంటుందా తండ్రీ? మరి ఇక నేనేమి చేయను?

ప్రభూ! ఆశను విడిచిపెడితే కాని విరతి (విరక్తి) అంకెకు రాదు (స్వాధీనం కాదు). జీవితంపై రోత కలిగితే కాని సుజ్ఞానంపై మక్కువ కలుగదు. మాయదారి వేషాలు మానితేకాని వివేకవంతులు మెచ్చరు. అదటుంచి పైన చెప్పిన వాని వివరము లేమియూ నాకు తెలియవు. నేనేమి చేయగలనయ్యా?

నోరు తెరిస్తే నానోటివెంట కల్లలే (అబద్ధాలే) దొర్లుతాయి. అబద్ధాలు మానుకొంటే కాని సత్యం చెప్పటం అలవడదు. నాకు సుఖం కావాలనుకొనేవాడికి యెన్నటికీ సుఖము రాదా. ఒల్లను (నాకు వద్దు) అంటేనే సుఖం వస్తుంది. ఇదిగో ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను సులభముగా యేలినావు. నీవు నాకు చేసిన ఈ మేలుకు ప్రత్యుపకారము యేమి చేయగలను తండ్రీ! సదా నేను నీ భృత్యుడను.

సంఖ్య : II/178 రాగం : శుద్ధవసంతం

కీర్తన : దీనరక్షకు డఖిలవినుతుడు దేవదేవుడు రాముడు

**62 దీనరక్షకుఁ డఖిలవినుతుఁడు దేవదేవుఁడు రాముఁడు**
**జానకీపతిఁ గొలువుఁడీ ఘనసమరవిజయుఁడు రాముఁడు** ||పల్లవి||

**హరునితారకబ్రహ్మమంత్రమై యమరినయర్థమ రాముఁడు**
**సురలఁ గాచి యసురల నడఁచినసూర్యకులజుఁడు రాముఁడు**
**సరయువందును ముక్తిచూరలు జనుల కొసఁగెను రాముఁడు**
**హరియె యాతఁడు హరుడువిరించుల కాదిపురుషుఁడు రాముడు** ||దీన||

**మునులరుషులకు నభయమొసఁగినమూలమూరితి రాముఁడు**
**మనసులోపలఁ బరమయోగులు మరుగుతేజము రాముఁడు**
**పనిచి మీఁదటిబ్రహ్మపట్టము బంటు కొసఁగెను రాముఁడు**
**మనుజవేషముతోడ నగజకు మంత్రమాయను రాముఁడు** ||దీన||

**బలిమి మించినదైవికముతో భక్తసులభుఁడు రాముఁడు**
**నిలిచి తనసరిలేనివేలుపు నిగమవంద్యుఁడు రాముఁడు**
**మెలుపు శ్రీవేంకటగిరీంద్రముమీఁది దేవుఁడు రాముఁడు**
**వెలసె వావిలిపాటిలోపలివీరవిజయుఁడు రాముఁడు** ||దీన||

**ఉపోద్ఘాతము :**

కడపజిల్లా వావిలిపాడులోని వీరరాఘవుని కీర్తిస్తున్నారు అన్నమయ్య. సీసపద్యమే శ్రీరామనుతి ఇక ఈ కీర్తన రాముని భజన అని వేరే వివరించనక్కరలేదు. పద్యమే భావపరిమళం.

సీ|| **హరుడు తారకబ్రహ్మ అని చెప్పి పలికించు**
**తారకమంత్రంబు మరణమపుడు**
**సురుల రక్షించెనసురులనుదండించె**
**హరవిరించులకును ఆదిభూతి**

ముని, యోగి, నరులకు ముక్తిచ్చె సరయులో
బ్రహ్మపట్టమునిచ్చె పావనికిని
దీనరక్షకుడును జానకీరాముండు
దేవదేవుని గొల్చు దేవి గిరిజ

తే.గీ॥ బలిమిచేగాక దైవిక భక్తిచేత
సులభుడీ రామ భజనమే సుగమ పథము
వెలసె వావిలిపాటిలో వేంకటపతి
వీరరాముడై కొలువుడీ నరులహరిని

**భావోద్దేశ్యము :**

దీనరక్షకుడును త్రిలోకవంద్యుడయిన దేవదేవుడు ఈ రామచంద్రుడు. ఈ జానకీవల్లభునికి మొక్కండి. ఈ రాముడు ఘనమైన రామరావణ యుద్ధమున విజయుడు.

హరుడు నరులకు అంత్య క్షణమున వారణాసిలో స్వయంగా తారకరామ మంత్రం పలికించి మోక్షమిస్తాడు. సురులను రక్షించి అసురులను శిక్షించిన అసహాయశూరుడీరాముడు. తన రామావతార పరిసమాప్తివేళ తన అయోధ్యాపుర ప్రజలకు సరయూనదిలో వైకుంఠమునిచ్చాడు. ఈతడు నరుడైన హరి కావున హరుడు, విరించిలకు ఆదిమూలమైన పరబ్రహ్మ శ్రీరాముడే.

మునులకు ఋషులకు అభయమొసగిన మూలమూర్తి యీ రాముడు. పరమ యోగులకు మనస్సులలో వెలిగే ఆత్మజ్యోతి శ్రీరాముడు. అనన్యసాధ్యమైన బ్రహ్మపదవిని తన ప్రియమైన బంటు మారుతికి శ్రీరాముడు స్వయముగానిచ్చాడు.

తన భుజబలమును మించిన దైవిక శక్తిని ప్రదర్శించినవాడీ రాముడు. అంతేకాక భక్తసులభుడు ఈ రాముడు. ఈ వేదవినుతుడు సరిలేని వేల్పుగా నిలిచిపోయాడు. శ్రీవేంకటగిరీంద్రముమీద కలియుగ దైవము శ్రీవేంకటేశ్వరుడై ఈ రాముడే వెలసినాడు. నేటి కడప జిల్లాలోని వావిలిపాడులో వీరవిజయ రాముడై భక్తుల కొంగుబంగారమైనాడు యీ శ్రీరామచంద్రుడు.

సంఖ్య : IV/294 రాగం : నాగవరాళి

కీర్తన : దైవము నెరగము తత్వము దలచము

**63** **దైవము నెరఁగము తత్వముఁ దలఁచము**
**చేవై హరి రక్షించీ నిదివో** ॥పల్లవి॥

**పాపముఁ బుణ్యముఁ బైకొను దేహము**
**కోపము శాంతపుగుణములది**
**వోపికవోపము లుదుటు చూపెడిది (వి?)**
**చేపట్టుక యిటు చెలఁగే మిదివో** ॥దైవ॥

**వెలికిని లోనికి విడిసేటిప్రాణము**
**చలువలు వేండ్లు చల్లెడిది**
**తెలివికి నిదురకుఁ దేపై యున్నది**
**బలిమిఁ జేపట్టుక బ్రదికే మిదివో** ॥దైవ॥

**పరమును నిహమునుఁ బట్టినజీవుఁడ**
**పొరుగుకు నింటికిఁ బొత్తైతి**
**గరిమల శ్రీవేంకటపతి శరణని**
**నిరతపు మహిమల నెగడే మిదివో** ॥దైవ॥**294**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య మానవులదుస్థితి మీద వ్యాఖ్యానిస్తున్నారు. ఏమిటి మా దౌర్భాగ్యము? దైవము నెరుగము, తత్వచింతన లేదు, వాటిని గురించియే ఆలోచించము, మరి మాగతేమిటి?

ఓ శ్రీహరీ! నీవే మా సత్తువయై రక్షించవయ్యా! ఇదే నా విన్నపము అంటున్నారు. కనుపించినంత తేలికకాదు ఈ కీర్తన వివరించటం. నా ప్రయత్నం నేను చేస్తాను. ఆపైన అంతా 'వాడి' దయ.

**ఆ.వె॥ దేవునెరుగబోము, తెలియము తత్త్వంబు**
**చేవయైన హరియె సేమమీయు**
**ఇహపరములజీవికిచ్చేటి దైవమౌ**
**వేంకటపతి శరణు వేడెదముగ.**

**భావోద్దేశ్యము :**

ఎంత దుస్థితిలో వున్నాము!! దైవమునెరుగము, తత్వచింతనలేదు, అసలు వాటిగురించే మేము ఆలోచించము. చేవయై (మాకు బలమై) ఆ శ్రీహరియే ఇదే మమ్ము రక్షించుగాక!

ఈ దేహము ద్వారానే జీవి పాపముగానీ పుణ్యముగానీ, పైకొనును (యత్నిస్తుంటాడు). మానవునికి కోపము ప్రకోపిస్తే పాపము, శాంతం చిత్తములో నెలకొంటే పుణ్యమూ చేస్తాడు. ఓపిక (క్షమ), ఓపము (తృప్తితో చాలు అనే భావన) ఉద్ధతిని పెంచుతాయి. వాటిని స్వీకరించి మేమూ, ఇదిగో అతిశయించెదము గాక!

ప్రాణి ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారా ఊపిరిపీల్చి వదిలేస్తాడు. అదే వాడి ప్రాణశక్తి. ఆ గాలికూడా లోపలికి పోయేది చల్లగాను బయటకు వచ్చేది వెచ్చగాను వుంటాయి. తెలివికి (మెలకువకు) నిదురకు (నిద్రకు) ఈ దేహము తెప్పవలెనున్నది. బలముగా ఈ దేహాన్ని పట్టుకొంటేనే ప్రాణం నిలిచేది. అట్లా బ్రతుకుతున్నాము, మేము.

ఓ జీవుడా! నీవు పరమును (ముక్తిని) ఇహమును (ఈ లోకవ్యాపారమును) పట్టక తప్పదు. ఆ పరము పొరుగువారి ఇల్లు, ఈ ఇహము స్వంత ఇల్లు వంటివి. ముందు స్వంత ఇంటికి మంచి చేసికొంటే పొరుగిల్లు అదే బాగుపడుతుంది. దీనికి జీవి చేయాల్సింది ఒక్కటే. నిత్యం శ్రీవేంకటేశ్వరుని శరణంటే, ఆయన మహిమవలన రెండూ సిద్ధిస్తాయి.

సంఖ్య : III/171 రాగం : ముఖారి

కీర్తన : దైవమా వోదైవమా నన్ను దయజూడదగదా

**64 దైవమా వోదైవమా నన్ను దయఁజూడఁదగదా**
**నే వెట్టివాఁడనైతే నీవు వెట్టివా. ॥పల్లవి॥**

**చవిగొంటి నెత్తురెల్లా చన్నుఁబాలనుచు నేను**
**భువిఁ దొల్లే నోచితి పుట్టే నంటాను**
**యివల గడుపులోన హేయమౌతాఁ గూడవుతా**
**నివిరి న న్నెరఁగను ని న్నెరిఁగేనా ॥దైవ॥**

**మొగిఁ జావుకు వెరతు ముందర గాన నేను**
**వెగటులంపటమైతే వేసరుకొందు**
**వగపును నగవును పడి నొక్కమొకమందే**
**తగులైనవాఁడ నీపైతలఁపు నాకున్నదా. ॥దైవ॥**

**మతి భ్రమసితిఁ గొంత మన్ను నాకు రాజ్యమని**
**సతులంటా సుతులంటా సంసారినైతి**
**గతియై శ్రీవేంకటేశ కాచితి వింతటిలోనే**
**యితరుఁడ నింతే నీకు నేమి బాఁతి నేను. ॥దైవ॥171**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య తెగ విసిగిపోయి దేవదేవునే యేమంటున్నారో చూడండి. సరే! నేనంటే ఒక వెట్టివాడను. కాని నీవు దేవదేవుడవే. నీవూ వెట్టివాడివా యేమి? నా జీవితంలో విసిగిపోయాను. నీవు ఆమాత్రం నామీద కరుణ చూపించలేవా? మా అమ్మ నెత్తురునంతా చనుబాలుగా త్రాగేశాను. ఆమె తిన్న ఆహారం నేనూ తిన్నాను. మలమూత్రాలకంపు భరించాను. పుట్టానోలేదో చావంటే భయం. ఎన్ని జతపడితే అన్ని లంపటాలు తగిలించుకొన్నాను. నేనెవరో నాకే తెలియదు. ఇక నిన్నేం తెలుసుకొంటాను? అంతా నారాజ్యము అని భ్రమిస్తున్నది 'మన్ను' మాత్రమే. సతీసుతులు నాకు నిన్న లేరు. రేపు నేను వారికుండను. మరి యేమిటీ బాఁతి? (భ్రాంతి)

**ఆ.వె॥ వెట్టివాడనైతి వెట్టివా నీవునూ**
**దయను జూడదగనె? దైవరాయ!**
**మతిచెడినది నాకు సుతులును సతులొద్దు**
**లెంకనయ్య శరణు వేంకటేశ!**

**భావోద్దేశ్యము :**

దైవమా! ఓ దైవమా! నన్ను దయజూడరాదా? పోనీ నేను వెట్టివాడినని అనుకొందాము. మరి యేరికోరి నన్ను సృష్టించిన నీవెంత వెట్టివాడివి?

నేను వెట్టివాడినని అంగీకరించాను. నీవు నన్ను పుట్టించావు. మరి యెటువంటి పుట్టుకనిచ్చావు. మా అమ్మ చనుబాలను ఆమె నెత్తురు త్రాగినట్లు త్రాగాను, నేను. ఏమి నోచానోగాని యెంత హేయమైన బ్రతుకు గడిపాను. నామలమూత్రాలలో నేనేపడి ఆ కంపు భరిస్తూ యెవరో శుభ్రపరిస్తేగాని వీలులేని స్థితిలో బ్రతికాను. ఇంతా చేసి నేనెవరినో యెక్కడనుంచి వచ్చానో తెలియను. ఇక నిన్నెట్లెరుగుదును దేవా!

పుట్టుక తెలియని నాకు చావు అంటే తగని భయం. కాని నేను పెట్టుకొన్న లంపటాలైన నా స్నేహితులను, ఆప్తులను, బంధువులను విడువలేను. వారంటే నాకు వేసట (విసుగు) కలుగుటలేదు. అదేమి వింతయోకాని వున్న ఒక్క మొగముతోనే ఏడుపూ ప్రదర్శిస్తాను, నవ్వూ ప్రదర్శిస్తాను. అనేక విషయాలపై తగులుకొంటాను. నీగురించి ఆలోచన నాకున్నదా? లేదు దేవా! లేదు.

కొంత మతి భ్రమించినవాడిలాగా నీవు సృష్టించి ఇచ్చిన ఈ భూమిలో కొంత నా"రాజ్యము" అనుకొంటుంటాను. సతులు, సుతులు అనుకొంటూ సంసార సాగరములో మునిగిపోయాను. ఆంతమున శ్రీవేంకటేశుడే నాకు గతియైనాడు. కాని నీవే నేనని గ్రహించలేకున్నాను. ఏమి "బాఁతి" (భ్రాంతిని) పెట్టావు ప్రభూ!

సంఖ్య : IV/311 రాగం : సామంతం

కీర్తన : దైవమొక్కడే సంతత భజనీయుడు

**65** **దైవమొక్కఁడే సంతత భజనీయుఁడు**
**భావము సమబుద్ధిఁ బాయఁగఁదగదు** ॥పల్లవి॥

**హరియే సకలాంతరాత్మకుఁ డటుగాన**
**తిరమై యొకరి నిందింపఁదగదు**
**అరయఁగ లోకములనిత్య మటుగాన**
**మరిగి కొందరిమీఁదిమమతయు వలదు** ॥దైవ॥

**బహుకల్పితములెల్లఁ బ్రకృతిమూలమే కాన**
**గహనపుఁదనవుద్యోగము వలదు**
**సహజవిహారుఁడు సర్వేశ్వరుఁడుగాన**
**వహిఁ దానేయిచ్చినవి వలదనఁదగదు** ॥దైవ॥

**తపములు జపములు దాస్యమూలమె కాన**
**వుపమల సందేహమొగి వలదు**
**యెపుడును శ్రీవేంకటేశ్వరు సేవించి**
**చపలచిత్తమువారి సంగమిఁక వలదు** ॥దైవ॥**311**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య చెబుతున్న పరమ సత్యాన్ని చక్కగా ఆకళింపు చేసికొంటే ఈ విశ్వమంతటిలోనూ సర్వేశ్వరుడైన విష్ణువే దైవమనీ ఆ దైవమే భజనీయుడని భావన కలిగి సమబుద్ధి అందరిపట్ల అలవడి సత్యదర్శనమవుతుంది.

అందరి అంతరాత్మ హరియే అని తెలిసిననాడు ఎక్కువ తక్కువలుండవు. హరియే శాశ్వతుడనీ లోకములన్నీ అశాశ్వతములు. అన్ని వికారాలకు ప్రకృతియే మూలము. ఆ శ్రీహరి ఇచ్చినదేదీ కాదనరాదు. తపములు, జపములు, క్రతువులు శ్రీహరి కరుణను సాధించుటకే కదా! అటువంటప్పుడు శ్రీవేంకటేశ్వరుని దాసులై అదే ఫలితము పొందవచ్చును కదా! శ్రమ యెందుకు?

**చం॥ సతతము దైవమే ఘనుడు చక్కగ మొక్కి భజింప యోగ్యుడున్**
**వితరణదెల్వువారలకె విష్ణుడు యందరి అంతరాత్ముడై**
**మతికిని దోచు నన్నిటిని మాధవు భిక్షగనెంచునందుకే**
**గతియని వేంకటేశ్వరుని కాళ్ళబడున్ గొని దాస్యమెల్లెడన్.**

**భావోద్దేశ్యము :**

సంతత భజనీయుడు (ఎల్లప్పుడూ భజించదగ్గవాడు) ఆ దైవమొక్కడే. మరియొక ముఖ్యమైన విషయమేమంటే జీవులందరికీ అంతరాత్ముడు ఆ సర్వేశ్వరుడే కాబట్టి అన్ని జీవులపై సమబుద్ధి భావన అలవరుచుకోవాలి. అంతేకాక ఆ భావన పాయగతగదు (వదిలిపెట్టరాదు).

సకలాంతరాత్మకుడు శ్రీహరియే కాబట్టి కావాలని పరులను నిందించుట తగదు. ఆలోచిస్తే ఈ లోకములే అశాశ్వతములు. అందువలన అశాశ్వతులైన వారిపైన లేనిపోని మమత (మమకారము)లను పెంచుకొనుట వలదు.

ప్రకృతి దేవుని ఆధీనంలో వుండి ఆయన ఆజ్ఞానువర్తి. మానవమాత్రులు దానిని శాసించలేరు. దీనిమూలమే బహుకల్పితము (అనేక విధములుగా, మారునట్లు కల్పించబడినది). కనుక గహనపు (చొరరాని) వుద్యోగము (యత్నములను) చేయతగదు. సర్వేశ్వరుడైన నారాయణుడు సహజ విహారుడు (ఎక్కడకు కావలెనంటే అక్కడికి పోగలడు). అటువంటి ప్రభువు ఒక విధానముననుసరించి నీకిది ఇచ్చానురా అంటే దానిని వలదనుట తగునా?

ఏవిధమైన తపము చేసినా, జపము చేసినా అది పరమాత్మ ప్రీతి కొరకే అని గ్రహించాలి. అవి అనేక వ్యయ ప్రయాసలతో కూడినవి. పైగా పలువురి తోడ్పాటు కావలసినవి. కాని ఇవన్నీ పరమాత్మకు దాసులమనే భావనతో చేయాలి. వాటిలో యే ఉపాయము మంచిది అనే సందేహము తగదు. ఇవన్నీ యెందుకు? చపలచిత్తుల సాంగత్యం వదలివేసి, శ్రీవేంకటేశ్వరుని సేవిస్తే చాలదా?

సంఖ్య : IV/290 రాగం : శంకరాభరణం

కీర్తన : ధర్మమునకే మము దయగావవే యిక

**66 ధర్మమునకే మము దయఁ గావవే యిఁక**
**నిర్మలుఁడవు నిను నే మెరిఁగేమా** ॥పల్లవి॥

**కాయధారులము కర్మలోలులము**
**మాయ కగపడినమనుజులము**
**పాయపుమదమున భ్రమసే మా మనసు**
**నీయెడఁ దగులై నిలిచీనా** ॥ధర్మ॥

**చాపల్యగుణము జడులమన్నిటాను**
**పాపపుణ్యసంబద్ధులము**
**పైపైఁగోర్కుల ప్రబలేమాబ్రదుకు**
**యేపనులను నీకెక్కీనా** ॥ధర్మ॥

**అతిప్రాకృతులము అహంకారులము**
**సతతంబునుఁ జంచలులము**
**హితవుగ శ్రీవేంకటేశ యేలితివి**
**తతితో నీభక్తి తగ మరచేమా** ॥ధర్మ॥**290**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య దేవదేవునితో యేమి మొరవెట్టుకొనుచున్నారో, ఆలకించండి. అరిషడ్వర్గాలను జయించినవాడిని కాను, భ్రమకులోనై ఒక్కొక్కప్పుడు "మానవుడే... మహనీయుడు" అనే దుష్ట వాదనలతో అహంకరిస్తుంటాను.

చిత్తచాపల్యమునకు లోనై జడులవలె పాపపుణ్యాలను పుష్కలంగా చేస్తుంటాము. కోర్కెలు లేకుండా నిన్ను ఆశ్రయించము. మేము ఏపని చేశామని మమ్మల్నెక్కుడుగా భావిస్తావు? చిత్త చాంచల్యమునకు లోనై నీపై స్థిరభక్తి కుదరటం లేదు. ఓ తిరుమలనాయకా! ఇక యేమి చూచి మమ్ము అనుగ్రహిస్తావు. కేవలం ధర్మ చింతనతో మాపై దయగొని మమ్మనుగ్రహించు. ఎందుకంటే, నిర్మలుడవైన నీతత్త్వాన్ని గ్రహించే గొప్పతనం మాకు లేదయ్యా!

**చం॥ మము దయగావుమయ్య హరి మాయెడ ధర్మపుచింతతోడనే**
**అమలుడవైన నిన్నెఱుగ అచ్యుత సాధ్యమ? మాదుబోంట్లకున్**
**అమరునెనీదుపై తగులు అన్ని గుణంబులగెల్వకున్నచో**
**విమలుడ నీదు భృత్యులము వేంకటరాయ! శరణ్యుడయ్యరో!**

**భావోద్దేశ్యము :**

ఓ సర్వేశ్వరా! మమ్ము రక్షించవలెనని, నిన్ను బలవంతం చేయలేము, మానవమాత్రులము. నిష్కళంకుడవు నిర్మలుడవు అయిన నిన్ను నీ వైభవమును మేమెఱుంగ, గలమా? అయినా మాపై దయతో ధర్మచింతనతోనైనా మమ్మల్ని ఆదుకో తండ్రీ.

ప్రభూ! మా బలహీనతలగురించి యేమి చెప్పమన్నావు? అనిత్యమైన శరీరములను ధరించినవారము. క్షణంలో బూడిదయ్యేదా శరీరం. ప్రతి నిముషము యేదో ఫలితమునిచ్చె కర్మలను చేస్తూనే వుంటాము. మాయకు సులభముగా వశులమయ్యే మానవులము. మా మనసు అరిషడ్వర్గములలోని మదమత్సరములకు బానిస. అందుకని భ్రమలోలురము. నీమీద తగులము (అనురాగమూ) నిలకడగా లేనివారము.

ఇదిట్లా వుండగా చాపల్యము మమ్మల్ని జడులను (మూఢులను) చేస్తుంటుంది. పాపపుణ్యాలు అధికంగా చేస్తూ వాటికి బద్ధులమై వుంటాము. మా బ్రతుకులన్నీ తుచ్ఛమై, ప్రబలములైన కోర్కెలకు లొంగివుంటాయి. ఏపని చేసి నీకు ఎక్కడా (యెక్కువ కాగలము?)

ఓ తిరుమలనాథా! మేము అతి ప్రాకృతులము (ప్రకృతికి లొంగినవారము). అహంకారంతో కన్నూ మిన్నూ కాననివారము. ఎప్పుడూ చంచలత్వము కలిగి వుంటాము. అటువంటి హీనులమైన మమ్ము కూడా ఓ శ్రీవేంకటేశ్వరా హితవుగా యేలితివి. ఆపేక్షతో నీపై మా భక్తిని మరువగలమా? ఎన్నటికీ మరువలేము.

సంఖ్య : IV/347 రాగం : లలిత

కీర్తన : ధ్రువవరదునివలె తుదకెక్కుగాక మరి

**67** **ధ్రువవరదునివలె తుదకెక్కుఁగాక మరి**
**యివల గర్మఫలంబు లేవైన సతమా** ॥పల్లవి॥

**కరిరాజవరదునకు కడఁగి శరణంటేను**
**కరిఁగాచినట్లనే కాఁచుగాక**
**పరదైవముల కెంత భంగపడి మొక్కినా**
**అరసి రావణుకొసంగినట్లనేకాదా** ॥ధ్రువ॥

**శ్రీపతినే అడిగినను జిగి నజామిళువలె**
**చేపట్టి సిరుల రక్షించుఁగాక**
**ఆపోక కౌరవుఁడు హరిపరాఙ్ముఖుఁడైన**
**పైపైనే సంపదలు పార్థుచేఁ బడవా** ॥ధ్రువ॥

**శ్రీవేంకటేశుఁడిచ్చేయీవరంబులే**
**వోవలను ద్రిష్టమై యుండుఁగాక**
**భావించ నితరములు పరలోకములయందు**
**కై వశంబగుననేకథలవలెఁగాదా** ॥ధ్రువ॥**347**

**ఉపోద్ఘాతము :**

అద్భుతమైన ఈ కీర్తనలో అన్నమయ్య యేమి చెబుతున్నారో ఆకళింపు జేసికొంటే ఈ యాంత్రిక జీవితంలో కడతేరినట్లేనని నమ్మండి. ధ్రువుడు బాలుడు. తండ్రిప్రేమ కోసం తపించి, అందరికీ తండ్రియైన నారాయణుని ప్రేమనే పొంది, చివరికి ధృవతారయైనాడు. తతిమ్మావారికి ఆ అదృష్టం లేదు. వారు పుణ్యలోకాలు పొందినా వారి పుణ్యఫలం బొత్తిగా వరాలు రక్షించేస్తాయని నమ్మటానికి వీలులేదు. వరాలు గజేంద్రుని రక్షించాయిగాని రావణుని రక్షించాయా? హరి బంధువైనా దుర్యోధనుడేమన్నా బాగుపడ్డాడా? శ్రీవేంకటేశుడు ఇచ్చిన వరాలు ముక్తికి వాడుకోవటం సుకృతం. సిరిసంపదలకు వాడుకోవటం కొండను త్రవ్వి ఎలుకను పట్టుకోవటంలాంటిది.

**చం॥ అరయగ కర్మ సత్ఫలము అంతము జెందును శాస్వతంబొకో**
**వరములు కూల్చె రావణుని బ్రహ్మయొసంగియు లాభమాయెనా?**
**హరినటుగట్టబోయి వడి అంతటి కౌరవనాథుడేమయెన్?**
**తిరుమలవేంకటేశ్వరుని దీవెన ద్రిష్టము అన్యమేదిరా?**

**భావోద్దేశ్యము :**

దేవదేవుడైన శ్రీహరి ధ్రువవరదుడు. ఆ ధ్రువుని వలె ముక్తిని పొందితే యేమోగాని, ఇటుల మరియందరికి కర్మఫలములేమి లభించినా అవి శాశ్వతమైనవి కావు. అన్నీ కాలపరిమితి కలిగినవే.

గజేంద్రవరదుడైన శ్రీహరిని శరణని ఆశ్రయిస్తే ఆ కరిని గాచినట్లే రక్షిస్తాడు కదా! పరదైవములు చాలామంది వున్నారు. వారు చేసే ఉపకారమూ పరిమితమే. రావణాసురునే తీసికోండి. బ్రహ్మదేవుడి ద్వారా అనేక వరాలు పొంది దేవతలను అష్టదిక్పాలకులను నవగ్రహాలను శాసించాడు. కాని అహంకారంవల్ల నరులను వానరులను వదలివేశాడు. శ్రీహరి నరుడైన రామునిగా వానరసేనతో వచ్చి వాడిని తుదముట్టించాడు.

అదే అజామీళునే తీసికోండి. ఆ భ్రష్టుడు తన కొడుకైన నారాయణను స్మరించినా మరణకాలంలో నారాయణా అన్నాడు కాబట్టి వైకుంఠాన్ని పొందాడు. కాని దుర్యోధనుని గతేమైనదో చూడండి. వాడు స్వయంగా శ్రీకృష్ణుని బావ అయినా భగవంతుని విశ్వరూపం చూడలేక తొడలు పగిలి మరణించాడు. అదే అర్జునుడు పరమాత్మ విశ్వరూపమునుచూచి భగవద్గీతనూ విన్నాడు.

శ్రీవేంకటేశ్వరుడిచ్చే వరములే ద్రిష్టమైవుండగా (అదృష్టమైవుండగా) అసలైన సుఖం పరలోకములలో వుందనే మతిలేని కథలను ప్రచారం చేస్తున్నారు. అవన్నీ యెందుకు, ఆయనను శరణంటే చాలుకదా!

సంఖ్య : II/387 రాగం : బౌళి

కీర్తన : నందగోపనందనుండే నాటిబాలుడు

**68 నందగోపనందనుండే నాఁటిబాలుఁడు**
**ఇందు నేఁడే రేపల్లె నేచి పెరిగెను.** ॥పల్లవి॥

**పువ్వువంటిమఱ్ఱియాకుపొత్తిఁ బవళించనేర్చె**
**యెవ్వఁడోకాని తొల్లె యీబాలుఁడు**
**మువ్వంకవేదములను ముద్దుమాఁట లాడనేర్చె**
**యెవ్వరూఁ గొంత నేర్పనేఁటికే వీనికి** ॥నంద॥

**తప్పుటడుగు లిడఁగనేర్చె ధరణియందు నాకసమున-**
**నెప్పుగా రసాతలమున నొంటి తొల్లియే**
**రెప్పలెత్తి చూడనేర్చె రేసీఁ జెంద్రునందు పగలు**
**గొప్ప సూర్యునందు నింకఁ గొత్త నేర్పనేఁటికే** ॥నంద॥

**మంచివెన్నబువ్వ లిపుడు మలసి యారగించనేర్చె-**
**నంచితముగ శ్రీవేంకటాద్రిమీఁదను**
**యెంచి యప్పలప్పలనుచు యెనసి కాఁగిలించనేర్చె**
**దించరానివురముమీఁద దివ్యకాంతను** ॥నంద॥

**ఉపోద్ఘాతము :**

నాటి బాలుడు అంటే సృష్టికి పూర్వమే మఱ్ఱి ఆకుపై పవ్వళించిన నాటి శిశువు అని అర్థం. ఆనాటి బాలుడే ఈనాడు రేపల్లెలో యశోదా నందగోపుల నందనుడైన బాలుడు. ఇచ్చటనతిశయముతో పెరుగుచున్నాడు. ఈ మఱ్ఱియాకు శిశువే మూడు వేదములను తన ముద్దుమాటలలో చెప్పాడు. సూర్యచంద్రులీబాలుని నేత్రాలు. ఈ బాలుడే వటువుగా వచ్చి తప్పటడుగులు వేసే వయస్సులో భూమ్యాకాశాలను కొలిచినాడు. నేడు వేంకటాద్రిమీద తన హృదయవాసినిని కౌగిట కరగించుచున్నాడు.

**ఉ॥ నందుని బిడ్డడై పెరిగె నంద(వ్రజంబున, మఱ్ఱియాకుపై**
**సుందర బాలుడే, పలికె సొంపగవేదము ముద్దుమాటలన్,**
**పొందుగమూడు పాదముల భూమినభంబుల కొల్చె బాలుడా!!**
**ఇందునె వేంకటేశునిగ ఇందిరనేచెను కౌగిటన్ భళా!!**

**భావోద్దేశ్యము :**

నాటి (సృష్ట్యాదికాలపు) బాలుడు, ఈ నందగోపనందనుడే (శ్రీకృష్ణుడే). ఇక్కడ రేపల్లెలో యేచి (అతిశయించి) పెరిగెను (పెద్దవాడైనాడు).

పువ్వువలె మృదువైన మఱ్ఱియాకు పొత్తిళ్ళలో పవ్వళించ నేర్చినాడు. అంతకుపూర్వం ఈ బాలుడెవ్వడో యెవ్వరికీ తెలియదు. ముప్వంక (మూడువిధములైన) వేదములను ముద్దుమాటలు పలికే బాలునిగానే జగతికి అందించాడు. అసలు ఈతనికి యెవరు, దేనిని నేర్పగలరు?

ఆపైన ఈ బాలుడు తప్పటడుగులు వేస్తూ వెళ్ళి బలి చక్రవర్తినుండి మూడడుగుల దానము పొంది ధరణిని, నింగిని రెండు పాదాలతో ఆక్రమించి మూడవ అడుగుతో బలిని రసాతలమునకు అణచాడు. అంత నేర్పుగలవాడీ శిశువు. రెప్పలెత్తి చూడటం నేర్చిన ఈ శిశువు ఒక కన్ను సూర్యుడు. ఇంకొక కన్ను చంద్రుడు. ఒక కన్ను మూస్తే రాత్రి, ఒక కన్ను మూస్తే పగలు. ఇట్టి వానికి కొత్తగా ఇంకా నేర్పవలెనా?

ఈ బాలునికి మంచి వెన్నముద్దలు భుజించే వయసు వచ్చింది. అతిశయించి ఇప్పుడు ఆ వెన్ననే ఆరగించుట నేర్చినాడు. నేడు అంచితముగ (పూజనీయుడై) శ్రీవేంకటగిరిమీద పూని వెలసిన వాడై అప్పలప్పనుచు (భలే భలే అంటూ) తన నీడయై మెలిగే దివ్యకాంతను (అలమేల్మంగను) బిగికౌగలించి దించరాదనినట్లు తన వురముపై నిలిపినాడు.

సంఖ్య : IV/336 రాగం : రామక్రియ

కీర్తన : నమ్మితేనితడే మన్ననగాచు

**69 నమ్మితే నితఁడే మన్ననఁ గాచు**
**యిమ్ముల ధ్రువునిఁ బట్టమేలించినట్లు** ॥పల్లవి॥

**తీరని కర్మములైన దీరుఁబో శ్రీహరిపాద -**
**మేరీతిఁ గొలిచినా నెవ్వరికిని**
**చేరరాని యడవిలో శిలలై పడియున్న**
**భారపుటహల్యశాపము దేరినట్లు** ॥నమ్మి॥

**కలుగనిసిరులెల్లఁ గలుగుఁబో శ్రీహరిఁ**
**గొలిచినవారికిఁ గోరినట్లే**
**అలనాఁడు దరిద్రుఁడైన కుచేలుని**
**బలుసంపదలఁ దెచ్చి బతికించినట్లు** ॥నమ్మి॥

**చూడఁగా మూఢులకైన సులభుఁడై నిలుచుఁబో**
**వేడుకతోఁ బాడితే శ్రీవేంకటేశుఁడు**
**యాగనే మాబోంట్లకు నిరవై కోనేటిదండ**
**మేడెపువరములెల్ల మెచ్చి యిచ్చినట్లు** ॥నమ్మి॥336

**ఉపోద్ఘాతము :**

భక్తిపొర్లిపొరలే కీర్తనలు చెప్పటంలో అన్నమయ్య సిద్ధహస్తుడని చెప్పటం రోహిణీ కార్తెలో భానుడు వేడిగా ప్రజ్వరిల్లుతుంటాడని చెప్పటం లాంటిది. అది అన్నమయ్య ప్రత్యేకత. అసలీ కీర్తన నెత్తుకుంటూనే, యేమంటున్నారో గమనించండి.

నారాయణుని భక్తులు చేయవలసినదల్లా మనస్సున ఆయనను నిలిపి నమ్మకం చెదరక వుంటే చాలు. కులగోత్రములు, వయస్సు, విద్యార్హతతో నిమిత్తం లేకుండా ఆనాడు నారాయణ మంత్రం పఠించిన ధ్రువునికి నింగిని ధ్రువతార జేసినట్లు ప్రఖ్యాతుల్లో విఖ్యాతుని జేస్తాడు. కుచేలుడు, అహల్య, తాపసులేకాదు పామరులూ సందర్శించగలిగిన తిరుమలేశుడైన కోనేటిరాయడైనాడు. ఇతనికంటే కరుణాకరుడెవరండీ?

**ఉ॥ ఇమ్ముల యాధ్రువున్ నిలిపె యేపున నింగిని తారజేయుచున్**
**కొమ్మని యాకుచేలునకు కూర్పెననంతములైన సంపదల్**
**ఇమ్మహిరాతిగా చెలగు ఇంతి అహల్యను నాతిజేసెబో**
**నమ్మిన చాలదా మదినినల్లని వేంకటనాథునిల్పుచున్.**

**భావోద్దేశ్యము :**

నమ్మితే ఈతనిని స్వయముగా ఈతడే అట్టి వారిని మన్ననతో కాపాడతాడు. ఎట్లాగో తెలియునా? అలనాడు తన భక్తుడైన ధ్రువునికి ధ్రువతార అయ్యే భాగ్యమిచ్చాడు.

శ్రీహరిపాదము నేరీతిగా గొలిచినా, యెవ్వరికైనా, తీరని పాపకర్మలు చేసినా, అవి తప్పక తీరిపోతాయి. ఆనాడు త్రేతాయుగంలో చొరరాని అడవిలో శిలయై పడియున్న అహల్యవద్దకు శ్రీహరి రామచంద్రుడై వచ్చి తన పాద స్పర్శతో ఆమెకు శాపవిముక్తి నీయలేదా?

శ్రీహరిని గొలిచినవారికి ఎవ్వరికీ కలుగని సిరిసంపదలైనా కలుగుతాయి. వారు శ్రీహరిని కోరక పోయినా వారి కోరిక తెలసికొని శ్రీహరే ఆ కోరిక తీరుస్తాడు. అలనాడు దరిద్రుడైన కుచేలునికి పలు సంపదలనొసంగి శ్రీకృష్ణమూర్తి బ్రతికించలేదా?

వేదపండితులను జ్ఞాన నిధులను రక్షించుట, అంతపెద్ద సంగతి కాదు. వారి జ్ఞానమే వారికి అండ. శ్రీవేంకటేశ్వరుడు తన భక్తులు పామరులైనా రక్షిస్తాడు. వారు కేవలం ఒక్క కీర్తన పాడితే చాలును. మాబోటి వారిని సైతము మన్నించటానికి ఈ స్వామి పుష్కరిణి దరిని వెలసిన ఈ తిరుమలేశుడు మెచ్చి మేడెపు వరములు (అందమైన వరములను) ప్రసాదించుటలేదా?

సంఖ్య : IV/144 రాగం : బౌళి

కీర్తన : నమో నమో దశరథనందన రామ

**70 నమో నమో దశరథనందన రామ**
**కమనీయయాగభాగకర్త రామ** ॥పల్లవి॥

**కాకుత్థ్సకుల రామ కౌసల్యాసుత రామ**
**శ్రీకరగుణోన్నత శ్రీరామ**
**కాకాసురవైరి రామ కౌశికవత్సల రామ**
**భీకరతాటకాంతకబిరుద రామ** ॥నమో॥

**వారిధిబంధన రామ వాలిహరణ రామ**
**చారుహరకోదండభంజన రామ**
**ధారుణీజపతి రామ దశకంఠహర రామ**
**సారవిభీషణాభిషేచన రామ** ॥నమో॥

**అమరపాలిత రామ అయోధ్యాపతి రామ**
**సమరకోవిద రామ సర్వజ్ఞ రామ**
**విమల రామ శ్రీవేంకటగిరి రామ**
**రమణ శరనాగతరక్షక రామ** ॥నమో॥**144**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య చెప్పిన శ్రీరామ సంస్తుతి కీర్తనలు భజన రూపంలోను గీర్వాణిలోనూ వున్నాయి. “చారుహరకోదండ భంజన”, “ధారుణీజపతి” అనడం నామాటలలోని సత్యాన్ని చాటుతున్నాయి. అంతెందుకు కీర్తన పల్లవిలోనే నాబోటి చాలామంది బొక్కబోర్లాపడేలా చేసే కీర్తన ఇది. నిజానికి, ఇది భజన. భజనలో (వివరించడానికి పెద్దగా లేకపోయినా) ఒక్కొక్క నామ విశేషణ తెలిపే ప్రయత్నం చేస్తాను. నిజానికి రామనామమే ముక్తిదాయకము.

**కం॥ దశరథ నందన రామా!**
**దశకంఠుని దనుజమూకc దరిగితివి నమో**
**పశుపతి ధనుస్సు విరుగగ**
**దిశలెల్లా పొగిడె నిన్ను తిరుమల రామా!**

**భావోద్దేశ్యము :**

ఓ దశరథనందనుడవైన శ్రీరామచంద్రా నీకు నమోవాకములు. కమనీయయ్యాగ భాగకర్తా (మనోహరమైన అశ్వమేధయాగమును చేసి ఫలమును దేశప్రజలకు దానము చేసినవాడా...) శ్రీరామా!

కాకుత్థ్సకులసంజాతుడవైన రామా! కౌసల్యాదేవి యొక్క సుపుత్రుడవైన శ్రీరామచంద్రా! శ్రీకరగుణోన్నత (మంగళప్రదమైన గుణములతో ఉన్నతుడవైన శ్రీరామచంద్రా! నీకు నమోవాకములు. కాకాసురుడు చేసిన నేరముచేత అతనికి వైరి అయిన రామా! కౌశికునికి (విశ్వామిత్రునికి) వత్సల (శిష్యుడమైన) రామా! భీకర రక్కసియైన తాటకి అనబడు దానిని సంహరించుటచే ప్రసిద్ధికెక్కిన శ్రీరామా! నీకు నమోవాకములు.

ఓ శ్రీరామా! నీవు సముద్రముపై లంకకు వారధిని (సంద్రమును) బంధించి సేతువును నిర్మించినవాడవు. సూర్యనందనుడైన వాలి అను కపిరాజు ప్రాణములను హరించినవాడవు. దేదీప్యమైన శివధనస్సును ఎక్కుపెట్టి విరిచిన అసమానబలశాలివి, ధారుణీజపతివి (భూదేవి పుత్రికయైన సీతను పరిణయమాడిన భర్తవు. దశకంఠుడైన రావణుని వాని అసురసేన సమేతముగా వధించినవాడవు. సద్వర్తనుడైన విభీషణునికి లంకారాజ్యమునకు యేలికగా అభిషిక్తుని చేసినవాడవు.

శ్రీరామా! నీవు దేవతలనే పాలించిన అయోధ్యా సామ్రాట్టువు. యుద్ధ విద్యలో సాటిలేని మేటివి. మానవునిగా జీవించినా సర్వం తెలిసిన నారాయణుడవు. నిర్మలుడవైన శ్రీరామా! నీవే కలియుగ దైవము శ్రీవేంకటపతివైన వేంకటరమణుడవు. శరణాగత రక్షకుడవు నీవే తండ్రీ!

సంఖ్య : II/187 రాగం : భైరవి

కీర్తన : నను జూచి హరి నీవు నవ్వకుండేవా

**71** **ననుఁ జూచి హరి నీవు నవ్వకుండేవా**
**పనిమా లెంత బయలుపాఁకీ నామనసు ॥పల్లవి॥**

**మనసుకు గోచరమా మాటలకు గోచరమా**
**కనుఁగొన వసమా నీఘనరూపము**
**నిను వెదకుచున్నాఁడ నీవెక్కడ నేనెక్కడ**
**జనుఁడ నింతె యెంత సాహసము నాది ॥నను॥**

**వున్నచో టెఱుఁగుదునా వోయీ అంటేఁ బలికేవా**
**యెన్ని తెలియఁదరమా యిట్టి నీమాయ**
**అన్నిటా నీకొలువుసేయఁ గడఁగుచున్నవాఁడ**
**యెన్నటిపొందు నీవు నా కెంత దిట్టతనమో ॥నను॥**

**వాకిలి గానవచ్చునా వంచించి చొరవచ్చునా**
**రాకపోక కబ్బునా పరమపదము**
**శ్రీకాంతుఁడ ప్రత్యక్షమై శ్రీవేంకటాద్రి యిదె**
**కైకొంటి నీకృప నెంత గట్టువాయతనమో ॥నను॥187**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య ఈ కీర్తనలో యేమంటున్నారంటే వో శ్రీహరీ! నాబోటి అల్పుణ్ణి చూచి నీవు నవ్వకుందువా? నేను యెంత పనికి మాలిన వాడిని? నా మనసు యెంత నిగ్రహములేనిది? నీ రూపము కనులకు కనుపించేదా? మాటలకు అందేదా? నీవెక్కడ నేనెక్కడ చెప్పవయ్యా! ఇంత అనంత విశ్వంలో మా భూమియెంత చిన్నది? ఇంత భూగోళంలో నా దేశమెంత చిన్నది? ఇంత సువిశాల భారతదేశంలో నావూరెంత చిన్నది? ఇందులో నేనుండే చోటు యెంత అల్పమైనది. మరి యీ మానవులు దేన్ని చూచి అహంకరిస్తారో కదా!

**కం॥ నను జూచి నీవు వో హరి!**
**వెనుకాడక నవ్వకుండ విడిచెదవయ్యా?**
**పనిమాలి యెంత పాకును?**
**మనసిది, శ్రీవేంకటేశ! మానకగొనవే.**

**భావోద్దేశ్యము :**

ఓ శ్రీహరీ! నీవు నన్ను జూచి నవ్వకుండా వుంటావా. నా మనసు పనిమాలి (పనికి మాలినదైపోయి) యెంత బయలు పాకీని? (యెంత భంగపడి తిరుగుతుంటుంది?)

ఓ ప్రభూ! నీ ఘనమైన రూపము. మనసుకు గోచరమవుతుందా? మాటలకు గోచరమౌతుందా? కనులతో నీ రూపాన్ని చూచే శక్తి మాకున్నదా? అసలు వెదకి నిన్ను కనుగొనుటకు, నీవెక్కడ నేనెక్కడ? నేను జన సామాన్యులలో వొకడను. అంతే. నాదెంత సాహసమయ్యా?

నీవెక్కడుందువో యెఱుగుదునా? నేను వోయీ! అని నిన్ను పిలిస్తే పలికెదవా? నీ మాయలిటువంటివని యెన్ని (లెక్కించి) చెప్పగల సమర్థుడనా? అన్ని విధములా నీకొలువు సేయుటకు సిద్ధపడినవాడను. నీవు యేనాటి పొందువో? నీ గురించి నేనంతయూ యెఱుగుదునని భావించుటకు నాదెంత దిట్ట తనమో కదా!

పరమపదము అని దేనినైతే అంటారో, అది రాకపోకలు చేయగల ప్రదేశమా? దాని ప్రవేశ ద్వారాన్ని గాంచే శక్తి మాకున్నదా? పోనీ నిన్ను వంచించి వైకుంఠం చొరవచ్చునా? శ్రీకాంతుడా! ప్రత్యక్షముగానున్న నీ శ్రీవేంకటాద్రిని స్వీకరించితివి. నీకృప యెంత గట్టువాయతనమో (విచ్చలవిడియైనదో) కదా!

సంఖ్య : IV/299 రాగం : వసంతం
కీర్తన : నిండెను లోకములెల్ల నెరి నితనికరుణ

**72** **నిండెను లోకములెల్ల నెరి నితనికరుణ**
**పండి రాసులాయఁ గీర్తిప్రతాపములెల్లను ॥పల్లవి॥**

**గరుడవేగమునఁ గదలె విజయరథ-**
**మిరవై యందు దేవుడేఁగుచుండఁగా**
**సొరిదిఁ బట్టుకుచ్చులు చుక్కలతో సందడించ**
**గరిమఁ బైఁడికుండలు గగనముదాఁకను ॥నిండె॥**

**అనిలవేగమున నదెవెడలె రథము**
**అనిమిషులు పగ్గములందుకొనఁగా**
**తనుఁదానె ఘనశంఖధ్వనులు దిక్కులనిండ**
**సునిసి చక్రము దనుజుల సాధింపఁగను ॥నిండె॥**

**వెలయ మనోవేగాన వేంచేసీ మగిడి రథ -**
**మెలమిఁ దమదాసులు యేచి పొగడ**
**అలమేలుమంగ దనకటు విడెమియ్యఁగాను**
**బలిమి శ్రీవేంకటాద్రిపతి మించీనిందును ॥నిండె॥299**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని రథోత్సవంలో స్వామి వైభవాన్ని వర్ణిస్తున్నారు. అనేక వాహనాలపై స్వామి వూరేగినా రథోత్సవంలో పాల్గొన్న వారికి ముక్తిప్రదం. అందరూ తలావొక చేయివేసే రథోత్సవం జన్మపావనకరం. ఆనాటి రథాలంకారములను వర్ణిస్తున్నారు.

ఆ రథం ఒకరోజు గరుత్మంతుని వేగంతో పరుగులెట్టిందట. ఒకరోజు వాయువేగంతో తరలిందిట. ఇంకొకసారి మనోవేగంతో ముందుకు పోయిందిట. అలమేల్మంగ స్వామివారికి ఆహ్వాన తాంబూలమునిచ్చిందిట. స్వామివారి కీర్తి ప్రతిష్టలు విశ్వవిఖ్యాతమైనవట. భక్తిపారవశ్యం లేని వారికిది వొక 'పాట'. ఉన్న వారికి కన్నులపండుగ. "యద్భావం తద్భవతి" అంతే.

**ఆ.వె॥ గరుడవేగమునను, ఘనవాయువేగాన**
**తిరురథమ్ముపైన దేవుడేచె**
**ఏగుదెంచెతేరు తగుమనోవేగాన**
**సతుల గూడి విభుడు చనెను, భళిర!!**

**భావోద్దేశ్యము :**

ఇతని కరుణ (ఈ శ్రీవేంకటేశుని కృప వలన) లోకములన్నీ బాగుగా నిండిపోయినవి. వీని కీర్తి ప్రతాపములు ఫలించి అనంతములుగా రాశికెక్కినవి (ప్రసిద్ధికెక్కినవి).

స్వామివారి విజయ రథము గరుత్మంతుని వేగముతో కదులుతున్నది. దానిలో దేవుడు ఇరవై (నెలకొని) యేగుచుండె (పోవుచున్నారు). సొగసైన పట్టుకుచ్చులు కదురుతూ నింగినున్న చుక్కలతో (నక్షత్రములను) తళుక్కుమనిపించుచున్నవి. ఆ రథములో పైడికుండలు ఒకదానిపై ఒకటి పేర్చినందువల్ల ఆకసంయెత్తున వున్నట్లున్నాయి.

తిరిగి బయలుదేరిన రథము, అనిలవేగము వాయువేగమున పోవుచున్నది. ఎందుకంటే ఈసారి పగ్గాలు పట్టి లాగుతున్నది అనిమిషులు (దేవతలు). స్వామివారి పాంచజన్య శంఖం చేసే ధ్వనులతో దిక్కులు పిక్కటిల్లుతున్నాయి. దానితోడైన సుదర్శన చక్రము దనుజులను చక్కబరచింది.

మరలిన ఆ రథము మనోవేగముతో వేంచేయుచున్నది. తమ దాసులందరూ జయజయ ధ్వానములు సలుపుచు అతిశయించి పొగడుతుంటే అలమేలుమంగమ్మ స్వామివారికి ఆహ్వాన తాంబూలమునందించింది. బలముతో శ్రీవేంకటేశ్వరుడు ఇందున (ఇక్కడ) అతిశయించినాడు.

సంఖ్య : IV/302 రాగం : కేదారగౌళ
కీర్తన : నిలచినవాడవు నీవేకాక దైవమా

**73** **నిలచినవాఁడవు నీవేకాక దైవమా**
**నెలవై ప్రకృతి నేను నీలోనిసొమ్ములము** ॥పల్లవి॥

**తటి నిరువదేను తత్వములుండఁగాను**
**యెఱఁగని యజ్ఞానానకెవ్వరు గురి**
**నెటిఁ జైతన్యమెల్లా నీసొమ్మై వుండఁగాను**
**యెఱుకవొక్కటేకాక యెవ్వరున్నారీడను** ॥నిలి॥

**దినలెక్క లూరుపులు తెచ్చి తెచ్చి వొప్పించఁగ**
**యెనలేని జన్మములకెవ్వరు గురి**
**వునికై బ్రహ్మాండము వొళ్ళునీకై వుండఁగాను**
**యెనసే ఆనందమేకా కెవ్వరున్నారీడను** ॥నిలి॥

**అచ్చపుసుముద్రవంటాత్మ లణువైయుండగా**
**యిచ్చఁ గామక్రోధాల కెవ్వరు గురి**
**నిచ్చలు శ్రీవేంకటేశ నీవేలికవై యుండఁగా**
**హేచ్చేటిదాస్యమేకాక యెవ్వరున్నారీడను** ॥నిలి॥**302**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనను నిగూఢంగా పరిశీలిస్తేగాని అర్థంకాదు. నిలిచిన అంటే శాశ్వతుడైన దైవము శ్రీమన్నారాయణుడు. శాశ్వతం అని భ్రమ కలిగిస్తూ శాశ్వతంకానివి ప్రకృతి, జీవినైన నేను ఈ జీవులూ ప్రకృతి సర్వమూప్రళయ కాలమున ఆ దైవములో కలిసిపోయేవే. అప్పుడు నిలిచే వాడు దైవమే. ఇదే నిజం. మనం ఒక నాటకం చూడటానికి వెళ్తే ఆ కాసేపు ఆ పాత్రధారుల భావాలు మనవే అనుకొన్నా మూడు గంటల తరువాత ఎవరిదారిన వారు పోతారని తెలిస్తే అంతతాదాత్మ్యం చెందము. మన బ్రతుకూ అంతే. ఇది కొన్నేళ్ళే. ఇప్పుడు మీకు ఏ భ్రాంతీ వుండదు. ఈ మాయావి శ్రీవేంకటేశ్వరుడని తెలిస్తే ఆయన దాసులమై పోతాము. అంతే....

**కం॥ నిలిచినవాడవు నీవే**
**నెలవై ప్రకృతియు నేను నీసొమ్ములమే**
**విలువైన వేంకటేశా!**
**చెలువగు నీదాస్య మొకటె సేమము నొసగున్.**

**భావోద్దేశ్యము :**

ఓ దైవమా! నీవు పరమాత్మవు. శాశ్వతుడవై నిలిచినవాడవు నీవే. ఈ ప్రకృతి, జీవాత్ముడినైన నేనూ నెలకొని నీ సొమ్ములై (ఆభరణములవలె) వుంటిమి. నీవు నిత్యుడవు, మేము అనిత్యులము. ఇదియే సత్యం.

తతి (సమీపమున) ఇరువదేను (ఇరవయ్యైదు) తత్వములు వుండగా వాటినేమీ యెఱుగని గొప్ప అజ్ఞానము నాది. దీనికెవ్వరు గుఱి (బాధ్యులు)? చైతన్యంలేకపోతే జీవి మరణించినట్లే కదా! మరి ఈ చైతన్యం నీవిచ్చిన సొత్తు. స్పృహ వొక్కటే కదా! చైతన్యం ఆ స్పృహ తెలిసినవానికి నీవు గాక అన్యులెవరున్నారు?

ఈ జన్మలో లెక్కవేస్తే నేనెన్ని సార్లు వూపిరి పీల్చానో చెప్పగల మొనగాడెవడు? నేను లెక్కపెట్టలేని జన్మలు యెన్నివున్నాయో? అదటుంచి ఈ జన్మలన్నిటికి ఎవ్వరు గుఱి (బాధ్యులు)? ఈ భూమిపై నేను తిరిగే చోటెంత? ఈ భూమివంటివి ఈ బ్రహ్మాండంలో యెన్నికోట్లున్నాయి?

ఈ బ్రహ్మాండము నీశరీరమట. అటువంటి అనంతుడవైన నీవు ఆగ్రహిస్తే విశ్వం వుంటుందా? అట్లా కాకుండుటకే నీవు ఆనంద స్వరూపుడవు. అందులో నీవు కాక ఇంకెవరున్నారు? ఇన్ని జీవులలో ఇన్ని ఆత్మల అణురూపములో వున్నవి. అందుకే ప్రాణులయందు ఆత్మనిండివుంటుంది. మరి ఈ జీవికి కలిగే కామక్రోధాలకు యెవ్వరు గుఱి? ఆటగాడెవరో తెలియని ఆట ఇది. ఇది మేమెఱుగగలమా? అందుకే ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీ దాసుడనైనాను. నాకు నువ్వు కాక మరెవ్వరున్నారు?

సంఖ్య : II/489 రాగం : మాళవిగౌళ

కీర్తన : నీచిత్త మిందరినేరుపునేరమి

**74 నీచిత్త మిందరినేరుపునేరమి**
**తోచి కాచి యిటు తుద కీడేర్చె** ॥పల్లవి॥

**దేవతలపాలు తీరనిపుణ్యము**
**ఆవలఁ బాపం బసురలది**
**భావింప మనుజులపాలివి రెండును**
**శ్రీవల్లభ నీసేసినమాయ** ॥నీచి॥

**వేదశాస్త్రములు విజ్ఞానమూలము**
**ఆది నసత్యము లజ్ఞానమూలము**
**సాదింప రెండును జగత్తుమూలము**
**భేదించి యివి నీపెరరేఁపణలు** ॥నీచి॥

**కావింపఁ గర్మము కాయముచేతిది**
**భావముచేతిది పరమము**
**తావుల రెండునుఁ దప్పనిప్రకృతివి**
**శ్రీవేంకటేశ్వర చేఁతలు నీవి** ॥నీచి॥**489**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య యెంత చిత్రమైన విషయం చెబుతున్నారో ఆలకించండి. మనస్సు భగవంతుని వలన సురలకు అసురులకు మానవులకు ఇవ్వబడ్డ ఒక కానుక. అది సురలకు గొప్ప వరప్రసాదమైతే, అసురులకు శాపం వంటిది. మానవులకు మాత్రం అదే గొప్ప ఉపకారి, అదే గొప్ప అపకారి అంటున్నారు. ఏదిమంచో ఏది చెడో తోచి అదే చివరకు మానవులను కాచి రక్షిస్తుంది అంటున్నారు. తీరని పుణ్యాలు చేసిన వారు దేవతలైతే అంతులేని పాపాలు చేసిన వారు అసురులవుతున్నారు. రెండూ చేసినవారే మానవులై జన్మించేది. మళ్ళీ ఇదంతా శ్రీవేంకటేశుని మాయయే.

**తే.గీ॥ వేద శాస్త్రాలు పుణ్యాలు వేల్పులవట**
**అవని పాపమజ్ఞానము అసురులవట**
**మంచి చెడుగులు రెండును మనుజులవట**
**వేంకటేశుడు శాసించి పెట్టినాడు.**

**భావోద్దేశ్యము :**

ఓ దేవదేవా! నీవిచ్చిన చిత్తము ఇందరి నేర్పు సామర్థ్యములకు ప్రతీక. దీనిలో నీవు తోచి ఆ జీవుణ్ణి కాచెదవు (రక్షింతువు). ఈ విధముగా తుట్టతుదిలో జీవుడు ఈడేరి ముక్తిని పొందగలడు.

తీరని పుణ్యము దేవతల పాలు. అటుపైన పాపమంతా అసురుల పాలు సుమా! మరి భావనా ప్రపంచంలో తలమునకలయ్యే మానవులపాలు ఈ పాపపుణ్యాలు రెండూను. ఇదంతా ఇట్లా యెందుకు జరుగుతున్నది? ఓ శ్రీవల్లభా! నీమాయవలన జరుగుతున్నది.

చతుర్వేదములు షట్శాస్త్రములు విజ్ఞానము యొక్క మూలము. అసత్యము అజ్ఞానము యొక్క మూలము. సాధింపగా ఈ విజ్ఞాన అజ్ఞానములు రెండూ జగత్తుయొక్క మూలము. విభేదించే ఈ రెండూ, దేవా! నీ ప్రేరేపణలే.

కర్మము చేయునది యెవరు? అది కాయము చేతిది. మరి పరమము గురించి భావము చేసేది యెవరు? మనస్సులోని భావమే. ఈ రెండూ యెందువలన తప్పుటలేదు? ప్రకృతి వలన. ఓ శ్రీవేంకటేశ్వరా! చివరకు ఈ చేతలన్నీ నీవే సుమా!

సంఖ్య : III/76 రాగం : లలిత

కీర్తన : నీమహి మది యెంత నీవు చేసేచేతలెంత

**75 నీమహి మది యెంత నీవు చేసేచేఁత లెంత**
**దీమసపునీమాయలు తెలియరాదయ్యా. ॥పల్లవి॥**

**నీపాదతీర్థము నెత్తి మోచె నొకఁడు**
**పూఁపకొడుకై యొకఁడు బొడ్డునఁ బుట్టె**
**యేపున నింతటివారి కెక్కుడైనదైవమవు**
**మోపుచు ధర్మరాజుకు మొక్కుటెట్టయ్యా ॥నీమ॥**

**నీలీల జగమెల్లా నిండియున్న దొకవంక-**
**నోలి నీలో లోకా లున్నవొకవంక**
**యేలీలఁ జూచినాను యింతటిదైవమవు**
**బాలుఁడవై రేపల్లెలోఁ బారాడితి వెట్టయ్యా. ॥నీమ॥**

**శ్రీసతికి మగఁడవు భూసతికి మగఁడవు**
**యీసరుస శ్రీవేంకటేశుఁడవు**
**రాసికెక్కి నీవింతటిరాజసపుదైవమవు**
**దాసులము మాకెట్ల దక్కితివయ్యా. ॥నీమ॥76**

**ఉపోద్ఘాతము :**

శ్రీవేంకటేశ్వరుడే మాయామానుషవేషధారియైన శ్రీకృష్ణుడని ప్రతిపాదిస్తూ కీర్తిస్తున్నారు అన్నమచార్యులవారు. నీ మహిమ ఇంత, నీ చేతలింత గొప్పవి అని అవధులెవరేర్పరచగలరు? అతిశయించిన నీ మాయలను గ్రహించుట మాకు సాధ్యమా? హరునికి విరించికి కూడా నీ మాయ అర్థం కాలేదు. మరి అంతటి వాడివి ధర్మరాజుకి నీకంటె పెద్ద బావగారిగా పాదాభివందనం చేశావు. లోకాలబ్బురపడే లీలలు చూపినవాడివి రేపల్లెలో మన్నులో పారాడావు. సిరుల శ్రీదేవి వనరుల వసుంధరకూ మగనివి. అంతటివాడివి నీ దాసులైన మాకు దక్కావు అంటున్నారు.

**ఆ.వె॥ నీమహిమది యెంత, నీ చేతలింకెంత**
**నీదు మాయ దెలియరాదు దేవ!**
**ఎవరినెట్లు బ్రోతువెవ్వడెరుగజాలు**
**వేంకటేశ! దాసవిభుడవయ్య!**

**భావోద్దేశ్యము :**

ఓ దేవదేవా! నీ మహిమ యెంతటిదో యెవరు చెప్పగలరు? నీవు చేసే చేతలెంత ఘనమైనవో యెవరు చెప్పగలరు? ధీమసమైన (ధైర్యవంతమైన) నీమాయలు తెలియరానివయ్య.

ప్రభూ! నీ పాదతీర్థమును తన నెత్తిమీద మోసినవాడు వొకడు (నారాయణుని పాదములనుండి పుట్టిన గంగను శిరసున ధరించిన శివుడు). నీ పసిబిడ్డ కొడుకు వొకడు నీ బొడ్డులోంచి పుట్టాడు (బ్రహ్మదేవుడు). మరి వీరిద్దరికీ అధికుడైన దేవుడవు నీవే కదా! అట్టి నీవు ధర్మరాజుకు నీకంటే పెద్ద బావ అని మొక్కావు. ఇదేమి వింతయ్యా?

నీ లీల ఈ విశ్వమంతా నిండివున్నది. మరి వొక వంక చూస్తే సమస్త విశ్వమూ నీ పొట్టలోనే వున్నది. ఏ విధముగా చూచినా నీ పొట్టలో జగన్నాటకమంతా యెలా జరుగుతున్నదో అర్థం కాదు. నీ లీలే అర్థంకాని వారికి నీవెంతటి దైవమవో యెలా తెలుస్తుంది? అటువంటి నీవు రేపల్లెలో యెలా మట్టిలో పొరాడినావు?

ఇటు చూస్తే శ్రీదేవికీ భూదేవికీ (ఇద్దరికీ) నీవే మగనివి. వీరి సరసన శ్రీవేంకటేశ్వరుడవు నీవే. ప్రసిద్ధి చెందిన రాజసమున్న శ్రీమంతుడవు నీవే. నీవే అటువంటి దైవమవు. మరి ఇంతటి దేవుడవు నీ దాసులమైన మా చేతికెలా చిక్కితివయ్యా? నీ మహిమనందుకే యెవ్వరూ చెప్పలేరు.

సంఖ్య : II/492 రాగం : దేవగాంధారి
కీర్తన : నీయంత నీవే యెరిగి నిచ్చ నన్ను గాతుగాక

**76** **నీయంత నీవే యెఱిఁగి నిచ్చ నన్నుఁ గాతుగాక**
**మాయలలోఁ బొరలేదిమ్మరివాఁడ నేను** ॥పల్లవి॥

**నీసరివాఁడనా నిన్ను దూరేవాఁడనా**
**దాసుఁడనై కొలిచిన తనుధారిని**
**వేసరించ నోపుదునా వెరపించఁగలనా**
**మాసినపాపాలలోనిమైల సోఁకినాఁడను** ॥నీయ॥

**విన్నవించేవాఁడనా వీడుజోడువాఁడనా**
**అన్నిటా శరణుచొచ్చినట్టిజీవిని**
**యెన్నిటి కుత్తరమిచ్చే యేపని సేసి మెప్పించే**
**మున్నిటికర్మములకు ముంగిట నున్నాఁడను** ॥నీయ॥

**యెదురాడేవాఁడనా యెలయించేవాఁడనా**
**సదరాన నీకు మొక్కేజంతువ నేను**
**ఇదివో శ్రీవేంకటేశ యెరుక నీ వొసగఁగా**
**పొదిగి నీమహిమలు పొగడుచున్నాఁడను** ॥నీయ॥**492**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య ఈ కీర్తనలో శ్రీహరి మహిమను ప్రశంసిస్తున్నారు. ఆయనకి అయ్యా! నీ భక్తులు పాపం కష్టాల్లో వున్నారు వెళ్ళి ఆదుకోవయ్యా! అని నచ్చచెప్పక్కరలేదు. ఆయన సర్వజ్ఞుడు. వాడు తన భక్తుడని ఆయన కనుగొన్న మరుక్షణమే తనే పరుగు పరుగున వచ్చి రక్షిస్తాడు. ఒకవేళ నా గ్రహచారం కొద్దీ నీవు రాకపోయినా నిన్ను నిందించు నీచుడినా నేను అంటున్నారు. పోనీ సరసంగా నిన్ను మందలిద్దామంటే నీకు ఈడుజోడైన వాడనా? మరి నిన్నేమని మందలింతును స్వామీ! నాది జ్ఞాన సిద్ధికి నీవిచ్చిన మానవజన్మ. అదే కరువైతే అది జంతువు జన్మే కదా!

**ఆ.వె॥ నిచ్చ నన్ను కాయు నీయంతటను నీవె**
**మాయ బొరలు మతిని మాలినోడ,**
**వేంకటేశ! నీవు వెనకనుండుచు కాయ**
**నీదు మహిమ బొగడ కాదు వశము.**

**భావోద్దేశ్యము :**

ప్రభూ! నీ భక్తుడనైన నేను కష్టాలలో వున్నానని మరియొకరు నీకు నచ్చ చెప్పనవసరం లేదు. నీయంతట నీవే తెలిసికొని వచ్చి పరుగు పరుగున రక్షింతువు గాక! నీవేమన్నా మాయలలో తగులుకొనే మతిమాలిన వాడవా యేమన్నానా?

పోనీ, నేనేమన్నా నీ సమానస్థాయి వాడనా? నిన్ను నిందించేపాటివాడనా? నీ దాసుడనై కొలుచుటకు నీవు ఇచ్చిన తనువును ధరించినవాడను. నీ మీద విసుగు చూపగలనా? పోనీ నిన్ను భయపెట్టే మొనగాడినా? పురాకృత పాపముల మైలసోకిన అధమాధముడను నేను.

నా దురవస్థలను విన్నవించే తెలివి వున్నవాడనా? కాను. చనువుగా నచ్చజెప్పే ఈడూ జోడైనవాడనా? కాను. అన్నిటా నీకు శరణార్థినైన నీ దాసుడను. అన్నిటా నిన్ను సమాధానపరచగల యేపనిజేసి నిన్ను మెప్పింతును? ఇంతా జేసి నా పురాకృత కర్మలు నా ముంగిటనే వున్నవి కదా!

స్వామీ! నీకు యెదురు చెప్పగల మొనగాడినా! పోనీ నీకు సర్దిచెప్పగల సమర్థుడనా? నేను సాదరంగా నీకు మొక్కే జంతువును. ఓ శ్రీవేంకటేశ్వరా! నామీద దయతో నీవు ఇచ్చిన యెఱుకతో నీ మహిమను పొగడగలుగుతున్నాను. లేకపోతే నాదెంత నీచమైన బ్రతుకు తండ్రీ?

సంఖ్య : VII/280 రాగం : మధ్యమావతి

కీర్తన : నెలమూడు సోబనాలు నీకు నతనికే తగును

**77 నెల మూడు సోబనాలు నీకు నతనికే తగును**
**కలకాలము నిచ్చ కళ్యాణమమ్మ ॥పల్లవి॥**

**రామ నామ మతనిది రామవు నీవైతేను**
**చామన వర్ణమతడు చామవునీవు**
**వామను దందురతని వామ నయనపు నీవు**
**ప్రేమపు మీ ఇద్దరికి పేరు బలమొకటే ॥నెల॥**

**హరిపేరాతనికి హరిణేక్షవు నీవు**
**కరిగాచే తాను నీవు కరియానవు**
**నరిజలధిశాయి జలధి కన్యవునీవు**
**బెరసి మీ యిద్దరికి పేరు బలమొకటే ॥నెల॥**

**జలజనాభు డతడు జలజముఖివినీవు**
**అలమేలు మంగవు నిన్నలమేతాను**
**ఇలలో శ్రీ వేంకటేశు డిటు నిన్నురాన మోచే**
**పిలిచి పేరు చెప్పే పేరు బలమొకటే ॥నెల॥**

**ఉపోద్ఘాతము :**

ఈ కీర్తన అన్నమయ్య అలమేల్మంగమ్మకు వినిపిస్తున్నారు. తల్లీ నెలకి మూడు శోభనాలు మీ ఇద్దరికీ యెంత చక్కగా అమరినవమ్మా!! కలకాలము ఇలాగే నిత్యకళ్యాణం పచ్చతోరణం వలె వుండి మాబోటి భక్తులను అనుగ్రహించండి. మీకంటే కనువిందైన జంట వుంటుందా? మీ ఇద్దరి మధ్య యెన్ని చక్కటి పోలికలున్నాయమ్మా! అందుకే మీ చక్కని జంటకు తగినట్లు శ్రీహరి నిన్ను తన హృదయవాసినివని తన వురముపై నిలుపుకొన్నాడు. ఇది మీ జంటకే తగినది.

**ఆ.వె॥ నెలకి మూడు సోబనాలు నీకతనికే**
**తగును కాలమెల్ల ధరణియందు**
**నిలిచిపోయెనమ్మ నిత్యకళ్యాణము**
**పచ్చతోరణంబు పతికి నీకు.**

**భావోద్దేశ్యము :**

ఓ తల్లీ! అలమేల్మంగమ్మా! మీ ఇరువురికి కలకాలము ఇదే విధముగా నెలకి మూడు శోభనాలు జరుగుతూ ఈ తిరుమలమీద మీకు నిత్యకళ్యాణము పచ్చతోరణం అనునట్లు వుండి భక్తులందరూ తరించెదరు గాక!

తల్లీ! మీ ఇరువురికీ అన్నీ యెంత చక్కగా తగినట్లు అమరినవమ్మా!! అతనిది రామనామము అని కదా! మరి నీవూ రామవు (వనితవు). అతనిది చామనవర్ణము (శ్యామల వర్ణ దేహము). నీవు చామవు (చమీకరము అంటే బంగారువన్నె కనుక బంగారు వర్ణవుదానివి) నీవు. ఆయన వామనుడు. నీవు వామనయనవు (లక్ష్మి యెడమకంటి కొననుండి చూచి అనుగ్రహిస్తుంది). మీ ఇరువురికి పేరు బలము ఒక్కటియే నమ్మా!

అతనిపేరే హరి. మరి నీవో హరిణేక్షణవు (జింక కన్నులు కలదానవు), అతడు కరిగాచినవాడు (గజేంద్రవరదుడు). మరి నీవో కరిగమనవు (మత్తకరీంద్ర గమన). అతడు నరిజలధిశాయి (పాలసముద్రము మధ్యలో పవళించువాడు). నీవు జలధికన్యవు. ఆ విధముగా మీ ఇద్దరికీ పేరు బలమొక్కటియే.

అతడు జలజనాభుడు. నీవు జలజముఖివైన శ్రీదేవివి. నీవు అలమేల్మంగవు. ఆతడు నిన్ను అలముకొనేవాడు (పైకొనువాడు). అందుకనే అతడు నిన్ను వదలలేక నిత్యమూ తన వురమున నిన్ను ధరించిన శ్రీధరుడు శ్రీవేంకటేశుడైనాడు.

❋

సంఖ్య : II/184 రాగం : మాళవిగౌళ
కీర్తన : నేరగల దొక్కటె నిశ్చలబ్రహ్మవిద్య

**78** **నేరఁగల దొక్కటె నిశ్చలబ్రహ్మవిద్య**
**వారివారియంతర్యామే వచ్చి పెరరేఁచీని ॥పల్లవి॥**

**వొక్కరు నేర్పఁగవద్దు వొగి సంసారధర్మము**
**దిక్కై పుట్టించిన ప్రకృతియు నేర్పీని**
**గుక్కక జంతులు చన్నుగుడుప నేరుపవద్దు**
**చక్కఁగా ననాదివాసనలే నేర్పీని ॥నేరఁ॥**

**ఆంచ నెవ్వరు నిద్రవొమ్మని బుద్ధిచెప్పవద్దు**
**మించి వారితమోగుణమే కప్పీని**
**కొంచక భుజియించుమని కోరి యచ్చరించవద్దు**
**పెంచినతనయాఁకలే పిలిచితెచ్చీని ॥నేరఁ॥**

**అట్టె పనివాటల అలవాటు చూపవద్దు**
**యెట్టైనా తనజాతే సేయిపించీని**
**వొట్టుక శ్రీవేంకటేశుఁ డున్నాఁడు కోనేటిదండ**
**పట్టికొలిచినవారే భాగ్యవంతు లిలను ॥నేరఁ॥184**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య నిశ్చయంగా యేమి చెబుతున్నారో ఆలకించండి. ముక్తి మీద ధ్యాస వున్నవారు అంతా నేర్వవలెనని ఆశించేది వొక్కటే. దానినే బ్రహ్మవిద్య అంటారు. వేదాంతమని దానికి మరొక పేరుకూడా వుంది. అందరికీ దానిపై మక్కువ కలుగదు వారి వారి అంతర్యామి ప్రేరేపించుట వలన మాత్రమే ప్రేరేపణ కలిగి కొంతమంది నేర్చెదరు అంటున్నారు. ఒక చిన్న వుదాహరణ చెబుతాను వినండి. అప్పుడే పుట్టిన శిశువుకు తల్లి చన్నుకుడవటం యెవరు నేర్పుతున్నారు? ఆ తల్లికాదు. మరెవరు? వాని పూర్వజన్మ జ్ఞానమే. అలాగే వానికి వేంకటపతి భక్తినిచ్చేదీ ఆ తిరుమలయ్యే. ప్రయత్నంతో వచ్చేది కాదది.

**తే.గీ॥ నేరఁగల దొక్కటే అదే నిశ్చయముగ**
**బ్రహ్మ విద్యనాబడును పో వారివారి,**
**అంతరాత్మ ప్రేరేపించ అమరునదియె**
**వేంకటేశుడు కృపజూపి వెనుకనుండ.**

**భావోద్దేశ్యము :**

ఈ ప్రపంచంలో విద్యలన్నిటిలోకి సర్వశ్రేష్ఠమైనది బ్రహ్మవిద్యయైన వేదాంతమే. నిశ్చలమైన అదొక్కటే నేర్వగల విద్య కాని,అది నేర్వవలెనని ప్రేరేపణ కలిగించునది మాత్రం అంతర్యామివలె మనలో సంచరిస్తున్న శ్రీహరియే.

సంసారధర్మమేమిటో జీవికి, ఒగి (పూనుకొని) వొకరు నేర్వగవద్దు (నేర్వవలసిన పని లేదు). ప్రకృతి రూపంలో జీవులకు దిక్కై పుట్టించిన వాడే నేర్పిని. గుక్కక (అనుమానించక) జంతువేదన్నా తన బిడ్డలకు చన్నులు పీల్చి పాలు త్రాగుట నేర్పుతుందా? ఆ జీవికి తన గత జన్మ వాసనయే అది నేర్పుతుంది.

ఎవ్వరు "వేళయిందిరా ఇక నీవు నిద్రపోవాలి" అని ప్రేరేపించి ఈ జీవికి చెబుతున్నారు? ఆ జీవుల తమోగుణమే వారినందుకు ప్రేరేపిస్తున్నది. ఒరే సంకోచించవద్దు నీకు ఆకలేస్తున్నది అని యెవరు వీనిని హెచ్చరిస్తున్నారు. పెంచిన తన ఆకలే పిలిచి తెచ్చినట్లు, ఆపని చేస్తుంది.

అదే విధంగా నీవు చేసే పనిపాటలే నీ అలవాట్లుగా మారుతాయని, ప్రత్యేకించి నీవు నిరూపించనక్కరలేదు. ఎట్టైనా తన జాతిధర్మమే తన చేత ఆ పని చేయిస్తుంది. ఈ స్వామి పుష్కరిణి అనేటి కోనేటి దరిని స్వామి శ్రీవేంకటేశ్వరుడే దైవమని పట్టి కొలిచేవారు ఈ ఇలలో గొప్ప భాగ్యవంతులు కదా!

సంఖ్య : I/274 రాగం : మలహరి

కీర్తన : పండియు బండదు చిత్తము పరిభవ మెడయదు కాంక్షల

**79 పండియుఁ బండదు చిత్తము పరిభవ మెడయదు కాంక్షల**
**యెండలనే కాఁగితి మిఁక నేలాగోకాని ॥పల్లవి॥**

**పదిగోట్లుజన్మంబులఁ బాయనికర్మపుఁబాట్లు**
**వదలక వొక నిమిషములో వడిఁ దీరుచు నితఁడు**
**చెదరనినిజదాసులకును శ్రీహరి, మాకిపు దంతక**
**హృదయము నిలువదు చంచల మేలాగోకాని ॥పండి॥**

**కూపపుబహునరకంబుల కోట్లసంఖ్యల బొరలేటి-**
**పాపము లొకనిమిషములోఁ బాపఁగఁగలఁ డితఁడు**
**కాపాడఁగఁ దలచిన యీకమలాపతి, నే మీతని-**
**యేపునఁ గని మనలే మిఁక నేలాగోకాని ॥పండి॥**

**జడిగొని యెన్నడుఁ బాయనిసంసారపుబంధంబుల**
**విడుమని వొకనిమిషములో విడిపించును యితఁడు**
**కడుఁగొలిచినవారికి వేంకటపతి, నే మీతని-**
**నెడయక కొలువఁగలేమిఁక నేలాగోకాని ॥పండి॥274**

**ఉపోద్ఘాతము :**

మానవుని చిత్తవృత్తులను ఆవిష్కరిస్తున్నారు అన్నమయ్య. ఈ చిత్తమున్నదే... ఇది మన జీవిత కాలంలో పరిపక్వత నొందింది అనిపిస్తుంది. ఇంకొకప్పుడు ఛీఛీ పరిపక్వత చెందలేదనిపిస్తుంది. ఎందుకంటే, ఇది తనకు జరిగిన అవమానాన్ని మరువదు, దాని కాంక్షలు పోవు, ఆకాంక్షల యెండలలో కాగిపోతూనే వుంటుంది. కర్మలవల్ల పాట్లు పడుతూనే వుంటుంది కాని హృదయంలో శ్రీహరిని నిలుపదు. ఆ కమలాక్షుని మదిలో సందర్శించలేదు. సంసార బంధాలనుంచి బయటపడదు. మరెట్లాగయ్యా తిరుమలయ్యా?

**కం॥ పండియు బండదు చిత్తము**
**యెందును కాంక్షలని పిలుచు యెండలలోనన్**
**మెండుగ, మరువదు మనసును**
**చెందెడి పరిభవమునైన శ్రీగిరినిలయా!**

**భావోద్దేశ్యము :**

మధుసూదనుడు, మన చిత్తముననే (మనస్సులో) వున్నది చూశారా, ఇది ఒకప్పుడు పరిపక్వమై పండినదానిలా ఆలోచిస్తుంది. మరి ఇంకొకప్పుడు పరిపక్వత చెందని దానిలాగా ప్రవర్తిస్తుంది. ఎందుకంటే ఇది తనను పరిభవించిన (అవమానపరచిన) వారిని మరువదు. కాంక్షలు అనబడెడి యెండలలో కాగిపోతిమి (ఎండిపోయాము). ఏలాగోకాని యేమీ బోధపడుటలేదు.

శ్రీహరీ ఈ జీవులు తాము పదికోట్ల జన్మలలో మగ్గినా వదలని కర్మపు పాట్లను (కర్మ ఫలమును) ఒక్క నిమిషములో, శీఘ్రముగా తీరుస్తుంటాడు. చెదరని, హరి నిజదాసులమైన మేము మా హృదయంలో ఆతనిని నిలుపుదుము. ఇక మాకు ఈ చంచలత్వము (చపలత) యెందుకు వస్తుంది?

ఈ కమలారమణుడు, బహునరక కూపములు కోట్ల సంఖ్యలో వున్నా అందులో తపించేవారి పాపములను నిమిషములో పోగొట్టగలడు. ఆయన కాపాడాలనుకొంటే చాలును. అందుకే మేము కృత నిశ్చయులమై ఈయనను దర్శించి మన్నన ప్రాప్తినొందాము. ఇక యేలాగున కాని మాకు భయములేదు.

ఈ శ్రీవేంకటేశ్వరుడు, బిగించిపట్టి యేనాటికీ వదలని సంసారబంధములను సైతము ఒక్క నిమిషములో విడిపిస్తాడు. కాకపోతే మన అంతిమ క్షణాలదాకా ఆతనిని విడువరాదు. మరి అలా కొలువలేకపోతే యేలాగుననో ఆయననే నమ్ముకొన్నాము కదా!

సంఖ్య : V/320 రాగం : సామంతం

కీర్తన : పడతి నిను దలచిపో పలుకడతడు

80 పడఁతి నినుఁదలచి పో పలుకఁడతఁడు. నీ-
వెడసినను బ్రాణంబులెరవులాతనికి ॥పల్లవి॥

వెదచల్లు నీ మోము వెన్నెలలఁ దలఁచిపో
పొదలు వెన్నెలబయటఁ బొలయఁడతఁడు
ముదిత నీ నెరులు దురుమును దలఁచిపో యతఁడు
కొదమతేంట్లఁ (టుల?) గనిన గుండె జల్లనును ॥పడఁతి॥

లలితాంగి నీ దేహలత దలఁచి పో యిపుడు
చెలఁగి వనమునకు విచ్చేయఁడతఁడు
వెలఁది నీమోవికావిరి దలఁచి పో యతఁడు
తలిరాకు గని గుండె తల్లడంబౌను ॥పడఁతి॥

కోమలిరొ నీయిట్లకూటములు దలఁచి పో
ప్రేమమితరములపైఁ బెట్టఁడతఁడు
దీమసపు వేంకటాధిపుఁడుగన యాతనికి
సామాన్యసరసతలు సరకుగావరయ ॥పడఁతి॥320

**ఉపోద్ఘాతము :**

భక్తి వైరాగ్య కీర్తనల సమ్మేళనంలో, ఈ శృంగార కీర్తనలు అడపాదడపా అన్నమయ్య కవితాచాతుర్యం చూపటానికి రావటం ఆ తిరుమలయ్య లీలయే కాబోలు. జగన్నాథుడు విరహవేదనతో సామాన్య సరసతలను సరకు చేయడట. లలితాంగి తలపున కొచ్చినప్పుడు పలుకడుపో! అంటున్నారు. ప్రాణములనుకూడా యెరువుసరుకుగానే భావిస్తున్నాడట. ఆమె దేహ సౌందర్యం తలచిన అతనికి గుండె తల్లడిల్లి పోతున్నదట. వెన్నెలవంటి ఆమె శోభ దలచి, ఆమె కూటమికై తపించి దేనిపైనా ప్రేమ కలగదతనికి. మన్మథుని తండ్రికి ఈ మదన తాపమేలనో?

ఉ॥ నిన్నుదలంచిపో, యతడు నెచ్చెలి! పల్కడు, ప్రాణముల్ భళీ
ఉన్నను యెంచడాయెనవియుర్విని శాశ్వతమైనవంచు, నీ
మన్నన ప్రేమలన్ దలచి మానిని! కూటమికై తపించు పో,
వెన్నుడు వేంకటేశ్వరుని వేదన జెప్పుట మాకు సాధ్యమా?

**భావోద్దేశ్యము :**

ఓ నెచ్చెలీ! నిన్ను దలచి ఇక అతడు మౌనముద్ర వహించినాడు పో! ఎవ్వరితోను పలుకుటయే మానెను. నీవు యెడసినను (దూరమైనను) ఆతనికి ప్రాణములు యెరవులే (చేబదులువలె అశాశ్వతమైనవే)

నీ వదనము వెదజల్లెడి లేవెన్నెలల దలపోసి అతగాడు వెన్నెలలో బయట ఒలయడు (ప్రవేశించడు). ఓ ముదితా! నీ నీలికేశపాశముతో చుట్టిన నీ కొప్పును తలపోయుచు అతగాడు, కొదమ తేటులను (గండుతుమ్మెదలను చూచి) నీ తురుము గుర్తుకు వచ్చి ఆతని గుండె జల్లనుచున్నది. జగన్నాథునికి ఈ వేదన యేలనమ్మా?

ఓ లలితాంగీ! నీ లతవంటి దేహము తలపునకు వచ్చినదంటే పో! ఇక అతగాని వింత ప్రవర్తన నేమందును? ఇప్పుడు ఉద్యానవనములకు పోవుటయే త్యజించినాడమ్మా! ఓ వెలదీ! నీ మోవి, కావిరి (లే-నలుపు అరుణిమ) స్మృతికి వచ్చిందంటే పో! అతడు లేత చిగురాకులను చూచినాడంటే గుండె తల్లడంబౌను (తల్లడిల్లిపోతోందమ్మా!)

ఓ కోమలీ! ఇట్లా నీ కూటమి తలపున మెఱసినదంటే పో! అతగాడు తన ప్రేమను దేవిపైనను బెట్టడు. కాని అతగాడెవ్వరనుకొన్నావు? దీమసపు (ధీరోదాత్తుడైన) శ్రీ వేంకటేశ్వరుడు. కాబట్టి ఆతనికి జనసామాన్యుల శృంగారము తరచిచూస్తే లెక్కేమిటి. దేవి ప్రేమ స్వామికి ఆత్మ పరమాత్మల సంయోగము.

సంఖ్య : II/182 రాగం : రామక్రియ

కీర్తన : పాటెల్లా నొక్కచో నుండు భాగ్య మొక్కచో నుండు

**81 పాటెల్లా నొక్కచో నుండు భాగ్య మొక్కచో నుండు**
**యీటువెట్టి పెద్దతనా లెంచఁ బనిలేదు ॥పల్లవి॥**

**సరవిఁ గలకాలముఁ జదువుచుండు నొకఁడు**
**గరిమ నీకృప నిన్నుఁ గను నొకఁడు**
**ధరఁ బ్రయాసముతోడఁ దపముసేయు నొకఁడు**
**శరణుచొచ్చి నీకుఁ జనవరౌ నొకఁడు ॥పాటె॥**

**వొక్కఁడు మోపుమోచు నొక్కఁడు గొలువుసేయు**
**వొక్కఁడు పొగడీ త్యాగ మూరకే యందు**
**వొక్కఁ డాచారము సేయు నొక్కఁడు మోక్షము గను**
**యెక్కడా నీకల్పన కేమిసేయవచ్చును ॥పాటె॥**

**భావించ నటుగాన ఫలమెల్లా నీమూలము**
**యేవలనైనా నీవు యిచ్చితేఁ గద్దు**
**జీవులు నిన్నెఱఁగక చీఁకటి దవ్వఁగనేల**
**శ్రీవేంకటేశ్వర నిన్ను సేవించేదీ నేరుపు ॥పాటె॥182**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య సుమధురమైన ఈ కీర్తనలో యేమి చెబుతున్నారో ఆలకించండి. ఎవరు చేసికొన్న అదృష్టం వారిది. కొంతమందికి జీవితం కష్టాలతోనే గడుస్తుంది. కొందరికి యెప్పుడూ సుఖంగానే గడుస్తుంది. వీడు పెద్దవాడని, వీడు అల్పుడని భావించవలసిన అవసరం లేదు. ఒకడు జీవితాంతం చదువుతూనే వుంటాడు. ఒకడు నీ కృపవలన నిన్ను కనుగొంటాడు. ఒకడు యెంతో ప్రయాసపడి నీకోసం తపస్సు చేస్తాడు. ఒకడు సర్వమూ వదలివేసి నీ శరణాగతితో నీ అనుగ్రహం సంపాదిస్తాడు. మరి దీనినంతా యేమని వివరించగలమయ్యా! వేంకటేశ్వరా! దీనిని నీవే వివరించాలి. నాకు తెలిసిందొక్కటే... “ఎవరి భాగ్యము వారిది”... అంతే.

**కం॥ పాటెల్ల నుండు నొకచో**
**వాటముగా మరొకచోట భాగ్యంబుండున్**
**యేటికిజీకటి త్రవ్వగ**
**నీటుగ సేవించ నిన్ను నీరజనాభా!**

**భావోద్దేశ్యము :**

నీరజనాభా! యేమని దీనిని వివరించగలమయ్యా? ఒకడికి జీవితాంతం పాటెల్లా (శ్రమంతా) వుంటుంది. అంతే తమాషాగా భాగ్యమంతా మరొకడికి దక్కుతుంది. యీటువెట్టి (శ్రమపడి) పెద్దతనాలు (గొప్పతనం) యెంచే పనేలేదు.

ఒకడు కలకాలము శ్రమలకోర్చి చదువులు కొనసాగిస్తూనేవుంటాడు. మధ్యలో నీ కృప వలన మరొకరు నిన్ను కనుగొనగలుగుతున్నాడు. ఒకడు అనేక ప్రయాసల కోర్చి నీకోసం తపస్సు చేస్తుంటే, మరొకడు నిన్ను శరణుజొచ్చి నీపట్ల చనువుగలవాడై, నీవాడు అవుతున్నాడు. ఏమిటీ వింత ప్రభూ!

ఒకడు బ్రతుకు బరువు పంటిబిగువున మోయలేకమోస్తుంటే, మరొకడు ఇతరులతో కొలువు సేయించుకొంటున్నాడు. ఒకడు పరులను పొగడి జీవిస్తుంటే, మరొకడు వూరకనే పరుల త్యాగమును పొందుతూ జీవిస్తున్నాడు. ఒక్కడు యెంత సదాచారియై జీవించినా అలాగే వుంటే మరొకడు సులభముగా ముక్తిని పొందగలుగుతున్నాడు. ఇదంతా నీ కల్పన. దీనికెవరేమిసేయగలరయ్యా!

దేవా! భావించి చూస్తే యేపనికైనా ఫలమునీమూలంగానే కలుగుతుంది. అది మంచైనా చెడైనా, నీవిచ్చావంటే తిరుగేలేదు. ఈ జీవులు నీ తత్త్వాన్ని గ్రహించలేక చీకటిని త్రవ్వుతూ వెలుగు కోసం పరితపిస్తున్నారు. ఓ శ్రీవేంకటేశా! అన్నీ వదలివేసి నిన్ను సేవించే వాడిదేనయ్యా! నేర్పు అంటే.

సంఖ్య : IV/309 రాగం : భల్లాటి
కీర్తన : పెదయౌభళపు గొండ బెరిగీనిదే

**82** పెదయౌబళుఁగొండఁ బెరిగీనిదే
వదలకకొలిచితే వరములిచ్చీని ॥పల్లవి॥

పదివేలశిరసులబలునరసింహము
గుదిగొన్నచేతుల గురుతైనది
ఎదుటఁ బాదాలుఁ గన్నులెన్నైనఁ గలిగినది
యిది బ్రహ్మాండపుగుహ నిరవైనది ॥పెద॥

ఘనశంఖచక్రాదుల కైదువలతోనున్నది
మొనసి రాకాసిమెకములఁ గొట్టేది
కనకపుదైత్యుని కడుపుచించినది
తనునమ్మిన ప్రహ్లాదుదాపును దండైనది ॥పెద॥

శ్రీవనితఁ దొడమీఁదఁ జేకొని నిలిపినది
దేవతలు గొలువ గద్దెపై నున్నది
శ్రీవేంకటాద్రియందుఁ జెలఁగి భోగించేది
భావించి చూచితేను పరబ్రహ్మమైనది ॥పెద॥**309**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య ఈ కీర్తనలో పెదఅహోబల నరసింహుని కీర్తిస్తున్నారు. కొలిచినవారికి కొల్లలుగా వరాలిచ్చే దైవం ఈ స్వామి. బ్రహ్మాండమునకు ప్రతీక ఈ గుహ. ఈ స్వామికి అనేక బాహువులున్నాయట. ఇంత ఘోర హిరణ్యదైత్యుడు రెండు చేతులకు చిక్కక తొడపైనుంచి పారిపోయి ఇంట్లోకెళితే వాడు చావడు కనుక రెండు పాదాలు కూడా చాపి తొక్కిపట్టాడు. సింహము కదా! మరి. కోరలతో గోళ్ళతో చీల్చి చంపాడు.

సీ॥ పదివేల శిరసుల బలు నరసింహంబు
గుదిగొన్న జేతల గురుతెఱుగుడు
ఘనశంఖ చక్రాల కైదువలనుబూని
రాకాశి మెకముల పీకనులిమె
కనకపుదైత్యుని కడుపును చీల్చెను
ప్రహ్లాదునేలిన వరదు డితడు
శ్రీలక్ష్మి దొడ మీద నిలిపిన సింగంబు
వేల్పు లెల్లరు గొల్వ వేడిశరణు

**తే.గీ॥ వేంకటాద్రిపై భోగించువీడె వాడు**
**భావమున నిల్చు పరమాత్మ వదలకుండ**
**అమితవరములు పెదయౌభళమునవిచ్చె**
**కొలువు డీతని దిక్కని కొండనెక్కి**

**భావోద్దేశ్యము :**

ఓ భక్తులారా! ఇది పెద ఔభళము కొండ పెరిగినిదే (చాలా ఉన్నతమైనది). ఈ కొండపైని దేవుడు విడువకుండా భక్తితో కొలిస్తే అనేక వరములనిస్తాడు.

ఈ నరసింహుడు గొప్ప బలమున్న పదివేల శిరసులున్న దేవుడు. అతిశయించిన పెక్కు హస్తములవాడు. అందుచే ప్రసిద్ధికెక్కినవాడు. తన పాదాలను ఎదురుగా చాచివుంచిన ఈయనకు కన్నులు కూడా అనంతమే. ఈ బ్రహ్మాండమైన గుహలో ఈ స్వామి నెలకొనియున్నాడు.

ఘనమైన శంఖ చక్రాలను ఆయుధములుగా ధరించినదీ నరసింహము. కనకపు దైత్యుని (హిరణ్యకశిపుని) కడుపు చీల్చి చంపినదీ సింహము. తనను నమ్మిన ప్రహ్లాదునికి దండి (నిబ్బరమైనదీ) సింహమే.

శ్రీలక్ష్మిని తన వామాంకమున నిడుకొన్నదీ నృసింహమే. దేవతలు కొలుచుచుండగా గద్దెపై (సింహాసనముపై) కూర్చొనివున్నదీ సింహము. శ్రీవేంకటాద్రిపై చెలగి (అతిశయించి) భోగించుచున్నదీ ఈ నరసింహమే. భావించినవారికి ఈ నృసింగమే పరబ్రహ్మము.

సంఖ్య : XV/429 రాగం : కీరవాణి

కీర్తన : భక్తవత్సలుఁడవుగా భావించ నీ కిది దగు

**83** **భక్తవత్సలుఁడవుగా భావించ నీ కిది దగు**
**శక్తి నీ కెంతైనాఁ గద్దు సర్వేశ్వరా** ॥పల్లవి॥

**నా వాడవే యని వుందు నవి నీ వెవ్వరికైనా**
**ఆవల నందరివాఁడవై వుండుదువు**
**భావించనిందుకొరకా బహురూపుఁడ వైతివి**
**వేవేలు శిరసులతో విశ్వమూరితీ** ॥ ॥భక్త ॥

**నీ పేరు నా నాలికపై నెలకొనె యీ రీతినే**
**దాపై యందరినోళ్ళ దగి లున్నవి**
**యేపునఁ బెక్కు నామము లిందుకా పెట్టుకొంటివి**
**వోపి నానాశబ్దముతో నుర్వీధరా** ॥ ॥భక్త॥

**యేలికెవు నాకని యెంచుకొందు నేపొద్దు**
**యీలీల నందరికి నేలికవట**
**తాలిచితి వనంతావతారాలు నీ వీ పనికా**
**వేళతో నానాగతి శ్రీవేంకటేశ్వరా** ॥ ॥భక్త॥

**ఉపోద్ఘాతము :**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో సర్వేశ్వరుని వైభవాన్ని వర్ణిస్తున్నారు. ఆయన భక్తవత్సలుడంటున్నారు. అపరిమితమైన శక్తివంతుడు అని భావిస్తే అందులో ఆవంతయైనా అసత్యం లేదు. జీవులు అందరూ ఆయనవారే. పెక్కు నామములవాడు. జీవులకి కంఠ స్వరమును ఇచ్చిన కరుణామయుడు. అనంతమైన అవతారాలను ఆ దేవదేవుడు యెందుకెత్తాడు. జగత్పరిపాలనా భారం మోస్తున్నది ఆయనే. అందులో అంతర్భాగ దుష్టశిక్షణ, శిష్ట రక్షణ, నిర్విరామంగా ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటాడు. శ్రీవేంకటేశ్వరునిగా కోరిన వారి కొంగు బంగారమైనాడు.

**కం॥ శక్తియుతుడ వీవెంతో**
**భక్తుల వత్సలుడవనుచు భావింతురుగా**
**ముక్తిని వేంకటపతివై**
**యుక్తులకే యిత్తువయ్య! ఓ సర్వేశా!**

**భావోద్దేశ్యము :**

ఓ సర్వేశ్వరా! నీకెంతైనా శక్తి యున్నది. భక్తవత్సలుడవైన నీవు దయాసాగరుడవని భావించుట యెంతో తగియున్నది.

నా వాడు అని యెందరో భ్రమిస్తుంటారు. కాని నీవు అందరివాడవు. ఇలా అందరూ భావిస్తారు కాబట్టే నీవు అన్ని రూపములూ నీవిగా వుంటివి. అందుకే నీవు విశ్వరూపుడవైనావు. వేలకువేల శిరస్సులతో వున్న నీ రూపాన్ని చూడగల మొనగాడెవడు?

ఓ ఉర్వీధరా! నా నాలిక యెప్పుడూ నీ పేరునే పలుకుతుంటుంది. ఇంతమంది నోళ్ళలో నీవు తగిలియున్నావు కాబట్టే వారందరికి మాట్లాడే శక్తి కలిగింది. అందుకేనా స్వామీ! నీకు పెక్కు నామములున్నవి. ఎవ్వరు యేపేరుతో పిలిచినా భక్తివుంటే పలుకుతావు. నానా శబ్ధములతో పలికే జంతువులకూ నీవే శబ్దోచ్చారణ శక్తినిచ్చావు.

నేనేపొద్దునైనా, నీవే యేలికవు అని భావింతును. కాని నాకే కాదు నీవు అందరికీ యేలికవని గ్రహించాను. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు అనంతమైన అవతారములను దాల్చితివి, దేనికోసం? నానాగతుల భక్త రక్షణకే.

సంఖ్య : XVI/380 రాగం : సామంతం

కీర్తన : భళిభళి మాకిది పరిణామము

84 భళి భళి మాకిది పరిణామము
పెలచగు వలపులు పెరిగీఁగా ॥పల్లవి॥

ఆకెకు నీకును నంగన వొక్కతె
సాకిరి గలిగెఁగా సంగడిని
చేకొని మాకును సెలవుల నవ్వుచు
సైకపుసరసము జరగీఁగా ॥భళి॥

మదన రహస్యపు మర్మము చిలుకలు
అదనుగ నేర్చెఁగా అన్నియును
కదిసిన సిగ్గులు గరఁగుచు మీలో
నుదుట సంతసము లొనరీఁగా ॥భళి॥

శ్రీవేంకటేశ్వర చెలినీకూటమి
భావపుకళలై పయికొనెఁగా
యీవలనీవే యిటు ననుఁగూడితి
కైవశము నాకుఁగలిగీఁగా ॥భళి॥

**ఉపోద్ఘాతము :**

పరమాత్ముని శ్రీవేంకటేశ్వరునిగా తన భావనలలో నిలుపుకొన్న అన్నమయ్య తిరుమలేశుని శృంగారకేళిని ఆలపిస్తుంటే ఒక అనిర్వచనీయమైన భావావేశంలో వోలలాడుతుంటారు. అప్పుడు ఆయన నోటివెంట మాటలు పలికించేది సాక్షాత్తు శ్రీనివాసుడే. ఆ భావనను "వ్యాకరణ చట్రం"లో బిగించాలని అనుకోవడం శుద్ధ తెలివిమాలిన పని. భావాన్ని అన్వయించుకొని మనబోటి అల్పులు "ఇదింతే" అయివుంటుందని అన్వయించుకోక తప్పదు. ఎందుకంటే మనకు ఆ తిరుమల నాథుని కృప ఆ మేరకు రాదు గాక రాదు. మనబోటి వారు వారివారి భాషా పాండిత్యాన్ని బట్టి యేదో "గిలుకుతారు" కాని దీని భావమేమి తిరుమలేశ! అని మనస్సు పీకుతూనే వుంటుంది. అన్నమయ్య శ్రీపతి శ్రీవనితల అనుంగు చెలి. ఆమెదీ స్వామి కూటమికి కలలు కనే మధుర ఆరాధనే.

**తే.గీ॥ వలపుతీర్మానమాయె పో! భళిర! మాకు**
**పెంకివలపులు తరుగవు పెరిగితీరు**
**మన్మథుని కేళియైయిది మారిపోయె**
**వేంకటేశుడు చెలిగూడి పెచ్చుమీరె.**

**భావోద్దేశ్యము :**

అహో! భళా! మాకిదియే పరిణామ (మంచి తీర్మానము). పెలుచగువలపులు (పెంకెతనముతో) గూడిన ప్రేమలు వృద్ధిజెందుతాయి గాని యేనాటికీ క్షీణించవు.

స్వామీ! ఆమెకు నీకు మధ్య ఒక అంగన (ఆడుది) సాకిరి (సాక్షిగా) వ్యవహరించవలెనా? మమ్మల్నికూడా మన్నించి సైకపు సరసము (నిర్మలమైన సరసత్వము)చే మీరు అనురాగముతో వుండెదరుగాక!

మీ జంట ఒక వింత గమనించుట లేదు. మీ పెంపుడు చిలుకలు తమలో తాము మదనరహస్యముల మర్మమును గూర్చి మాటలాడుకొంటున్నాయి. అవి యెవరి నుంచి వాటిని నేర్చినవో మేము వివరించవలెనా? కాని దీనివలన ఒక మంచి పని జరిగింది. ముప్పిరిగొన్న సిగ్గులు ఒకింత సడలి మీలో ఉప్పొంగిన ఆనందములు కలిగినవి.

ఓ శ్రీవేంకటేశ్వరా! దేవితో నీ కూటములు భావపుకళలై (మదన విలాసములై) పయికొనినవి (మితిమీరినవి). ఈవల (ఇటీవల) స్వామీ! నీవే నన్నునూ (చెలికత్తె అయిన అన్నమయ్యను) కూడితివి అంతేకాదు నాకు కైవశము కూడా అయ్యావు.

సంఖ్య : IV/291 రాగం : భంగాళం

కీర్తన : భావించి తెలుసుకొంటే భాగ్యఫలము

**85 భావించి తెలుసుకొంటే భాగ్యఫలము**
**ఆవలీవలిఫలము లంగజజనకుఁడే ॥పల్లవి॥**

**దానములలో ఫలము తపములలో ఫలము**
**మోనములలో ఫలము ముకుందుఁడే**
**జ్ఞానములలో ఫలము జపములలో ఫలము**
**నానాఫలములును నారాయణుఁడే ॥భావిం॥**

**వినుతులలో ఫలము వేదములలో ఫలము**
**మనసులోని ఫలము మాధవుఁడే**
**దినములలో ఫలము తీర్థయాత్రల ఫలము**
**ఘనపుణ్యముల ఫలము కరుణాకరుఁడే ॥భావిం॥**

**సతతయోగ ఫలము చదువులలో ఫలము**
**అతిశయోన్నత ఫలము యచ్యుతుఁడే**
**యతులలోని ఫలము జితకామిత ఫలము**
**క్షితి మోక్షము ఫలము శ్రీవేంకటేశుఁడే ॥భావిం॥291**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో మానవులు ఫలితమునాశించకయే పుణ్యకార్యమూ చేయరు. దానము, మౌనమూ, జ్ఞానము, సన్నుతి, వేదపారాయణము, మనస్సులో ధ్యానము, పితృకార్యాలు చేయుట, తీర్థయాత్రలు, గొప్ప పుణ్యకార్యాలూ యోగ సమాధిలో వుండటం, శాస్త్రపురాణాల అధ్యయనం – వీటన్నిటినీ అచ్యుతుని ప్రీతికొరకే చేస్తారు మానవులు. అంతెందుకు, యతి అయినా కోర్కెలు జయించిన వారైనా అందరూ కోరేది మోక్షమే కదా! శ్రీవేంకటేశుని శరణంటే క్షితి మోక్షమే లభిస్తుంది కదా! అంటున్నారు. మరి ఆ శ్రమదేనికి? అంటే యేమిటో ముందు తెలుసుకోండి.

**ఆ.వె॥ బాగు తెలుసుకొనిన భాగ్యఫలము వీడె,**
**అవల ఇవలఫలము అచ్యుతుండె**
**అవని మీద దొరకు అతులిత మోక్షంబు**
**వేంకటేశు శరణు వేడుడయ్య!**

**భావోద్దేశ్యము :**

ఈ విషయాన్ని చక్కగా భావన జేసి గ్రహిస్తే జీవుల భాగ్య ఫలప్రదాత యెవరు? ఇంకెవరు, ఈ అచ్యుతుడే సుమా! ఆవల (మరణించాక) ఊర్ధ్వలోకాలు లభించాలన్నా, ఈవల (జీవించివున్నప్పుడు ఈ భూమ్మీద, సత్ఫలితములనిచ్చేవాడూ అంగజగురుడే (మన్మథుని తండ్రియైన) శ్రీహరియే.

శ్రేష్టమైన భూసురులకు చేసిన మంచి దానములఫలము, తపోధనులు చేసే గొప్ప తపములఫలము, మౌనులు చేసే మౌనవ్రత ఫలము, మరెవ్వరూ కాదు. ముకుందుడే సుమా! గొప్ప జ్ఞానులు పొందే సత్ఫలమూ, అనేకరకములైన జపముల యొక్క ఫలము, వివిధ రకములైన సత్కర్మల ఫలము ఈ నారాయణుడే సుమా!

పరమాత్మను వినుతి (సన్నుతిని) చేసిన ఫలము, వేదపారాయణముల ఫలము, మంచి మనస్సు కలవారు పొందే ఫలము మాధవుడే. దినములలోని (పితృకర్మలలోని) ఫలము, పుణ్యతీర్థయాత్రల ఫలము, గొప్ప పురాణముల యొక్క ఫలము ఈ కరుణాకరుని కరుణ లభించుటయే.

యోగీశ్వరులు సతతము యోగసమాధిలో పరమాత్ముని భావిస్తూ శమదమాదులవంటి సాధనలతో ముక్తిని పొందాలని చూస్తారు. చదువులతో (శాస్త్రములనభ్యసిస్తారు). కొంతమంది, అతిశయించిన అన్ని ఔన్నత్యముల ఫలము అచ్యుతుడే. యతీశ్వరులైనా కోర్కెలను జయించిన శ్రీవేంకటేశ్వరుని శరణాగతి బొందినా, కలిగే గొప్పఫలము "క్షితమోక్షము" అనబడే జీవన్ముక్తియే.

సంఖ్య : XIV/110 రాగం : సురటి

కీర్తన : మంచి ముహూర్తమున శ్రీమంతులిద్దరు

**86 మంచి ముహూర్తమున శ్రీమంతులిద్దరు**
**చంచుల బూవుదండలు చాతుకొనే రదివో॥ ॥పల్లవి॥**

**సొరిది బేరటాండ్లు సోబాన బాడగాను**
**హరియు సిరియు బెండ్లియాడేరదే**
**తొరలి యంతటా దేవదుందుభులు మొరయగ**
**గరిమ బాసికములు గట్టుకొనే రదివో ॥ ॥మంచి॥**

**మునులు మంగళాష్టకములు చదువుచుండగను**
**పెనగుచు సేసలు పెట్టే రదే**
**ఘనులు బ్రహ్మాదులు కట్నములు చదువగను**
**వొనరి పెండ్లిపీటపై నున్నారదివో ॥ ॥మంచి॥**

**అమరాంగనలెల్లాను ఆరతు లియ్యగాను**
**కొమరార విడే లందుకొనే రదే**
**అమరి శ్రీవేంకటేశు డలమేలుమంగ గూడి**
**క్రమముతో వరములు గరుణించే రదివో ॥ ॥మంచి॥**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య చెప్పిన పెండ్లికీర్తన వింటే ప్రత్యక్షంగా పెండ్లి చూస్తున్నట్లే వుంటుంది. ఈనాటికి కంప్యూటర్లు, అడ్వాన్సు బుకింగులు, రికమండేషన్ల పరంపర వచ్చింది కాని, అన్నమయ్య కాలంలో చెంచువారికి కూడ, అన్నమయ్య జరిపించిన దినదిన పెండ్లిండ్లు అందరితో చూచి తరించే భాగ్యం కలిగింది. వారనేమిటి అదృశ్యులై సురలు, మునులు, అప్సరసలు, బ్రహ్మాది దేవతలు వచ్చి తాంబూలమందుకొని వెళ్ళేవారట. ఆ పుణ్యఫలమే నేటికీ అక్షరమ్ముక్కరాని వారికీ అక్షయమైన ధన సంపాదనా భాగ్యమిస్తున్నాడీ ఏడుకొండల ఏలిక.

**తే.గీ॥ చెంచువారి పూదండలు సిరియు, హరియు**
**మంచి సుముహూర్తమని తాము మార్చుకొనిరి,**
**సురలు, మునులు, భూవరులు, పామరులు, ద్విజులు**
**పెండ్లిచూచి తరించిరి వేంకటేశ!**

**భావోద్దేశ్యము :**

శ్రీమంతులైన సిరి, హరి ఇద్దరూ మంచి ముహూర్తమని పెండ్లాడుతున్నారు. చంచుల (చెంచుజాతివారి) అల్లిన పూవుదండలను, అదిగో వధూవరులు చాతుకోనేరు (ధరించినారు). సమయం మించికుండా చూచితరించండి.

పేరంటాండ్లు (ముత్తైదువలు) సోబనాలు (పెండ్లిపాటలు) పాడుతుండగా, అదే సిరియు, హరియు బెండ్లియాడేరు. దేవదుందుభులు అన్నిచోట్లా తొరలి మొరయగ (మాఱుమ్రోగినవి). అదివో వధూవరులకు బాసికాలు నొసటిపై కట్టినారు. చూచి తరించండి.

పరమాత్ముని పెండ్లికి అదృశ్యరూపులై మహామునులు వచ్చి మంగళాష్టకాలు (ఎనిమిది ఆశీర్వచనములు) చేస్తున్నారు. పెండ్లికి వచ్చిన యోగీశ్వరులు, ముక్తులూ అదిగో మేము ముందంటే మేము ముందని, సేసలు పెట్టేరు (అక్షతలు చల్లుతున్నారు). బ్రహ్మాది దేవతలు కట్నకానుకలు సమర్పిస్తున్నారు. వధూవరులిద్దరూ పెండ్లిపీటలపై కూర్చొని వున్నారు.

అదిగో అప్సరసలు హారతులనిస్తున్నారు. అదృశ్యులైనా అందరూ పెండ్లి ఆహ్వాన తాంబూలాలను కొమరారా (మనోజ్ఞముగా) స్వీకరిస్తున్నారు. ఆ విధముగ శ్రీవేంకటేశ్వరుడు, అలమేల్మంగను గూడి, అదిగో పెండ్లికి వచ్చినవారి మంచి కోర్కెలను 'తథాస్తు' అని క్రమముగా, తీరుస్తున్నారు.

సంఖ్య : X/4 రాగం : గుజ్జరి

కీర్తన : మచ్చరములు గపటంబులు మానినంత మరికదా

**87 మచ్చరములుఁ గపటంబులు మానినంత మరికదా**
**విచ్చలవిడి నాయాసల వీఁగఁదోల నోపుటా** ॥పల్లవి॥

**చంచలమగు నామనసిది మంచిదైన మరికదా**
**పంచేంద్రియములపోరునఁ బడకమానుటా**
**కొంచెపరచునాకోపముఁ గోసివేసి మరికదా**
**కంచపుఁ బాపంబులలోఁ గడతేరుటా** ॥మచ్చ॥

**వుడివోని దీపనమున కోరిచి(న)నె మరికదా**
**జడివట్టిన నాజిహ్వాచాపల్యము మానుటా**
**చిడుముడి నాభోగంబులఁ జిక్కు వడక మరికదా**
**విడువని సంసార మనెటివెల్లి దాఁటనోపుటా** ॥మచ్చ॥

**తరితీపుల మోహంబునఁ తగులకున్న మరికదా**
**కెరలిన యీలోభంబున(ను?) గెలువనోపుటా**
**నెరవుగ శ్రీవిష్ణుభక్తి నిలుకడైన మరికదా**
**గరగరికలనె శ్రీవెంకటనాథునిఁ జేరుటా.** ॥మచ్చ॥**4**

**ఉపోద్ఘాతము :**

ఇది అన్నమయ్య మనుమడు చినతిరుమలయ్య వినిపిస్తున్న అధ్యాత్మ కీర్తన. మనకు దాయాదుల్లోనో లేక ఇరుగుపొరుగు వారల్లోనో లేక తోటి ఉద్యోగస్తుల్లోనో శత్రువులుండటం సహజమే. మనం కొంత చాతుర్యంతో ప్రవర్తించి వారి పీడనుంచి తప్పించుకొనవచ్చును, కాని మనలోనే దాగివుండే మన కామక్రోధాలవంటి అరిషడ్వర్గాలతో నెగ్గుకు రావటం అంత తేలిక వ్యవహారం కాదు. అవి యెందుకు మరీ అపకారులంటే అవి మరొక దుర్గుణాన్ని పెంచి ఆ అపకారం పేరుకుపోయేట్లు చేస్తుంది. అది పోవాలంటే శ్రీవేంకటేశుని కృప వుంటే గాని సాధ్యం కాదు.

కం॥ చెడ్డ గుణంబులు నిలువక
అడ్డంబై వొకటికొకటి హరికృపనాపున్
ఒడ్డక విష్ణుని భక్తిని
దొడ్డగ వేంకటపతింక తోడనరాదా!

భావోద్దేశ్యము :

ఎవ్వరికైనా ఆసలు తొలినాళ్ళలో అనుభవం లేక విచ్చలవిడిగానే వుంటాయి. వాటిని వంచి అదుపులో వుంచటం అంత తేలికపని కాదు. దానికి తోడు మనిషి కుండె మచ్చరము (మాత్సర్యము) అనే దుర్గుణము వలన కపటపు వర్తన అలవడుతుంది. దీనివలన ఆసలు ఇంకా విచ్చలవిడి అవుతాయి.

ఈ ఘోరాలకు అసలు కారణమేమిటో తెలియునా? అతి చంచలమైన నా మనస్సే. ఇది మంచిదైతేనేకదా! నేనూ మంచివాడనయ్యేది. అప్పటిదాకా అది నామాట వినదు. నా పంచేంద్రియములమాటే వింటుంది. మనిషిని పెద్దతనం (అనుభవం) లేని మూర్ఖశిఖామణిని చేసేది ఇదే. సమృద్ధియైన పాపములనుండి కడతేరవలెనంటే ఈ పాపములనుండి కడతేరక తప్పదు.

ఉడివోని (తొలగని) దీపనమున (ప్రేరేపణ) కోర్చిన తరువాత కదా! జడివట్టని (ముసురుకొనిన) నా నాలుక యొక్క చాపల్యము నన్ను వదలిపెడుతుంది. చిదుముడిభోగములుకు (తొందరపెట్టు సుఖాపేక్షకు) నేను లొంగకున్నప్పుడు కదా! యెన్నటికీ విడువని సంసారమనెడి ఉప్పెన దాటగలుగుట జరిగేది.

మోహమనెడి అంతఃశత్రువు, తరితీపు (తహతహ) కలిగిస్తుంది. అందులో తగులుకొనక తప్పదు. తగులుకోనివారికి కదా! అది తరితీపు (తహతహ) కలిగించదు. కెరలిన (విజృంభించిన) ఈ లోభమును జయించాలంటే మోహమును గెలవాలి. నెరవుగ (స్థిరముగ) విష్ణుభక్తి కుదిరిన గాని అది సాధ్యము కాదు. గరిగరికలనే (శృంగారమూర్తియైన) శ్రీవేంకటేశుని చేరటం ఇంకో రీతిగా సాధ్యం కాదు.

సంఖ్య : X/21 రాగం : మాళవిగౌళ

కీర్తన : మనసె వశమైతేగా మరి మీదటిపనులు

**88 మనసె వశమైతేఁగా మరి మీఁదటిపనులు**
**తనువులోపలి హరిదయ యింతె కాకా ॥పల్లవి॥**

**వొద్దనె పుత్రమిత్రాదు లువ్విళ్లూరించఁగాను**
**అద్దొ వైరాగ్య మేమి ఆటపాటలా**
**కొద్దిలేనివిషయాలు˘గుంపు గూడు కుండఁగాను**
**వద్దని కడకుఁ దోయ వశ మవునా ॥మన॥**

**వొయ్యనె ధనధాన్యాలు వొడ్డుకొని వుండఁగాను**
**అయ్యో సుజ్ఞానము లల్లాడఁబడెనా**
**గయ్యాళికోరిక లెల్లా గమిగూడ కుండఁగాను**
**వుయ్యక దూలయాసలఁ బోఁదోల వసమా ॥మన॥**

**పల్లదపుటాఁక లిది పాయక వుండఁగాను**
**చెల్లఁబో వోరుపు లింత చెడఁబోయనా**
**నల్లని శ్రీవెంకటనాథుఁడె యందరికిని**
**తల్లి దండ్రియై కావఁగా తప్పువాసెఁగాకా. ॥మన॥21**

**ఉపోద్ఘాతము :**

చినతిరుమలయ్య యేమంటున్నారంటే గత జన్మలలో చేసికొన్న సుకృతమే మన మనస్సు శ్రీహరిపై లగ్నమయ్యేట్లు చేస్తుంది. ముందుగా మనస్సు వశమైతేనేకదా! మరి మీదటిపనులైన ప్రార్థనలు, పూజలు ఇత్యాది సత్ఫలితములిచ్చే పనులు చేయగలుగుతాము. మరి ఇదెలా సాధ్యమవుతుందనుకొంటున్నారు? దానిని మన తనువులోపల అంతర్యామిగా వున్న హరి దయ కలిగి మన మనస్సు ఆయనపై లగ్నమయ్యేట్లు చేయాలి. ఇదిగాక ఇంకో విధంగా అది సాధ్యం కాదు. అందుకనే అందరికీ హరి భక్తి అబ్బదు. అందంపై భ్రమ అబ్బుతుంది.

**కం॥ మనసే వశమైతేనే**

**అనువే మరి మీదిపనులు అది సత్యమురా**

**తనువున దాగిన "హరి" దయ**

**వెనుకాడని వేంకటేశుప్రేరేపణయౌ.**

**భావోద్దేశ్యము :**

మనసు వశమైవుంటేనేకదా! మరి మీదటి పనులు (అన్నిటికంటే శ్రేష్ఠమైన పనులను) చేయగలిగేది. ఇదంతా తనువు లోపల అంతర్యామిగా వున్న "హరి" దయ. ఇంతే కాక హరి దయలేనివాడు ద్విపాద పశువే.

ఇదే జీవన భ్రమ. నీవద్దనే వుండె పుత్రులు మిత్రులు ఉవ్విళ్ళూరిస్తుంటారు. ఛీ! ఇప్పుడే ఈ వైరాగ్యమేమిటి? హాయిగా ఆటపాటల్లో గడుపు నా మాటనమ్మండి. విషయ సుఖాలకు కొద్ది అంటూ వుండదు. అవి గుంపుకూడకుండా చివరకు వద్దని నిరాకరించటం జరిగే పనికాదు.

ఒయ్యనె (మెల్లగా) ధనధాన్యాలు ఒకనాడు కాకపోయినా, ఇంకొకనాడు తప్పక ఒడ్డుకొంటాయి (వశపఱచుకొంటాయి). అయ్యో! ఇవి వుండగా మనిషికి సుజ్ఞానం అబ్బుతుందా? కనీసం అల్లల్లాడుతుందా. గయ్యాళి కోరికలు (తెంపరివైన కోర్కెలు) గుమికూడకుండా, మనస్సులో దూలయాసలు (దురదపెట్టే కోర్కెలు) పుష్పించక పోద్రోల సాధ్యమవుతుందా?

ఆకలి అనేది పల్లదపుది (ధూర్తత్వం పెంచునది). అది పాయక (వదలక) వుండగా చెల్లబో! (అయ్యయ్యో!) ఓర్పు చెడిపోక వుంటుందా? నల్లని శ్రీవేంకటేశ్వరుడే మన అందరికీ తల్లీదండ్రీ కూడా. ఆయన కాపాడుతుంటే మన తప్పులన్నీ మన్నించబడతాయి.

సంఖ్య : X/14 రాగం : వరాళి

కీర్తన : మాటిమాటికి జూచి మరపులేలె

**89 మాఁటిమాఁటికిఁ జూచి మరపులేలె**
**నీటునఁ బాటిగంప నీళ్లు మోచేవా** ॥పల్లవి॥

**తెలిపేగురుఁ డుండఁగ తెలియఁగ నేరవు**
**చిలుకచదువులేలోజీవుఁడా**
**అలవోక నెందైన ఆస మానలేవు**
**కల గన్నచోటి కెల్ల గంపయెత్తేవా** ॥మాఁటి॥

**వొబ్బిదైనవేదమార్గ మొల్లనిపుణ్య మంటేవు**
**జిబ్బిటాయతప మేలె జీవుఁడ**
**అబ్బురపువేడుకల నలసేవు పలుమారు**
**గబ్బివై పారేబండికిఁ గాలు చాఁచేవా** ॥మాఁటి॥

**వొల్లనె సంసారములో నూరకె గర్వించేవు**
**చెల్లఁబో రొయ్యకొవ్వేలె జీవుఁడా**
**నల్లని శ్రీవెంకటనాథునిబంటవైతివి**
**తల్లకిం దేల మేరువు తలగడనుండఁగా.** ॥మాఁటి॥

**ఉపోద్ఘాతము :**

తన తాత అన్నమయ్యలాగ చెప్పదలుచుకున్నది సోదాహరణంగా చెప్పటం చిన్న తిరుమలయ్యకు జన్మతః వారసత్వంగా అబ్బిన నేర్పు. ఈ కీర్తనలో యేమంటున్నారో ఆకళింపుజేసికొనండి. పాటిగంప (చిన్నగంప) యేదో చెత్తయెత్తివెయ్యడానికి పనికివస్తుందేమో గాని, నీటుగా నీళ్ళు మోయడానికి ఉపయోగపడుతుందా? ఇది అనునిత్యం నీవు చూచేదే కదా! మాటిమాటికీ చూస్తూ కూడా మరపులేనా? నల్లని శ్రీవేంకటేశ్వరుడు కలియుగంలో యేపుణ్యకార్యమూ సక్రమంగా చేయలేని మనలాంటివారికోసం వైకుంఠంనుండి దిగివచ్చిన నారాయణుడు మోక్షప్రదాత అయిన ఆయన్ని సిరిసంపదలడగటం మేరుపర్వతాన్ని తలకింద పెట్టుకొని తల్లడిలిపోవటం లాంటిది.

**చం॥ మరపులవేలనో అరసి మాటికి మాటికి నీటిగంపలా**
**గురుడొకడుండనేర్పుటకు కోరకుకీరముపల్కు వేదముల్**
**పరుగిడుబండిచక్రమున పాదములుంచకు పుణ్యమట్లగున్**
**అరయక వేంకటేశ్వరుని, అల్పములన్నియు మేరువైననున్.**

**భావోద్దేశ్యము :**

ఓ జీవులారా! ఈ నేను జెప్పబోవు విషయాన్ని మీరు అనునిత్యం మాటిమాటికీ చూస్తున్నదే. ఇంత చూచికూడా తెలివిలేనివారిలాగ పాటిగంప (చెత్తపారవేయుటకు వాడే చిన్న గంప) నీళ్ళు తేవటానికి వుపయోగిస్తారా?

అన్నీ విడమరచి తెలిపే గురుడుండగా తెలుసుకొనే ప్రయత్నం చేయవు. ఓ జీవుడా! చిలుకలాగా పలుకులు చెప్పే చదువులెందుకు? అలవోక (సులభంగా) ఆశను విడనాడలేవు. కలగన్న వాటినెల్లా సంపాదించాలని గంపబట్టుకొని పరుగులు దీస్తావు. ఇదేమి మూర్ఖత్వంరా జీవుడా.

ఒబ్బిడైన (బాగైన) వేదమార్గములంగీకరించని పుణ్యములకు ప్రయత్నించేవు. జిబ్బిటాయ (గబ్బిలం మాదిరిగా) తపస్సు చేసినందువలన ప్రయోజనమేమటి జీవుడా? నూతనంగావుండి ఆశ్చర్యకరమైన వేడుకలకోసం అనేకమార్లు ప్రయత్నించి అలసిపోతున్నావు. గబ్బివై (గర్విష్టివై) పరుగులు తీసే బండిచక్రం కింద పాదములు చాచేవు. మరి నీ కాళ్ళు విరగక యేమవుతుందిరా మూర్ఖుడా!

ఒల్లనే (అధికముగా) ఈ సంసారంలో ప్రతిదీ నీకుందని గర్విస్తున్నావు. చెల్లబో! (అయ్యయ్యో!) జీవుడా! రొయ్యలకు మీసాలున్నంతమాత్రాన కండలుంటాయా? నల్లనయ్య శ్రీవేంకటేశ్వరునికి బంటునని చెప్పుకుంటావు. నీతలగడగా బంగారు శిఖరాల మేరుపర్వతమే వుండగా, చిల్లర కోరికలు కోరుకోవటానికి అసలు నీకు బుద్ధుందా. ఆయన సన్నిధి కోరుకోరా మూర్ఖుడా!

సంఖ్య : III/566 రాగం : దేవగాంధారి

కీర్తన : మాయామోహము మానదిది

**90 మాయామోహము మానదిది**
**శ్రీయచ్యుత నీచిత్తమే కలది. ॥పల్లవి॥**

**యెంతవెలుఁగునకు నంతేచీఁకటి**
**యెంత సంపదకు నంతాపద**
**అంతటా నౌషధ మపథ్యమును సరి**
**వింతే మిగిలెను వేసటే కలది. ॥మాయా॥**

**చేసినకూలికి జీతమునకు సరి**
**పూసినకర్మభోగము సరి**
**వాసులజన్మము వడి మరణము సరి**
**ఆసల మిగిలిన దలపే కలది. ॥మాయా॥**

**మొలచినదేహము ముదియుటకును సరి**
**తలఁచినదైవము తనలోను**
**యిలలో శ్రీవేంకటేశ నీ కరుణ-**
**గలిగినమాకెల్ల ఘనతే కలది. ॥మాయా॥566**

**ఉపోద్ఘాతము :**

మానవుని జీవితకాలంలో వాడిని మోహము వదిలిపెట్టదు. మాయలోనే పడికొట్టుమిట్టాడుతుంటాడు. ఇదంతా దేనివల్ల జరుగుతున్నది? శ్రీ అచ్యుతుడు మానవునికి మనస్సు అనేదాన్ని అంటగట్టాడు. అది కలుగుట చేత ఈ చిక్కులు కలుగుతున్నాయి అంటున్నారు అన్నమయ్య. ఈ ప్రపంచంలో యెంత వెలుగుందో అంతే చీకటివుంది. ఎంత సంపదుంటే అంత ఆపదవుంటుంది. ఎంత కూలిచేస్తే అంతే జీతం దొరుకుతుంది. ఎంత మంచి కర్మజేస్తే అంత భోగము దక్కుతుంది. దేహము యెంత బలిష్టమైనదైనా ముసలితనము వచ్చిందంటే ఆ బలం మటుమాయమవుతుంది. శ్రీవేంకటేశుడి కరుణ వుంటే ఘనత దానంతటదే కలుగుతుంది.

**కం॥ మాయామోహము మానదు**
**శ్రీయచ్యుతకలదు నీదు చిత్తంబెటులో**
**యేయెడ మంచిజరుగునో**
**ఆయెడ చెడుకద్దు తిరుమలయ్యా! సమమే.**

**భావోద్దేశ్యము :**

శ్రీఅచ్యుతుడు కల్పించిన మాయవలన మానవునికి మోహము కలుగుతుంటుంది. దానివల్ల వాడికి ద్వంద్వ భావములు కలుగుతాయి. ఈ మాయ యెన్నటికి మానదు. నీవు ఇచ్చిన చిత్తమే (మనస్సే) కలది (ఇదంతా చేయిస్తుంది).

ఈ సృష్టిలో యెంత వెలుగున్నదో అంతే చీకటి వున్నది. మనకి ఎంత సంపద వుంటుందో అంతే ఆపదకూడా వుంటుంది. మనము యెంత ఔషధం తీసికొంటామో అంతే అపథ్యం చేస్తుంటాం. అందుకే రోగము యెన్నటికీ పూర్తిగా తగ్గదు. చివరికి ఇదంతా వింతలాగే మిగులుతుంది. వేసటే (అలుపు మాత్రమే) కలదు.

ఎంత కూలి చేస్తే అంతే జీతం దొరుకుతుంది. ఎంత సత్కర్మ చేస్తే అంత భోగము (సుఖము) దక్కుతుంది. ఎన్నిసార్లు పుట్టుక వస్తే అన్నిసార్లు చావూ వస్తుంది. ఎన్ని ఆశలు మనస్సులో నిలిచిపోతే అన్ని ఆలోచనలు మిగిలిపోతాయి.

పెరిగి పెద్దదవుతున్న దేహము ముసలిదై వడిలిపోవటంతో సరి. మనం తలుచుకొనే దైవము మనలోనే వున్నాడు. ఇదంతా తెలియని వారిని సైతం అనుగ్రహించడానికి వెలసిన శ్రీవేంకటేశ్వరా! నీ కరుణను పొందిన మాకెల్లా ఘనతే కలుగుతుంది.

సంఖ్య : XV/236 రాగం : కాపి

కీర్తన : మా యింటికి రావోయి మాధవా, నీ

**91 మా యింటికి రావోయి మాధవా, నీ**
**మాయలెల్లాఁ గంటి మిదె మాధవా ॥పల్లవి॥**

**మచ్చు చల్లేవు వలపు మాధవా నేను**
**మచ్చిక లెల్లాఁ జేసితి మాధవా**
**మచ్చెము నీపై నిదె మాధవా యింక**
**నుచ్చురపు చూపు నలో మాధవా ॥మాయింటి॥**

**మఱఁగేల యింక నీకు మాధవా**
**మఱి నాకు దక్కితివి మాధవా**
**మఱచేవానిచేఁతలు మాధవా మాతో**
**మఱుచు మాటే మనేవు మాధవా ॥మాయింటి॥**

**మట్టులేని శ్రీవేంకట మాధవా కట్టు**
**మట్టుతో మమ్ముఁ గూడితి మాధవా**
**మట్టేవుమా కాళ్లప్పటి మాధవా**
**మట్టె లియ్యఁ గద వోయి మాధవా ॥మాయింటి॥**

**ఉపోద్ఘాతము :**

ఇది పెదతిరుమలయ్య శృంగార కీర్తన. మురళీధరుని ప్రేమించని జవ్వనియే లేదు గోకులంలో. అదను చూచి ప్రతి వయ్యారీ మా ఇంటికి రావోయి అని అతనిని ఆహ్వానించేదే. వారి ప్రేమను తిరస్కరించలేని బలహీనత మాధవునిది. అంతేకాదు ఆ గోపాంగనలకు మాధవుడు మాయల నన్నింటినీ తెలిసిన వారైనందున ఇంకెవత్తెనన్నా మాయచేయి, కానీ నేను నీకోసమే బ్రతుకుతున్నాను, కనుక నన్ను మాయచేయకు అని ప్రాధేయపడుతుంటారు. ఆయన మట్టులేని వేంకటమాధవుడు కాబట్టి తనకు మట్టెలు నియ్యాలట. అంటే యేమిటో?

**తే.గీ॥ కంటిమిదె మాధవా! నీదు గడుసుమాయ-**
**లెల్ల, మాయింట రావోయి కల్లకాదు**
**మట్టులేని వేంకటపతి! మఱుగదేల?**
**మట్టెలియ్యరా మాకాళ్ళు ముట్టినావు.**

**భావోద్దేశ్యము :**

ఓ మాధవా! నీవు మా యింటికి రావోయి. మాకు నీ మాయలన్నీ సుపరిచితాలే. వాటిని మేమేనాడో కంటిమి. ఇక చాలించి మావద్దకు రావోయి.

ఓ మాధవా! నీ వలపులనే మచ్చు (మత్తుమందు) మాపై చల్లేవు. మమ్మల్ని మచ్చిక చేసికొని నీకు అలవాటు పడేట్లు చేసికొన్నావు. మా మచ్చెము (చేపవంటి) కనుచూపు నీపై పడినది. ఇదెరావోయీ వుచ్చరపు చూపుల (నాటుకొనునట్లు చూచే) మాధవా!

ఓ మాధవా! నీకూ మాకూ ఇంకా మఱుగు (చాటుమాటు) యెందుకు? ఇంతమంది వలపుకత్తెలు నీకున్నా ఈరోజు నాకు దక్కినావు. ఓ మాధవా! నీ చేష్టలు యెలా వున్నాయంటే అవి మఱిచిపోయేవాని చేతలవలెనే వున్నాయి. మా దగ్గర మాటలన్నీ నీవు మఱచేవే, అటులైన ఆ శుష్క వచనముల ప్రయోజనమేమి?

మట్టులేని (మతిలేని) వో వేంకట మాధవా! ముట్టుతో (చెలరేగి) మమ్ము కూడితివి. అంతకు ముందేమి చేశావో గుర్తుందా? అప్పటిన్ (మాయ మాటలు చెబుతూ) మా కాళ్ళను ముట్టేవు (స్పృశించేవు). ఓ మాధవా! ఇక జాగు దేనికి మా కాళ్ళకు మట్టెలు తొడిగి మమ్ము పెళ్ళాడు.

సంఖ్య : XV/200 రాగం : బౌళి

కీర్తన : మేలుకొనవే నీల మేఘ వర్ణుడా

**92** **మేలుకొనవే నీల మేఘ వర్ణుడా**
**వేళ తప్పకుండాను శ్రీ వేంకటేశుడా** ||పల్లవి||

**మంచముపై నిద్రదేర మల్లెల వేసేరు**
**ముంచి తురుము ముడువ మొల్లల వేసేరు**
**కంచము పొత్తారగించ కలువల వేసేరు**
**పించెపు చిక్కుదేర సంపెంగల వేసేరు** ||మేలు||

**కలసిన కాకదేర గన్నేరుల వేసేరు**
**వలపులు రేగి విరజాజుల వేసేరు**
**చలువగా వాడుదేర జాజుల వేసేరు**
**పులకించ గురువింద పూవుల వేసేరు** ||మేలు||

**తమిరేగ గోపికలు తామరల వేసేరు**
**చెమటార మంచి తులసిని వేసేరు**
**అమర శ్రీ వేంకటేశ అలమేలు మంగ నీకు**
**మమత పన్నీటిలో చేమంతులు వేసేరు** ||మేలు||

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య స్వామికి మేలుకొలుపు పాడుతున్నారు. ఓ నీలమేఘశ్యామా! ఆలస్యమవుతున్నది వేళ తప్పక లేవవయ్యా వేంకటేశ్వరా! అని కీర్తిస్తున్నారు. ఆయనపై మల్లెపూలు వేస్తే ఆ సువాసనకి మంచముపైనున్న నిద్ర తేలిపోతుందట. ఇలా సాగుతుంది కీర్తన. జాజులు వేస్తే చలువగా వాడుదేరుతుందట. అంటే యేమిటి? చదవకపోతే ఏమో అనక తప్పదు. ఇది అన్నమయ్య ఉదతి.

**ఉ॥ మేలగు సృష్టికంతటికి మేల్కొనవే హరి నీలవర్ణుడా!**
**మాలలు కావు ఈ విరులు మాన్పును నిద్దుర బద్ధకంబులన్**
**ఆలి సిరైన వానికిల ఆవిభవంబులు మాకు తృప్తికే**
**లీలగ వేళతప్పెనని లేపుట యేమది? వేంకటేశ్వరా!**

**భావోద్దేశ్యము :**

నీలమేఘవర్ణపు శరీర కాంతితో శోభిల్లే ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నిదురలేచేవేళ తప్పిపోతున్నది. వివిధ పూలతో నిన్ను సేవించుటకు మేము సిద్ధంగా వున్నాము. త్వరగా మేలుకొని మమ్మేలుకోవయ్యా!

మంచముపై నిదురించుచున్న నీ నిద్ర తేలిపోవుటకు ఇదే నీపై మల్లెపూలను వేస్తున్నాము. పనిలో పనిగా నీ కొప్పున ముడుచుకోవటానికి మొల్లపూలను వేస్తున్నాము. నీ కంచమున పొత్తులలో నీ దేవేరులతో నివేదన భుజింతువని సువాసనాభరితమైన కలువపూలను వేస్తున్నాము. పించెపు చిక్కుదేర (నెమలి పింఛము ధరించుటచే పడిన చిక్కు విడదీసి) సంపెంగపూలు ముడుచుటకు సిద్ధముగానున్నవి.

నీ ఒంటిపైని కాకదేర (ఉష్ణమునుపసంహరించుటకు) ఎఱ్ఱగన్నేరు పూలను వేస్తున్నాము. నీ దేవేరులపై వలపులు రేకెత్తుటకు విరజాజి పూలను వేస్తున్నాము. చల్లగా వాడుదేర (వాడుకోవడానికి) జాజిపూలను వేస్తున్నాము. నీవు పులకించిపోవుటకు గురువింద పూలను నీపై వేస్తున్నాము.

ఇక నీ గోపికల సంగతి చెప్పనే అక్కరలేదు. వారు నీకు తన్మయత్వం కలుగుటకు తామరపూలను వేసేవారు. నీ చెమటలు ఆరిపోవుటకు తులసి దళములను వేస్తున్నారు. అలమేలుమంగమ్మతో అమరిన శ్రీవేంకటేశ్వరా! నీ మమత దేవిపై అతిశయించుటకు నీవు స్నానమాడు పన్నీటిలో చేమంతిపూలను వేసినాము.

సంఖ్య : II/379 రాగం : సాళంగనాట

కీర్తన : మొక్కరే మొక్కరే మీరు ముందు ముందే జయలిడి

**93 మొక్కరే మొక్కరే మీరు ముందు ముందే జయ లిడి**
**దక్కి శ్రీవేంకటేశుఁడే తానైనదేవునికి** ॥పల్లవి॥

**కరములు వే యవే కరములును భయం-**
**కరనఖాయుధములు కడలే వవే**
**సిరి దొడపై నదె సింహపునెమ్మొ మదే**
**నరరూపు సగమదె నరసింహునికి** ॥మొక్కరే॥

**వంకరకోర లవె వజ్రపుదంతము లవె**
**సంకునుఁ జక్రము నిరువంకలా నవె**
**జంకెల నేత్రము లవె జడలు మూఁపున నవె**
**అంకె నభయహస్తము అదె నరహరికి** ॥మొక్కరే॥

**నిక్కినకర్ణము లవె నీలిమచ్చవుర మదె**
**చుక్కలమొలపూసల నొక్కరూ పదె**
**తొక్కినపాపము లవె తోడనే శ్రీవేంకటాద్రి**
**పక్కెరనరసింహపు ప్రళయసింహునికి** ॥మొక్కరే॥

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య చెప్పిన తొలినాళ్ళ కీర్తన అని నా భావన. కీర్తన పల్లవిలోనే శ్రీవేంకటేశ్వరుడే తానై దక్కిన దేవుడు వీడే అనటంవలన ఇది ఆచార్యులవారి తొలినాళ్ళ కీర్తన అనిపించింది. నీలిమచ్చవురమువాడు అంటే ఉరముపై శ్రీవత్సము అనబడు నల్లని పుట్టుమచ్చ కలవాడని అర్థం. జంకెల నేత్రములంటే బెదరగొట్టే కళ్ళు అని అర్థం. కాబట్టి ఈ కీర్తన వివరణ నల్లేరుపై బండి పోకడ అనుకోకండి.

**తే.గీ॥ మొక్కరే మొక్కరే మీరు ముందుముందె**
**దక్కి శ్రీవేంకటేశుడే యెక్కుడైన**
**నారసింహుడు, తొడపైన నళినికాంత**
**తొక్కి పాపాలు వరమిచ్చు దొంతినితడు.**

**భావోద్దేశ్యము :**

ఓ శరణాగతులారా! దక్కి (పుణ్యము దక్కించుకొని) చూస్తే తిరుమల శ్రీవేంకటేశ్వరుడే తానైన దేవుడు, యీ నృసింహదేవుడు. ముందు ముందే జయజయ ధ్వానములను బల్కి ఈ స్వామికి మొక్కండయ్యా! మొక్కండి.

ఈ భీకరమూర్తిని తేరిపార చూడండి (మనో నేత్రంతో). అవిగో ఆయన కరములు వేయి (వేయి చేతులు) కరములే కాదు, కరములకున్న భయంకర నఖాయుధములు. వాటికి కూడా అంతూ పొంతూ లేదు. అదిగో ఆయన యెడమతొడపై నళినీకాంత అయిన సిరి (శ్రీలక్ష్మి). అదిగో ప్రకాశించుచున్న సింహవదనము. సగము మానవశరీరమైన ఆయన దేహమదిగో. ఈ నృసింహునికి మొక్కరో!

అవిగో ఈ సింహముఖుని వంకరలు తిరిగిన కోరలు. కాస్త నవ్వినప్పుడు కనబడుతున్నాయే, అవే ఆయన వజ్రములవంటి దంతములు. అవిగో ఆయన ఆయుధములు సంకు (పాంచజన్యము) చక్రములు (సుదర్శన చక్రము). అవిగో ఆయన జంకెననేత్రములు (బెదరించుకన్నులు). ఆయన మూపుమీద సింగపు జూలు అదిగో. ఈ నరకేసరి రూపానికి మొక్కండయ్యా!

అవిగో నిక్కి నిక్కి కనిపించుచున్న నారసింహుని చెవులు. అదిగో ఆయన ఉరముపై నల్లని శ్రీవత్సమనే పుట్టుమచ్చ. నక్షత్రములే పూసల సౌరైన మొలత్రాడు అదిగో. ఒకే ఒక రూపమైన నృసింహుడదిగో. ఆయన తొక్కివేసిన మనందరి పాపరాశులవిగో. శ్రీవేంకటాద్రిపై ఏనుగుకు తొడిగే చర్మము పక్కెరగా ధరించిన ప్రళయ నృసింహుడూ వీడే.

❋

సంఖ్య : II/149 రాగం : శ్రీరాగం

కీర్తన : లావణ్యశృంగారరాయ లక్ష్మీనాథ

**94 లావణ్యశృంగారరాయ లక్ష్మీనాథ**
**యేవేళ నీవినోదాన కేదాయ నేమి** ||పల్లవి||

**పాలజలధివంటిది పవ్వళించు నామనసు**
**గాలివూర్పులే కడళ్లు కలదు లోఁతు**
**చాలఁగఁ దొల్లి నీవు సముద్రశాయివట**
**యీలీల నీవినోదాన కేదాయ నేమి** ||లావ||

**నిక్కపుభూమివంటిది నెలవుకో నామనసు**
**పెక్కులిన్నియుఁ గలవు పెరుగుచుండు**
**పుక్కటఁ దొల్లియు నీవు భూసతిమగఁడవట**
**యెక్కువ నీవినోదాన కేదాయ నేమి** ||లావ||

**నిండుఁగొండవంటి దిదె నిలుచుండు నాభక్తి**
**వుండుచోటనేవుండు నొక్కచోటను**
**కొండలరాయఁడవట కోరికె శ్రీవేంకటేశ**
**అండ నీవినోదానకేది యాయ నేమి** ||లావ||

**ఉపోద్ఘాతము :**

శ్రీమన్నారాయణునిపై ఈ కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఆయన శృంగారరాయుడే కాదు, గొప్ప లావణ్యముగల శృంగార రాయుడు. పైగా లక్ష్మీదేవికి నాథుడు. ఇక ఆయన వైభవం చెప్పటం యెవ్వరి తరమవుతుంది? ఏవేళనైనా ఆయన వినోదాలకి హద్దేముంటుంది? నా మనస్సు కూడా సముద్రంలా లోతైనదే. నీవెలాగో జలధిశాయివి మరి నామనస్సులో పవళించరాదా? నా మనస్సూ భూమివంటిదే. నీవే భూవల్లభుడవు. మరి నామనస్సునేలుకోరాదా? ఏమికీర్తన ఇది!!

**తే.గీ॥ లలిత శృంగారరాయడా! లక్ష్మినాథ !**
**నీవినోదాలకేమైన అవునెలోట?**
**నిలుచునీభక్తి నాలోన నిండుకొంద**
**వెలయు కొండలరాయడే వేంకటపతి.**

**భావోద్దేశ్యము :**

ఓ లక్ష్మీనాథా! నీవు లావణ్యముగల (లలితమైన) శృంగారరాయడివి. నీవినోదములకు యేవేళయైనా తగినదే ప్రభూ!

అయినా నాకు తోచిన విషయం నీకు విన్నవించుకొంటాను. నామనస్సు స్వచ్ఛమైన పాలసముద్రంలాంటిది. నీకు పాలసముద్రముపై పవ్వళించటం అలవాటే కదా! నా ఉచ్ఛ్వాస నిస్శ్వాసలే, ఈ జలనిధి కడళ్ళు (అలలు), పైగా దీనిలోతుకూడా వూహించుట అసాధ్యమే. మరి ఈ నామనస్సనే సముద్రంలో పరుండి జలధిశాయి అనే పేరు నిలుపుకోరాదా? ఇట్లా నీవు వినోదించవచ్చును కదా! ప్రభూ!

ఇంకొకమాట చెబుతాను వినవయ్యా! ఈ భూమి వంటిది నా మనస్సు. భూమిలోపలా, వెలుపలా అనేకమైన వనరులు వున్నాయి. అందు కొన్ని పెరుగుతుంటాయి కూడా సరిగ్గా నా మనస్సు కూడా ఈ భూమిలాంటిదే. ఇందులోకూడాఎన్నో దాగివున్నాయి. ఈ భూమి కంపించినట్లే నా మనస్సూ కంపిస్తుంటుంది. నీవు భూవల్లభుడవు కృతయుగంనాటినుంచే. మరి నీవు నామనస్సును కూడా నీ దానినిచేసి ఏలుకోరాదా? నీ వినోదాలకేమి హద్దు?

ప్రభూ! నీమీద నాభక్తి కొండవలె అచలమైనది. అది ఎప్పుడూ ఒక్కచోటునే (నీవుండే తిరుమలలోనే) వుంటుంది. ఓ శ్రీవేంకటేశా! ఏడుకొండలవాడివి నీవే. దీన్నికూడా ఏలుకోరాదా? ఈ కొండమీద కూడా నీ వినోదాలకు హద్దు వుండదులే. రావయా తండ్రీ! వచ్చి ఈ నా మనస్సును నీ నివాసం చేసికొనరాదా?

సంఖ్య : XV/237 రాగం : గౌళ

కీర్తన : లేరా దేవతలూ లేరా లావరులూ

95 లేరా దేవతలూ లేరా లావరులూ
ఆరీతి నాఁ డెందు వోయి రధికులే కలిగితే ॥పల్లవి॥

మొదల సృష్టికి నెల్ల మూలమైన బ్రహ్మదేవుని
యదె నాభిఁ బొడమించే నచ్యుతుఁడే
తుదఁ బ్రళయమునందు దొంతులుగా జగములు
వుదరమునందు నించె నొక్కఁడే నిలిచి ॥లేరా॥

మోవలేక దేవతలు మొలుగఁగ మందరము
తోవ మోచి తెచ్చినట్టి దొరవిష్ణువే
వేవేగ జలధిలోన వేసితే కుంగిన కొండ
ఆవల వీఁపున నెత్తె నాదికూర్మ మితఁడే ॥లేరా॥

తనబంటు శేషుని తరితాడు గావించి
కొననాధారమై నిలిచె దోవిందుఁడే
దనుజులు దేవతలు తచ్చి తచ్చి యలసితె
వెనక నంతయుఁ దచ్చె విశ్వరూపుఁడితఁడే ॥లేరా॥

కాలకూటమున కీశుఁ గంచముగాఁ జేసి మింగి
చాలి నీలవర్ణుఁ డాయె శశివర్ణుఁడే
కాలకంఠుఁ డాయెను శంకరుఁడు పాత్రయిన వంక
పోలింప ఋగ్వేద మిదె పొగడీ నితనిని ॥లేరా॥

అమరఁ తనయిచ్చు నమృతము పంచిపెట్టె
నమరుల కెల్లా నారాయణుఁ డితఁడె
నెమకి తా ననువైన నిర్మల కౌస్తుభము
కమలముపై లక్ష్మిఁ గైకొనె నీ ఘనుఁడె ॥లేరా॥

మూలమని నుడిగితే మోచివచ్చి కరిఁగాచె
కోలుముంద్రై యిందరిలో గోవిందుఁడే
తూలిన శ్రుతులు దెచ్చి తుంగిన(?) భూమియెత్తె
అలరి భస్మాసురుని నడఁచె నీ దేవుఁడే ॥లేరా॥

యిందుమౌళిపై నేసి యింద్రియములఁ గట్టిన
కందర్పజనకుఁడైన కమలాక్షుఁడే
కందువ పాదతీర్థపు గంగ హరు శిర మెక్కె
యెందును దైవ మితఁడే యిందిరానాథుఁడు ॥లేరా॥

మాయలెల్లా నితనివె మహిలో సంకల్పములు
యేయెడ 'శ్రీవిష్ణురాజ్ఞి' యీతనిదే
తోయరాని చక్రముచే దుర్వాసు వారఁగాను
దాయి దండై బ్రదికించె తనబంటు చేత ॥లేరా॥

సంది నన్నిమతముల సన్యాసులకు గతియై
అందరి నోళ్లకు నారాయణు నామమే
ముందు సంధ్యాజపముల మూలపు టాచమనము
అందుల కితని కేశవాది నామములె ॥లేరా॥

వాదుల 'నదైవం కేశవాత్సర' మని తొల్లి
వేదవ్యాసు లనిన విభుఁ డీ హరి
సోదించి వశిష్టుఁడును శుకనారదాదులు
పోదితోడ దాసులైరి పురుషోత్తమునికి ॥లేరా॥

బాణాసురుని నతికి భంగపడఁగా విడిచె
వేణునాదప్రియుఁడైన విఠ్ఠలుఁడే
బాణమై త్రిపురములు భస్మీకరము చేసె
ప్రాణుల రక్షించె నీ పరమాత్ముఁడే ॥లేరా॥

ఆపదలందినవేళ యసురబాధలు మాన్ప
చేపట్టి లోకము గాచే శ్రీపతియే
పైపై నింద్రాదులకు పారిజాతాదిసిరులు
వైపుగాఁ గాయించిన వరదుఁడు నితఁడే ॥లేరా॥

భూమి యీతనిసతి యంబుధు లితని పరపు
సోమ సూర్యాదు లితని చూపుఁగన్నులు
వేమరు నూర్పులే గాలి విష్ణుపద మాకాశము
వాములైన హరి నీ వాసుదేవుఁడే ॥లేరా॥

హరునిఁ బూజించవలె నంటె నర్జునునకు
సిరులఁ బాదము చాఁచె శ్రీకృష్ణుఁడే
అరిది మార్కండేయుఁ డతని మహిమ చూచి
వరదైవా మితఁ డని వాదించి కొలిచె ॥లేరా॥

ధృవపట్ట మితఁ డిచ్చె దొరకొని శరణంటే
వివరింప నిదివో శ్రీవేంకటేశుఁడే
యివల నితనిఁ జెప్ప నెవ్వరివశము లింక
భువిఁ బార్వతి హరినిఁ బొగడేటినాఁడు ॥లేరా॥**237**

**ఉపోద్ఘాతము :**

నేను వివరించిన అతిపొడవైన కీర్తనలలో ఇది ఒకటి. అన్నమయ్య సుపుత్రుడు పెద తిరుమలయ్య చెప్పిన ఈ కీర్తన నేను ఇదివరలో వివరించిన "పొడవుకి పొడవైన పురుషోత్తమా"లో వుండవలసిన కీర్తన. శ్రీనివాసుని నిర్ణయం ఇలావున్నది మరి. వరుసగ శ్రీహరి లీలలన్నీ వర్ణిస్తున్నారు. ఎలా అని తినబోతూ రుచి అడగకండి. జాగ్రత్తగా దీని భావోద్దేశ్యము చదవండి. దీని వివరణ ఇచ్చింది నేను కాదు. నాలోని "పెదతిరుమలయ్యను" ఆదేశించిన ఏడుకొండల తిరుమలయ్య. కాకపోతే నాకేమి పాండిత్యం వుందని వివరించగలను? పురాణేతిహాసాలు రావు, వేదశాస్త్రములు రావు, ఉపనిషత్తులు రావు ఏవీరావు గారు అని పిలువదగినవాడిని. అయినా పలు జన్మల సుకృతము నాతో ఇది పలికించింది. అందుకే...

**ఆ.వె॥ పెదతిరుమలవంటి బిడ్డడొక్కడు చాలు**

**కౌరవాళియేల నూరుమంది?**

**ఇట్టికీర్తనొకటి ఈ శ్రీహరికి చాలు**

**"చెయ్యనేల వెయ్యి చెయ్యినొయ్య?"**

**భావోద్దేశ్యము :**

ఓ భక్తులారా! ఒక్కసారి ఆలోచించండి. ఈ సృష్టిలో లేరా దేవతలు (యెందరు దేవతలు లేరు?) లేరా లావరులు (యెందరు బలవంతులు లేరు?) ఆ విధముగా నాడు (ఆనాడు) అధికులుగా వారుంటే మరి ఈనాడు లేరేమి? ఎందువోయిరి (ఎక్కడికి పోయారు?)

ఈ సృష్టికి కర్త బ్రహ్మదేవుడు. మరి అతగాడు యెక్కడనుండి వచ్చాడు. ఆయనను ఈ అచ్యుతుడే తనబొడ్డులో మొలచిన నాభికమలము నుంచి పుట్టించాడు. సృష్టియే కాదు ప్రళయకారకుడు (విశ్వాంతకుడూ) జగములనన్నీ పొత్తుగా తన ఉదరములో నింపుకొన్న ఆ పరమాత్మే. ఆయనొక్కడే నిలిచియుంటాడు.

పాలసముద్రమథనమున దేవతలు, మందర పర్వతాన్ని మోయలేక దీన్ని చిలకటం మావల్లకాదని విచారిస్తుంటే దాన్ని క్షీరసాగరం దాకా మోసి తెచ్చిన దొర విష్ణువే. ఆవిధంగా త్వరత్వరగా కొండను తెచ్చి సాగరంలో వేస్తే అది కాస్తా మునిగిపోయింది. అపుడు నారాయణుడు ఆదికూర్మమై తన వీపుమీద యెత్తినదెవరు? ఇతడే కదా!

తనబంటు అయిన ఆదిశేషుని, మందరమునకు తాడువలె చుట్టి దానవుల సహాయంతో సాగరమథనం చేయమన్నాడు గోవిందుడు. తచ్చితచ్చి (చిలికి చిలికి) వారు అలసి నీరసించితే విశ్వరూపుడై తానే చిలికినాడు, ఇతగాడే.

అనంతరం క్షీరసాగర మథనంలో కాలకూట విషము అగ్నికీలలు ప్రజ్వరిల్లుతూ పుట్టింది. లోకములన్నీ తల్లడిల్లిపోతే అప్పుడు దయాళువై విష్ణువు కంచమువలె దానిని ధరించగా, శంకరుడు దానిని మింగి తన కంఠంలో దాచి వుంచాడు. దాని మూలంగా ధవళవర్ణుడైన శంకరుని కంఠసీమ నల్లబడి నీలకంఠుడైనాడు. శశివర్ణుడైన విష్ణువు నల్లని నీలవర్ణుడైనాడు. ఈ విషయాన్నే ఋగ్వేదము కూడా పొగిడింది.

అప్పుడుద్భవించిన దివ్యమైన వస్తువులను ముందు దేవతలకిచ్చాడు హరి. దానవులు అమృతము తప్ప మరేమీ వద్దన్నారు. ఆ వస్తువులనన్నీ దేవతలకిచ్చి సముద్రరాజ తనయ శ్రీలక్ష్మిని కౌస్తుభమణిని స్వీకరించాడు హరి. హరుడు కవ్వపుతాడువలె వుపయోగపడిన వాసుకిని తన కంఠము చుట్టూ హారముగా ధరించి నాగభూషణుడైనాడు. మాయచేసి అమృతము దుష్టబుది గల దానవులకు దక్కకుండా చేశాడు నారాయణుడు. మూలకారణంబు నీవే అని నుతించిన దీనుడు గజేంద్రుని కోలుముందై (మున్ముందే) మకరి పీడనుంచి పరుగుపరుగున వచ్చి రక్షించాడు గోవిందుడు. ఆ శ్రీహరి లీలలు యెన్నని చెప్పగలము. వేదములను సోమకాసురునుంచి రక్షించి బ్రహ్మకిచ్చాడు. క్రుంగిన భూమిని సరిజేశాడు. భస్మాసురుని బూడిద చేసి అట్టి దుష్టులకు ప్రమాదకరమైన వరములివ్వవద్దని శివునికి హితము జెప్పాడు.

శివపార్వతులను దంపతులను చేయుటకు తన సుతుడైన కందర్పుని (మన్మథుని) త్యాగం చేసి అతను మరణించక జీవుల మనస్సులలో జీవిస్తూ కామప్రకోపముచే సంతానోత్పత్తి చేయించి జీవుల పుట్టుకకు మూలకారణమైనాడు కమలాక్షుడు. శివుడు అందుకే పాదతీర్థమైన ఆకాశగంగను ధరించి గంగాధరుడై తిరిగి భూమిపైకి పంపి జీవులకు దాహము తీర్చాడు. ఈ మహిని పరిపాలించటానికి యెన్నో మాయలు చేస్తుంటాడు. ఆయన సంకల్పమే జీవులకు ఆజ్ఞయై వారిచేత సత్కర్మలూ దుష్కర్మలూ రెండూ చేయిస్తుంటాయి. దుష్కర్మల వల్ల జీవులు నశించి తిరిగి పుడుతుంటారు. ఇదే జగన్నాటకం. చెడు నిర్మూలనకే సుదర్శనమనే చక్రాయుధుడై అహంకరించిన దుర్వాస మహామునిని సంహరించి తన భక్తుడైన అంబరీషుని బ్రతికించి, మునులకు అహంకారం తగదని హితవు చెప్పాడు.

మతములు అనేకము వచ్చినా అన్ని మతముల ఆశయము పరమాత్మలో ఐక్యమేనని వారికి తిరిగి జన్మలేక ముక్తినిస్తానన్నాడు. అందరూ సన్యసించి ఋషులైతే, సృష్టి ఆగిపోతుందని కేశవనామాలతో సంధ్యావందనము యేర్పరచి ఏనాటిపాపం ఆనాడే పోవునట్లు చేశాడు. దాని వలన సద్వర్తనులకు పాపమే రాదు.

కేశవుని వంటి దైవమే లేదని వేదములను సామాన్యులకోసం పురాణాలుగా వివరించిన వేదవ్యాస మహాముని కీర్తించాడు. వశిష్టుని ద్వారా ధర్మము, శుకుని ద్వారా భాగవతము, నారదుని ద్వారా భక్తిని ప్రచారం చేసినందువల్ల జీవులు పురుషోత్తముని దాసులై ముక్తిమార్గమే మేలని గ్రహించారు.

విష్ణువు దయాసాగరుడు. శంకరునే బంటునిచేసికొని అహంకరించిన బాణాసురుని నఱికివేసి భంగపడితే మన్నించి బాంధవ్యం కలుపుకొనినాడు. విఠ్ఠలుడై సమ్మోహనకరమైన వేణునాదలోలుడైనాడు. బాణముగా మారి త్రిపురాసురులను భస్మీపటలం చేశాడు. ఆవిధముగా ప్రాణులను అనేకపర్యాయములు రక్షించాడీ పరమాత్మ.

దేవతలను వికృతమైన వరగర్వితులైన అనేకమంది దానవులు పీడిస్తే ఎన్నో అవతారములను ధరించి వారిని సంహరించి దేవతలను, ధర్మనిరతులను రక్షించాడు. ఇంద్రాది దేవతలపై ప్రేమతో పారిజాతాది సిరులనిచ్చి అనేక వరములనిచ్చాడీ దేవదేవుడు.

భూదేవి ఈతని భార్యామణి. క్షీరసాగరము అతని నివాసము. ఆదిశేషుడు ఆతని తల్పము. సర్వజగములకు వెలుగునిచ్చే సూర్య చంద్రులు అతని రెండు నేత్రములు. జగముల కవసరమైన 'గాలి' అతని ఊర్పులు లోపలికిపోయి బయటకు వచ్చే గాలికి అతని వలననే ప్రచండ శక్తి వచ్చినది. విశాలమైన అనేక ఖగోళముల మధ్యవున్న ఆకాశము శూన్యమై కూడా పరమాత్మ శక్తితో ఖగోళమును ఒక క్రమమున నడుపుచున్నది. ఈ విధముగా పృథ్వి, వాయువు, నీరు, తేజస్సు, ఆకాశము అనే పంచ భూతముల ద్వారా సృష్టిని నియంత్రించుచున్నవాడు ఈ వాసుదేవుడు గాక మరెవరు?

నిజానికి హరిహరులమధ్య అభేదమే. అయినా రాబోయే భారతయుద్ధంలో అర్జునుని అనేక పర్యాయములు రక్షించవలసి వుంటుంది అని హరుని పూజించే అర్జునుని బావమరిదిని చేసికొని తన శ్రీపాదము నొసగినాడీ హరికృష్ణుడు. అదేవిధంగా చిరంజీవిగా వరము పొందిన మార్కండేయునికి తన మహిమను చూపి పురాణకర్తను చేసి వరదైవము నారాయణుడని ఆయనచేతనే వాదించునట్లు చేసి ధర్మసురక్ష చేశాడు.

శరణన్న వారికి ఈయన ఇవ్వని ఔన్నత్యం లేదు. కలియుగంలో పాపాలు చేస్తూ తపశ్శక్తి లేని అల్పాయుష్కులకు, దినదినగండం గడిస్తేనే నూరేళ్ళు ఆయుస్సు అని గ్రహించేలా చేయటానికి వరములు కురిపించే వేంకటేశ్వరునిగా తిరుమలపై వెలసిన ఈతని కరుణని వర్ణించటం మానవమాత్రులకు సాధ్యమవుతుందా? శంకరుని అర్ధశరీరమైన పార్వతీదేవి శ్రీహరి భక్తురాలు, చెల్లెలు మరి మీకు ఈ శ్రీపతియే భుక్తి, శక్తి, రక్తి, యుక్తి, విరక్తి, ముక్తి.... ఇది నిజం.

సంఖ్య : X/25 రాగం : గుండక్రియ

కీర్తన : వట్టవిచారములేల వలవని చింత లేల

**96 వట్టివిచారము లేల వలవని చింత లేల**
**దిట్టతనాన రక్షించ దేవుఁ డుండఁగాను ॥పల్లవి॥**

**తానె బుద్దెరిఁగితే తప్పు లేల వచ్చీని**
**మానక యేలిక లెస్స మన్నించుఁ గాక**
**మేనిలోఁ బాపము లేక మించిన భయ మేఁటికి**
**ఆనుకొని రక్షించ శ్రీహరి యుండఁగాను ॥వట్టి॥**

**చేరి తానె కొలిచితే జీత మేల తప్పీని**
**భారకుఁడై దొరయే చేపట్టుఁ గాక**
**మారుముద్ర గాని మంచిమాడకు వట్టము లేల**
**తారుకాణగా హరి తానె రక్షించుఁ గాక ॥వట్టి॥**

**చనవె కలిగితేను సలి గేల తప్పీని**
**తనచెప్పినట్టు రాజు తాఁ జేసుఁగాక**
**పనివడి రాచవారి పసులకు బందె యేది**
**నను శ్రీవెంకటగిరినాథుఁడు రక్షించఁగా ॥వట్టి॥25**

**ఉపోద్ఘాతము :**

చినతిరుమలయ్య భక్తి పారవశ్యంలో తాత అన్నమయ్యతో పోల్చదగినవాడే. ఈ కీర్తన వంటిదే అన్నమయ్య కూడా చెప్పారు. మేము వేంకటేశుని పసువులము. మాకు బందెలదొడ్డి యేమిటి? రాజుగారి పశువులకు, బందెలు దొడ్డి వుంటుందా? మేము సర్వలోక నాయకుడైన వేంకటేశుని బంట్లము. మా జోలికి వస్తే వూరుకోడు మా స్వామి అని సగర్వంగా ప్రకటించుకొంటున్నారు. దిట్ట తనాన మనల్నందరినీ మన దేవుడే రక్షించుకొంటాడు. ఇక అనవసరమైన చింతలు వంతలు యెందుకర్రా! అని ధైర్యం చెబుతున్నారు.

**తే.గీ॥ దిట్టతనమున రక్షించు దేవుడుండ**
**వట్టి చింతలు యేలనో వంతలేల?**
**రాచపసులకు బందెలు రావు అడ్డు**
**వేంకటేశుని బంట్లకు వెఅపులేల?**

**భావోద్దేశ్యము :**

వట్టి (వ్యర్థమైన) విచారములేల (విచారములెందుకు) వలము (వదలని) చింతలు యేల? దిట్టతనముతో (సామర్థ్యంతో) రక్షించే దేవుడు (భగవంతుడైన వేంకటేశ్వరుడు) వుండగా మనకేమి భయం?

తానే నేరస్థుడు గాక బుద్ధిమంతుడైతే వాడివల్ల తప్పెందుకు జరుగుతుంది? అట్టివానిని యేలిక లెస్సగా మన్నించడా? ఎవనిమేనిలో పాపచింతవుండదో వానికి భయమెందుకు వానికి ఆనుకొని (సంరక్షించుచు) శ్రీపతియే వుండగా ఇక వానికి భయమెందుకు?

తానే వచ్చి కొలిచినా జీతమీయక తప్పుతుందా? భారకుడై (భారము వహించినవాడై) దొరయే పూనుకొంటే ఇంకా కావలసిందేమిటి? మారుముద్రగాని (దొంగనాణెముగాని) మాడకు మంచి మాడ అని నిరూపణ కావలెనా? దానికి వట్టము (తరుగు పెట్టుట) వుంటుందా. అందరికీ నిరూపణగా శ్రీహరి తానే రక్షిస్తుంటే, ఇంకా నిరూపణేమిటి?

ఈ స్వామి అనుగ్రహం కలిగితే బంధీ యేల? తప్పుతుంది, ఎందుకంటే ఈయన యెలా చెప్పితే ఆదేశపు రాజు సరిగ్గా అలాగే చేస్తాడు. మేము ఆ రాజుగారి పసువుల్లాంటి వాళ్ళము. మాకు బందిలుదొడ్డిలో పెట్టటం వుండనే వుండదు. ఎందుకంటే నేనూ శ్రీవేంకటేశుని పశువును. నన్ను ఆయన రక్షించును కదా!

సంఖ్య : X/31 రాగం : గుజ్జరి
కీర్తన : వద్దుసుమ్మీ చెప్పితిని వలల బడగ వద్దు

**97 వద్దుసుమ్మీ చెప్పితిని వలలఁ బడఁగ వద్దు**
**పెద్దరికాన దేవునిఁ బేరుకొన రాదా ॥పల్లవి॥**

**పల్లదపు సంసారానఁ బాయలేక తిరిగేవు**
**చెల్లఁబో జీవుఁడ యింకా సిగ్గు గాదుగా**
**వెల్లవిరి నింతయాల వెనకముందరిపాటు**
**దళ్లాలితనము మాని తలఁచుకో రాదా ॥వద్దు॥**

**వెయ్యైనా మీఁద మీఁద వేసరక కోరేవు**
**అయ్యో యింకా నిందు కాసపడేవా**
**వొయ్యనె వెనకజన్మ మొక్క టొక్క టెంచి చూచి**
**తియ్యని విష్ణుభక్తి తెలుసుకో రాదా ॥వద్దు॥**

**యేపు మీరి యేమైనా నింపులు సేసుకొనేవు**
**పో పో యింకా రోఁత వుట్టదాయఁగా**
**చేపట్టి కాచేయట్టి శ్రీవెంకటనాథుఁడె**
**దాపై వున్నాఁ డిదె దరిసించ రాదా ॥వద్దు॥31**

**ఉపోద్ఘాతము :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ మేటి కీర్తన నాకళింపుచేసికొంటే మీరు ముక్తి బాటలో పడ్డట్లే. జీవనోపాధికి చదివే చదువుల ఆశయం పొట్టనింపుకోగల కొలువు సంపాదన. 18 ఏళ్ళ యువకుడికి మంచి జీవనోపాధి పొంది కొంతకాలానికి వివాహము, వంశాభివృద్ధి. ఆపైన తనను కన్నవారిని తరింపజేయుట, తాను కన్నవారిని ప్రయోజకులను చేయుట. ఇక వీటిని ఒక్కొక్కటే విడనాడి భగవంతుని దారిలో బడి ముక్తికి కృషిచేయుట. నిజానికి నేనూ దాదాపు ఇట్లే చేశాను. కాని భగవంతుని దారిలో పడి ముక్తికి ఆరాటపడలేదు. ఇంకా ఇంకా సంపాదించాలనుకొన్నాను. ఎలక్ట్రానిక్స్ ఇంజినీరుకు, సోల్డరింగ్ చేసే కుడిచేతిని పక్షవాతంతో తీసివేస్తే చంపేసినట్లే. అలాగే నన్ను చంపినా ఆ తిరుమలేశునికే జాలిపుట్టి ఇదివరలో నేను పద్యాలలో చెప్పిన భగవద్గీతకు మెచ్చినట్లున్నాడు, ఎడమచేత్తో వ్రాయటం నేర్పి నా బ్రతుక్కి ఒక పరమార్థం కల్పించాడు. ఇప్పుడు 2016 అన్నమయ్య కీర్తనలను విశ్లేషించాను. సగం వేంకటేశ్వరుడు స్వీకరించాడు. ఇక నేను జీవన్ముక్తుణ్ణి. చావు నన్నేం చేస్తుంది?

**చం॥ వలలబడంగవద్దు విను, వాదన మానుము చెప్పితిన్ కదా!**
**చెలువుగపెద్దవై మసలు శ్రీహరి దేవుడు పేరుకొంటినే**
**నిలువవు పాయలేవెపుడు నీదనుకొందువు ఈ జగంబునే**
**కొలువుము వేంకటేశ్వరుని కోరుము ముక్తిని ఇప్పుడైననున్.**

**భావోద్దేశ్యము :**

నేను చెప్పితిని సుమా! నా మాట వినుము. వలలో పడవద్దు. ఇప్పటికైనా పెద్దరికం వహించి సర్వమునకూ కారణము దేవుడు తప్ప మరేదీ కాదని పేర్కొనరాదా!

పల్లదపు సంసారాన ధూర్తత్వంకల జగత్తును) పాయలేవు (విడువలేక) తిరిగేవు. అయ్యయ్యో! జీవుడా ఇంకా నీకు సిగ్గురాదుటరా! విజృంభించిన ఇంతయాల (ఉపేక్ష)తో వెనకాముందూ అవుతూ అనేక పాట్లు పడతావు. దళ్ళాలితనము (మోసగాని లక్షణం) మానుకోవు. ఈ పీకులాట బదులు ఇకనైనా శ్రీహరిని తలచుకోరాదుటరా జీవుడా!

నీకెన్ని వున్నా విసుగులేక ఇంకో వెయ్యి కావాలని కోరుకొంటావు. అయ్యో! ఇంకా ఇందులో ఆశపడేందుకేముందిరా? మెల్లగా వెనక జన్మలలో ఒక్కొక్కదాంట్లో యేమి జరిగుంటుందో వూహించు. విష్ణుకృపలేక నీకు ఇంతమంచి జన్మ ఒక్కసారి వచ్చేస్తుందా? రానేరాదు. ఇకనైనా తియ్యని విష్ణుభక్తినాస్వాదించరాదా?

ఏపుమీరి (అతిశయించి) ఇంకా యేమైనా ఇంపులు మంచి బాగులు నీకు నీవే చేసికొనవలెనని ఆరాటపడతావు. పోపోరా! ఇంకా నీకు రోత పుట్టటం లేదా దౌర్భాగ్యుడా! ఎన్నాళ్ళిలా ఛస్తావు? చేపట్టి కాచే కలియుగదైవం శ్రీవేంకటేశ్వరుడు మన దగ్గరనే వున్నాడురా! ఇప్పుడైనా ఆయనను దర్శించి తరించరాదుటరా! నీకు మంచి జన్మనిచ్చాడు కదరా!

సంఖ్య : IV/352 రాగం : ముఖారి
కీర్తన : వింతనా నేదనకు వేసాలవాడు

**98** **వింతనా నేఁ దనకు వేసాలవాఁడు**
**కంతునికి గురుఁ డనఁగలిగినవాఁడు** ॥పల్లవి॥

**జడిగొని మొదలఁ దా జలసూత్రపువాఁడు**
**వెడమాయలుగ బారి విద్యలవాఁడు**
**కడుసోద్యములనే కర్మపుఁ జేఁతలవాఁడు**
**అడరి కంభపుసూత్ర మాడెడివాఁడు** ॥వింత॥

**యిలనుండి మిన్ను ముట్టే యింద్రజాలములవాఁడు**
**తల ద్రుంచి బ్రదికించుతక్కులవాఁడు**
**తెలియఁ గొండలు నీళ్ళఁ దేలవేసినవాఁడు**
**కలసి పగలు రేయిగాఁ జేసేవాఁడు** ॥వింత॥

**మగువలభ్రమయించేమౌనవ్రతములవాఁడు**
**వెగటై రాయి గంతులు వేయించేవాఁడు**
**చిగిరించే వరముల శ్రీ వేంకటాద్రివాఁడు**
**బగివాయ కిట మమ్ముఁ బాలించేవాఁడు** ॥వింత॥**352**

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య వినిపించిన చక్కని దశావతార కీర్తనను ఆస్వాదించండి. అన్నమయ్య ప్రత్యేకత యేమంటే ఇది దశావతార కీర్తన అని పెద్దలు వివరిస్తేనో, లేక అంటేనో... అవునా అని ఆలోచించి సమన్వయ పరచుకొంటేకాని అర్థం కావు. నామాటలపై నమ్మకం లేకపోతే ఈ కీర్తననే భావించండి. వెడమాయలుగ బారి విద్యలవాడు... అంటే యేమిటో ఆలోచించండి. వింతమాయలు చూపిన గారడి విద్యలవాడు. నిలువెత్తు సుందరాకారుడు (విష్ణువు) చిన్న తాబేలు అయిపోయి పెద్ద కొండను వీపు మీద మోసింది. ఆ తాబేలే అందమైన ఆడదియై (మోహిన) రాక్షసులను మోహింపజేయుట, చక్రంతో ఇద్దరు రాక్షసుల తలలు ఖండించటం వంటి మాయలు ప్రదర్శించాడు. అంటే కూర్మావతార ప్రస్తుతి. ఇంత గూఢంగా వుంటుంది. దశావతార వర్ణన.

**ఆ.వె॥ వింతగాదు నాకు వేసాల వాడేను**
**దశ విధముల రూపు దాల్చువాడు**
**మన్మథునికి తండ్రి మావేంకటేశుండు**
**మమ్ముయేలువాడు మరి యెవండు?**

**భావోద్దేశ్యము :**

నేను (అన్నమయ్య) తనకు (శ్రీహరికి) వింతనా (యెరుగనివాడనా?) తానే వేసాలవాడు (అనేక రూపములను దాల్చినవాడు). అతనెంత అందగాడంటే కంతునికి గురుడు (మన్మథునికి తండ్రి) అనగలిగినవాడు.

జడిగొని (అతిశయించి) ఆదికాలంలో తాను జలసూత్రపువాడు (చేప ఆకారం దాల్చినవాడు) అనగా మత్స్యావతారుడు. వెడమాయలుగబారి విద్యలవాడు (వింత మాయలు చూపిన గారడి విద్యలవాడు) అంటే కొండను మోసిన కూర్మావతారుడు. ఎన్నో చోద్యములు చూపిన పనులు చేసినవాడు. వరాహరూపుడైనా భూదేవిని వలపించుకొన్నవాడు వరాహావతారము. కంభమున తనను తానే సృజించుకొన్న నరుడు సింగమూ అయిన నరసింహావతారం.

ఒక పాదంతో నేలను ఇంకొక పాదంతో నింగిని అణుమాత్రం సందులేకుండా కప్పివేసిన ఇంద్రజాల విద్యవాడు. అంటే త్రివిక్రముడైన వామనావతారుడు. తల్లితల నిస్సంకోచంగా నరికి వరమడిగి అదే తల్లిని బ్రతికించుకొన్నవాడు పరశురామావతారుడు. నీలునిద్వారా కొండలను సముద్ర జలములపై తెలించి వారధి కట్టి కపిసేనతో దాటిన రావణాంతకుడు శ్రీరామావతారము. పగటివేళ సుదర్శన చక్రమును సూర్యుని కడ్డముగా రమ్మని ఆదేశించి చీకటిని సృష్టించిన అర్జునుని మరణించాలని వెలువడిన సైంధవుని చంపించాడు. శ్రీకృష్ణావతారము.

త్రిపురాసుల స్త్రీలను భ్రమయించి వారి మానములనపహరించి వారి భర్తల మరణకారణమైన మౌనవ్రతమువాడు బుద్ధావతారము. ద్వేషముతో రాయిని (దేవతాశ్వమును) చిందులు తొక్కించిన కల్కి అవతారము. చిగురించే వరములు శ్రీవేంకటాద్రిపై ఒసగినవాడు శ్రీవేంకటేశ్వరుడు. బగివాయక (దూరముగాక) ఈవిధముగా మమ్ము పాలించేవాడు.

సంఖ్య : XXVII/XXIII రాగం : మధ్యమావతి

కీర్తన : వీడే నెలకొన్నాడు శ్రీవేంకటగిరి మీద

**99 వీడే నెలకొన్నాడు శ్రీవేంకటగిరి మీద**
**వీడే కౌరవుల పాలిటికీ విశ్వరూపుడితడు ॥పల్లవి॥**

**త్రిపురంబులపై వ్రాలిన ఆఘన తీవ్ర బాణమితడు**
**చపలపు బాణుని మర్మభేదియగు చక్రధరుడితడు**
**విపరీతము కంబముతో వెలసిన వీరసింహమితడు**
**కపటపు భస్మాసురుని పాలిటికి కాలదండమితడు ॥వీడే॥**

**ధరణి కింద బలినణిచిన ఆపాలే(తా)ళ భేదియితడు**
**పరశురాముని గర్వము నణచిన ప్రళయ వాయువితడు**
**ఒరసిన నరకాసురుని పాలిటికి ఉరుమని పిడుగితడు**
**దురమున నెదరిన దనుజ కోటులకు ధూమకేతువితడు ॥వీడే॥**

**అదిగో విధిరుద్రాదుల కెల్లను ఆదిమూల మితడు**
**పదిలముగా తను గొలిచిన ఆశ్రిత పారిజాతమితడు**
**కదలని ఆ బ్రహ్మాండ కోటులకు కన్నతండ్రి యితడు**
**వెదకి వెదకి వరము లొసంగెడి వేంకటపతి యితడు ॥వీడే॥**

**ఉపోద్ఘాతము :**

ఇంత చక్కటి అన్నమయ్య కీర్తనకు అంతే చక్కటి సీస పద్యం తోడై ఆ కోనేటిరాయని కొలువును అలరిస్తుందని నా ఆశ. తండ్రీ! ఇది నీ వైభవమేనయ్యా!!

**సీ॥ త్రిపురాలుగూల్చిన తీవ్ర బాణము వీడు**
**చపల బాణుని పాలిచక్రధరుడు**
**కంభాన వెలసిన ఘననారసింహము**
**భస్మాసురుని జేసె భస్మరాసి**
**బలిని త్రొక్కినయట్టి పాతాళభేది, ఆ**
**పరశురాముని పాలి ప్రళయమితడు**
**నరకుని పాలిటి ఉరుములేని పిడుగు**
**ధూర్తులు దనుజుల ధూమకేతు**

**తే.గీ.॥ ఆ విరించికి శివునికి ఆదిమూర్తి**
**వికట కురుపతి పాలిటి విశ్వరూపి**
**అన్నిబ్రహ్మాండకోట్లకు కన్నతండ్రి,**
**వెదకి వరముల నొసగెడి వేంకటపతి.**

**భావోద్దేశ్యము :**

శ్రీవేంకటగిరి మీద నెలకొన్న ఇతగాడే అన్ని రూపములను దాల్చి ఇలలో దుష్టశిక్షణ, శిష్ట రక్షణ చేసినాడు. ఇతడే కౌరవులకు విశ్వరూపము చూపి తానే పరమాత్మనని చాటినాడు. (వారు వినలేదు, అది వారి దౌర్భాగ్యము).

ఇతడు త్రిపురాసురులనంతముచేసిన తీవ్ర బాణము చపల స్వభావముగల బాణాసురునిపాలి చక్రధారి విష్ణువు. ఇతడు విపరీతముగా స్తంభమున వెలసి హిరణ్యకశిపుని వధించిన వీరనరసింహుడు. భస్మాసురుని భస్మము చేసిన యమదండము వీడే.

భూమిక్రింద లోకమైన రసాతలమునకు బలిని అణగద్రొక్కినా అతని దాతృత్వానికి మెచ్చి దానికి కావలివానిగా మారిన ధర్మమూర్తియే వీడు. పరశురాముని గర్వభంగము చేసిన ప్రళయమారుతము రామచంద్రుడితడే. శ్రీకృష్ణుడై అతిశయించిన నరకాసురుని పాలిటి ఉరమని పిడుగై వాని పీడతొలగించాడు. వీడు దురమున (రణరంగమున) తననెదిరించిన కోట్లాది దానవులను తుదముట్టించిన ధూమకేతువు (తోకచుక్క) వీడే.

అదిగో ఆ తిరుమల నాయకుడే విరించి (బ్రహ్మదేవునికి) రుద్రునికి (శివునికి) ఆదిమూర్తి అయిన పరమాత్ముడు. తనను శ్రద్ధగా కొలిచిన ఆశ్రితులపాలిటి అభీష్టప్రదాతయైన పారిజాతవృక్షము వీడే. అభేద్యమైన బ్రహ్మాండ కోట్లకు కన్నతండ్రి ఈ శ్రీహరియే. తన దాసులకు వెదకి వెదకి మరీ వరములొసగే శ్రీవేంకటేశ్వరుడు వీడే. వీనిని శరణనండి.

సంఖ్య : XXIVV/XXI రాగం : వలజి

కీర్తన : వీణ వాయించెనే అలమేలు మంగమ్మ

**100 వీణ వాయించెనే అలమేలు మంగమ్మ**
**వేణుగాన విలోలుఁడైన వేంకటేశునొద్ద** ॥పల్లవి॥

**కురులు మెల్లన జాఱఁగ సన్నజాజి -**
**విరులు జల్లన రాలఁగ**
**కరకంకణంబులు ఘల్లని మ్రోయఁగ**
**మరువైన వజ్రాల మెరుగు తూలాడఁగ** ॥వీణ॥

**సందిటి దండలు కదలఁగాను ఆణిముత్యాల -**
**సరులు ఉయ్యాల లూఁగఁగాను**
**అందమై పాలిండ్లను అలఁదిన కుంకుమ**
**గంధము చెమటచే ఁకరఁగి ఘుమఘుమనగా** ॥వీణ॥

**ఘన నయనములు... మెరయంగా వింతరాగ -**
**మును ముద్దులు కులుకఁగా**
**ఘన నిభవేణి జంత్ర గాత్రము మెరయగా**
**వినెడి శ్రీవేంకటేశుల వీనుల విందుగా** ॥వీణ॥

**ఉపోద్ఘాతము :**

ఎంత మనోహరమైన దృశ్యాన్ని అన్నమయ్య ఆవిష్కరిస్తున్నారో జ్ఞాననేత్రంతో అనుభూతిచెంది ఆ నందకాంశ సంభూతుని పొగడండి. సంపెంగలు మూటగట్టిన వస్త్రానికి కూడ సుగంధమబ్బినట్లు పదకవితా పితామహుని విభావరి నాబోటి అనామకుని విశ్లేషణ కూడా మన్నన పాత్రత నొందింది. వేణుగానలోలుడైన శ్రీవేంకటపతిని తన వీణావాదన నిపుణతతో అలమేలుమంగమ్మ అలరించిందట. ఆమె సొబగులు ఆ ఘన నిభవేణికి తోడైన జంత్రగాత్ర విభావరి తిరుమలేశునిచేత సెహబాస్ అనిపించిందట.

**తే.గీ॥ వీణ వాయించెనీ అలివేణి మంగ**
**వేణుగాన విలోలుడు వేంకటేశు -**
**నొద్ద, జంత్ర గాత్రపు జోడి నోలలాడి**
**కళల కలికిని మెచ్చె వేంకటవిభుండు.**

**భావోద్దేశ్యము :**

ఈ అలమేలు మంగమ్మ వీణవాయించినది. వేణుగానలోలుడైన శ్రీవేంకటేశ్వరుడి వద్ద జరిపిన ఆ సంగీత విభావరి ఆ ఏడుకొండలవాని మనస్సును, మురిపించింది. అందుకు ఇంకొక కారణం కూడా వున్నది. ఏమిటది?

ఆ వీణావాదనలో నిమగ్నమైన ఆ దేవి కురులు మెల్లగా జారిపోయాయి. కొప్పులోని సన్నజాజిపూలు జలజలా రాలజొచ్చినవి. వీణవాదనకు, లయగా దేవి కరములలోని కంకణరవములు మేళవించినవి. మరువైన (మరువైన అంటే సుందరమైన) వజ్రాల మెరుగు, తూలాడగ (చలించగా) దేవి చేతివేళ్ళు వీణపై నర్తించినవి.

ఆ దేవి సందిటి దండలు (దండ కడియాలు) కదలాడుతుంటే ఆమె మెడలోని ముత్యాలదండలు ఉయ్యాలలూగుచున్నవి. అందమైన పాలిండ్లనలదిన పరిమిళ భరిత కుంకుమ స్వేదమునకు తోడై ఘమఘమలాడినది. ఇవి శ్రీవిభుని మనసు దోచినవి కాబోలు.

తన విభుని మురిపెమును చూచిన దేవి విప్పారిన కనులు మెఱసినవి. వింతగా ఆమె రాగమునకు అనురాగముతోడై ముద్దుగా ఆ దేవి కులికినది. ఘనమైన కేశపాశము మెఱసినట్లే జంత్ర వాయిద్యములు గాత్ర సమ్మేళనముతో మురిపించగా శ్రీవేంకటేశ్వరుని వీనులకు "వినెడి విందు" విరిసినది.

సంఖ్య : XV/338 రాగం : నాట

కీర్తన : వెదకితే నీ వంటి వేల్పు లెవ్వరున్నారు

**101 వెదకితే నీ వంటివేల్పు లెవ్వ రున్నారు**
**అదన నీ దాసుఁడైన యతఁడే పుణ్యుఁ డయ్యా ॥పల్లవి॥**

**యేలేది పరమపద మీశ్వరుఁడ విందరికి**
**మేలిమి శ్రీభూమీసమేతుఁడవు**
**పాలింతువు లోకమెల్ల బ్రహ్మంతవాఁడు కొడుకు**
**వాలాయించి నిన్నుఁ గొల్చువాఁడే ధన్యుఁ డయ్యా ॥వెదకి॥**

**పందేది పాలజలధి పంపుసేసేది చక్రము**
**నిండువన్నెపైఁడికోక నీ మేనిది**
**వుండుదు వందరిలోన యోగమాయ నీ మహిమ**
**అండ నిన్ను నమ్మినవాఁ డన్నిటాఁ బూజ్యుఁ డయ్యా ॥వెదకి॥**

**సురలు నీ యాజ్ఞవారు సూర్యచంద్రులు కన్నులు**
**బిరుదుటెక్కెములు చూపే వేదములు**
**వురమున నలమేల్మంగ యొప్పెను శ్రీవేంకటేశ**
**గరిమ నీ శరణన్నఘనుఁడే నేర్పరయ్యా ॥వెదకి॥**

**ఉపోద్ఘాతము :**

శ్రీవేంకటేశ్వరుని ప్రస్తుతిస్తున్నారు పెదతిరుమలయ్య. బహు సరళమైన కీర్తన ఇది. ఎక్కడ వెదకినా ఇతని వంటి వేల్పు దొరుకుతాడా? ఈ లోకంలో పుణ్యులెవరు అంటే తడుముకోకుండా నీ దాసులని వెంటనే చెప్పవచ్చును. ఎందుకంటే అనంతమైన, విలక్షణములున్న మరియొక వేల్పెవ్వడు? అందుకనే నిజమైన నేర్పరి యెవ్వడు అంటే నిన్ను శరణుజొచ్చి నిశ్చింతగా వుండేవాడు అని అంటున్నారు. ఈ స్వామికి వేదములు అంటే యెంతప్రీతి అంటే అవి ఆయనకు బిరుదుటెక్కెములంట. అనగా రథముపై రెపరెపలాడు జెండాలన్నమాట.

**చం॥ వెదకగ నిన్ను బోల్చగల వేల్పుమరెవ్వడు లోకమెల్లయున్**
**చెదరని దాసులే[ప్రియులు చెల్వపు కన్నులు సూర్యచం[ద్రులున్**
**గదిసిన భార్యలీ అవనికల్మి సతీమణి, బిడ్డ [బహ్మయున్**
**మదనుని కన్నవేలుపువు మాధవుడందురు భక్తులందరున్**
**నిదురలు పాలసం[ద్రమున, నింపుదు మాయలు, కొకపైడిదే**
**వదలని వేంకటేశుడవు భార్యనురంబున దాల్తువెల్లెడన్**

**భావోద్దేశ్యము :**

ఓ దేవదేవా! యెంత వెదకినా ఈ సృష్టిలో నీవంటి వేల్పు మరియొకరు లేరు. తగినట్లుగా నీదాసుడైన వాడే నిశ్చయముగా పుణ్యాత్ముడు.

అందరికీ నీవు ఈశ్వరుడవు (ఏలికవు). నీవు ఏలునది పరమపదము అని [ప్రసిద్ధి చెందిన వైకుంఠము. మేలిమి బంగారము వంటి శ్రీదేవికి, రత్నగర్భయైన భూదేవికి నీవు భర్తవు. లోకములనన్నింటినీ పరిపాలింతువు. [బహ్మదేవుడంతటివాడు నీ కొడుకు వాలాయించి (నిర్బంధించినట్లు) నిన్ను గొలిచినవాడే ధన్యుడు.

పండేది (నీవు పరుండునది) క్షీరసాగరమున. దుష్టసంహారానికి నీవు పంపుసేసేది (పంపించేది) చ[క్రాయుధము. నీవు నీ శరీరంపై ధరించేది పైడికోక (స్వర్ణపీతాంబరము). నీ నివాసము అంతర్యామిగా అందరిలోనూ వుంటావు. నీ యోగమాయవల్ల నీ మహిమ వెల్లడి అవతుంటుంది. నీవే అండవు అని నమ్మేవాడు, నిజమైన పూజ్యుడు.

దేవతలందరూ నీ ఆజ్ఞను పాటించేవారే. సూర్యచం[ద్రులిరువురూ నీ రెండు కన్నులు. చతుర్వేదములు రెపరెపలాడే నీ రథముపైని జెండాలు. దేవి అలమేల్మంగ యెప్పుడు నీ వురముననే నివసిస్తుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీ మహిమ నెరిగి నిన్ను శరణుజొచ్చినవాడే నిజమైన నేర్పరి.

సంఖ్య : II/32 రాగం : ఝుంఝూటి

కీర్తన : వెన్నలు దొంగిలునాటి వెట్టివా నీవు

**102 వెన్నలు దొంగిలునాటి వెట్టివా నీవు**
**విన్న కన్న జాడ గాదు వెట్టివా నీవు** ॥పల్లవి॥

**మీఁటి యజ్ఞానంబున మిమ్మెల్లని జీవుల**
**వీఁటిడివై మోచేవు వెట్టివా నీవు**
**వేఁటే నార పేరు నుడివితే నీ పేరనీవు**
**వేఁటులేని చుట్టమవై వెట్టివా నీవు** ॥వెన్నలు॥

**బంటులైన వారికెల్లాఁ బరతంత్రుఁడవై**
**వెంట వెంటఁ దిరగేవు వెట్టివా నీవు**
**అంటి రెండు కుచేలుని యడుకులకే మెచ్చేవు**
**వింటే మాకు నవ్వు వచ్చీ వెట్టివాడవా నీవు** ॥వెన్నలు॥

**పావనమై లోకులెల్లా బదుకుఁడంటాఁ బేరులు**
**వేవేలు వెట్టికొంటివి వెట్టివా నీవు**
**శ్రీ వేంకటేశుడవై చేరివరములిచ్చేవు**
**వేవేగ నెవ్వరికైనా వెట్టివా నీవు** ॥వెన్నలు॥

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య ఈ కీర్తనలో పురాణ కథలు విని ఈ శ్రీకృష్ణుడు వెన్నదొంగ, కన్నెలదొంగ, అసత్యవాది అనుకొనే కుహనా పండితులు యేవేవో పిట్టకథలతో భాగవతాన్ని భ్రష్టుపట్టించారు. ఇవన్నీ వారి వారి వెట్టి తలకెక్కిన ప్రలాపాలు. ఆయన వెట్టివాడా? మనము వెట్టి వెధవలము. అజ్ఞానాంధకారంలో జన్మల కర్మబంధాల సుడిగుండాలలో దినదినగండం నూరేళ్ళు ఆయువులాగ బ్రతికే ఈ 'వెట్టి సన్నాసులు' వేంకటరమణుని ఆక్షేపించే మొనగాళ్ళా?

**కం॥ వెన్నలు దొంగిలు వెట్టివ?**
**వెన్నుని జాడల నెఱుంగు వేత్తలెవరురా?**
**విన్నవి కన్నవి కథలే**
**ఎన్నటికీ నేర్వలేరు యీతని మహిమల్.**

**భావోద్దేశ్యము :**

ఓ దేవదేవా! నీవు రేపల్లెలో నీతోటి గొల్లపిల్లలతో వెన్నదొంగిలించి తినే వెఱ్ఱి గొల్లగోపయ్యవా? ఆ విన్న పిట్టకథలు కన్న నాటకముల రచయితల కథలు నీ జాడకాదు (నీ తత్త్వము కాదు). నీవు వెఱ్ఱివాడనే అజ్ఞానులే నిజమైన వెఱ్ఱివారు.

భాగవతమును భక్తితో చదివేవారికే నీ మహిమ అనంతమని తెలుస్తుంది. ప్రభూ! మిమ్ము ఒల్లని (అంగీకరించని) జీవులు అజ్ఞానం మితిమీరి అట్లా చేస్తుంటారు. వారిని కూడా వేఁటిడివై (అమాయకుడవై) మోచేవు (వహిస్తున్నావు). ఎందుకు నీవు జగద్రక్షకుడవు, అందుకు. వాడెవడో చనిపోయే క్షణములో 'నారాయణా' అనలేక "నార" అని ప్రాణం వదిలాడు. వాడికి అది నీపేరు అనుకొని నీ వైకుంఠప్రాప్తినిచ్చావు. నీవు వెఱ్ఱివా?

పరతంత్రుడివై (పరుల అధీనములోనున్నవానివలె) నీ దాసుల వెంటవెంటే తిరుగుతుంటావు. నీవు దయాంబుధివా లేక వెఱ్ఱివా? అలా నిన్నన్న పిచ్చోళ్ళే వెఱ్ఱి. రెండు గుప్పిళ్ళ ముక్కిపోయిన అటుకులు తిని కుచేలుడిని మెచ్చి అష్టైశ్వర్యాలనిచ్చావట. ఈ కథ వింటేనే మా పొట్ట చెక్కలు అయ్యేంత నవ్వు వస్తోంది. ఇది వెఱ్ఱితనం అనుకునే 'సన్నాసులుకి' యేమి చెప్పగలము?

లోకములన్నీ పాపవిముక్తములై వర్ధిల్లాలని వేవేల నామములు ధరించి నన్నే పేరుతోనైనా మనస్ఫూర్తిగా పిలవండిరా వస్తాను అన్నావు. నీవేమైనా వెఱ్ఱి కొంటివా (పిచ్చితలకెక్కించుకొన్నావా?) తొమ్మిది వందల తొంబది తొమ్మిది పేర్లు మఱచినా ఒక్క పేరునైనా గుర్తుపెట్టుకొంటారని, ఇవన్నీ యీ వెఱ్ఱికుంకలవల్ల కాదు అని తిరుమలపై శ్రీవేంకటేశ్వరుడవై దర్శించి నమస్కరిస్తే కోరిన కోర్కెలు తీరుస్తున్నావే, నీవు వెఱ్ఱివా స్వామీ?

❋

సంఖ్య : XV/134 రాగం : సౌరాష్ట్ర

కీర్తన : శరణంటే జాలు సర్వేశ్వరునికి

**103 శరణంటేఁ జాలు సర్వేశ్వరునికి**
**అరయ నిందరిఁ గొట్టి అర్జునుఁ గావఁడా ॥పల్లవి॥**

**చేతెఁడు దవ్వేసుఁడీ చేరి మొక్కేవారికెల్ల**
**రాతిరిఁ బగలు హరి రక్షించే చోటు**
**కాతరాన జీవులాల కానలేరు నమ్మలేరు**
**ఘాతతో శిశువుకై కంబములో వెళ్ళడా ॥శరణంటే॥**

**కూఁతవెట్టుదవ్వేసుఁడీ కోరి పిలువ నేర్చితే**
**దాఁటి హరినామమునుండి పాలించే చోటు**
**లోఁతు గాదు వాఁతుగాదు లోలోన శ్రీపతి పేరు**
**నాతి మొరాలించి యీతడు నాఁడు గావఁడా ॥శరణంటే॥**

**కనుచూపు దవ్వేసుఁడీ కప్పి శ్రీవేంకటపతి**
**మనసులో అందరిని మన్నించేచోటు**
**ననిచి యేడనుండి ధ్యానము సేసికొనినాను**
**వనజాక్షుఁ డీతఁడే పో వరము లొసఁగడా ॥శరణంటే॥**

**ఉపోద్ఘాతము :**

పెదతిరుమలయ్య అత్యద్భుతమైన సత్యం చెబుతున్నారు. లోపం మానవుల్లో వుంటుంది కాని లోకేశ్వరుడు సర్వేశ్వరుడూ అయిన హరిలో వుండదు.

శ్రీపతికి నీవు ఈయగల 'సిరి' యెంత? కంటి చూపుతో కౌరవసేనని గొట్టి అర్జునుని కాపాడినాడు. స్తంభంలో వెలసి ప్రహ్లాదుని కాయలేదా? కృష్ణా! నీవేనాకు దిక్కు అంటే ద్రౌపదికి అక్షయమైన చీరెలిచ్చి మానసంరక్షణ చేయలేదా? తిరుమల రానక్కరలేదు, యెక్కడవున్నా 'శరణు శరణు సురేంద్ర సన్నుతా!' అంటే చాలు ఆ ధ్యానానికే తీసికొని, బాగుపడండిరా అని కోరిన వరాలిస్తాడు. ఒక్కటే తెలుసుకోవాలి. భక్తిలేని ప్రార్థనలు కంఠశోష తప్పించి ఫలితాన్నివ్వవు.

**ఆ.వె॥ శరణమనుట చాలు సర్వేశ్వరుని కది**
**అల కిరీటిగాచె అరులగొట్టి**
**వెదకి మనలనిచ్చు వేడినవరములు**
**వేంకటపతి సాటి వేల్పు కలడె?**

**భావోద్దేశ్యము :**

సర్వేశ్వరుని త్రికరణశుద్ధిగా నమ్మి శరణంటే చాలును. ఆపై నీబాధ్యత ఆయన తీసికొని నిను రక్షిస్తాడు. అర్జునుడు నీవే శరణు నీవేమి చెబుతే అది చేస్తానంటే అర్జునుని కంటికి రెప్పలా కాపాడాడు. వాని చేతుల ద్వారా కౌరవ పాపాత్ములను అందరిని తుదముట్టించాడు.

తనకి శరణని మొక్కే వారికి 'చేతెదవ్వేసుండి (చేతికందేంత దూరంలోనే వుంటాడు సుమా!) శ్రీహరి రేయింబవళ్ళూ వారిని కాపాడుతుంటాడు. ఓ జీవులారా! కాతరాన (ధైర్యం కోల్పోయి) శరణనక ఆయనను నమ్మలేరు. అందుకనే చూడలేరు. మనం చేయలేనిపని ఆనాడు శిశువు ప్రహ్లాదుడు చేశాడు కాబట్టే స్తంభములో వెలసి రక్షించాడు.

హరినామ సంకీర్తన జరిగేచోటునుంచి, కూతవేటు దూరములోనే (కేకవేస్తే వినిపించేదూరంలో) శ్రీహరి వుండి, పాలించుటలో జాగుచేయడు. తాను ఎంత లోతునవున్నా ఎంత ఎత్తునవున్నా శ్రీపతిపేరు లోలోపల స్మరించినా తక్షణం ఆదుకొంటాడు. ఆనాడు కురుసభలో ద్రౌపదిని కాపాడలేదా?

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటపతి కనుచూపు ఆనేటంత దూరంలోనే వుండి, కప్పి (వ్యాపించి) తన మనస్సుద్వారా అందరినీ రక్షిస్తాడు. మనము స్వయంగా తిరుమల శిఖరాలెక్కి స్వామిని దర్శించక్కరలేదు. ఎక్కడవుండి ధ్యానించినా, ఈ పద్మనయనుడు వరములొసగడా!! తప్పక ఇస్తాడు పో!!

సంఖ్య : III/155 రాగం : శ్రీరాగం

కీర్తన : శరణు వేడెద యజ్ఞ సంభవ రామ

**104 శరణు వేఁడెద యజ్ఞసంభవ రామ**
**అరసి రక్షించు మమ్ము నయోధ్యారామా. ॥పల్లవి॥**

**ధారుణిలో దశరథతనయ రామ**
**చేరినయహల్యను రక్షించినరామ**
**వారిధిబంధన కపివల్లభరామ**
**తారబ్రహ్మమైనసీతాపతిరామా. ॥శరణు॥**

**ఆదిత్యకులాంబుధిమృగాంకరామ। హర-**
**కోదండభంజనముచేకొనినరామ**
**వేదశాస్త్రపురాణాదివినుతరామ**
**ఆదిగొన్న తాటకాసంహార రామా. ॥శరణు॥**

**రావణునిభంజించినరాఘవ రామ**
**వావిరి విభీషణవరద రామా**
**సేవ నలమేల్మంగతో శ్రీవేంకటేశుఁడవై**
**యీవల దాసులనెల్లా నేలినట్టిరామా. ॥శరణు॥155**

**ఉపోద్ఘాతము :**

ఇప్పుడు అన్నమయ్య వినిపించిన శ్రీరామనామ సంకీర్తననాస్వాదిద్దాము. యజ్ఞసంభవుడైన రామచంద్రునికి శరణాగతి చెబుతూ వేడుకొంటున్న భజన ఇది. ఓ అయోధ్యరామా! మమ్ము రక్షించవయ్యా! అంటున్నారు. సీతాపతియైన యీ రఘుకులేశుడే తారకబ్రహ్మ అని అంటున్నారు. వేదశాస్త్రపురాణములన్నీ వినుతించిన కోదండ దీక్షాదక్షుడంటున్నారు. నాటి రావణ భంజనుడే నేటి అలమేల్మంగా వల్లభుడు శ్రీ వేంకటేశ్వరుడంటున్నారు. ఏమాత్రమూ సందిగ్ధతలేని శ్రీరామ భజన ఇది.

**తే.గీ॥ వేడెదను యజ్ఞసంభవా! నేడు శరణు,**
**అరసి రక్షించు సాకేతపురనివాస!**
**రామచంద్రుని కీర్తించి రామరామ**
**అనగ వేంకటేశుడు బ్రోచు అవనిజనుల.**

**భావోద్దేశ్యము :**

యజ్ఞమువలన సంభవించిన (పుట్టిన) ఓ శ్రీరామా! నిన్ను శరణువేడెదమయ్యా! ఓ అయోధ్యరామా! మమ్ము కరుణతో జూచి రక్షింపుము ప్రభూ!

ఓ శ్రీరామా! నీవు పుడమిలో దశరథ నందనునిగా ఆవిర్భవించినావు. విశ్వామిత్రుని దర్శకత్వంలో నీవు శిలవలె మారిన అహల్యను శాపవిముక్తురాలను చేసి రక్షించావు. కపిసేన అధినాయకుడవై సముద్రము మీద లంకకు వారధి (సేతువు) నిర్మించినావు. ఓ శ్రీరామా! సీతాపతివైన నీవే తారక బ్రహ్మమైనావు. కాశీనగరమున తుది శ్వాస విడచువారికి పరమశివుడు రామతారక మంత్రం పఠింపజేసి బ్రహ్మలోక ప్రాప్తినిస్తాడు.

ఆదిత్య (సూర్య) కులాంబుధి (వంశము అను సముద్రమున) పుట్టిన మృగాంక (చంద్రుడవైన) శ్రీరాముడివి. నీవు కోదండమను విల్లును యెల్లప్పుడు ధరించే దీక్షాదక్షుడవు. చతుర్వేదములు షట్శాస్త్రంబులు ఏకాదశ పురాణములు శ్లాఘించెడి శ్రీరాముడవు. ఆదికొన్న (దానవ సంహారాన్ని ఆరంభించిన) తాటకి అను రాక్షసిని సంహరించిన శ్రీరాముడవు.

రావణాసురుని నిర్జించిన రాఘవరాముడవు. వావిరి (ఉత్కృష్టముగా) విభీషణునికి అభయమొసగిన శ్రీరాముడవు. అలమేలుమంగ సేవించు వేంకటేశ్వరుడే నీవైన, శ్రీరామా! మాబోటి దాసులనెల్లవేళలా యేలితివి.

సంఖ్య : II/279 రాగం : శ్రీరాగం

కీర్తన : సకలలోకనాథుడు జనార్దనుడితడు

**105 సకలలోకనాథుఁడు జనార్దనుఁ డితఁడు**
**శుకయోగివంద్యునిసుజ్ఞాన మెంత** ॥పల్లవి॥

**మరునితండ్రికిని మఱి చక్కఁదనమెంత**
**సిరిమగనిభాగ్యము చెప్ప నెంత**
**పురుషోత్తముఘనత పొగడఁగ నిఁక నెంత**
**గరిమ జలధిశాయి గంభీర మెంత** ॥సకల॥

**వేవేలు ముఖాలవానివిగ్రహము చెప్ప నెంత**
**భూవల్లభునివోరుపు పోలించ నెంత**
**వావిరి బ్రహ్మతండ్రికి వర్ణింప రాజస మెంత**
**యేవల్లఁ జక్రాయుధుని కెదురెంచ నెంత** ॥సకల॥

**అమితవరదునికి ఔదార్యగుణ మెంత**
**విమతాసురవైరివిక్రమ మెంత**
**మమతల నలమేలుమంగపతిసొబ గెంత**
**అమర శ్రీవేంకటేశుఆధిక్య మెంత** ॥సకల॥

**ఉపోద్ఘాతము :**

అన్నమయ్య ఈ కీర్తనలో యేమి చెబుతున్నారో వినండి. జగన్నాథుడైన ఇతగాడు శుకయోగి ఆరాధించిన సుజ్ఞాని. ఈయన చక్కదనం, సంపద, ఘనత, గాంభీర్యము యెంతటివో యెవరు చెప్పగలరు? సహస్రముఖుడైన ఈ విశ్వరూపుని విగ్రహము, ఓర్పు, రాజసము, ప్రత్యర్థులెవరో యెవరు వూహించగలరు. ఈ దేవదేవుని ఔదార్యమెంతటిదో, పరాక్రమమెంతటిదో, అలమేల్మంగమెచ్చిన ఈతని సొబగు యెంతటిదో యెవరు చెప్పగలరు? అన్నీ అటుంచి ఈ శ్రీవేంకటేశ్వరుని అధికారమెంతటిదో యెవరైన చెప్పగలరా?

**ఆ.వె॥ ఎవరు చెప్పగలరు యీతని విభవంబు**
**శుకుని స్తుతిని గొనిన సకల విభుడు**
**జ్ఞానమెంత తెలుప సాధ్యమగునె? వీడు**
**వేంకటేశ్వరుండు, విశ్వరూపి.**

**భావోద్దేశ్యము :**

ఇతడు సకలలోకములకు నాథుడైన యేలిక. ఈ జనార్దనుని, శుకయోగి భాగవతమున బాగుగ స్తుతించినాడు. ఇతని సుజ్ఞానమెంతో యెవరు చెప్పగలరు?

ఇతగాడు స్వయంగా మన్మథుని కన్నతండ్రి. మరి వీనిచక్కదనమెంతయో యెవరు చెప్పగలరు? శ్రీమహాలక్ష్మికి మగడు కదా! ఇతనెంత భాగ్యవంతుడో యెవరు చెప్పగలరు? ఇతడు పురుషోత్తముడు. ఇక వీని ఘనత యెంతని పొగడగలము? ఈయన పవళించేది సముద్రముపైన ఇతని గాంభీర్యము యెంతో పొగడుట యెవ్వరివలనవుతుంది?

ఈ విశ్వరూపుని ముఖములు అనేకము. మరి ఇతని విగ్రహమిలా వుంటుందని యెవరు చెప్పగలరు? ఈతడు స్వయంగా భూదేవి భర్త. మరి ఇతగాని ఓర్పు యెంతో యెవరు చెప్పగలరు? విరించి అని ప్రసిద్ధికెక్కిన బ్రహ్మదేవుని తండ్రి ఇతడే. ఇతని రాజసమెంతని వర్ణించగలము? ఇతని ఆయుధము సుదర్శన చక్రము. ఈయననెవరు యెదిరించగలరు?

ఇతగాడు అనుగ్రహిస్తే అంతులేని వరాలనిస్తాడు. మరి వీని ఔదార్యమెంతో యెవరు చెప్పగలరు? విమత (దుర్మార్గులైన) రాక్షసులకు ఈతడు శత్రువు. వాళ్ళని నిర్జించాలంటే యెంత పరాక్రమవంతుడవ్వాలో వూహించగలమా? మమతల కోవెలయైన అలమేల్మంగ పతికి మమత యెంతో చెప్పగలమా? ఈయనే అమరిన శ్రీవేంకటేశ్వరుడు. ఈయన యెంత అధికుడో యెవరైనా చెప్పగలరా?

సంఖ్య : IV/192 రాగం : సౌరాష్ట్ర

కీర్తన : హరియవతారమె ఆతం డితడు

**106 హరియవతారమె ఆతం డితడు**
**పరము సంకీర్తన ఫలములో నిలిపె ॥పల్లవి॥**

**ఉన్నాడు వైకుంఠమున ఉన్నాడు ఆచార్యునొద్ద**
**ఉన్నతోన్నత మహిమ అన్నమయ్య**
**ఉన్నవి సంకీర్తనలు ఒట్టుక లోకములందు**
**పన్నిన నారదాదులు పైపైపాడగాను ॥హరి॥**

**చరియించు నొకవేళ సనకాది మునులలో**
**హరిబాడు తాళ్ళపాక అన్నమయ్య**
**తిరమై యాళువారల తేజము తానై యుండు**
**గరుడానంత ముఖ్య ఘనుల సంగడిని ॥హరి॥**

**శ్రీవేంకటాద్రిమీద శ్రీపతికొలువునందు**
**ఆవహించె తాళ్ళపాక అన్నమయ్య**
**దేవతలు మునులును దేవుండని జయవెట్ట**
**కోవిదుడై తిరుగాడి కోనేటి దండను ॥హరి॥**

**ఉపోద్ఘాతము :**

మనబోటి హరిభక్తులు జన్మజన్మలకీ దాస్యం చేసినా తీరని ఋణబద్ధులను చేసిన అసామాన్య వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమాచార్యులవారు. ఎంతోమంది వాగ్గేయకారులకు స్ఫూర్తియై ఎంతోమంది గాయకులకు ఇహమున జీవనోపాధిని, పరమున దివ్యలోకప్రాప్తిని ఇచ్చారు. తరతరములకు తరగని ముక్తిని ఇచ్చారు. నాబోటి అనామకులకీ హరికృప కల్పించారు. ఇది పెదతిరుమలయ్య తన తండ్రిపై చెప్పినదో, లేక చినతిరుమలయ్య తన తాతపై చెప్పిన కీర్తనో ఇదమిత్థంగా తెలియదు.

కం॥ **హరియవతారంబతడే**
**పరమును సంకీర్తనముల ఫలముగనిలిపెన్**
**గురు తాళ్ళపాక అన్నమ**
**తరగని హరివాసమిచ్చె తరతరములకున్.**

**భావోద్దేశ్యము :**

హరి అవతారమైన ఆతండే (శ్రీవేంకటేశుడే) ఇతడు (ఈ తాళ్ళపాక అన్నమాచార్యులు). ఇతడు మన బోంట్లకు చేసిన మహోపకారమేమిటో తెలుసా. తపస్సు చేస్తేగాని లభించని పరమును (మోక్షమును) హరిసంకీర్తన భక్తితో పాడితే, వాటి ఫలములో నిలిపినాడు. సరిగా కూర్చోలేని రోగపీడితులకూ ముక్తినిచ్చాడు.

ఆ తాళ్ళపాక గురుదేవుడు వైకుంఠంలో శ్రీరామానుజాచార్యులతో హరిని సేవిస్తుంటాడు. గురుకృప పొందిన అన్నమాచార్యుని మహిమ అంతటిది. ఈ భూలోకంలో ఆయన సంకీర్తనలు పట్టుకొని ముగ్ధులై నారదాదులు కూడా పైకి అందరికీ వినబడునట్లు లోకాలన్నిటిలో పాడుతుంటారు.

ఒక్కొక్కప్పుడు సనక సనందనాది మునులతోడుగా హరిని సేవిస్తుంటారు. అన్నమయ్య హరి కీర్తననాలపిస్తుంటే ఆ మునులు సంతోషంతో తలలనూపుతుంటారు. వైకుంఠంలో స్థిరనివాసం పొందిన పన్నెండుమంది ఆళ్వారులు, గరుత్మంతుడు, ఆదిశేషుడు కూడా మెచ్చుకొని తమతో అన్నమయ్యను హరిసేవకు ఆహ్వానిస్తుంటారు.

ఇన్ని వైభవాలున్నా అన్నమాచార్యులవారికి తిరుమలపై ప్రేమ చెప్పనలవికానిది. శ్రీవేంకటేశ్వరు కొలువుకు వచ్చి అక్కడ హరి కీర్తనలు పాడే వారితో శృతి కలుపుతూ మురిసి పోతుంటారు. ఇది చూచి దేవతలు మునులు ఏమీ వీని భాగ్యము!! అని ఇతడే దేవుడు అని జయజయధ్వానములు చేస్తారు. ఆయనకిష్టమైన స్వామి పుష్కరిణి గట్టున కూర్చొని అక్కడే తిరుగాడుతుంటారు.

సంఖ్య : XV/184 రాగం : మలహరి

కీర్తన : హరి నారాయణ ఆదిమపురుషుడ

**107 హరి నారాయణ ఆదిమపురుషఁడ**
**సరవి నీ నామమె జనరక్షణము** ॥పల్లవి॥

**భవసాగరమునఁ బడిన జీవునికి**
**యవల నీ నామం బది దేప**
**తవిలి క్రోధ మనుతాపపు టిండ్లకు**
**జవళి నీ నామస్మరణే నీడ** ॥హరి॥

**నెట్టన మాయల నిరాధారులకు**
**పట్టుఁగొమ్మ నీ పరమనామము**
**అట్టె దురాసలను పెను గాలికి**
**గట్టిగా నీ నామకతలె చాటు** ॥హరి॥

**పండినసంసారబహురాజ్యమునకు**
**అండనె నీ నామ మటు దిక్కు**
**నిండు శ్రీవేంకటనిలయ మాకు నీ**
**దండి నామకీర్తనమే ఫలము** ॥హరి॥

**ఉపోద్ఘాతము :**

పెదతిరుమలయ్య చేసిన హరినామ సంకీర్తనతో ఈ సంపుటి II నారంభించటం సుకృతమే. సరవి అంటే శ్రేష్టముగా అని అర్థం. నీనామము శ్రేష్టమైనది. అదే జనులనందరినీ రక్షించగలిగినది. ఓ హరినారాయణా! ఆదిమపురుషా! నీనామ వైభవమునేమని పొగడను, యెంతని పొగడను? అంటున్నారు.

ఆ తరువాత అది యెట్లు సర్వరక్షకమో సోదాహరణంగా వివరిస్తున్నారు. ఈ సంసారమనే మహాసామ్రాజ్యమునకు అండ నీనామమే ప్రభూ! ఎంత దయ తలచి మాకు నీనామమిచ్చావయ్యా? ప్రజలారా! “ఓం నమో వేంకటేశాయ” అంటే చాలని అన్నావు.

**కం॥ హరి నారాయణ ఆదిమ**
**పురుషుడ! నీనామమొకటె పుడమిని జనులన్**
**సరవిని రక్షించును పో!**
**తిరుమల గిరివాస ముక్తి తెరువది దేవా!**

**భావోద్దేశ్యము :**

ఓ శ్రీహరీ! నారాయణుడా! ఆదిపురుషా! సరవి (శ్రేష్ఠమైన) నీ నామమే జనరక్షణము (ప్రజలను రక్షించు శక్తి గలది).

భవసాగరమున బడి కొట్టుమిట్టాడే జీవునికి నీనామ సంకీర్తనము అవల (వాడు పరలోకాలకి తరలిపోయేటప్పుడు) తేప (తెప్ప) వలె రక్షిస్తుంది. క్రోధము (కోపమనే అగ్ని) తాపమునకు గుర్రై ఇండ్లకు (ఎండలకు) నీ నామము చల్లటి నీడవంటిది.

నెట్టన మాయల (అధికమైన హరిమాయలను) ఝంఝూమారుతములో యెగిరిపోతున్న వారికి పరమునొసగే నీనామము, పట్టుకొనే ఆధారము అదే విధముగా దురాశ అనే ప్రళయకాల గాలివానలో నీనామ కథాశ్రవణము చాటు (రక్షణ నొసగు గృహము) వంటిది.

సంసారము అనే పాపపురాజ్యములో వృద్ధులయ్యేదాకా తపించేవారకి దిక్కు యెవరు? అండ అని గుర్తించి భక్తితో జరిపే నీనామ సంకీర్తనమే. శ్రీ వేంకటము అనే గొప్ప కొండను, మమ్ముద్ధరించుటకు నీ నిలయముగా చేసికొనిన శ్రీవేంకటేశ్వరా! నిండైన నీనామ సంకీర్తనము మాకు దండి ఫలము (గొప్ప ఫలితము నొసగు) గొప్ప కవచము.

సంఖ్య : IV/261 రాగం : బౌళి

కీర్తన : హరి సర్వాత్మకుడాదిమపురుషుడు

**108 హరి సర్వాత్మకుఁ డాదిమపురుషుఁడు**
**పొరి నెరుఁగువారి పుణ్యముగాన ॥పల్లవి॥**

**నాలుక కొననే నారాయణుఁ డిదె**
**వైళము దలఁచని వారిదె పాపము**
**నేలయు మిన్నును నిజవైకుంఠము**
**పోలించి చూడని పురుషుల వెలితి ॥హరి॥**

**మనసులోననే మాధవుఁ డున్నాఁడు**
**కనుఁగొననివారి కడ మింతే**
**తనువే విష్ణుని తత్వసాధనము**
**వొనరఁగ శ్రీపతి యున్నాఁడు గాన ॥హరి॥**

**చేరువ నిదివో శ్రీవేంకటపతి**
**ధారుణిఁ గొలిచేటి? దాసులభాగ్యము**
**కారణ మితఁడే కలిగిన దైవము**
**కోరినవారల కొంగులపసిఁడి ॥హరి॥**

**ఉపోద్ఘాతము :**

శ్రీహరి ఆదిమ పురుషుడు, సర్వాంతరాత్మకుడు. ఆది మధ్యాంతరహితుడు. రూపమే లేనివానిని చూచుటెట్లు? తెలియుటెట్లు? పూజించుటెట్లు? యోగీంద్రులే అందుకు సమర్థులు. మనమందరము భోగీంద్రులము. మన పంచేంద్రియాలు “సుఖమో” అని వెంపర్లాడుతుంటాయి. దీనికి తోడు “నేను” అనే భ్రమ చివరి శ్వాస వరకు మనల్ని వదలదు. కీర్తిపై కాంక్ష, తీరని కోరికలు, ఒకటేమిటి? అన్నీ వైకుంఠపాళిలో పాములే. అప్పుడప్పుడు నిచ్చెలెక్కినా, పాము నోటపడక తప్పదు. మరి దారేమిటి? హరి శరణాగతి మాత్రమే. శ్రీహరిని దర్శించగల సత్తా మనకెలాగునా లేదు. మనకోసమే తిరుమల శిఖరాలపై కలియుగంలో శ్రీవేంకటేశ్వరుడై అవతరించాడు. “ఓం నమో వేంకటేశాయ” అంటే చాలు. వీలు దొరికినప్పుడల్లా దాన్ని వదలకండి. అన్నమయ్య చూపిన దారిలో పోతే... అదే మోక్షానికి దారి.

**కం॥ హరి సర్వాత్మకుడాదిమ**
**పురుషుండని అన్నమయ్య పోలించె హరిన్**
**కరివరదుడు మన కొంగున**
**ధరియించిన 'పైడి' సుండి!! తగు శరణనుటే.**

**భావోద్దేశ్యము :**

శ్రీహరి సర్వాత్మలయందును స్థితుడై వుంటాడు. ఆయన ఆదిపురుషుడు. ఇది బాగుగా తెలియాలంటే వారికి చేసిన పుణ్యం యెంతో వుండాలి.

నాలుక చివరి నుండి భక్తితో నారాయణ అని అన్నివేళలా, తలచని వారికి పాపరాశి పెరగక యేమవుతుంది? మనకు నేల, నింగి కనబడుతూనే వుంటాయి. కాని ఆకాశమేమో శూన్యము, భూమి అశాశ్వతం నిజమైన వైకుంఠం యెక్కడుందో తెలియదు. కాని ఆ వైకుంఠాన్ని యిక్కడే భావించగలవారు ధన్యులు.

మాధవుడున్నాడు, అదీ మన మనస్సులలోనే సుమా! అట్లా కనుగొనలేని వారి లోపమేగాని, స్వామి లోపం యెక్కడుంది? విష్ణుని తత్త్వం తెలియాలంటే మానవ శరీరమే ఆవశ్యకము. అదే లేకపోతే, శ్రీపతి వున్నాడని తెలిసే దారియేది?

ఈ శ్రీవేంకటపతి మన చేరువనే వున్నాడు. అట్లా తెలియుటయే శ్రీపతి దాసులు చేసికొనిన భాగ్యము. అన్నిటికీ కారణ భూతుడు శ్రీహరియే. అందుకనే ఈయనను కోరిన వారికి కొంగున కట్టిన బంగారమువలె, భద్రతనిస్తాడు. ఇది ముమ్మాటికీ నిజం.

# హరిమంగళా శాసనము

## మంగళా శాసనం

1 శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

2 లక్ష్మీసవిభ్రమాలోక సుభ్రూవిభ్రమ చక్షుషే
చక్షుషే సర్వలోకానం వేంకటేశాయ మంగళం.

3 శ్రీ వేంకటాద్రి శృంగాగ్ర మంగళాభరణాంఘ్రయే
మంగళానాం నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

4 సర్వావయవ సౌందర్య సంపదా సర్వచేతసామ్
సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్

5 నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్

6 వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీతటే
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్

7 శ్రీమత్సుందర జామాతృమునిమానస వాసినే
సర్వలోక నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

8 మంగళశాసనపరైః మదాచార్యపురోగమైః
సర్వైశ్చపూర్వైః సత్కృతాయాస్తు మంగళమ్

**శ్రీపద్మావతీ సమేత శ్రీశ్రీనివాస పరబ్రహ్మణేనమః**

రచయిత:

# అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు



| | | |
|---|---|---|
| పిలవండి | : | **అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు** |
| పుట్టింది | : | **9-6-1945** |
| చదివింది | : | **ఎం.టెక్.** |
| ఉండేది | : | **ఫ్లాట్ నెం. 5., ప్లాటు నెం. 61,<br>సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్.** |
| రంధి | : | **భగవన్నామ సంకీర్తన** |
| నచ్చింది | : | **శాస్త్రీయ సంగీతం** |
| నచ్చంది | : | **నక్కజిత్తులు** |
| మెచ్చింది | : | **సజ్జన సాంగత్యం** |
| రింగండి | : | 00919393021360 |
| చదవండి | : | www.geetadeksha.com |
| ఇవ్వండి | : | e-mail : geetadeksha@gmail.com |